

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 159

గురువారం 29-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
గురువారం ॥ 29-8-2024

నేటి 'సాక్షి' ఈపేపర్‌లో
స్పెషల్ 'సన్నిధి' పేజీ

'సాక్షి' ఈ పేపర్‌లో ప్రతిరోజూ
ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ



కళ్లు మూసుకొని నాలుగడుగులు వేయలేము. కళ్లు కనపడకుండా పరిగెత్తగలమా? ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు పారిస్‌లో పారా ఒలింపిక్స్ జరగనున్నాయి. ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు తేలేని బంగారు పతకం మన దివ్యాంగ క్రీడాకారులు తెస్తారని ఆశ. కర్ణాటకకు చెందిన అంధ అథ్లెట్ రక్షిత రాజు 1500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనబోతున్న తొలి భారతీయ పారా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించనుంది. పతకం తెస్తే అది మరో చరిత్ర. రక్షిత రాజు పరిచయం.



● రన్‌వేపై రక్షిత

కాళ్లే కళ్లయ్యి

అక్టోబర్ 26, 2023.

రక్షిత రాజుకు ఆనందబాష్పాలు చిప్పిల్లుతున్నాయి. కన్నీరు కూడా ఉబుకుతోంది. ఆమె హాంగ్జావు (చైనా) పారా ఆసియా గేమ్స్‌లో 1500 మీటర్ల పరుగులో స్వర్ణం సాధించింది. చాలా పెద్ద విజయం ఇది. ఈ విషయాన్ని ఆమె తన అమ్మమ్మతో పంచుకోవాలనుకుంటోంది. కాని పంచుకోలేకపోతోంది. కారణం? అమ్మమ్మకు వినపడదు. చెవుడు. మాట్లాడలేదు. మూగ. కాని ఆ అమ్మమ్మే రక్షితను పెంచి పెద్ద చేసింది. ఆమె వెనుక కొండలా నిలుచుంది. ఆ ఘట్టం బహుశా ఏ సినిమా కథకూ తక్కువ కాదు. నిజజీవితాలు కల్పన కంటే కూడా చాలా అనూహ్యంగా ఉంటాయి.

ఊరు వదిలేసింది

కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్‌లోని చిన్న పల్లెకు చెందిన రక్షిత రాజు పుట్టుకతోనే అంధురాలు. ఆమెకు నాలుగు సంవత్సరాలు ఉండగా తల్లిదండ్రులు మరణించారు. దాంతో ఊరంతా రక్షితను, ఆమె చిన్నారి తమ్ముణ్ణి నిరాకరించారు. చూసేవాళ్లు ఎవరూ లేరు. అప్పుడు రక్షిత అమ్మమ్మ వచ్చి పిల్లలను దగ్గరకు తీసుకుంది. ఆమె స్వయంగా చెవుడు, మూగ లోపాలతో బాధ పడుతున్నా మనవళ్ల కోసం గట్టిగా నిలుచుంది. మనవరాలిని చిక్‌బళ్లాపూర్‌లో అంధుల కోసం నిర్వహిస్తున్న ఆశాకిరణ్ స్కూల్‌లో చదివించింది. అక్కడి హాస్టల్‌లో ఉంటూ అప్పుడప్పుడు అమ్మమ్మ వచ్చి పలుకరిస్తే ధైర్యం తెచ్చుకునేది. అంధత్వం వల్ల భవిష్యత్తు ఏమీ అర్థం అయ్యేది కాదు. దిగులుగా ఉండేది.

వెలుతురు తెచ్చిన పరుగు

ఆశా కిరణ్ స్కూల్‌లో మంజన్న అనే పీఈటీ సారు రక్షిత బాగా పరిగెత్తగలదని గమనించి ఆమెను ఆటల్లో పెట్టాడు. స్కూల్‌లో ఉన్న ట్రాక్ మీద పరిగెట్టడం ప్రాక్టీసు చేయించాడు. జైపూర్‌లో పారా గేమ్స్ జరిగితే తీసుకెళ్లి వాటిలో పాల్గొనేలా చేశాడు. అక్కడే రాహుల్ అనే కర్ణాటక అథ్లెట్ దృష్టి రక్షిత మీద పడింది. ఈమెను నేను ట్రెయిన్ చేస్తాను అని చెప్పి ఆమె బాధ్యత తీసుకున్నాడు. అప్పటివరకూ సింథెటిక్ ట్రాక్ అంటేనే ఏమిటో రక్షితకు తెలియదు. రాహుల్ మెల్లమెల్లగా ఆమెకు తర్ఫీదు ఇచ్చి అంతర్జాతీయ స్థాయి పారా అథ్లెట్‌గా తీర్చిదిద్దాడు.



గైడ్ రన్నర్ సాయంతో పరుగెదుతున్న రక్షిత రాజు

గైడ్ రన్నర్ సాయంతో...

అంధ అథ్లెట్లు ట్రాక్ మీద మరో రన్నర్ చేతిని తమ చేతితో ముడేసుకుని పరిగెడతారు. ఇలా తోడు పరిగెత్తేవారిని 'గైడ్ రన్నర్' అంటారు. అంతర్జాతీయ పోటీల్లో రాహులే స్వయంగా ఆమెకు గైడ్ రన్నర్‌గా వ్యవహరిస్తున్నాడు. హాంగ్జావులో 1500 మీటర్లను రక్షిత 5 నిమిషాల 21 సెకన్లలో ముగించింది. 'చైనా, కిర్గిజ్‌స్తాన్ నుంచి గట్టి పోటీదారులు వచ్చినా నేను గెలిచాను. పారిస్‌లో జరిగే పారా ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది' అంటుంది రక్షిత.

అదే సవాలు

అంధులు పరిగెత్తడం పెద్ద సవాలు. వారు గైడ్ రన్నర్ సాయంతోనే పరిగెత్తాలి. 'మాతో పాటు ఎవరైనా పరిగెత్తొచ్చు అనుకుంటారు. కాని గైడ్ రన్నర్‌లకు, మాకు సమన్వయం ఉండాలి. మమ్మల్ని పరిగెత్తిస్తూ వారూ పరిగెత్తాలి. ఎంతోమంది ప్రతిభావంతులైన అంధ రన్నర్లు ఉన్నా గైడ్ రన్నర్‌లు దొరకడం చాలా కష్టంగా ఉంటోంది. ఒకప్పుడు నా కళ్ల ఎదుట అంతా చీకటే ఉండేది. ఇప్పుడు పరుగు నాకు ఒక వెలుతురునిచ్చింది. పారిస్‌లో స్వర్ణం సాధించి తిరిగి వస్తాను' అంటోంది రక్షిత.

నేడు నేషనల్ స్పోర్ట్స్ డే

'ఎప్పుడూ ఆటలేనా... చదువుకోవచ్చు కదా' అనే తల్లిదండ్రులే ఎక్కువ. 'ఎప్పుడూ చదువేనా... ఆటలు కూడా ఆడవచ్చు కదా' అనే తల్లిదండ్రులు అతి తక్కువ. చదువు విషయంలోనే కాదు ఆటల్లో కూడా పిల్లలను ప్రోత్సహిస్తే చారిత్రక అద్భుతాలు జరుగుతాయని చెప్పడానికి బలమైన ఉదాహరణ... స్టార్ షూటర్ మను బాకర్. 'మీకు డాక్టర్ లేదా ఇంజినీర్ కావాలని లేదా... అయితే ఆటల ప్రపంచంలోకి రండి. అదొక అద్భుత ప్రపంచం' అంటుంది ఒలింపిక్స్‌లో డబుల్-మెడల్ గెల్చుకున్న మను బాకర్. విద్యార్థుల దృష్టిని ఆటలపై మళ్లించడానికి నేషనల్ టూర్ చేస్తోంది...



చెన్నై విద్యార్థినులతో మను బాకర్

● మను క్రీడా యాత్ర

ఆడుకుందాం రండి

తన పర్యటనలో భాగంగా చెన్నైలోని వేలమ్మాళ్ నెక్సెస్ స్కూల్‌కు వెళ్లిన మను బాకర్ ఆటలకు ఉండే శక్తి ఏమిటో ఆసక్తికరంగా చెప్పింది. 'ఆటలు అనే దారి వైపు వచ్చి చూడండి. ఆ దారిలో ముందుకు వెళుతున్న కొద్దీ మీలో ఉత్సాహం, శక్తి అంతకంతకూ పెరుగుతూ పోతాయి' అంటుంది మను.

'టోక్యో ఒలింపిక్స్‌లో నా గురి తప్పింది. ఓటమి పలకరించింది. అలా అని నిరాశలోనే ఉండిపోలేదు. ఆటలో గెలుపు ఎంత సహజమో, ఓటమి అంతే సహజం. గెలుపు ఓటములు ఆటలో శాశ్వతం కాదు. ఆటలో ఉన్న అందం, అద్భుతం ఇదే' అంటుంది మను.

'డ్రీమ్ బిగ్' అని మను అన్నప్పుడు పిల్లలు చప్పట్లు కొట్టారు.

'మనం ఒక లక్ష్యం ఏర్పర్చుకున్నప్పుడు ఆ లక్ష్యాన్ని చేరుకుంటామా లేదా అనేది పూర్తిగా మన మీదే ఆధారపడి ఉంటుందంటూ తన గత అనుభవాలను విద్యార్థులతో పంచుకుంది.

'ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకే ఆటలు సరిపోతాయి. పేద, మధ్య తరగతి పిల్లలకు కష్టం' అనే అపోహను తోసిపుచ్చింది మను. 'ఆత్మస్థైర్యం నుంచి ఆర్థికసహాయం వరకు క్రీడా ప్రపంచంలో ఏది కష్టం కాదు. మీరు పెద్ద కల కంటే పెద్ద విజయాన్ని సాధిస్తారు. పేదరికం మీకు ఎప్పుడూ అడ్డు కాదు. ఈ విషయాన్ని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది' అంటుంది మను బాకర్. 'మీ ఇన్‌స్పిరేషన్ ఎవరు?' అనే ప్రశ్నకు– 'ఇంకెవరు... మా అమ్మే' అని చెప్పింది మను. 'ఎప్పుడూ ఆటలేనా!' అని ఎప్పుడూ అనేది కాదు ఆమె. ఆటల్లో కూతురు చూపుతున్న ప్రతిభకు సంతోషించేది.

'క్రీడల్లో పిల్లలు రాణించడం, పెద్ద స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంది' అంటుంది మను బాకర్.



ఆటలు ఇంకా ఏం చేస్తాయి? మను మాటల్లో చెప్పాలంటే ప్రపంచాన్ని చూపిస్తాయి. 'షూటింగ్ కెరీర్ వల్ల ప్రపంచంలో ఎన్నో దేశాలు తిరిగాను. దీనివల్ల రకరకాల మనుషులు, రకరకాల సంస్కృతులు, చరిత్ర, పోరాటాలు... ఒక్కటా రెండా ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది. నేను ఆటల్లోకి రాకపోయి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు' అంటుంది మను.

'మనం ఎక్కడి నుంచి వచ్చామనేది కాదు ఎక్కడికి వెళ్లాలనేది ముఖ్యం' అంటారు పేదరిక నేపథ్యం నుంచి వచ్చిన విజేతలు. ఇదే విషయాన్ని పిల్లలకు చెబుతుంటుంది మను.

'మేము పేదవాళ్లం, నాకు ఇంగ్లీష్ రాదు, నేను బలహీనంగా ఉంటాను, ఇతరులతో పోటీ పడగలనా... ఇలాంటి ఆలోచనలేవీ పెట్టుకోవద్దు. ఎన్ని పరిమితులు ఉన్నా కష్టపడే తత్వం, అంకితభావం ఉంటే మన ప్రయాణానికి అవేమీ అడ్డు కాదు. ప్రయాణం ఎలా చేస్తున్నాం అనేది ముఖ్యం. నా విషయానికి వస్తే... మొదట్లో నాకూ ఇంగ్లీష్ పెద్దగా రాదు, ఇతరులతో ఎలా మాట్లాడాలో తెలియదు. ఏమీ తెలియదు... అనుకుంటే అక్కడే ఉండిపోతాం. తెలుసుకుంటాను'... అనే పట్టుదల ఉంటే తెలుసుకోగలం. నేను ఎంతోమంది వ్యక్తుల నుంచి ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. కొత్త విషయాల గురించి తెలుసుకోవడానికి తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల వరకు ఎవరితోనైనా మాట్లాడవచ్చు' అంటుంది మను.

'మీకు ఎన్నో కెరీర్ ఆప్షన్‌లు ఉన్నాయి. అవేమీ మీకు ఆసక్తిగా లేకపోతే ఆటల ప్రపంచంలోకి రండి' అని విద్యార్థులను ఆహ్వానిస్తోంది మను బాకర్. ఆమె మాటల స్ఫూర్తి ఎంతోమందికి విజయ మంత్రం కావాలని ఆశిద్దాం.

మన(సు)లో మాట

ఆ ఆలోచన నుంచి బయటపడేదెలా?

నా వయసు 35 సంవత్సరాలు. ఒక సంవత్సరం నుంచి నాకెందుకో చనిపోవాలనిపిస్తోంది. 24 గంటలూ ఆత్మహత్య ఆలోచనలే వస్తున్నాయి. ఏ పనీ చేయాలనిపించదు. మునుపున్న హుషారు, ఉత్సాహం అసలు లేవు. మనసంతా నెగటివ్ ఆలోచనలతో నిండి, మైండ్ మొద్దుబారి, బ్లాంక్‌గా ఉంటోంది. నిజానికి నాకసలు సీరియస్ సమస్యలేమీ లేవు. నాలో ఈ నైరాశ్యం, నిర్వేదం తొలగి భార్యా పిల్లలతో హాయిగా గడిపే మార్గం చెప్పగలరు.
– రఘురాం, అనంతపురం

మీరెంతో ఆవేదనతో రాసిన ఉత్తరం చదివాను. మీ పరిస్థితి అర్థం అయింది. 'మేజర్ డిప్రెసివ్ డిజార్డర్' అనే మానసిక వ్యాధికి గురయిన వారిలో ఏ విధమైన కారణాలూ లేకుండా ఇలా ఆత్మహత్య చేసుకుందామనే ఆలోచనలు వస్తుంటాయి. వీరిని ఎవరూ పట్టించుకోకపోతే వారిలో ఆ భావనలు బలపడిపోయి ఎలాంటి కారణం లేకుండానే ఉన్నట్టుండి ఒకరోజు ఆత్మహత్య చేసుకుంటారు.

డిప్రెషన్ వ్యాధికి బయటి సమస్యల కంటే మెదడులో జరిగే కొన్ని అసాధారణ రసాయనిక చర్యలే ముఖ్యకారణమని శాస్త్రీయంగా నిర్ధారణ అయిన సత్యం. వీరు నిరాశా నిస్పృహలతో ప్రతి చిన్న సమస్యనూ భూతద్దంలో చూసి, భయపడుతూ, తాను చేతగాని వాడినని, తనవల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇతరులకు తనవల్ల ఎలాంటి ఇబ్బందీ కలగకూడదని, తనకిక చావే శరణ్యమని భావించి, ఆత్మహత్యకు పాల్పడతారు. ఆలస్యం చేయకుండా మీరు వెంటనే మానసిక వైద్యుని సంప్రదించి, తగిన చికిత్స తీసుకుంటే, డిప్రెషన్ పూర్తిగా తొలగిపోయి మునుపటిలా సంతోషంగా, హుషారుగా ఉండగలరు.



మా అబ్బాయికి పదహారేళ్లు. ఇంటర్‌లో చేర్పాం. మొదటినుంచి చదువులో యావరేజ్. అయితే ఈ మధ్య వాడి దగ్గర సిగరెట్ వాసన వస్తోంది. అదేమని అడిగితే ఒప్పుకోవడం లేదు. మొన్నొకరోజు జేబులో సిగరెట్లు దొరికాయి. గట్టిగా అడిగితే ఎదురు తిరగడం, కోపంతో వస్తువులు విసిరేయడం వంటివి చేస్తున్నాడు. మొదటి నుంచి వాడు కొంచెం మొండివాడే. ఈ మధ్య ఆ మొండితనం మరీ ఎక్కువైంది. చదువు ఎలా ఉన్నా సరే, కనీసం వాడిలో ఈ మొండితనం, కోపం తగ్గి, స్మోకింగ్ అలవాటు మాన్పించేందుకు మాకేదైనా సలహా ఇవ్వగలరు.
– విజయలక్ష్మి, హన్మకొండ

టీనేజ్‌లో వచ్చే శారీరక, మానసిక మార్పుల వల్ల వారు కొంత మొండిగా ఉండటం సహజమే. అయితే మీ అబ్బాయిలోని స్మోకింగ్, ఎదురు తిరగడం, విపరీతమైన మొండితనం, కోపం, అబద్ధాలు చెప్పడం లాంటి లక్షణాలు కాండక్ట్ డిజార్డర్ లేదా అపోజిషనల్ డిఫియెంట్ డిజార్డర్ అనే మానసిక రుగ్మతను సూచిస్తున్నాయి. వీటిని చిన్నతనంలో అరికట్టలేకపోతే, అవి భవిష్యత్తులో ఆ కుటుంబానికే కాకుండా, సమాజం మొత్తాన్ని ఇబ్బంది పెట్టే సంఘ విద్రోహ శక్తిగా మారే అవకాశం ఉంది. అంతేకాకుండా స్మోకింగ్ క్రమేణా ఒక వ్యసనంగా మారి, దాంతోపాటు గంజాయి, ఆల్కహాల్ వంటి ఇతర మత్తుపదార్థాలకు కూడా అలవాటు పడేలా చేస్తుంది. ఇలాంటి పిల్లలకు కొన్ని మందుల ద్వారా, డయలెక్టివ్ బిహేవియర్ థెరపీ అనే ప్రత్యేక మానసిక చికిత్స ద్వారా మంచి మార్పు తీసుకురావచ్చు. మీరు ఆందోళన పడకండి.



– డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

బ్యూటిప్

హోమ్ మేడ్ బాడీ స్క్రబ్



రెండు టీ స్పూన్ల టీ పొడి, కప్పు పంచదార, అర కప్పు నీళ్లు, పావు కప్పు కొబ్బరి నూనె తీసుకోవాలి. ముందుగా నీళ్లు మరిగించి, అందులో టీ పొడి వేసి మూత పెట్టి, మంట తీసేయాలి. ఐదు నిమిషాల తర్వాత నీళ్లను వడకట్టాలి. ఈ నీళ్లలో పంచదార, కొబ్బరి నూనె కలపాలి. పంచదార పూర్తిగా కరగనివ్వాలి. ఈ మిశ్రమాన్ని గాలి తగలని జార్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ స్క్రబ్ మిశ్రమాన్ని మేనికి పట్టించి, రుద్ది, నీళ్లతో శుభ్రపరుచుకోవాలి. రోజూ ఈ స్క్రబ్‌ను వాడుకోవచ్చు.

● డ్రోన్ దీదీ

పల్లెటూరి పైలట్



మహిళా సాధికారతకు ఉత్తమ సాధనాలలో ఒకటిగా నిలిచింది డ్రోన్ శిక్షణ. ఢిల్లీకి ఉత్తరాన ఉన్న సింఘోలా, నైరుతి జిల్లాల్లోని 200 మంది మహిళలు శిక్షణ తీసుకొని డ్రోన్ లైసెన్స్ పొందేందుకు సిద్ధమయ్యారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళలకు సాధికారిత కల్పించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని కిందటేడాది చేపట్టింది. ఇందులో భాగంగా శిక్షణ పొందిన మహిళలు దేశ రాజధానిలో ఇటీవల కార్యక్రమాన్ని నిర్వహించారు.



శిక్షణ పొందిన డ్రోన్ దీదీలు పైలెట్ లైసెన్స్ సర్టిఫికెట్స్ పొంది, స్వయం ఉపాధి అవకాశాలను పొందుతారు. శిక్షణ పొందిన వారికి డ్రోన్‌లను ప్రభుత్వమే అందజేస్తుంది.

స్వయం ఉపాధికి

డ్రోన్లను స్వయంగా ఉపయోగించడానికి, అద్దెకు ఇవ్వడానికి అనుమతిస్తారు. సర్వేలు, ఈవెంట్ షూట్‌లు, ఫొటోగ్రఫీ, వ్యవసాయంలో సీడింగ్, పురుగుమందులు చల్లడం వంటి వాటి కోసం డ్రోన్‌లను ఉపయోగించడమే లక్ష్యంగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

ఆర్థికాభివృద్ధికి

మూడేళ్ల కాలంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు 15 వేల డ్రోన్‌లను అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వ్యవసాయంతో పాటు అదనంగా మహిళలు డ్రోన్ సంబంధిత వ్యాపారాలను చేసుకునే అనుమతి లభిస్తుంది. దీనివల్ల ఆర్థిక వృద్ధి, అభివృద్ధికి మరింతగా దోహదపడుతుంది. ఎరువులను చేతితో పిచికారీ చేసే సాంప్రదాయ పద్ధతులను డ్రోన్లతో భర్తీ చేయడం ద్వారా పురుగు మందుల వల్ల కలిగే ప్రమాదం తగ్గుతుంది. పంట దిగుబడి పెరుగుతుంది. అంతేకాదు, డ్రోన్ల వాడకంలో ఖర్చులు తగ్గి, రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

టెక్నాలజీలో ఆధునాతన శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి కృషి జరపడం అంటే గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను మరింత శక్తిమంతులుగా తయారు చేయడమే.

సమష్టి కృషి

వన ఉత్పత్తులకు దమ్మక్క బ్రాండ్


తాము తయారు చేసిన ఉత్పత్తులతో దమ్మక్క గ్రూప్ సభ్యులు

అడవుల జిల్లాగా పేరొందిన భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలుగా గిరిజన మహిళలు ఎదుగుతున్నారు. ఐదేళ్ల కిందట శిక్షణతో మొదలైన వారి ప్రయాణం నేడు ఈ కామర్స్ వాకిలి వరకు చేరుకుంది. వీరి విజయ గాథ...

నైపుణ్య శిక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మహిళలు 2018లో హైదరాబాద్‌కు ఐటీడీఏ తరఫున వెళ్లారు. అక్కడ సబ్బులు, షాంపులు తయారు చేసే ఓ సంస్థలో మూడు నెలలు శిక్షణ తీసుకున్నారు. ఆ శిక్షణతోనే సరిపెట్టుకోకుండా అదే కంపెనీలో మరో తొమ్మిది నెలల పాటు పనిచేసి తమ నైపుణ్యానికి మరిన్ని మెరుగులు అద్దుకున్నారు. ఇందులో పదిహేను మంది సభ్యులు కలిసి దమ్మక్క జాయింట్ లయబిలిటీ గ్రూప్‌గా ఏర్పడ్డారు. రూ. 25 లక్షలతో షాంపూ, సబ్బుల తయారీ పరిశ్రమ స్థాపించాలని నిర్ణయించుకున్నారు.

అవరోధాలన్నింటినీ అధిగమిస్తూ...

దమ్మక్క గ్రూప్ సభ్యుల ఉత్సాహం చూసి అప్పటి ఐటీడీఏ పీవో గౌతమ్ పోట్రు బ్యాంకు అధికారులతో మాట్లాడి లోను ఇప్పించడంతో భద్రాచలంలో 2019 నవంబరులో షాంపూ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. పనిలో చేయి తిరగడం అలవాటైన కొద్ది రోజులకే 2020 మార్చిలో కరోనా విపత్తు వచ్చి పడింది. లాక్‌డౌన్‌లు, కరోనా భయాల వల్ల బయటకు వెళ్లి పని చేసేందుకు ఇంట్లో కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పడం ఒక ఇబ్బందైతే, మరోవైపు తయారీ యూనిట్‌లో షాంపూ బాటిళ్లు పేరుకుపోయాయి. ఇంతలోనే ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు షాంపూ బాటిళ్లు కావాలంటూ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) నుంచి ఆర్డర్ రావడంతో కొంత ఊతం లభించింది.'' అంటూ దమ్మక్క గ్రూపు జాయింట్ సెక్రటరీ బేబీరాణి అనాటి రోజులను గుర్తు చేసుకున్నారు.

ఊపందుకున్న అమ్మకాలు

షాంపూ కొనుగోలుకు జీసీసీ నుంచి మార్కెట్ అందుబాటులో ఉండటంతో పాటు షాంపూ నాణ్యత విద్యార్థులకు నచ్చడంతో క్రమంగా దమ్మక్క యూనిట్ పనితీరు గాడిలో పడింది. 100 మిల్లీలీటర్ల షాంపూ బాటిళ్ల తయారీ 2021లో యాభైవేలు ఉండగా 2022 ముగిసే నాటికి లక్షకు చేరుకుంది. ఆ మరుసటి ఏడాది ఏకంగా రెండు లక్షల బాటిళ్ల షాంపూలు తయారు చేసి విక్రయించారు. షాంపూల తయారీలో వచ్చిన అనుభవంతో ఈ ఏడాది మొదట్లో గ్లిసరిన్ ప్రీమియం సబ్బుల తయారీని ప్రారంభించి జీసీసీ స్టోర్లలో ప్రయోగాత్మకంగా అమ్మకాలు ప్రారంభించగా... తొలి దఫాలో ఐదు వేల సబ్బులు అమ్ముడయ్యాయి. ఆ తర్వాత అమ్మకాలు ఊపందుకున్నాయి.

బ్యాంక్ రుణం కూడా తీర్చేశారు!

యూనిట్ ఆరంభమైన తర్వాత ఏడాదిలో కేవలం మూడు నెలలే గ్రూపు సభ్యులకు పని దొరికేది. షాంపూ, సబ్బులకు డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది వరుసగా ఎనిమిది నెలలు అంతా పని చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో బ్యాంకు రుణం కూడా తీర్చేశారు. ప్రతి సభ్యురాలికి ఖర్చులు పోను కనీసం రూ.10 వేల వరకు ఆదాయం వచ్చినట్టు గ్రూప్ ట్రెజరర్ పూనెం విజయలక్ష్మి తెలిపారు.

ఈ కామర్స్ దిశగా

రాబోయే రోజుల్లో ఈ కామర్స్ వేదికగా ఈ ఉత్పత్తుల అమ్మకానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు గ్రూపు అధ్యక్షురాలు తాటి రాజసులోచన తెలిపారు. ఈ మేరకు బ్రాండ్‌నేమ్ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. అది విజయవంతం అయితే మరెందరో కొత్త వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి,
సాక్షి, భద్రాచలం


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 159

గురువారం 29-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పారాలింపిక్స్ ప్రారంభం..

దివ్యాంగుల విశ్వ క్రీడలు బుధవారం అట్టహాసంగా పారిస్‌లో ప్రారంభం అయ్యాయి.

- వివరాలు 12లో



నైట్ పెట్రోలింగ్ ఉండాలి

'కోల్‌కతా' ఘటన నేపథ్యంలో కేంద్రం.. వైద్య సిబ్బంది భద్రత కోసం ఆస్పత్రుల్లో అమలు చేయాల్సిన మార్గదర్శకాలను విడుదల చేసింది.


- వివరాలు 6లో



ఆవేదనతో చలించిపోయా..

కోల్‌కతాలో జూ. డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

- వివరాలు 6లో



వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయెల్ భీకర దాడి

ఇజ్రాయెల్ వెస్ట్‌బ్యాంక్‌పై విరుచుకుపడింది. ఫైటర్ జెట్లు, డ్రోన్లతో భీకర దాడులకు దిగింది. 9 మంది పాలస్తీనియన్లు మరణించారు.

- వివరాలు 6లో



5 గంటల 35 నిమిషాలు

యూఎస్ ఓపెన్ చరిత్రలో అతి సుదీర్ఘంగా సాగిన మ్యాచ్‌గా ఇవాన్స్, ఖచనోవ్ తొలి రౌండ్ మ్యాచ్ నమోదైంది.

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

ఓటుకు నోటు కేసులో నువ్వు కుమ్మక్కయ్యావా?



ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితకు బెయిల్ లభించడంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు మండిపడ్డారు. కవితకు బెయిల్ రావడాన్ని ప్రశ్నిస్తున్న రేవంత్.. ఓటుకు నోటు కేసులో బెయిల్ కోసం ఎవరితో కుమ్మక్కయ్యారని హరీశ్ ప్రశ్నించారు.

- వివరాలు 2లో

2 డీఏలకు త్వరలో మోక్షం!



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం (డీఏ) బకాయిలను త్వరలో చెల్లించనున్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు బకాయిల్లో రెండింటిని వీలున్నంత త్వరగా మంజూరు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.

- వివరాలు 3లో

తక్షణమే జాయింట్ సర్వే!



పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించాలని సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా ఆదేశించారు.

- వివరాలు 11లో

ప్రయోజనాలు పరిరక్షించేలా..



ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంటు తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫోర్త్ సిటీలో పనిచేసే ఉద్యోగుల కుటుంబసభ్యులకు వసతుల కల్పనకు వీలుగా అలైన్‌మెంట్ ఉండాలన్నారు.

- వివరాలు 5లో

అనుమతులు చెల్లవ్

జన్వాడ ఫామ్‌హౌస్‌కు సర్పంచ్ అనుమతులు ఉన్నాయన్న అంశంపై సీఎం రేవంత్

పదేళ్లు మంత్రిగా చేసిన కేటీఆర్‌కు ఇది తెలియదా?

- ఎన్నికల అఫిడవిట్‌లో ఫామ్‌హౌస్ లీజు వ్యవహారం వెల్లడించారా?
- లేకుంటే అనర్హత వేటు, విచారణతప్పదు
- అక్రమాలను ఉమ్మడిగా పరిశీలిద్దాం.. విపక్ష నేతలు రావాలి
- మా కుటుంబ సభ్యుల అక్రమ నిర్మాణాలున్నట్టు చూపితే నేనే దగ్గరుండి కూల్చివేయిస్తా
- '111 జీవో'లో మార్పులు చేయలేం..
- ఓఆర్‌ఆర్‌కు ఆనుకుని ఉన్న గ్రామాల వరకే హైడ్రా పరిధి
- హరీశ్, కేటీఆర్ రుణమాఫీ జరగని వారి వివరాలిస్తే మాఫీ చేస్తాం
- కేజ్రీవాల్‌కు బెయిల్ రాకముందే కవితకు ఎలా వచ్చిందని ప్రశ్న
- మీడియాతో సీఎం ఇష్టాగోష్టి

2లో



బుధవారం సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కోసం భూమిపూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, కేశవరావు, దానం, గద్వాల విజయలక్ష్మి తదితరులు

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

- మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది తెలంగాణ బిడ్డల సమక్షంలో వేడుక: సీఎం రేవంత్
- పదేళ్ల అధికారంలో ఉన్నా గత పాలకులకు తెలంగాణ తల్లి గుర్తుకురాలేదని విమర్శ
- సచివాలయంలో విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- 2లో



నాడు మీరు బీజేపీతో కుమ్మక్కయ్యారా?

- అందుకే నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు బెయిల్ వచ్చిందా?: కేటీఆర్
- రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పనికిమాలిన ప్రచారం
- తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తామని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: బీజేపీతో కుమ్మక్కైనందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చినట్టయితే.. నేషనల్ హెరాల్డ్ కేసులో 2015 డిసెంబర్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కూడా అలాగే వచ్చిందా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిగతా 2వ పేజీలో ▶

నా బిడ్డొచ్చింది

కవితను హత్తుకుని భావోద్వేగానికి గురైన శోభమ్మ

- అంతకుముందు విమానాశ్రయం వద్ద పార్టీ శ్రేణుల ఘనస్వాగతం
- కేటీఆర్, భర్త, కుమారుడితో కలిసి హైదరాబాద్‌కు..
- భారీ ర్యాలీతో బంజారాహిల్స్ నివాసానికి పయనం
- హారతి పట్టిన తల్లి శోభమ్మ, వదిన శైలిమ
- నేడు ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో కవిత భేటీ



కవిత, తల్లి శోభమ్మ ఆత్మీయ ఆలింగనం

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ/ శంషాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం ఢిల్లీలో సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, భర్త అనిల్, కుమారుడితో పాటు పార్టీ కీలక నేతలతో కలిసి విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరిన కవిత.. సాయంత్రం 5.30కు శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. ఎయిర్ పోర్టు వద్ద కవితకు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ స్వాగతం పలికాయి. సీఎం.. సీఎం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన కవిత సాయంత్రం ఏడు గంటలకు బంజారాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు.

అమ్మకు పాదాభివందనం.. సోదరుడికి రాఖీ..

కవిత రాకకు ముందే ఆమె నివాసానికి కేసీఆర్ సతీమణి శోభమ్మ, కేటీఆర్ సతీమణి శైలిమ ఇతర కుటుంబ సభ్యులు చేరుకున్నారు. కవితను కలిసేందుకు నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది. డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాల నడుమ ఇంటికి చేరుకున్న కవితకు శోభమ్మ, శైలిమతో పాటు ఇతర కుటుంబ సభ్యులు గుమ్మడి కాయతో దిష్టితీసి హారతి పట్టారు. తల్లి, వదినను కవిత ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. శోభమ్మకు పాదాభివందనం మిగతా 3వ పేజీలో ▶

'నేను ఇస్తున్న వివరాలన్నీ వాస్తవమే'

ఏ తప్పు గుర్తించినా రుణమాఫీ మొత్తాన్ని రికవరీ చేసుకోవచ్చు

రుణమాఫీ కాని రైతుల నుంచి అఫిడవిట్ స్వీకరిస్తున్న ప్రభుత్వం

కుటుంబ సభ్యుల వివరాల సేకరణపై మార్గదర్శకాలు జారీ

గ్రామాల్లో ప్రారంభమైన సర్వే.. కొనసాగుతున్న గందరగోళం



అన్నారంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు

సాక్షి, హైదరాబాద్: 'కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం నేను ఇస్తున్న నా కుటుంబ సభ్యుల వివరాలు వాస్తవం/సరైనవి. రుణమాఫీ పొందడానికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గుర్తించినా లేదా మోసపూరితంగా పంట రుణాన్ని పొందినట్లు తేలినా లేదా పంట రుణమాఫీకి అర్హత లేదని నిర్ధారణ అయినా.. పొందిన రుణమాఫీ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించడానికి అంగీకరిస్తున్నాను. ఆ మొత్తం రికవరీ చేయడానికి చట్ట ప్రకారం వ్యవసాయ శాఖ సంచాలకుల వారికి అధికారం ఉంటుంది..' ఇది రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతులు, రుణమాఫీ కోసం ఇవ్వాల్సిన అఫిడవిట్. ఇలా అఫిడవిట్ కోరడంతో పాటు రుణమాఫీ–2024 బ్యాలెన్స్ ఉన్న రైతు కుటుంబాలకు సంబంధించిన మార్గదర్శకాలను వ్యవసాయ శాఖ జారీ చేసింది. రుణమాఫీ కాని రైతులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. మార్గదర్శకాలకు రైతులు ఇవ్వాల్సిన అఫిడవిట్‌ను జత చేసింది.

ఫొటో తీయాలి..సెల్ఫీ దిగాలి

→ పంట రుణం ఉన్న రైతు ఇంటిని ఎంఏవో తప్పనిసరిగా సందర్శించి, రైతు వెల్లడించిన కుటుంబ సభ్యుల మిగతా 5వ పేజీలో ▶

జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ



- రూ.2,361 కోట్లతో ఏర్పాటు
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి
- రెండు దశల్లో, దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- హైదరాబాద్–నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ప్రాజెక్టు
- వివిధ రంగాల్లో 1.74 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా.. న్యాలకల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా రూ.2,361 కోట్ల వ్యయంతో ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణం జరగనుంది. మొత్తం రెండు దశల్లో దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ – ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ ఫ్రేమ్ వర్క్‌లో భాగంగా..తొలిదశలో 3,245 ఎకరాల్లో పనులు ప్రారంభం అవుతాయి. ఇది జాతీయ రహదారి–65కు 2 కిలోమీటర్ల దూరంలో, హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుకు 65 కిలోమీటర్లు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అలాగే జహీరాబాద్ రైల్వేస్టేషన్‌కు 19 కిలోమీటర్లు, మెటల్‌కుంట మిగతా 2వ పేజీలో ▶



యూఎస్.. మనదే జోష్

- ఉద్యోగాలు చేసేవారి నుంచి ఉద్యోగాలు ఇచ్చేవారి దాకా భారతీయ అమెరికన్ల హవా
- విభిన్న రంగాల్లో ప్రతిభ చాటుతూ మనదైన ముద్ర
- సగటు జీవన ప్రమాణాల్లో అమెరికా స్థానికుల కంటే మనవారే ఉన్నతం
- సంపాదనలో, పొదుపులో, దాతృత్వంలో ఆదర్శంగా నిలుస్తున్న తీరు
- అదే సమయంలో అమెరికా పురోగతికి బాటలు
- సంపద సృష్టి, ఉద్యోగాల కల్పనతో ఆ దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పాటు

14లో

ఇవాంజ్ఞకత్



..అలవాటయ్యి.. శాంతియుతంగా అసలుండలేకపోతున్నాను మోదీజీ! సారీ!

గ్రేటర్ పరిధిలో అమలుకు ట్రాఫిక్ పోలీసుల నిర్ణయం

అతి వేగంగా డ్రైవింగ్ చేసినా క్యాన్సిలే..

రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యం

ఇప్పటివరకు డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లోనే చర్యలు..

రాంగ్‌సైడ్‌లో వెళ్తే లైసెన్స్ రద్దు..



→ నార్సింగి ఠాణా పరిధిలోని బండ్లగూడ జాగీర్ రోడ్‌లో నివాసం ఉండే తల్లీకూతుళ్లు అనురాధ, మమత ఇద్దరూ రోజూ లాగే ఇటీవల మార్నింగ్ వాక్‌కు బయలుదేరారు. కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్న వారిని అతి వేగంగా దూసుకొచ్చిన ఓ కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

→ చందానగర్‌లోని ఓ మాల్‌లో పనిచేసే గొలుసు మనోజ్, చిట్టిమళ్ల రాజులు.. ఉద్యోగం పూర్తయ్యాక బైక్ మీద మియాపూర్‌లోని ఇంటికి పయనమయ్యారు. ఇంటికెళ్లాలనే తొందర్లో రాంగ్ సైడ్‌లో ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో మృతి చెందారు.

- వివరాలు 3లో

కూచ్ బెహార్‌లో బీజేపీ కార్యకర్తను అడ్డుకుంటున్న పోలీసులు



బెంగాల్ బంద్ హింసాత్మకం

ర్యాలీలు.. పోలీసులతో ఘర్షణ.. లాఠీచార్జి..

బంద్‌కు మిశ్రమ స్పందన

- జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనతోపాటు మంగళవారం జరిగిన 'నబన్నా అభియాన్'పై పోలీసుల దాడికి నిరసనగా ప్రతిపక్ష బీజేపీ బుధవారం తలపెట్టిన 12 గంటల రాష్ట్ర బంద్ హింసాత్మకంగా మారింది. పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా పలుచోట్ల పోలీసులతో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘర్షణకు దిగారు. మరోవైపు తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చేదాకా ఉద్యమం కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్ల ఫోరమ్ తేల్చిచెప్పింది. - 6లో

రేపిస్టులకు మరణశిక్షే: మమతా బెనర్జీ 6లో

అనుమతులు చెల్లవ్

జన్వాడ ఫామ్‌హౌస్‌కు సర్పంచ్ అనుమతులు ఉన్నాయన్న అంశంపై సీఎం రేవంత్

పదేళ్లు మంత్రిగా చేసిన కేటీఆర్‌కు ఇది తెలియదా?

సాక్షి, హైదరాబాద్: ''జన్వాడలో తాను లీజుకు తీసుకున్న ఫామ్‌హౌస్‌కు సర్పంచ్ ఇచ్చిన అనుమతులు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. సర్పంచ్‌లకు అనుమతులిచ్చే అధికారం ఉండదనే విషయం పదేళ్లు మంత్రిగా చేసిన కేటీఆర్‌కు తెలియదా? డీటీసీపీకి మినహా సీఎంకు సైతం ఆ అధికారం లేదు. అసలు ఫామ్‌హౌజ్ లీజు విషయాన్ని కేటీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారా? వెల్లడించకుంటే కేటీఆర్‌పై అనర్హత వేటుతో పాటు విచారణను ఎదుర్కోక తప్పదు..''అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాను 2020లో జన్వాడ ఫామ్‌హౌస్‌పై కోర్టులో కేసు వేసినప్పుడు, అక్రమాలుంటే తానే కూల్చివేస్తానని కేటీఆర్ అన్నారని.. మరి ఎందుకు కూల్చివేయలేదని ప్రశ్నించారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌లు జలమండలి పరిధిలోకి వస్తాయని.. 111 జీవో పరిధిలో నిర్మాణాలకు ఆ సంస్థే ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుందని, సర్పంచ్ కాద ని స్పష్టం చేశారు. తన కుటుంబ సభ్యుల అక్రమ నిర్మాణాలేమైనా ఉంటే కేటీఆర్ ఆ జాబితా తీసుకురావాలని.. తానే దగ్గరుండి కూల్చివేయిస్తానని రే వంత్ చెప్పారు. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

111 జీవోలో మార్పుల్లేవు

సుప్రీంకోర్టు నిబంధనలను పూర్తిగా అమలుచేయకుండా 111 జీవో విషయంలో అంగుళం మార్పు కూడా చేయలేమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. భూముల రేట్లు పెంచి వ్యాపారం చేసుకోవడానికే గత ప్రభుత్వం 111 జీవో ఎత్తివేత కోసం కమిటీని ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఆ కమిటీలోని అధికారులు రిటైర్ కావడంతో కదలిక లేదని చెప్పారు.

ఉమ్మడిగా తనిఖీలకు వెళ్దాం.. వస్తారా?

విపక్ష నేతలు, ఎమ్మెల్యేలే లక్ష్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయనే ఆరోపణలను రేవంత్ తోసిపుచ్చారు. కాంగ్రెస్ నేత పల్లంరాజు కట్టడాన్ని కూడా కూల్చామని చెప్పారు. ''చెరువుల్లో అక్రమ నిర్మాణాలపై ఉమ్మడిగా తనిఖీలు చేద్దాం రండి. ప్రజాకోర్టు నిర్వహించి నిజనిర్ధారణ చేద్దాం. ప్రభుత్వ శాఖల అధికారులూ ఇందులో పాల్గొంటారు..''అని విపక్ష నేతలకు సవాలు విసిరారు. అకడమిక్ సంవత్సరం మధ్యలో విద్యార్థులకు నష్టం జరగవద్దన్న ఉద్దేశంతో.. అక్బరుద్దీన్, పల్లా రాజేశ్వర్‌రెడ్డిల కాలేజీల భవనాలను కూల్చకుండా హైడ్రా సమయం ఇచ్చిందని చెప్పారు. శాస్త్రీపురంలో ఐదంతస్తుల కట్టడాన్ని (ఓ ఎంఐఎం ఎమ్మెల్యేకు సంబంధించిన) కూల్చామని, అక్కడ ఎవరుంటారో మీకు తెలుసు కదా అని అసదుద్దీన్ ఒవైసీని ఉద్దేశించి పరోక్షంగా ప్రస్తావించారు.

భూములు కొన్నవారిదే బాధ్యత!

కూల్చివేతలతో సాధారణ ప్రజలు కూడా నష్టపోతారని మీడియా ప్రశ్నించగా.. స్థలాల కొనుగోళ్లకు ముందు దస్తావేజుల తనిఖీ బాధ్యత కొనుగోలుదారులదేనని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో 50 ఏళ్ల నుంచీ ఉన్నా కూల్చివేయడానికి నోటీసులు అవసరం లేదంటూ రాయదుర్గ్‌లోని లిడ్‌క్యాప్ స్థలంలో జరిపిన కూల్చివేతలను సమర్థించారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తప్పవన్నారు.

ఇక కూల్చివేయడమే!

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా, పార్కుల్లో అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడానికి ఆస్కారం ఉండదని, వాటిని కూల్చివేయడమే లక్ష్యమని రేవంత్‌రెడ్డి చెప్పారు. హైడ్రా పరిధిని ఔటర్ రింగ్‌రోడ్డును తాకే గ్రామపంచాయతీల వరకు నోటిఫై చేసినట్టు తెలిపారు. హైడ్రా పరిధి వెలుపలి ప్రాంతాల్లోని మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని అక్రమ కట్టడాల కూల్చివేతకు హైడ్రా సహాయాన్ని కోరవచ్చని చెప్పారు. హైడ్రాకు పోలీసుస్టేషన్ హోదా కల్పించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అధికారం ఇస్తామని తెలిపారు.

10 ఏళ్లలో రికార్డులు మాయం

హెచ్ఎండీఏ ఎన్ని చెరువులను నోటిఫై చేసిందనే అంశంపై పరిశీలన జరుగుతోందని రేవంత్ చెప్పారు. గత పదేళ్లలో కొన్ని రికార్డులు మాయమయ్యాయని, దీంతో రాష్ట్రం ఏర్పాటుకు ముందున్న రికార్డులను పరిశీలిస్తున్నామని తెలిపారు. జీవో 58, 59 కింద గత ప్రభుత్వంలో అక్రమంగా క్రమబద్ధీకరించిన ప్రభుత్వ భూములను గుర్తించి నిషేధిత భూముల జాబితాలో చేర్చినట్టు వెల్లడించారు.

వారంలో జర్నలిస్టుల సొసైటీకి స్థలాలు

జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జే)కి పేట్‌బషీరాబాద్‌లో కేటాయించిన భూములను వారంలోగా అప్పగిస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఖమ్మం జిల్లా పర్యటనలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనాల్సి ఉండడంతో.. గురువారం రవీంద్ర భారతిలో తలపెట్టిన సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని తెలిపారు.

కేజ్రీవాల్‌కు బెయిల్ రాలేదు.. కవితకు ఎలా వచ్చింది?

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌కు ఇంకా బెయిల్ రాలేదని.. మనీశ్ సిసోడియాకు బెయిల్ కోసం 16 నెలలు పట్టిందని.. కవితకు 5 నెలల్లోనే ఎలా బెయిల్ వచ్చిందని సీఎం రేవంత్ ప్రశ్నించారు. కవితకు ఒక న్యాయం, మిగతా వారికి ఇంకో న్యాయమా? అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ ఓట్లను బీజేపీకి బదిలీ చేసిందని, ఆ రెండు పార్టీల మధ్య అవగాహన జరిగిందని ఆరోపించారు.

కేటీఆర్ కొడంగల్‌కు వెళ్తే అభ్యంతరం లేదు

రుణమాఫీపై హరీశ్‌రావు, కేటీఆర్‌ల ఆరోపణలు అవాస్తవమని.. ఆగస్టు 15లోగా 22,37,848 ఖాతాలకు రూ.17,933 కోట్ల రుణమాఫీ చేశామని రేవంత్ చెప్పారు. గత ప్రభుత్వం 2018–23 మధ్యకాలంలో 23,61,849 ఖాతాలకు సంబంధించి రూ.13,329 కోట్ల రుణాలను వాయిదాల్లో మాఫీ చేసిందన్నారు. హరీశ్, కేటీఆర్, బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామగ్రామాన తిరిగి రుణమాఫీ జరగని వారి వివరాలను సేకరించి ప్రభుత్వానికి అందిస్తే వారికీ రుణమాఫీ చేస్తామన్నారు. కొడంగల్‌లో రుణమాఫీ పరిశీలనకు కేటీఆర్ వెళ్తానని అన్నారని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా.. తనకేమీ అభ్యంతరం లేదని చెప్పారు. నెలాఖరులోగా కొత్త బీసీ కమిషన్ ఏర్పాటు చేసి కులగణన ప్రారంభిస్తామన్నారు.

ఏపీకి రూ.2,500 కోట్ల వడ్డీల చెల్లింపు..

ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న రుణాలను జనాభా దామాషా ప్రకారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పంచుకోవాలన్న తెలంగాణ వాదనను తమ ప్రభుత్వ కృషితో ఏపీ అంగీకరించిందని రేవంత్ చెప్పారు. తెలంగాణ వాటా వడ్డీల కింద ఏపీకి రూ.2,500 కోట్లను చెల్లించడానికి కేంద్రం రుణాన్ని మంజూరు చేసిందని, దానితో తెలంగాణకు మేలు జరిగిందని చెప్పారు. కర్ణాటకలో జరిగిన వాల్మీకి స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలకు వాటాలు అందాయన్న కేటీఆర్ ఆరోపణలను రేవంత్ తోసిపుచ్చారు. బీఆర్ఎస్ నేతలకే వాటాలు ఉండవచ్చని విమర్శించారు. రాష్ట్రంలో నిజమైన కేసుల విచారణకు సీబీఐకి అనుమతిస్తామని, తప్పుడు కేసులకు ఇవ్వబోమని ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

- తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పరిపాలనకు కేంద్ర స్థానమైన సచివాలయం ప్రాంగణంలో డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన మిలియన్ మార్చ్ తరహాలో.. లక్షలాది మంది తెలంగాణ బిడ్డల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కోసం సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలనుకున్నామని.. వేద పండితులను సంప్రదిస్తే ఈ రోజు మినహా దసరా వరకు మంచి రోజులు లేవని చెప్పారని ఆయన తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి ముందుగానే నిర్ణయించిన మేరకు కేరళ పర్యటనకు వెళ్లారని.. మంత్రులు ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నా హడావుడిగా కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చిందని చెప్పారు.

తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారు

సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది లేదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారని సీఎం రేవంత్ శ్లాఘించారు. 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారన్నారు. కానీ 2014 నుంచి 2024 వరకు పదేళ్లు తెలంగాణను పాలించిన వాళ్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచామంటూ గొప్పలు చెప్పుకొన్నారని మండిపడ్డారు. వారు తెలంగాణ తల్లిని తెరమరుగు చేసే ప్రయత్నం చేశారని.. తానే తెలంగాణ, తెలంగాణే తాను అనే విధంగా వ్యవహరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అలాంటి విధానాలకు విరుద్ధమన్నారు.

పదేళ్లు సచివాలయంలోకి ప్రవేశం లేదు..

పదేళ్ల పాటు సీఎంగా, మంత్రులుగా ఉన్న వారు సచివాలయంలోకి ప్రజలకు ప్రవేశం కల్పించలేదని రేవంత్ విమర్శించారు. గత పదేళ్లలో రూ.22.50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టిన వారికి.. రూ.కోటి పెట్టి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు మనసు రాలేదని మండిపడ్డారు. నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ చుట్టుపక్కల మన దేశం, రాష్ట్రం కోసం ఎంతో చేసిన అంబేడ్కర్, ఇందిరాగాంధీ, అంజయ్య, పీవీ నరసింహారావు, కాకా వెంకటస్వామి విగ్రహాలు, జైపాల్‌రెడ్డి సమాధి ఉన్నాయని.. వాటి మధ్య రాజీవ్‌గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందని అన్నారు. కొందరు సచివాలయం ఎదుట ప్రదేశాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉంచుకోవాలని భావించారని.. కానీ తాము మేధావుల సూచన మేరకు అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. దేశం కోసం ఎంతో చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహం పెడితే తెలంగాణ తల్లి విగ్రహంతో ముడిపెట్టి దానిని వివాదం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా విగ్రహం

గత పాలకులు పదేళ్ల అధికారంలో ఉండీ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని.. సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని తాను జూన్ రెండో తేదీనే ప్రకటించానని సీఎం రేవంత్ చెప్పారు. కన్నతల్లిని తలపించేలా, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలనేది తమ అభిమతమన్నారు. దొరల గడీల ఆనవాళ్లు విగ్రహంలో ఉండకూడదని, అందుకే తెలంగాణ ప్రజల అభిమతానికి తగినట్లు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించే బాధ్యతను తెలంగాణ బిడ్డ, జేఎన్‌టీయూ ఫైనార్ట్స్ విభాగం కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించామని వివరించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2009 డిసెంబర్ 9న మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రకటించిందని.. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ జన్మదినం కూడా అదే రోజున ఉన్న నేపథ్యంలో.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9న ఆవిష్కరిస్తామని రేవంత్ తెలిపారు. తెలంగాణ ప్రజలకు డిసెంబర్ 9 పండుగ రోజని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

కవిత బెయిల్‌కు బీజేపీకి లింకు పెట్టొద్దు: ఎంపీ రఘునందన్‌రావు



సిద్దిపేట రూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకుగాను సుప్రీంకోర్టు ఇచ్చిన కవిత బెయిల్ పిటిషన్‌పై రాజకీయాలు చేయడం దుర్మార్గమని ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ..కవిత బెయిల్ పిటిషన్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. అలాగైతే మనీశ్ సిసోడియా బెయిల్‌కు బీజేపీకి కూడా సంబంధం ఉండాలన్నారు. కవిత అరెస్టుకు, బెయిల్‌కు బీజేపీకీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కనీస అవగాహన లేకుండా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ల పేరుతో మాట్లాడటం సరైందికాదని, బెయిల్ అనేది కోర్టుకు సంబంధించిన విషయమని పార్టీలకు సంబంధం లేదని జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్‌లకు అర్థమయ్యేలా చెప్పాలని హితవు పలికారు. బీజేపీ ఏ పార్టీనీ విలీనం చేసుకునేందుకు సిద్ధంగా లేదని, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సొంతంగా ఎదిగేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ కేసులో బెయిలొస్తే స్వీట్లు పంచుతారా?

బీఆర్ఎస్ నేతల వైఖరి సిగ్గుచేటు: షబ్బీర్‌అలీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన మహిళ లిక్కర్ కుంభకోణంలో అరెస్టయినందుకు సిగ్గుపడాల్సింది పోయి, ఆమె బెయిల్‌పై వస్తే టపాసులు కాల్చి, స్వీట్లు పంచుతారా అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ప్రశ్నించారు. కవిత కేవలం కండిషన్ బెయిల్ మీదనే వచ్చారని, ఆమె మీద మోపిన అభియోగాల నుంచి బయటపడలేదన్న విషయాన్ని బీఆర్ఎస్ నేతలు గ్రహించాలని హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజాహితం కోసం ఆమె జైలుకు వెళ్లినట్టు, స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అరెస్టయి బయటకు వచ్చినట్టు బీఆర్ఎస్ నేతలు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అవినీతి ఆరోపణలపై కేసీఆర్ కుటుంబం నుంచి జైలుకు వెళ్లిన మొదటి వ్యక్తి కవిత అని, భవిష్యత్తులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు కూడా కాళేశ్వరం కుంభకోణంలో జైలుకు వెళ్లే అవకాశాలున్నాయని తెలిపారు. బీజేపీకి పరోక్షంగా సహకరించి పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించడంతో కవిత బెయిల్‌కు బీజేపీ సహకరించిందని షబ్బీర్‌అలీ ఆరోపించారు.

ఓటుకు నోటు కేసులో నువ్వు కుమ్మక్కయ్యావా?

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మండిపడిన హరీశ్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కవితకు బెయిల్ లభించడంపై బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కు అయిందని అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఓటుకు నోటు కేసులో కేవలం 15 రోజుల వ్యవధిలోనే రేవంత్‌కు బెయిల్ లభించిన విషయాన్ని గుర్తు చేశారు. కవితకు ఐదు నెలల్లోనే బెయిల్ రావడాన్ని ప్రశ్నిస్తున్న రేవంత్ గతంలో బెయిల్ కోసం ఎవరితో కుమ్మక్కయ్యారని ప్రశ్నించారు. డెక్కన్ హెరాల్డ్ కేసు విషయంలోనూ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి అరెస్ట్ కాక మునుపే బెయిల్ లభించడం వెనుక కుమ్మక్కు రాజకీయాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న క్రేజీవాల్ తన బెయిల్ కోసం ఎవరితో కుమ్మక్కయ్యారో రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. న్యాయవ్యవస్థ పవిత్రతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలన్నారు.

నాడు మీరు బీజేపీతో కుమ్మక్కయ్యారా?

▶ మొదటి పేజీ తరువాయి



కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ కూడా ఎన్డీయేతో కుమ్మక్కు అయినందుకే వారిద్దరికి బెయిల్ వచ్చిందని భావించాల్సి వస్తుందని కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతలు పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ ప్రయోజనం పొందేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియా కూటమిలో భాగమైన ఆప్ నేత మనీశ్ సిసోడియాకు కూడా వారం క్రితమే బెయిల్ వచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఓటుకు కోట్లు కేసులో సీఎం రేవంత్‌రెడ్డి 2015 నుంచి బెయిల్‌పై ఉన్నారన్న సంగతి కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇవన్నీ కూడా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే జరిగాయని, వీరంతా ఎన్డీయే భాగస్వాములేనని అనుకోవాలా? అని ప్రశ్నించారు.

రాసి పెట్టుకో...

సోనియా గాంధీని దెయ్యం, పిశాచి, బలి దేవత అన్న రేవంత్‌రెడ్డి.. రాజీవ్ గాంధీ మీద ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు ప్రజలకు తెలుసని కేటీఆర్ ధ్వజమెత్తారు. దొడ్డిదారిన పీసీసీ అధ్యక్షుడై రాజీవ్‌గాంధీ పేరుతో నాటకాలు ఆడుతున్నారన్నారు. 'నీ ఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం'అని మండిపడ్డారు. 'తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలేంటని అడిగితే కారుకూతలు కూస్తావా? తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది'అని అన్నారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని పునరుద్ఘాటించారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం.. రాసి పెట్టుకో అని రేవంత్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్ఠిస్తామని చెప్పారు.

జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

▶ మొదటి పేజీ తరువాయి

రైల్వేస్టేషన్‌కు 12 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 125 కిలోమీటర్ల దూరంలో, ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్టుకు 600 కిలోమీటర్ల దూరంలో, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం పోర్టుకు 620 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

ఇప్పటికే పర్యావరణ అనుమతులు

మొదటి దశకు అవసరమైన 3,245 ఎకరాల స్థలంలో 3,100 (దాదాపు 80%) ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉంది. రాష్ట్రానికి సంబంధించి షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్, స్టేట్ సపోర్ట్ అగ్రిమెంట్ ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ వస్తువులు, ఫుడ్ ప్రాసెసింగ్, మెషినరీ, మెటల్స్, నాన్–మెటాలిక్ ఆధారిత పరిశ్రమలు, రవాణా తదితర రంగాలకు ఊతం లభిస్తుంది. 1.74 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనికి సంబంధించిన పర్యావరణ అనుమతులన్నీ అటవీ పర్యావరణ శాఖ నుంచి అందాయి. తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ పారిశ్రామికాభివృద్ధి మరింత వేగంగా ముందడుగు వేస్తుందని భావిస్తున్నారు. జహీరాబాద్‌కు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌కు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏపీలో రెండు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు

దేశంలో మొత్తం 12 ప్రపంచ స్థాయి గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగానే తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్లులో రూ.2,786 కోట్లతో, కొప్పర్తిలో రూ.2,137 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటు కానున్నాయి.

తెలంగాణలో 31 ఎఫ్ఎం స్టేషన్లు

తెలంగాణలో 31, ఆంధ్రప్రదేశ్‌లో 68 ప్రైవేట్ ఎఫ్ఎం స్టేషన్ల ఏర్పాటుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. తెలంగాణలోని ఆదిలాబాద్ (3), కరీంనగర్ (3), ఖమ్మం (3), కొత్తగూడెం (3), మహబూబ్‌నగర్ (3), మంచిర్యాల (3), నల్లగొండ (3), నిజామాబాద్ (4), రామగుండం (3), సూర్యాపేట (3)ల్లో కొత్త ప్రైవేట్ ఎఫ్ఎం స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి.

కృతజ్ఞతలు తెలిపిన శ్రీధర్‌బాబు

జహీరాబాద్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదించడంపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఈ సమయంలో ప్రధాన మంత్రి దూరదృష్టితో రూ. 2,361 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ప్రకటించడం అభినందనీయం అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బుల్కాపూర్ నాలా డిజిటల్ సర్వే

హద్దులు నమోదు చేసిన అధికారులు



నాలా మ్యాప్‌ను సరిచూసుకుంటున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ, మియాఖాన్ గడ్డ వద్ద సుమారు 400 మీటర్ల మేర ఉన్న బుల్కాపూర్ (ఫిరంగి) నాలా డిజిటల్ సర్వే బుధవారం నిర్వహించారు. చేవెళ్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రత్నాకర్ రావు, శంకర్‌పల్లి ఆర్ఐ తేజ, సర్వేయర్ సాయితేజ, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగం ఈ సర్వేలో పాల్గొన్నారు. ఇదంతా మాజీ మంత్రి కేటీఆర్ సన్నిహితునిదిగా చెబుతున్న ఫాంహౌస్ చుట్టే జరగడం గమనార్హం. అధికారులు సర్వే చేస్తున్నారన్న సమాచారంతో స్థానికులు, మీడియా ప్రతినిధులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. గంట పాటు డిజిటల్ మీటర్‌తో సర్వే చేసిన అధికారులు హద్దులు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు నివేదికను చేవెళ్ల ఆర్డీఓకు అందజేస్తామని వారు తెలిపారు. గురువారం ఫిరంగి నాలాకు సంబంధించిన ప్రాంతానికి హద్దులు (మార్కింగ్) నిర్ణయిస్తామని చెప్పారు.

మూడు నెలల్లో పార్లమెంట్‌కు 'వక్ఫ్' నివేదిక: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లుపై మూడునెలల్లో పార్లమెంట్‌కు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదిక సమర్పిస్తుందని ఈ కమిటీ సభ్యురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఈ నెల 30న జేపీసీ రెండో సమావేశం జరగనుందని, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నివేదికను సమర్పించేలా కమిటీ కసరత్తు చేస్తోందని తెలియజేశారు. గతంలోని చట్టానికి సవరణలు ఎందుకు చేయాల్సి వస్తున్నదనే దానిపై దృష్టి నిలిపామన్నారు. వక్ఫ్ భూములతో ముడిపడిన వివిధ సమస్యలపై అరుణ ఫిర్యాదులు అందుకున్న సందర్భంగా ఆమె స్పందించారు. హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి పలువురు బాధితులు ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను ధరణి వచ్చాక తమ పాత పాస్ పుస్తకాలను రద్దు చేసినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. చట్టసవరణ బిల్లుతోనైనా వారికి న్యాయం జరుగుతుందని బాధిత ప్రజలు భావిస్తున్నారని అరుణ వెల్లడించారు.

తదుపరి ఆదేశాలిచ్చే వరకు కూల్చొద్దు

- 'పల్లా'పిటిషన్‌లో హైడ్రాకు హైకోర్టు ఆదేశం
- విచారణ రేపటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: జనగాం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలోని 'గాయత్రి'భూముల్లో తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు కూల్చివేతలు చేపట్టవద్దని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. చెరువుకు సంబంధించిన మ్యాప్ ఇతర వివరాలను జలసౌధ నుంచి తెప్పించి తమ ముందు ఉంచాలని ఆదేశించింది. ఈమేరకు హైడ్రాతోపాటు ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. చెరువుకు సంబంధించిన మ్యాప్, ఇతర వివరాలు చూస్తే ఆక్రమణలపై నిజానిజాలు నిగ్గుతేల్తాయని వ్యాఖ్యానించింది. చట్టాన్ని పాటించకుండా తమ విద్యాసంస్థల భవనాల కూల్చివేత చేపట్టేందుకు హైడ్రా, ఇతర అధికారులు యత్నిస్తున్నారంటూ గాయత్రి విద్యా సాంస్కృతిక ట్రస్ట్, అనురాగ్ యూనివర్సిటీ, నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, గూడ మధుకర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వే నంబర్ 796, 813లోని కొంత భాగంలోని 17.21 ఎకరాల్లో చట్టవిరుద్ధంగా ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు.

హైడ్రా నిర్ణయం ఏకపక్షమంటూ వాదన

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. 'విద్యాసంస్థల నిర్మాణాలను కూల్చివేయాలని హైడ్రా భావించే ముందు పిటిషనర్‌కు నోటీసు ఇవ్వలేదు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల భవనాలను కూల్చివేయడం లేదని, సెలవుల్లో మాత్రమే చర్యలు తీసుకుంటామని హైడ్రా ఇటీవల ప్రకటన చేసింది. ముందుగా భవనాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయో లేదో నిర్ధారించాలి. ఆ తర్వాత ఒకవేళ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని తేలితే విద్యాసంస్థలను మరో ప్రదేశానికి తరలించడానికి సహేతుకమైన సమయం ఇవ్వాలి. ఎలాంటి సర్వే చేయకుండానే నాదం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పిటిషనర్ విద్యాసంస్థలు ఉన్నట్లు ఏకపక్షంగా నిర్ధారణకు రావడం చట్టవిరుద్ధం'అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని అధికారులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.



తహసీల్దార్ నోటీసుల కొట్టివేత

- డాక్యుమెంట్లను పరిశీలించి చట్టప్రకారం నడుచుకోవాలని హైకోర్టు స్పష్టీకరణ
- అప్పటివరకు కూల్చివేతలు వద్దు
- మారుతి, మర్రి విద్యాసంస్థల పిటిషన్లలో ముగిసిన విచారణ

సాక్షి, హైదరాబాద్: చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టారంటూ మారుతి, మర్రి విద్యాసంస్థలకు గండిమైసమ్మ తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను హైకోర్టు కొట్టివేసింది. ఇది వాల్టా, తెలంగాణ నీటిపారుదల చట్టాలను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. వాటిని షోకాజ్ నోటీసులుగా పరిగణించి సంబంధిత డాక్యుమెంట్లతో ఏడు రోజుల్లోగా తహసీల్దార్‌ను సంప్రదించాలని పిటిషనర్లను ఆదేశించింది. వారి వాదనలు విన్న తర్వాత చట్టప్రకారం ముందుకెళ్లాలని తహసీల్దార్, ఇతర అధికారులను ఆదేశించింది. అప్పటి వరకు కూల్చివేత సహా ఎలాంటి చర్యలు చేపట్టవద్దంటూ వాదనలను ముగించింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని 10 ఎకరాలకు సంబంధించి తమకు పట్టా ఉన్నా.. అధికారులు జోక్యం చేసుకుని, ఆక్రమణలను ఏడు రోజుల్లోగా తొలగించాలంటూ ఈనెల 22న తహసీల్దార్ నోటీసులు జారీ చేయడాన్ని సవాల్‌చేస్తూ మారుతి విద్యాసంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్, సీహెచ్ సత్తిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే దుండిగల్‌లోని 17.20 ఎకరాలకు సంబంధించి తమకు పట్టా ఉన్నా అధికారులు జోక్యం చేసుకుంటున్నారని మర్రి విద్యాసంస్థలు, మర్రి లక్ష్మణ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు.

ఇరుపక్షాల వాదనలు...

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'భూమిని సర్వే చేసి, ఆ ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందో లేదో నిర్ధారించడానికి తహసీల్దార్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. సదరు విద్యాసంస్థలు ఆక్రమణలకు పాల్పడ్డాయని, 8.25 ఎకరాల్లో ఆక్రమణలను తొలగించాలని పిటిషనర్లకు నోటీసులు జారీ చేశారు. చెరువులపై సర్వే చేయడానికి సర్వే అధికారులను సంప్రదించి చట్ట ప్రకారం సరిహద్దులు నిర్ధారించాలి. కానీ, ఆ విధానం పాటించలేదు' అని చెప్పారు.
ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అడ్వొకేట్ కమిషనర్లు నగరంలోని అన్ని చెరువులను సందర్శించారు. దుండిగల్‌లోని చిన దామెరచెరువు ఆక్రమణలను వారు నివేదికలో వివరించారు. తప్పుచేసిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువును పరిరక్షించాలని సీజే ధర్మాసనం ఆదేశించింది'అని చెప్పారు. కాగా, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ అమర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నివాసి ఊర్మిలా దేవి దాఖలు చేసిన పిటిషన్‌లో జస్టిస్ కె.లక్ష్మణ్.. నోటీసులపై స్టే ఇచ్చారు.

50 వేల మందికి నైపుణ్య శిక్షణ

మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్రంలో నాలుగేళ్లలో 50 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. జాతీయ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్‌ (ఎన్‌ఎస్‌ఐసీ) సహకారంతో యువతకు వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తామని వెల్లడించారు. ఎన్‌ఎస్‌ఐసీ, తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ సంయుక్తంగా నైపుణ్య శిక్షణకు సంబంధించి బుధవారం సచివాలయంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఎన్‌ఎస్‌ఐసీ చైర్మన్‌ సుభ్రాంశు శేఖర్‌ ఆచార్య, తెలంగాణ పరిశ్రమల విభాగం అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ ఒప్పందం వల్ల ముడిసరుకు కొనుగోలు, ఉత్పత్తుల విక్రయంలో చిన్న పరిశ్రమలకు ఎన్‌ఎస్‌ఐసీ సహకరిస్తుందని శ్రీధర్‌బాబు వివరించారు. జిల్లాల స్థాయిలో ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తామని తెలిపారు. దీనికోసం 'తేజస్‌' (తెలంగాణ ఎంట్రప్రెన్యూర్స్‌ జర్నీ ఫర్‌ యాస్పిరేషన్స్‌ అండ్‌ అచీవింగ్‌ సక్సెస్‌) అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కమిషనర్‌ డాక్టర్‌ మల్సూర్, టీ–వర్క్స్‌ సీఈవో జోగిందర్‌ తనికెళ్ల, తెలంగాణ లైఫ్‌ సైన్సెస్‌ ఫౌండేషన్‌ సీఈవో శ్రీకాంత్‌ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐటీ ఎగుమతులు 11.3% వృద్ధి

సాఫ్ట్‌వేర్‌ ఎగుమతుల్లో జాతీయ సగటు కంటే తెలంగాణ మూడింతల వృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. 2024–25 మొదటి మూడు నెలల్లో జాతీయ ఐటీ ఎగుమతులు కేవలం 3.3% పెరగగా ఏప్రిల్‌ నుంచి జూన్‌ మధ్య 11.3% వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. సెప్టెంబర్‌ 5,6 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్‌ ఏఐ సదస్సుకు కర్టెన్‌ రైజర్‌గా 'నాస్కామ్‌'బుధవారం గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన కార్యక్ర మానికి ఆయన హాజరయ్యారు.

తెలంగాణను పర్యాటక కేంద్రంగా మారుస్తాం

మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్‌: ప్రపంచానికి తెలంగాణ పర్యాటక రంగాన్ని దర్శనీయ గమ్యస్థానంగా మారుస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. థాయ్‌లాండ్‌ రాజధాని బ్యాంకాక్‌లోని క్వీన్‌ సిరికిట్‌ నేషనల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌లో నిర్వహించిన పసిఫిక్‌ ఆసియా ట్రావెల్‌ అసోసియేషన్‌ మార్ట్‌లో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పర్యాటకశాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించేలా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, హైదరాబాద్‌లోని చార్మినార్, ములుగులోని లక్నవరం తీగల వంతెన ఛాయాచిత్రాల్ని ప్రదర్శించారు. రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, వరంగల్‌ ఖిల్లా, కాకతీయ తోరణం, చార్మినార్, కుతుబ్‌షాహీ టూంబ్స్, ఆసియా ఖండంలో అతిపెద్ద బుద్ధిజం ప్రాజెక్టు బుద్ధవనం, వేయి స్తంభాల గుడి, ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైన పోచంపల్లి పర్యాటక ప్రదేశాలను చూసేందుకు రావాలని ఆయా దేశాల ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ట్రావెల్‌ మార్ట్‌ ద్వారా తెలంగాణ పర్యాటక అందాలను ప్రపంచానికి తెలియజేసే అవకాశం దక్కిందన్నారు.

నేటి సాయంత్రం నుంచి పాస్‌పోర్ట్‌ సేవలకు ఆటంకం

రాంగోపాల్‌పేట్‌ (హైదరాబాద్‌): సాంకేతిక మరమ్మతుల కోసం ఈ నెల 29 సాయంత్రం 8 గంటల నుంచి సెప్టెంబర్‌ 2 ఉదయం 6 గంటల వరకు పాస్‌పోర్ట్‌ సేవా పోర్టల్‌ పనిచేయదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ పోర్టల్‌ ద్వారా తెలిపింది. పోర్టల్‌ ద్వారా అందే ఎంఈఏ, ఆర్పీవో, డీవోపీ, పోలీసుల సేవలను ఉపయోగించుకునేందుకు అవకాశం ఉండదని స్పష్టం చేసింది. ఈ నెల 30న పాస్‌పోర్ట్‌ అపాయింట్‌మెంట్లను రీ షెడ్యూల్‌ చేసి త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.



రాంగ్‌సైడ్‌లో వెళ్తే లైసెన్స్‌ రద్దు!


గ్రేటర్‌ పరిధిలో అమలుకు ట్రాఫిక్‌ పోలీసుల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ఒకరు కాదు ఇద్దరు కాదు గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలో ఏటా వందల సంఖ్యలో రాంగ్‌ సైడ్‌ డ్రైవింగ్, అతివేగం కారణంగా మృత్యువాత పడుతున్నారు. ఆయా ప్రమాదాలలో వాహనదారులే కాదు పాదచారులు, తోటి ప్రయాణికులు సైతం మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసుల్లో మాత్రమే డ్రైవింగ్‌ లైసెన్స్‌ (డీఎల్‌) రద్దయ్యేలా చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచేటప్పుడు.. అభియోగపత్రాల్లో మందుబాబుల వ్యవహార శైలి, మద్యం మత్తులో చేసిన ప్రమాదాల వివరాలను నమోదు చేస్తున్నారు. న్యాయస్థానాలు వారికి రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకూ జరిమానాలు విధించడంతో పాటు కొందరికి 3 నెలల నుంచి 6 నెలల వరకు లైసెన్స్‌లు రద్దు చేస్తున్నాయి. తాజాగా అపసవ్య దిశలో (రాంగ్‌ సైడ్‌) వాహనాలు నడపడం, అతివేగం కారణంగా సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడం లక్ష్యంగా ట్రాఫిక్‌ పోలీసు ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ట్రాఫిక్‌ నిబంధనలు ఉల్లంఘించేవారి డ్రైవింగ్‌ లైసెన్స్‌లు కూడా రద్దయ్యేలా అభియోగ పత్రాలు దాఖలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రవాణా శాఖకు ప్రతిపాదనలు పంపించినట్లు, త్వరలోనే గ్రేటర్‌లో అమల్లోకి రానున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

హైవేలపై ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలు: జాతీయ రహదారులపై పాదచారులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు. దీంతో హైవేలపై ప్రజలు రోడ్డు దాటేందుకు వీలుగా ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే రాచకొండ కమిషనరేట్‌ పరిధిలో 103 బ్లాక్‌స్పాట్లు (ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలు) ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. వీటి మరమ్మతులు, నిర్వహణపై జీహెచ్‌ఎంసీ, ఆర్‌ అండ్‌బీ, ఇతరత్రా విభాగాలతో జరిగిన సమావేశంలో చర్చించారు. రోడ్డు మధ్యలో డివైడర్ల ఎత్తును పెంచడంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేసేలా చూడాలని నిర్ణయించారు. మరోవైపు ప్రమాదాలకు ప్రధాన కారణాలను కూడా పోలీసులు గుర్తించారు.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు

- జాతీయ రహదారులపై డ్రైవర్లు 15–18 గంటల పాటు ఏకధాటిగా డ్రైవింగ్‌ చేయడం.
- హైవేలపై లైనింగ్‌ నిబంధన పాటించకపోవడం. ఇతర వాహనాలను ఓవర్‌ టేక్‌ చేసేందుకు ప్రయత్నించడం.
- రాత్రివేళ సరైన నిద్రలేకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం.
- హైవేలపై కేటాయించిన స్థలంలో కాకుండా రోడ్డు మధ్యలో వాహనాలను నిలపడం.
- పాదచారులు జాతీయ రహదారులపై లైట్లు లేని ప్రాంతంలో రోడ్లను దాటుతుండటం.



భవిష్యత్తు అంధకారమే..



ట్రాఫిక్‌ నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడపడంతో పాటు ఇతరుల మరణానికి కారణం అయితే చేజేతులా భవిష్యత్తును అంధకారం చేసుకున్నట్లే. మోటార్‌ వాహన చట్టం (ఎంవీ) కేసులలో పోలీసులు న్యాయస్థానాల్లో సమర్పిస్తున్న అభియోగపత్రాల ఆధారంగానే ఉల్లంఘనల విషయంలో చర్యలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో జైలుకు వెళ్లాల్సి వస్తే ఉన్న ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఉద్యోగ అవకాశాల సమయంలో విద్యార్థులు, యువకులను ఈ కేసులు ఇబ్బంది పెడతాయి.

– వి.శ్రీనివాసులు, డీసీపీ, ట్రాఫిక్, రాచకొండ

సుస్థిర అభివృద్ధి సాధించాలి

ఆలయాలు, కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు నగరం: రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ



లక్నవరం సరస్సులో బోటింగ్‌ చేస్తున్న గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క తదితరులు

హనుమకొండ అర్బన్‌: చారిత్రక వారసత్వ నగరం ఓరుగల్లు సుస్థిర అభివృద్ధి సాధించాలని రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ ఆకాంక్షించారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు, ప్రఖ్యాత కవులు, కళాకారులు, రచయితలు, సామాజిక కార్యకర్తలతో భేటీ అయ్యారు. అదే విధంగా నగరంలోని వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి, పద్మాక్షి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. కాకతీయ ఆలయాల శిల్పకళను పరిశీలించారు. వరంగల్‌ కోట, వరంగల్‌ ఎన్‌ఐటీలను సందర్శించి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హనుమకొండ రెడ్‌క్రాస్‌ను సందర్శించి తలసేమియా, సికిల్‌సెల్‌ ఎనిమియా అదనపు బ్లాక్‌ను ప్రారంభించారు. రెడ్‌క్రాస్‌ చేపడుతున్న కార్యక్రమాల పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్‌ జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ మాట్లాడుతూ వరంగల్‌ నగరం సుస్థిర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మండలి వైస్‌ చైర్మన్‌ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్‌ కమిషన్‌ చైర్మన్‌ సిరిసిల్ల రాజయ్య, మేయర్‌ గుండు సుధారాణి, రాష్ట్ర గవర్నర్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

లక్నవరం సరస్సులో బోటింగ్‌

మంగళవారం రాత్రి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బసచేసిన గవర్నర్‌ బుధవారం ఉదయం సరస్సులో మంత్రి సీతక్క, అధికారులతో కలిసి బోటింగ్‌ చేశారు. సరస్సు అంతా కలియదిరిగి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

సామాజిక న్యాయానికి ఈ వివాహాలే తార్కాణం

కేరళ ఓచిరా పరబ్రహ్మ ఆలయంలో జరిగిన సామూహిక వివాహ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్‌: సమానత్వ విలువలకు, సామాజిక న్యాయానికి సామూహిక వివాహాలు తార్కాణంగా నిలుస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సామూహిక వివాహాలు వ్యక్తిగత వేడుక కాదని, సామాజిక ప్రాధాన్యత ఉన్న కార్యక్రమమని చెప్పారు. కుటుంబాలు బలంగా ముడిపడితే సమాజం బలమైన పునాదుల మీద నిలుస్తుందని, సామూహిక వివాహాలు భారతీయులను ఏకతాటిపైకి తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు. అఖిల భారత కాంగ్రెస్‌ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌ ప్రాతినిధ్యం వహిస్తోన్న అలప్పుజ లోక్‌సభ నియోజకవర్గంలోని ఓచిరా పరబ్రహ్మ ఆలయంలో బుధవారం జరిగిన 400 సామూహిక వివాహాల వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సామూహిక వివాహాల సాంప్రదాయం ప్రతి ఒక్కరూ తలెత్తుకుని తిరిగే సమాజ ఆవిష్కరణకు ప్రతిబింబంగా నిలుస్తుందని చెప్పారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ద్వారా ఓచిరా పరబ్రహ్మ ఆలయ నిర్వాహకులు సమాజం పట్ల నిబద్ధతను చాటుకున్నారని ప్రశంసించారు. తెలంగాణ ప్రాంతంలో కూడా సంఘర్షణ నుంచి సంస్కరణలు ఉద్భవించాయని, సాయుధ రైతాంగ పోరాటం నుంచి సామాజిక సంస్కరణల వరకు తెలంగాణ ప్రస్థానం అడుగడుగునా స్ఫూర్తిదాయకమన్నారు. పెళ్లయిన కొత్త జంటలకు భట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేరళ మంత్రులు కె.రాజన్, మణి, ఎమ్మెల్యే రమేశ్‌ చెన్నితల తదితరులు పాల్గొన్నారు.



అలెప్పీలో సామూహిక వివాహాలకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, కేరళ కాంగ్రెస్‌ నేతలు

రెండు డీఏలకు త్వరలో మోక్షం!

- ప్రభుత్వ ఉద్యోగుల నాలుగు పెండింగ్‌ డీఏల్లో రెండు ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం
- ఆర్థిక శాఖకు సీఎం ఆదేశాలు
- సెప్టెంబర్‌లోనే మంజూరు చేసే అవకాశం.. లేదంటే దసరా కానుకగా ప్రకటన

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం(డీఏ) బకాయిలను త్వరలో చెల్లించనున్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు బకాయిల్లో రెండింటిని వీలున్నంత త్వరగా మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు రెండు డీఏల ప్రతిపాదనలు, అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. వీలును బట్టి సెప్టెంబర్‌లోనే ఈ రెండు డీఏలను మంజూరు చేయాలని, లేదంటే దసరా కానుకగా ప్రకటించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా మొదటి తేదీనే ఉద్యోగులకు వేతనాలు అందుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయడం ద్వారా వారిలో మరింత మనోస్థైర్యాన్ని నింపాలన్న ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. వీలైనంత త్వరలోనే రెండు డీఏలను మంజూరు చేస్తూ అధికారిక ప్రకటన చేసే అవకాశాలున్నాయి.

నెలకు రూ.150 కోట్ల భారం

వాస్తవానికి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. 2022 జూలై, 2023 జనవరి, జూలై, 2024 జనవరికి సంబంధించిన డీఏలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. 2024 జూలై డీఏను కేంద్రం ఇంకా ప్రకటించలేదు. అంటే కేంద్రం ప్రకటించిన విధంగా ప్రతి డీఏ కింద బేసిక్‌పేలో 3.64 శాతం వేతనాన్ని ప్రకటించాల్సి ఉంది. నాలుగు డీఏలు కలిపి అది 14.56 శాతానికి చేరుతుంది. ఇప్పుడు రెండు డీఏలు మంజూరు చేయాల్సి వస్తే 7.28 శాతం వేతనం ప్రకటించాలి. ప్రస్తుత వేతన స్కేల్‌ ప్రకారం ప్రతి శాతం వేతనానికి ఏడాదికి రూ.250 కోట్ల చొప్పున ప్రభుత్వంపై భారం పడుతుందని ఉద్యోగ సంఘాలు చెపుతున్నాయి. ఈ లెక్కన రెండు డీఏలు కలిపి రూ.1,820 కోట్లు అవసరమవుతాయి. అంటే ప్రతి నెలా రాష్ట్ర ఖజానాపై రూ.150 కోట్ల పైచిలుకు భారం పడనుంది.

▶ మొదటి పేజీ తరువాయి

నా బిడ్డొచ్చింది

చేశారు. ఈ సందర్భంగా శోభమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. కేటీఆర్‌ సోదరి కవిత చేయిపట్టుకుని కార్యకర్తల నినాదాల నడుమ ఇంట్లోకి తోడ్కొని వెళ్లారు. సోదరుడు కేటీఆర్‌కు కవిత రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. పార్టీ అధినేత, తన తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు కవిత గురువారం ఎర్రవల్లి నివాసానికి వెళ్లనున్నారు. సుమారు ఐదున్నర నెలల తర్వాత కేసీఆర్‌తో కవిత భేటీ కానుండటం ఆసక్తికరంగా మారింది. కాగా ఆమె రెండు రోజుల పాటు ఎర్రవల్లి నివాసంలో తన తల్లిదండ్రులతోనే ఉండనున్నారు. మరోవైపు గురువారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో పార్టీ ముఖ్య నేతలు భేటీ కానున్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే నేతలకు విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ప్రజాక్షేత్రంలో బలంగా పనిచేస్తా: కవిత

ప్రజాక్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తానని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. తాను ఏ విషయంలోనూ, ఎలాంటి తప్పు చేయలేదని, అన్ని అపవాదుల నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. న్యాయం, ధర్మం కచ్చితంగా గెలిచి తీరుతుందని, నిజం నిలకడ మీద ప్రజలకు తెలుస్తుందని అన్నారు. కేసీఆర్‌ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసమస్యలపై జరిగే పోరాటంలో పాల్గొంటానని చెప్పారు. తాను కేసీఆర్‌ బిడ్డనని వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు. తనకు వెన్నుదన్నుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ తనపై కుట్ర చేసిన వారికి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తానని అన్నారు.



బుధవారం విమానాశ్రయం బయట అభిమానులతో ఎమ్మెల్సీ కవిత కరచాలనం



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న కవిత. చిత్రంలో కేటీఆర్‌ సతీమణి శైలిమ, ఎర్రబెల్లి, కౌశిక్‌రెడ్డి,బాల్క సుమన్‌

నా చెల్లెలు ఫైటర్‌: అంతకుముందు బుధవారం ఉదయం కవిత హస్తినలో బిజీబిజీగా గడిపారు. ఆమె విడుదల విషయాన్ని తెలుసుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. బుధవారం ఉదయం జిల్లాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలతో ఆమె ముచ్చటించారు. ఐదున్నర నెలల్లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై ఆరా తీశారు. కేటీఆర్, కవితలతో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర భేటీ అయ్యారు. కవిత జైలు నుంచి విడుదల కావడంతో తనకెంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఇటీవలి పార్లమెంటు సమావేశాలకు సంబంధించిన విశేషాలను వివరించారు. హైదరాబాద్‌ బయలుదేరే ముందు సోదరుడు కేటీఆర్‌తో కవిత కొద్దిసేపు ముచ్చటించారు. మరోసారి కవితను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న కేటీఆర్‌ భావోద్వే గానికి గురయ్యారు. 'నా చెల్లెలు ఫైటర్‌ .. పట్టు వదలని విక్రమార్కురాలు..' అంటూ ఆశీర్వదించారు.

సీబీఐ కేసులో కోర్టుకు హాజరైన కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ నమోదుచేసిన కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ట్రయల్‌ కోర్టుకు హాజరయ్యారు. బుధవారం ఢిల్లీలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయం నుంచి వర్చువల్‌ విధానంలో కవిత విచారణకు హాజరయ్యారు. కవిత, మనీశ్‌ సిసోడియా, అభిషేక్‌ బోయిన పల్లి, ముత్తా గౌతమ్, బుచ్చిబాబు తదితరు లపై సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటు, సప్లిమెంటరీ చార్జిషీట్లపై రౌజ్‌ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా విచారణ జరిపారు. ఆయా డాక్యుమెంట్ల కాపీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సరైన రీతిలో అందించాలని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీంతో వారం రోజుల్లో వారికి స్పష్టంగా ఉన్న డాక్యుమెంట్లు అందజేయాలని సీబీఐ తరఫు న్యాయవాదిని జడ్జి ఆదేశించారు. తదుపరి విచారణను సెప్టెంబర్‌ 11కు వాయిదా వేశారు.

'వేణుస్వామికి సమన్లపై వివరణ ఇవ్వండి'

సాక్షి, హైదరాబాద్‌: జ్యోతిషుడు వేణుస్వామికి సమన్ల జారీపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర మహిళా కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. కమిషన్‌తోపాటు తెలుగు ఫిల్మ్‌ జర్నలిస్ట్‌ అసోసియేషన్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ లోగా కౌంటర్‌ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణ సెప్టెంబర్‌ 2కు వాయిదా వేసింది. ఇటీవల వేణుస్వామి చేసిన వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లగా.. ఆయనకు కమిషన్‌ సమన్లు జారీ చేసింది. ఆ సమన్లను సవాల్‌ చేస్తూ వేణుస్వామి పిటిషన్‌ వేయగా..దీనిపై జస్టిస్‌ నందా సూరేపల్లి విచారణ చేపట్టారు. నాగచైతన్య, శోభితలకు లేని అభ్యంతరం ప్రతివాదులకు ఎందుకని ప్రశ్నించారు.

క్రూరత్వం మొత్తం బలహీనత లోంచే పుడుతుంది.
– సెనెకా

సాక్షి
గురువారం, 29 ఆగస్టు 2024

కటకటాల్లో టెలిగ్రామ్ చీఫ్

ఆయనేమీ అమెరికా సైనికుల అకృత్యాలను ఆన్‌లైన్‌లో రచ్చకీడ్చిన జులియన్ అసాంజ్ కాదు. దేశదేశాల్లోని కోట్లాదిమంది పౌరులపై నిఘా ఉంచుతున్న అమెరికా జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) తీరుతెన్నులను బట్టబయలు చేసి రష్యాలో తలదాచుకుంటున్న ఎడ్వర్డ్ స్నోడెన్ కాదు. ఆయన వేలాది కోట్ల డాలర్ల విలువైన అతి పెద్ద మెసేజింగ్ సంస్థ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్. రెండు రోజుల క్రితం ఫ్రాన్స్ పోలీసులు పారిస్‌లో ఆయన్ను అరెస్టు చేసి నిర్బంధించారని తెలియగానే ట్విటర్, టెస్లా సంస్థల అధిపతి ఎలాన్ మస్క్ ఖండించారు. పావెల్ విడుదల కోసం ట్విటర్ వేదికగా 'ఫ్రీ పావెల్' ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రపంచాధినేతల్లో ఎంతో పలుకుబడిగల మస్క్ గతంలో ఎప్పుడూ ఇలాంటి వివాదాల జోలికిపోలేదు. ఆరు నూరైనా... ఎలాంటి పర్యవసానాలూ, పరిణామాలూ ఎదురైనా పౌరుల భావప్రకటనా స్వేచ్ఛ ఉండితీరాలని వాదించటంలో పావెల్‌కి ఎవరూ సాటిరారు. నిజానికి అది వివాదాస్పదం కావటంతోనే అతను జైలుపాలయ్యాడు. కారణాలు వెల్లడి కాకపోయినా పసివాళ్లతో రూపొందించిన బూతుచిత్రాల పంపిణీకీ, మాదకద్రవ్య ముఠాల కార్యకలాపాలకూ, ఉగ్రవాద కార్యకలాపాలకూ, అక్రమమార్గాల్లో ద్రవ్య చలామణీకీ టెలిగ్రామ్ అవకాశమిస్తోందన్నది చాన్నాళ్లుగా ఉంటున్న అభియోగాల సారాంశం. భావప్రకటనా స్వేచ్ఛకు ఏమేరకు హద్దులుండాలి... దానివల్ల ఎదురయ్యే దుష్పరిణామాలకు బాధ్యులెవరు... ఈ విషయంలో ప్రభుత్వాల ప్రమేయాన్ని ఎంతవరకూ అనుమతించాలి వంటి ప్రశ్నలు ఎప్పటినుంచో అందరినీ వేధిస్తున్నాయి. ఇప్పుడు పావెల్ అరెస్టుతో అవి మరింత ప్రముఖంగా చర్చకొస్తున్నాయి.

పావెల్ రష్యా పౌరుడని పేరునిబట్టి ఎవరైనా గుర్తుపడతారు. అయితే ప్రస్తుతం ఆయనకు ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాల పౌరసత్వం ఉంది. అసమ్మతిని అణిచేయటంలో సిద్ధహస్తుడైన రష్యా అధ్యక్షుడు పుతిన్ చాన్నాళ్లుగా అతన్ని బంధించాలని ప్రయత్నిస్తున్నారు. పావెల్‌ను అప్పగించాలని, కనీసం మాట్లాడటానికి అనుమతించాలని తాజాగా ఫ్రాన్స్‌ను రష్యా డిమాండ్ చేస్తోంది. 2011లో రష్యా నిర్వహించిన ఎన్నికలు పూర్తిగా బోగస్ అంటూ బయల్దేరిన 'మంచు విప్లవం' (స్నో రివల్యూషన్) దేశం నలుమూలలా విస్తరించటానికి పావెల్ దోహదపడ్డాడు. ఆ క్రమంలో ఏర్పడిన మెసేజింగ్ యాప్ కాస్తా తర్వాతకాలంలో టెలిగ్రామ్‌గా రూపుదిద్దుకుంది. పావెల్ ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణను ఖండించే అభిప్రాయాలకు చోటిచ్చాడు. అంతేకాదు... ఇజ్రాయెల్ గాజాలో సాగిస్తున్న అకృత్యాలను బట్టబయలు చేసే వీడియోలను వెల్లడించేందుకు అనుమతించాడు. ఇతర దిగ్గజ సంస్థలు మొహం చాటేసిన ఈ అకృత్యాలు టెలిగ్రామ్ లేకపోతే బాహ్య ప్రపంచానికి బహుశా తెలిసేవి కాదు. వాట్సాప్ వంటి ఇతర సంస్థలకు లేని వెసులుబాటు– రెండు లక్షలమందితో గ్రూప్ నిర్వహించటం– టెలిగ్రామ్‌లోనే సాధ్యం. అయితే ఇందువల్ల అనర్థాలు తలెత్తటం కూడా వాస్తవం. ఆమధ్య పారిస్, బెర్లిన్ నగరాల్లో పేలుళ్లకు, దాడులకు ఉగ్రవాద సంస్థ ఐఎస్ టెలిగ్రామ్ యాప్‌ను వాడుకుంది. ఆ తర్వాత సంస్థ సాంకేతిక సిబ్బంది దాన్ని కట్టడిచేశారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటీయని వ్యవస్థ ఏర్పర్చుకోవాలని, నేరగాళ్ల ఆనుపానులు ఎప్పటికప్పుడు తమకు అందించాలని అనేక దేశాలు టెలిగ్రామ్‌ను కోరుతున్నాయి. యూరప్ దేశాలు ఈయూ డిజిటల్ సర్వీసుల చట్టాన్ని రెండేళ్ల క్రితం తీసుకొచ్చాయి. పర్యవసానంగా చాలా మాధ్యమ సంస్థలు దారికొచ్చాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా 'అవాంఛిత' సందేశాలను జల్లెడ పడుతున్నాయి. వాటిని నిలిపేస్తున్నాయి. అయితే సమస్యేమంటే... ఈ వంకన అనేక మాధ్యమాలు సహేతుకమైన అసమ్మతికి కూడా తలుపులు వేస్తున్నాయి. నియంతలకు వంత పాడుతున్నాయి. కొన్ని సంస్థలైతే సంకేత నిక్షిప్త సందేశాల(ఎన్‌క్రిప్షన్)కు అవకాశమున్నదని పైకి చెబుతూ తమ వినియోగదారుల ఆనుపానులు తెలుసుకోవటానికి ప్రభుత్వాలకు అవకాశమిస్తున్నాయి. కానీ టెలిగ్రామ్ లొంగటం లేదు. ప్రతి దేశంలోనూ స్థానిక చట్టాల లొసుగులను వాడుకుని బయటపడుతోంది. అలాగని తన వేదికపై వినియోగదారులు పరస్పరం పంపుకునే సందేశాలు టెలిగ్రామ్‌కు తెలియక కాదు. వాటిని అవసరమనుకున్నప్పుడల్లా చూస్తోంది.

భావప్రకటనా స్వేచ్ఛకూ, బాధ్యతకూ మధ్య సన్నని విభజన రేఖ ఉంటుంది. స్వేచ్ఛ మాటున వదంతులు సృష్టించటం, అల్లర్లకు ఆజ్యం పోయటం ఎవరు చేసినా తప్పే అవుతుంది. అలాంటి వారు చట్టం ముందు తలవంచాల్సిందే. ఆ మధ్య గోరక్షణ పేరుతో బృందాలు ఏర్పడి వ్యక్తులను కొట్టిచంపిన ఉదంతాలు పెరిగాక సందేశాల పంపిణీపై వాట్సాప్ అనేక పరిమితులు విధించింది. మన దేశంలో టెలిగ్రామ్‌కు 50 లక్షలమంది చందాదారులున్నారు. మాదకద్రవ్యాలు, జూదం, బెదిరించి డబ్బులు గుంజుకోవటం వంటి కార్యకలాపాలకు అది వేదిక వుతున్నదని మన ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇటీవల నీట్ ప్రశ్నపత్రాల లీకు పుణ్యం టెలిగ్రామ్‌దే. కేంద్ర హోంశాఖ నేతృత్వంలోని ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ఆ వ్యవహారాలపై దృష్టి సారించింది. ఇది ఒక కొలిక్కి వస్తే టెలిగ్రామ్ నిషేధానికి కూడా గురికావొచ్చన్నది విశ్లేషకుల అంచనా. ఏదేమైనా తనవల్ల సమాజానికి నష్టం కలుగుతున్నదని గ్రహించాక టెలిగ్రామ్ బాధ్యత గుర్తెరగవలసింది. కనీసం ఆ పని ఇప్పుడైనా జరగాలి. అదే సమయంలో ఆ వంకన ప్రభుత్వాలు సహేతుక విమర్శలకూ, అసమ్మతికీ పాతరేయకుండా చూడటం ప్రజాస్వామికవాదుల కర్తవ్యం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.ఏకాదశి తె.3.35 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉ.ఆరుద్ర రా.7.57 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.02 నుండి 11.36 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం: 6.15
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

దేశ పునర్నిర్మాణానికి ఊపిరి

అభిప్రాయం

డా॥ కత్తి పద్మారావు

అంబేడ్కర్ ప్రతిపాదించిన సామాజిక విప్లవ సిద్ధాంతం భారతీయ సామాజిక పునర్నిర్మాణానికీ, దళితజాతుల విముక్తి పోరాటానికీ లక్ష్యాన్ని, గమ్యాన్ని నిర్దేశించింది. తరతరాలుగా భారతీయ సంస్కృతి కోల్పోయిన మానవతను, సమతను ఆయన విముక్తి పోరాటం పునరుజ్జీవింప జేసింది. నేడు భారత దేశంలో సమసమాజ నిర్మాణానికి ఉద్యుక్తులవుతున్న వారందరూ అంబేడ్కర్‌ను అధ్యయనం చేయకుండా, సమన్వయ పర్చుకోకుండా వారి పోరాటాల్లో విజయం సాధించటం అసాధ్యం. అంబేడ్కర్‌ను విస్మరించినవారు తమ లక్ష్యాల్లో, గమ్యాల్లో వైఫల్యం చెందుతూ ఆ వైఫల్యానికి కారణాలు గుర్తెరగలేక తిరోగమిస్తున్నారు. ఏ వ్యవస్థలోనైనా పునాదులతో సహా మార్పు తేవాలన్నప్పుడు, ఆ సామాజిక వ్యవస్థను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించాలి.

వికసిత భారత నిర్మాణం ద్వారా మన ప్రస్థానం ప్రపంచానికి స్ఫూర్తిదాయకం కావాలని ఆగస్టు 15న ఎర్రకోటపై చేసిన తన 98 నిమిషాల సుదీర్ఘ ప్రసంగంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఉద్బోధించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఒక ప్రధాని చేసిన సుదీర్ఘ ప్రసంగం ఇది. మోదీ ఇప్పటికి ఎర్రకోట మీద 11 సార్లు జెండా ఎగురవేసి, ఎక్కువసార్లు ఎగురవేసిన మూడో ప్రధానిగా నిలిచారు.

భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఎర్రకోట మీద 17 సార్లు జెండా ఎగురవేశారు. ఆయన ప్రసంగాలు ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నాయి. నెహ్రూ తన ప్రసంగాలలో భారత భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలతో పాటు ఆర్థిక అంశాలను, అంతర్జాతీయ అంశాలను ఉటంకించేవారు. నెహ్రూ గొప్ప చదువరి. స్వతహాగా పండితుడు. ప్రపంచ దేశాల ప్రధాన మంత్రులతో విస్తృతమైన స్నేహం ఉన్నవారు. ఆ తరువాత ఇందిరా గాంధీ 16 సార్లు ఎర్రకోట మీద పతాకను ఎగురవేశారు. ఇందిర ప్రసంగాలలో కూడా విస్తృతమైన అంశాలు చర్చలకు వచ్చేవి. పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణల వంటి అనేక అంశాల్ని ఆమె పేర్కొన్నారు. భారత దేశ మౌలిక స్వభావాన్ని మార్చే భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయీకరణ పెద్ద చర్చనీయాంశాలుగా మారాయి.

స్వాతంత్రం వచ్చేనాటికి మన దేశ జనాభా 40 కోట్ల లోపే. ఇందిరాగాంధీ పాలన వరకు అది సుమారు 80 కోట్లు. ఇప్పుడు 140 కోట్లకు పెరిగింది. జనాభా ఇంతగా పెరిగిన ఈ సందర్భంలో ప్రజలందరూ ప్రధాని ఉపన్యాసంలో వచ్చే ముఖ్యమైన అంశాల కోసం ఎదురు చూడటం సహజం. ఇప్పటి జనాభాలో ప్రధానమైన శక్తిగా యువత 40 కోట్ల మందిగా ఉన్నారు. దగ్గర దగ్గర 67 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. భారత సమాజంలో కోటీశ్వరులు పెరుగుతున్నారు. 20 కోట్ల మంది కోటీశ్వరులు ఉంటే, పేదలు 70 కోట్ల మంది ఉన్నారు. సమాజం ఇంకా సామాజిక అసమానతలతోనూ, స్త్రీల అణచివేతలతోనూ, నిరుద్యోగ భారతంగానూ ఉన్న సందర్భమిది. అందుకే ప్రధాని ప్రసంగంలోని నిర్మాణాత్మకమైన అంశాల కోసం ప్రజలు ఎదురుచూశారు. ప్రధాని యువతకు నూత్న ఉపాధి అంశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. దేశాభివృద్ధికి మరిన్ని నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామన్నారు. దేశాన్ని గ్లోబల్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చడానికి ఇది సువర్ణావకాశం అని కూడా అన్నారు. ఇవన్నీ దేశ ప్రజలను ఉత్తేజితం చేసే మాటలే అయినప్పటికీ రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామనే వాగ్దానం కనుమరుగైనట్టేనని అనిపించింది. నిజానికి ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్న రైల్వేలు, టెలిఫోన్లు, విద్యుత్, ఇంధన, అనేక భారీ



పరిశ్రమలు కార్పొరేట్ చేతుల్లోకి వెళుతున్న సందర్భమిది. భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తేనే భారత ఆర్థిక సంపద ఇతర దేశాల ఆర్థిక సంపదకు దీటుగా పెరుగుతుందని చెప్పారు.

ఇకపోతే మోదీ గ్లోబల్ కంపెనీలను భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించాలనీ, వాటిని ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తమలో తాము పోటీ పడాలనీ సూచించారు. నిజానికి మోదీ లక్ష్యం చేసిన 2047వ సంవత్సరానికి భారత జనాభా 170 కోట్లను దాటవచ్చును. ఇప్పటికే 70 కోట్ల మంది ప్రజలకు ఇళ్ళ స్థలాలు లేవు. 170 కోట్లకు జనాభా పెరిగినప్పుడు, విదేశీ కంపెనీలకు స్థలాలు యిచ్చుకుంటూపోతే 2047 కంతా భారతదేశ ప్రజలకు ఇళ్ళ స్థలం దొరక్కపోగా, కొన్ని దేశాలవలే మనమూ సముద్రాల పైన ఇళ్ళు నిర్మించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని భౌగోళిక శాస్త్రవేత్తలు అంటున్నారు.

నరేంద్ర మోదీ ప్రసంగంలో దేశంలో సాంకేతిక రంగంలో ప్రధాన భూమికను వహిస్తున్న మైనారిటీలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల విషయంలో మార్పులు తేవాలనే భావన కనిపిస్తుంది. ఈ విషయాలను హ్యూమన్ రైట్స్ వాచ్ ఖండించింది. ప్రధాని సహజంగా మతాతీత భావనలో ప్రసంగిస్తేనే దేశంలో సామరస్యత, శాంతి, క్రాంతి కలుగుతాయని లౌకికవాదుల భావన. నిజానికి సాంస్కృతిక లౌకిక వాదం అంటే చర్చనీయాంశం అవుతుంది. నెహ్రూ, ఇందిరాగాంధీ, వి.పి. సింగ్... వీరంతా భారతదేశం లౌకిక ప్రజాస్వామ్యదేశం అని చెప్పారు. ఇకపోతే రాజ్యాంగ సభ సమయంలో అంబేడ్కర్ మతాతీత లౌకిక భావనతో పాలకవర్గం ఉన్నప్పుడు దేశంలో సామరస్యం నెలకొంటుందనీ, ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలు, జైనులుగా చెప్పబడుతున్న ప్రజలంతా భారతీయులేననీ నొక్కి వక్కాణించారు. మైనారిటీలు, దళితుల వెనుకబాటుతనాన్ని గూర్చి, వారి అభ్యున్నతికి పాటు

పడాల్సిన అంశాలను గూర్చి అంబేడ్కర్ ఇలా చెప్పారు: సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాల్లో మనలో మనకు తీవ్రమైన భేదాభిప్రాయాలున్నవని నేనెరుగుదును. అయినప్పటికీ మనమంతా కలిసి వివిధ ధోరణులనన్నింటిని సమన్వయింపజేసికొని ఒక దేశం, ఒకే ప్రజలు అనిపించే జాతీయ భావంతో మెలగ్గలిగే రోజులు రాగలవనే విశ్వసిస్తున్నాను. ఇకపోతే అనుక్షణం మారుతున్న ఆధునాతన యుగంలో విద్యకున్న విలువ మరి దేనికీ లేదు. అందులోనూ సాంఘిక గౌరవాన్ని పెంపొందించుకోవాల్సివున్న నిమ్న జాతుల్లో విద్య చాలా అవసరం.

ఇకపోతే అంబేడ్కర్ ప్రతిపాదించిన సామాజిక విప్లవ సిద్ధాంతం భారతీయ సామాజిక పునర్నిర్మాణానికీ, దళితజాతుల విముక్తి పోరాటానికీ లక్ష్యాన్ని, గమ్యాన్ని నిర్దేశించింది. తరతరాలుగా భారతీయ సంస్కృతి కోల్పోయిన మానవతను, సమతను ఆయన విముక్తి పోరాటం పునరుజ్జీవింప జేసింది. నేడు భారతదేశంలో సమసమాజ నిర్మాణానికి ఉద్యుక్తులవుతున్న వారందరూ అంబేడ్కర్‌ను అధ్యయనం చేయకుండా, సమన్వయ పర్చుకోకుండా వారి పోరాటాల్లో విజయం సాధించటం అసాధ్యం. అంబేడ్కర్‌ను విస్మరించినవారు, అంబేడ్కర్‌ను అధ్యయనం చేయనివారు తమ లక్ష్యాల్లో, గమ్యాల్లో నిరంతర వైఫల్యం చెందుతూ ఆ వైఫల్యానికి కారణాలు గుర్తెరగలేక తిరోగమిస్తున్నారు. ఏ వ్యవస్థలోనైనా పునాదులతో సహా మార్పు తేవాలన్నప్పుడు, ఆ సామాజిక వ్యవస్థను మొత్తం శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఆ అవసరాన్ని విస్మరించిన ఏ వాదమూ సజీవమైనది కాదు. ఈ వాస్తవాన్ని హిందూ కర్మవాదులు, కులవాదులు నిరంతరం విభేదిస్తూనే ఉంటారు. అంబేడ్కర్ వారసులుగా వారితో మన యుద్ధం సాగుతూనే ఉంటుంది.

ఇకపోతే భారతదేశాన్ని పాలించే పాలకులకు తప్పక కొన్ని అభ్యుదయ భావాలు ఉంటాయి, కాదనలేము, స్త్రీలపై జరిగే అత్యాచారాల విషయంలో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును అందరూ స్వీకరించాల్సిందే. ప్రతిపక్ష నాయకుణ్ణి మొదటి వరుసలో కూర్చోబెడితే బాగుండేది. ఎందుకంటే నెహ్రూ, వాజ్‌పేయి ఈ సంప్రదాయాన్ని పాటించారు. నిజానికి తన సుదీర్ఘమైన ప్రసంగంలో రాజ్యాంగ కర్తను బహుధా ప్రస్తావించటం ఆయన ధర్మం. అస్పృశ్యతా నివారణ, కులనిర్మూలన, దళితుల రక్షణ, పౌరహక్కుల రక్షణ, విశ్వవిద్యాలయాల్లో శాస్త్రీయభావాల పెంపునకు సంబంధించిన రాజ్యాంగ స్ఫూర్తి కలిగి ఉండటం ఒక చారిత్రక అవసరం. ఏమైనా అంతిమంగా అంబేడ్కర్ రాజ్యాంగమే స్వాతంత్ర్య దినోత్సవ ఆశయాలకు దిక్సూచి. అంబేడ్కర్ మార్గమే భారతదేశ అభివృద్ధికి ప్రధాన భూమిక. ఆ మార్గంలో పయనిద్దాం!

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

డాలర్ లేకపోతే?

డాలర్ మారక ప్రాభవాన్ని తగ్గించాలని ఎప్పటినుంచో ఉన్న ఆలోచన సాకారమైతే, అమెరికా నిజంగా ఎక్కడుండాలో అక్కడుంటుంది. ప్రజాస్వామ్య ముసుగులో ఈ పెద్దన్న దౌర్జన్యం చాలు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

ఇంత దిగజారడమా?

రాజకీయ సంభాషణలు ఎన్నడూ లేనంతగా దిగజారిపోయాయి. సహానుభూతి, బాధ్యత, జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన అంశాలను కూడా అవమానించడానికీ, సిగ్గుపడేలా చేయడానికీ వాడుకోవడం అసహ్యం పుట్టిస్తోంది.

– పూజా భట్, నటి

పెట్టే చేతులే...

హరియాణాకు నిధులు కూర్చేది గురుగ్రామ్. మహారాష్ట్రకు నిధులు కూర్చేది ముంబయి. కర్ణాటకకు నిధులు కూర్చేది బెంగళూరు. ఈ మూడు నగరాలూ మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అర్హమైనవి. కానీ ప్రతి నగరం సంక్షోభంలో ఉంది.

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

యూదు విజేతలు

ఇప్పటివరకూ కనీసం 214 మంది నోబెల్ పురస్కార గ్రహీతలు యూదు సంతతికి చెందిన వారు. మొత్తం పురస్కార గ్రహీతల్లో వీరు 22 శాతం. అత్యధికం సైన్సులో వచ్చినవే. ప్రపంచ జనాభాలో కేవలం 0.2 శాతంగానే యూదులు ఉన్నప్పటికీ, తమ జనాభా కంటే 110 రెట్ల పురస్కారాలను గెలుచుకున్నారు.

– హెన్ మాజిగ్, రచయిత

వైఖరి స్పష్టం

చైనా–ఇండియా సరిహద్దు ఘర్షణ, సోవియట్ యూనియన్ వైఖరికి సంబంధించిన కొన్ని ఆర్కైవల్ రికార్డులను చదవండి. చైనా మీద తన ఆగ్రహాన్ని సోవియట్ బహిరంగంగానే ప్రదర్శించింది. ఇండియాను పాశ్చాత్య దేశాల వైపు నెట్టిందని చైనాను నిందించింది కూడా.

– మోనికా వర్మ, పరిశోధకురాలు

మిత్రుడికి సమస్యొస్తే...

'టెలిగ్రామ్' సహవ్యవస్థాపకుడు పావెల్ దురోవ్‌ను అరెస్ట్ చేయడం ద్వారా ఫ్రెంచ్ ప్రభుత్వం 17 బిలియన్ డాలర్లు నష్టపోయింది. 80 రఫేల్ జెట్స్ కొనుగోలు ఒప్పందాన్ని యూఏఈ నిలిపేసింది. పావెల్ యూఏఈ పౌరుడే కాక, ఉప ప్రధాని హమ్దాన్ అల్ మఖ్తూమ్‌కు సన్నిహిత మిత్రుడు.

– కిమ్ డాట్‌కామ్, ఆంత్రప్రెన్యూర్

తెచ్చుకున్న సమస్య

బలూచిస్తాన్‌లోని సమస్యలకు ఇండియాను నిందిస్తోంది పాకిస్తాన్. కానీ 2006లో బాగా తెలిసిన బలోచ్ నాయకుడు అక్బర్ ఖాన్ బుగ్తీని చంపమని ముషారఫ్‌కు సలహా ఇచ్చింది ఢిల్లీ కాదు. తన జీవితకాలంలో బుగ్తీ బలోచ్ విముక్తి ఐకాన్ కాదు. కానీ ముషారఫ్ ఆయన్ని అలా మార్చేశారు. నిర్మూలించిన 18 ఏళ్ల తర్వాత బలోచ్ ప్రజల స్మృతిలో బుగ్తీ మరింత ఎత్తు పెరిగారు.

– నిరుపమా సుబ్రమణియన్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సవరల అక్షర బ్రహ్మ

ఆదివాసీలైన సవరల భాషపై పరిశోధన చేస్తూ సవర లిపిని, నిఘంటువును రూపొందించిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు తెలుగు వాడుక భాషోద్యమానికి ఎనలేని సేవ చేశారు. గిడుగు గ్రాంథిక భాషావాదుల పాలిట 'పిడుగు' అని కీర్తించబడ్డారు. సవరలపై చేసిన అవిరళ కృషి గిడుగు వాడుక భాషా ఉద్యమ ప్రస్థానానికి నాంది.

శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో 1863 ఆగస్టు 29న ఆయన జన్మించారు. గిడుగు తన సహాధ్యాయి గురజాడతో కలిసి 1875లో విజయ నగరం మహారాజా కళాశాలలో బీఏ పట్టా పుచ్చుకొని చరిత్ర అధ్యాపకులుగా పనిచేసేవారు. ఆ రోజుల్లో పర్లాకిమిడి పట్టణానికి చుట్టూర ఉన్న కొండలపై నివసిస్తున్న సవర తెగ ప్రజలపై ఆయన దృష్టి పడింది. నాగరికులతో పోల్చితే వారు నీతీ, నిజాయితీలు గల మానవీయులు. కడు దైన్య స్థితిలోనూ తమ ప్రత్యేక జీవన సంస్కృతి విస్మరించని ఆదిమ ప్రపంచం సవరలది. వారి అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు గిడుగు. తొలుత వారిని చదువుబాట పట్టించాలని సంకల్పించారు.



గిడుగు రామమూర్తి పంతులు

సవర భాషను స్వయంగా నేర్చుకొని పిల్లలకు వారి మాతృభాషలోనే విద్య నేర్పడానికి ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పారు. గిడుగు రచించిన సవర వాచకాలు, కథల పుస్తకాలు, పాటల పుస్తకాలు, తెలుగు–సవర, సవర–తెలుగు నిఘంటువులను 1911లో ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం ప్రచురించింది. ఆయన కృషికి పారితోషికం ఇవ్వజూపితే అందుకు గిడుగు 'ఆ డబ్బుతో ఒక బడి నెలకొల్పండి, నేను పెట్టిన బడులకు నిధులివ్వండి చాలు!' అని ప్రభుత్వాన్ని కోరారు. అందుకు శిక్షణా పాఠశాలలను స్థాపించింది ప్రభుత్వం. వివిధ సవర రచనలు, సవర భాషా వ్యాకరణ నిర్మాణంలో గిడుగు సాధించిన కృషికి ప్రభుత్వం 1913లో 'రావు సాహెబ్' బిరుదును బహూకరించింది. 1933లో 'కైజర్–ఇ–హింద్' బిరుదుతో పాటు బంగారు పతకాన్ని ప్రకటించింది.

– గుమ్మడి లక్ష్మీనారాయణ, ఆదివాసీ రచయితల వేదిక, పూర్వ కార్యదర్శి, తెలంగాణ (నేడు గిడుగు రామమూర్తి జయంతి: తెలుగు భాషా దినోత్సవం)

పరిరక్షణ... దీర్ఘకాలం కొనసాగాలి!

సందర్భం

ఫిరోజ్ ఖాన్

మునిసిపల్ కార్పొరేషన్‌ల వంటి వ్యవస్థలు తప్పులు జరిగాయని నిర్ధారణ జరిగినా అనేక రకాల కారణాలు చెబుతూ చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదు. అదే కొత్తగా వచ్చిన 'హైడ్రా' చాలా వేగంగా పని పూర్తి చేస్తోంది. విచారణ, కోర్టుల పేరుతో కాలయాపన చేయకుండా చెరువులు, కుంటల పరిరక్షణకు; సామాన్యులకు న్యాయం చేసేందుకు ముందుకు సాగుతోంది. అందుకే ఇప్పుడు హైడ్రా లాంటి వ్యవస్థలు కావాలని ప్రతి జిల్లా, ప్రతి మునిసిపాలిటీ నుంచి డిమాండ్లు వస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రం, ప్రతి నగరం, ప్రతి పట్టణంలో చెరువులు కబ్జా చేసి, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. నీటిని మోసుకెళ్లే నాలాలను సైతం వదిలిపెట్టలేదు. చెరు వులు, నాలాలను పూడ్చివేసి బిల్డింగులు కట్టుకున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది చెరువులు నామరూపాల్లేకుండా మాయమయ్యాయి. వేలాది చెరువులు సగానికి పైగా కుంచించుకుపోయాయి. నాలాలు నీటిని తీసుకెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చిన్నపాటి వర్షాలు వచ్చినా కాలనీలకు కాలనీలే నీట మునుగుతున్నాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

తెలంగాణ మునిసిపాలిటీల చట్టం –2019ను రూపొందించిన అప్పటి ప్రభుత్వం... అందుకు అనుగుణంగా 'టీఎస్ బీపాస్' అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించింది. భవన నిర్మాణ అనుమతుల కోసం ఆన్‌లైన్ అప్లికేషన్ వ్యవస్థను తీసుకువచ్చి ఈజీ చేసింది. అక్రమ నిర్మాణాలపై కూడా ఇందులో ఫిర్యాదు చేసే అవకాశమిచ్చింది. అయితే టీఎస్ నుంచి టీజీ బీపాస్‌గా మారిన ఈ వ్యవస్థ ప్రస్తుతం అనుమతులు ఇవ్వడానికి మాత్రమే పరిమితమైంది. అక్రమ, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై ఎవరైనా టీజీ బీపాస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

టీజీ బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందుతున్న చాలా మంది వాటికి భిన్నంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఎలాంటి సెట్ బ్యాక్స్ వదల



కుండా, ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలోనూ నిర్మాణాలు చేస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే పర్మిషన్ తీసుకొని రెండు, మూడు అంతస్తులు నిర్మిస్తున్న వారు సైతం ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.

టీజీ బీపాస్ అమలులో భాగంగా జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఆర్ అండ్ బీ అధికారులను భాగస్వాములను చేశారు. నేరుగా, పోర్టల్, కాల్‌సెంటర్లు, మొబైల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వీరు మూడు రోజుల్లో పరిశీలన జరపాలి. అక్రమమని తేలితే ఎలాంటి నోటీసు లేకుండా కూల్చివేయాలి. కూల్చివేతకు అయ్యే ఖర్చును కూడా వారి నుంచే వసూలు చేయాలి. అంతేకాకుండా స్థలం విలువలో 25 శాతం జరిమానా విధించవచ్చు. మూడేళ్ల జైలు శిక్షకు సైతం చర్యలు తీసుకునే నిబంధనలున్నాయి. నిర్మాణం/లే అవుట్ రిజిస్ట్రేషన్ కాకుండా డీటీఎఫ్సీలు, సబ్ రిజిస్ట్రార్లకు తెలియజేసి... అలాంటి స్థలాలను బ్లాక్ లిస్టులో పెట్టేలా ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇది స్పష్టంగా ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు.

గత ప్రభుత్వం తీసుకువచ్చిన మునిసిపల్ యాక్ట్ –2019ను సక్రమంగా, కఠినంగా అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు పరిష్కారమవుతాయి. అయితే కమిషనర్లు అందుకు సాహసించడం లేదు. 'గట్స్' ఉన్న ఒకరిద్దరు అధికారులు ఉన్న చోట అంతో ఇంతో చర్యలు కొనసాగుతున్నాయి. అందుకే రంగనాథ్ లాంటి అధికారులతో కూడిన హైడ్రా లాంటి వ్యవస్థ ఉంటేనే చెరువులు పరిరక్షించొచ్చనీ, అక్రమ నిర్మాణాలను ఆపవచ్చనీ ప్రజల్లో అభిప్రాయం ఏర్పడింది. ప్రభుత్వం ఆ డిమాండ్‌కు అనుగుణంగా హైడ్రా లాంటి వ్యవస్థలు ఏర్పాటు చేయడం మంచిదే. అయితే తాత్కాలిక ఉపశమన చర్యలకు బదులు పట్టణాలు, నగరాల్లో కీలకంగా వ్యవహరించే కమిషనర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి... ఇలాంటి చర్యలు ఎల్లప్పుడూ కొనసాగేలా చూడాలి. తప్పులను నిర్ధారించిన తర్వాత చర్యలు తీసుకోలేకపోతున్న కమిషనర్లపై ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
మొబైల్: 96404 66464

మనిషి అన్వేషణ

దత్తబోధ


శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మనం అందరం దేనినో ఒకదానిని గూర్చి అన్వేషిస్తూ ఉన్నాము. అది లభించే వరకు మనకు మానసిక ప్రశాంతత ఉండదు. ప్రయత్నం మాత్రం కొనసాగుతూనే ఉంటుంది. మనం దేనికోసం వెదకుతున్నామో, మనలో చాలామందికి తెలియదు. మనం ఐశ్వర్యం, అధికారం, పేరుప్రతిష్ఠలు, సంతానం, సుదీర్ఘ జీవనం, ఆరోగ్యం వంటివానిలో ఏదో ఒక దాని గురించి లేక మొత్తం అన్నింటిగూర్చి అన్వేషిస్తున్నట్లు భావిస్తాము. వాస్తవంగా ఆలోచిస్తే మన జీవితంలో సమైక్యత గూర్చి ఆలోచిస్తున్నాము.

ప్రస్తుత కాలంలో మన జీవితాల్లో సమైక్యత కనబడటం లేదు. ఐశ్వర్యం, హోదా, ఖ్యాతి, వివిధ వస్తు సముదాయాల ద్వారా తృప్తి పొందుతున్నాం. వీటి ద్వారా సమైక్యత కోసం ప్రయత్నిస్తున్నాం. వీనిని పొందడం వల్ల సమైక్యత, ప్రశాంతత పొందవచ్చని తలస్తున్నాం. సమైక్యతకు మూలకారణం దేవుడు. కాని, అటువంటి పరమాత్మని ఉపేక్షించుటయే దీని లోపానికి మూలకారణం.

మనలో భగవదంశ ఉండటం వలననే మనం జీవించి ఉన్నాం అనే విషయాన్ని ఎన్నటికీ మరచిపోకూడదు. అటువంటి భగవత్ శక్తియే మనల్ని నడిపిస్తూ, కార్యాలు నిర్వర్తించేలా చేస్తోంది. జీవితంలో ఐక్యతను, సమాధి స్థితిని పొందాలంటే... పైన తెలిపిన వాస్తవం మీదే మనస్సు లగ్నం చేయాలి.

భ్రమను కలిగించే గందరగోళపు తెర ఒకటి మన జీవితాలను కప్పివేస్తోంది. కాని, దాని వెనుక కంటికి కనబడని ఒక శాశ్వత నిర్వహణ క్రమం ఉంది. ఈ విషయాన్ని ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకోవాలి.





శ్రీశైలం 6 తెరుచుకున్న గేట్లు
సాగర్ 18 కృష్ణాకు పోటెత్తుతున్న వరద

కృష్ణాబేసిన్‌లో ఎగువ నుంచి వరద పోటెత్తడంతో ప్రాజెక్టులకు నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం జూరాల ప్రాజెక్టు 40 గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,62,288 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 23,121, సుంకేశుల నుంచి 962 మొత్తం 2,86,371 క్యూసెక్కుల నీటిని వదలగా, శ్రీశైలం వైపు తరలుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉండటంతో ఆరుగేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేరకు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,68,174 క్యూసెక్కులు, ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,826 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 1,94,758 క్యూసెక్కులు వస్తుండగా, 18 క్రస్ట్‌గేట్ల ద్వారా 1,45,800 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28,948 క్యూసెక్కులు మొత్తం 1,74,748 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. -దోమలపెంట/నాగార్జునసాగర్

సీఎంతో సీపీఐ బృందం భేటీ

- పలు ప్రజా సమస్యలతో వినతిపత్రం అందజేత
- సమస్యల పరిష్కారం పట్ల సీఎం సానుకూలంగా ఉన్నారని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో పార్టీలోని వివిధ ప్రజా సంఘాలకు చెందిన 30 మంది బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బుధవారం రాత్రి సమావేశమైంది. రెండు గంటలపాటు సీఎం వారితో సమావేశం కావడం గమనార్హం. ఆర్టీసీ, అంగన్‌వాడీ, ఆటో, మధ్యాహ్న భోజనం, సింగరేణి, అగ్రిగోల్డ్, టూరిజం ఇలా అనేక సంఘాలు, ఆయా రంగాలకు చెందిన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ బృందం సీఎంకు విన్నవించింది. ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్టీసీలో యూనియన్ల కార్యకలాపాలకు అవకాశం కల్పించాలని సీపీఐ నేతలు సీఎంను కోరారు. సెప్టెంబర్ 17న తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా చేయాలని కోరినట్టు కూనంనేని వెల్లడించారు. రుణమాఫీ అందరికీ ఇవ్వాలని కోరామన్నారు. అర్హులైన రైతులందరికీ మాఫీ చేస్తామని సీఎం తమతో అన్నట్టు కూనంనేని తెలిపారు. రెండు లక్షల రూపాయలకు పైబడి రుణాలున్న రైతులు.. ఆపై సొమ్ము చెల్లిస్తే వారికి కూడా మాఫీ అందజేస్తామన్నారన్నారు. అవి చెల్లించకపోతే తాము 2 లక్షల రూపాయలు చెల్లించినా బాకీ అయినట్టు కాదనీ.. రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు కూడా బ్యాంకులు ఇవ్వవని... రైతులకు కూడా ప్రయోజనం ఉండదని సీఎం అన్నట్టు కూనంనేని తెలిపారు. రైతుభరోసా కూడా ఇస్తామని సీఎం అన్నట్టు తెలిపారు. అన్ని సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు.

ప్రయోజనాలను పరిరక్షించేలా
దక్షిణ రింగు అలైన్‌మెంట్

- ఫోర్త్‌సిటీ ఉద్యోగుల కుటుంబాల వసతికి ఉపయోగపడాలి: సీఎం రేవంత్
- నిర్వాసితుల విషయంలో సానుభూతితో వ్యవహరించాలని అధికారులకు సూచన



సమీక్షలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంట్ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే విధంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటయ్యే ఫోర్త్ సిటీలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్య, ఇతర వసతులు కల్పించేందుకు వీలుగా ఆ అలైన్‌మెంట్ ఉండాలని సూచించారు. బుధవారం రాత్రి తన నివాసంలో రీజనల్ రింగు రోడ్డు దక్షిణ భాగం, రేడియల్ రోడ్ల నిర్మాణం, డ్రైపోర్టును సీపోర్టుతో అనుసంధానించే గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. రీజనల్‌రింగు రోడ్డుకు సంబంధించి గతవారం సూచించిన మార్పుల ఆధారంగా రూపొందించిన అలైన్‌మెంట్‌ను సీఎం పరిశీలించారు. అందులో కొన్ని మార్పులను సూచించారు. అలైన్‌మెంట్ ఖరారుకాగానే.. వెంటనే తదుపరి కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్–ఓఆర్‌ఆర్ మధ్య రేడియల్ రోడ్ల కోసం ముందుగానే భూసమీకరణ, భూసేకరణ చేపట్టాలని పేర్కొన్నారు. నిర్వాసితుల విషయంలో సానుభూతితో వ్యవహరించి సాధ్యమైనంత ఎక్కువ పరిహారం అందించేలా చూడాలని.. ప్రభుత్వపరంగా మరేదైనా అదనపు సాయం చేయగలమేమో ఆలోచించాలని సూచించారు.

డ్రైపోర్టుపై పరిశీలన చేయండి

డ్రైపోర్టు ఏర్పాటుకు సంబంధించి కాకినాడ, మచిలీపట్నం రేవులను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. రేవులకు ఉండే దూరంతోపాటు ఏపీ ప్రభుత్వం ఏ మార్గానికి సుముఖంగా ఉన్నదీ, తెలంగాణకు దేనిద్వారా ఎక్కువ ఉపయోగం కలుగుతుందనే విషయాలను గమనంలో ఉంచుకోవాలని సూచించారు. ఈ అధ్యయనం తర్వాతే గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రూపకల్పన చేయాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్–ఓఆర్‌ఆర్ మధ్య రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న రహదారిలో మూడు చోట్ల ఉన్న అటవీ ప్రాంతాలను నైట్ సఫారీలుగా మార్చే అంశంపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బెంగళూరులో ఉన్న జిందాల్ నేచర్‌కేర్ వంటివి మనవద్ద కూడా ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాచకొండ ప్రాంత ప్రకృతి రమణీయత సినీ పరిశ్రమను ఆకర్షించేందుకు ఉన్న అవకాశాలపైనా ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేను ఇస్తున్న వివరాలన్నీ వాస్తవమే

▶ మొదటి పేజీ తరువాయి

వివరాలను ఆధార్ నంబర్‌తో సహా నమోదు చేసుకోవాలి.

→ ఎంఏవోతో సహా ఏ అధికారికీ ఒకటి కంటే ఎక్కువ మండలాలను కేటాయించకూడదు. మండల స్థాయిలో నియమితులైన అధికారి వివరాలను వెంటనే రుణమాఫీ విభాగానికి సమర్పించాలి.
→ ఎంఏవో రుణమాఫీ లాగిన్‌లలో కుటుంబ సభ్యుల వివరాలను అప్‌లోడ్ చేయడానికి మొబైల్ యాప్ అభివృద్ధి చేయడం జరిగింది.
→ మండలంలోని అన్ని బ్యాంకు బ్రాంచీల వారీగా కుటుంబ సభ్యులను నిర్ధారించి రుణం పొందిన రైతుల జాబితా ప్రదర్శించాలి.
→ రుణం పొందిన రైతు జీవిత భాగస్వామి వివరాలను నమోదు చేయాలి.
→ జీవిత భాగస్వామి వివరాలను నమోదు చేసిన తర్వాత ఇతర కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలి. కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లతో పాటు వారి వయస్సు నమోదు చేయాలి. కుటుంబ పెద్దతో ఫొటో తీయాలి. → రైతు సమర్పించే అఫిడవిట్‌లో అతను అందించిన కుటుంబ సభ్యుల వివరాలు ఏ ప్రభుత్వ అధికారి అయినా లేదా పంచాయతీ కార్యదర్శి లేదా ఏఈవో లేదా ఏఏవో ధ్రువీకరించాలి. → రైతులు సమర్పించిన అఫిడవిట్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. → డేటా సేకరణ సమయంలో అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు రుణం పొందిన రైతుతో ఎంఏవో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

వివరాల సేకరణ షురూ

రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్..బ్యాంక్ అకౌంట్లలో తప్పిదాలు, సాంకేతిక కారణాలతో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వ్యవసాయశాఖ అధికారులు బుధవారం గ్రామాల్లో సర్వే చేపట్టారు. మండలం యూనిట్‌గా రైతుల వివరాలను సేకరిస్తున్నారు. అనేకచోట్ల వివరాలను సేకరిస్తున్నా రైతులు మాత్రం ఇంకా గందరగోళంలోనే ఉన్నారు. రూ.2 లక్షలకు పైన రుణం ఉన్న రైతులు రుణమాఫీ విషయంపై నిలదీస్తున్నారు. రూ.2 లక్షలకు పైగా ఉన్న సొమ్ము బ్యాంకులో చెల్లించాలా వద్దా? అని అడుగుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేకపోతున్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం గ్రామంలో ఎస్‌బీఐ, గ్రామీణ వికాస్‌బ్యాంక్ సైట్లు ఓపెన్‌కాగా ఎన్‌డీసీసీ బ్యాంక్ సైట్ మాత్రం ఓపెన్ కాలేదు. గ్రామంలో 30 మంది రైతుల వివరాలను అప్లోడ్ చేశారు. కానీ ఎన్‌డీసీసీ బ్యాంక్ సైట్ ఓపెన్ కాకపోవడంతో 15 మంది రైతులు వెనుదిరగాల్సి వచ్చింది.

అతివకు అండగా..

మీ సమస్యను 8977794588కు వాట్సాప్ చేయండి



ఆడ బిడ్డ.. ఇంటి నుండి బయటికొస్తే అడుగడుగునా వంకరచూపులే. బస్టాపు మొదలు కాలేజీ, కార్యాలయం, కార్ఖానా.. ప్రదేశం ఏదైనా అవకాశం దొరికితే వెకిలి చేష్టలు, వేధింపులు.. డబుల్ మీనింగ్ డైలాగులతో టార్చర్. ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నా..సెల్‌ఫోన్‌కు అసభ్య సందేశాలు, ప్రేమ పేరుతో పలకరింపులు, వద్దని తిరస్కరిస్తే ఫొటోల మార్ఫింగ్‌లతో బ్లాక్‌మెయిలింగ్‌లు. ఇవీ.. పల్లె, పట్టణం, నగరం అనే తేడా లేకుండా నేటి మహిళను వెంటాడుతున్న అతిపెద్ద సమస్యలు. భయం, కుటుంబ పరువు ,ప్రతిష్ట, గౌరవం దృష్ట్యా అనేక మంది ఈ నిత్య వేధింపులను భరిస్తున్నారు. షీ టీమ్స్ లేదా పోలీసుల వద్దకు వచ్చి నిర్భయంగా ఫిర్యాదు చేస్తున్నవారు కొందరే. అందుకే 'సాక్షి' ఇక మీ నేస్తం అవుతోంది. ఇంటా బయట, చదివే చోట, పని ప్రదేశంలో, ప్రయాణంలో, చివరకు 'నెట్'ఇంట్లో.. ఇలా ఎక్కడ, ఎలాంటి వేధింపులు ఎదురవుతున్నా 8977794588 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలపండి. మీ సమస్యల్ని 'సాక్షి' తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీ శిఖా గోయల్ దృష్టికి తీసుకెళ్తుంది. మూడో కంటికి తెలియకుండా మీ సమస్యకు పరిష్కారం చూపుతుంది. భయం వీడండి..ధైర్యంగా ముందుకు కదలండి. వేధింపుల నుంచి విముక్తి పొందండి.

మీతో సాక్షి

నోట్: పేరు, వివరాలు గోప్యంగా ఉంచాలని కోరితే.. వారి అభిప్రాయాలను 'సాక్షి' గౌరవిస్తుంది

రాజన్న భక్తులకు నిరంతర అన్నదానం

- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం వెల్లడి



వేములవాడ: తిరుమలలోని వెంగమాంబ అన్నదా నం తరహాలో వేములవాడ రాజన్న భక్తులకు నిరంత రం అన్నదానం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వర స్వామి ని బుధవారం కుటుంబ సభ్యులతో కలసి ఆయన దర్శించుకున్నారు. మంత్రితోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ రాగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు అద్దాల మండపంలో వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, రానున్న కార్తీకమాసం నుంచి భక్తులకు నిత్యాన్నసత్రం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాజన్న దర్శనం వేగంగా కల్పించేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆలయ అభివృద్ధికి శృంగేరి పీఠాధిపతుల సూచనలతో ముందుకెళ్తామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది శ్రావణమాసం ఆరంభం నుంచి భక్తుల కోసం బ్రేక్ దర్శనాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అర్బన్ తహసీల్దార్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలం... బలవన్మరణం

- రెండు ఘటనల్లో ఇద్దరు యువకుల అఘాయిత్యం



జయంత్



అశోక్ (ఫైల్)

నెక్కొండ/శాంతినగర్: ప్రేమ విఫలం కావడంతో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరంగల్ జిల్లా నెక్కొండ ఎస్‌ఐ మహేందర్ తెలిపిన ప్రకారం.. నెక్కొండకు చెందిన చింతల జయంత్ (22) ఓ గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగం వచ్చాక పెళ్లి గురించి ఆలోచించాలని జయంత్‌ను యువతి తల్లిదండ్రులు మందలించారు. యువతి సైతం అతన్ని దూరం పెట్టింది. దీంతో ఈ నెల 27న తన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకుంటూ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ వీడియోను కుటుంబ సభ్యులకు పంపించాడు. వీడియో చూసిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జయంత్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీడియో తీసి.. సూసైడ్ నోట్ రాసి..

ప్రేమించి మోసపోవద్దని, తాను మోసపోయి ఆత్మహత్య చేసుకుంటున్నా అంటూ ఓ యువకుడు పంపిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. జోగులాంబ–గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ స్టేజీకి చెందిన తెలిగి అశోక్ (22) మంగళవారం రాత్రి కర్నూలులోని ఓ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు అతడు.. తాను ప్రేమించిన యువతికి మరో వ్యక్తితో వివాహం నిశ్చయమైందని, యువతి తండ్రి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నందున తనపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, తన చావుకు కారణమైన వారిని వదలొద్దంటూ వీడియోలో పేర్కొన్నాడు. సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బుధవారం అశోక్ మృతదేహాన్ని తీసుకొచ్చి అలంపూర్–రాయచూర్ రోడ్డుపై బైఠాయించి ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తుచేస్తామని సీఐ రవిబాబు చెప్పారు.

విద్యుత్ కంచెకు తగిలి చిరుత మృతి

- చెరుకుతోటలోనే పూడ్చిపెట్టిన రైతు
- వెలికితీయించి పోస్టుమార్టం చేయించిన అటవీ అధికారులు



చిరుత కళేబరం

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి): విద్యుత్ కంచెకు తగిలి చిరుత పులి మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ కట్టకింది తండాలో చోటు చేసుకుంది. ఎఫ్‌డీవో రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...తండాకు చెందిన రైతు కడావత్ దూప్యా నాయక్ తన చెరుకుతోట చుట్టూ అడవి పందులు రాకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి చిరుతపులి మృతి చెందింది. అయితే ఈవిషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే దుప్యానాయక్ చెరుకుతోటలోనే చిరుత కళేబరాన్ని పూడ్చిపెట్టాడు. విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు బుధవారం సిబ్బందితో వచ్చి దూప్యానాయక్ సమక్షంలో పూడ్చిపెట్టిన చిరుత కళేబరాన్ని వెలికితీయించి పోస్టుమార్టం చేయించారు. వన్యప్రాణి చట్టం కింద దూప్యానాయక్ మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణ రెడ్‌కో వీసీ అండ్ ఎండీగా అనీల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్‌కో) వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వావిళ్ల అనీలను నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'తిరుపతన్న బెయిల్‌పై వివరాలు తెలుసుకోండి'

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు తిరుపతన్న దాఖలు చేసిన పిటిషన్‌పై వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ నగర భద్రతా విభాగం అదనపు డీసీపీగా పనిచేస్తున్న మేకల తిరుపతన్నను ఫోన్ ట్యాపింగ్ కేసులో మార్చిలో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా..జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు.

డెంగీతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మృతి

గుండాల: డెంగీతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాలలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు తెలిపిన వివరాలివి. గుండాల మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న కె.సురేశ్‌కుమార్ (54) జ్వరంతో బాధపడుతూ ఆదివారం జనగామలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకోగా. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వెళ్లాలని రిఫర్ చేశారు. దీంతో ఆయన సోమవారం యశోద ఆస్పత్రిలో చేరారు. రక్తపరీక్షలు నిర్వహించగా డెంగీ అని తేలింది. రక్తం మొత్తం ఇన్‌ఫెక్షన్ చేరినట్లు నిర్ధారణ అయ్యింది. ఆయన మూడు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

ఆవేదనతో చలించిపోయా..

కోల్‌కతా డాక్టర్ హత్యపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము | ఇలాంటి దారుణాలు ఇకపై జరగడానికి వీల్లేదు | మహిళలపై నేరాల పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలి



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఆ భయానక సంఘటన గురించి తెలుసుకొని చలించిపోయానని చెప్పారు. ఇలాంటి దారుణాలు ఇకపై జరగడానికి వీల్లేదని స్పష్టంచేశారు. మహిళలపై నేరాల పట్ల మనమంతా ఆత్మపరిశీలన చేసుకోవాలని బుధవారం పీటీఐ వార్తా సంస్థకు రాసిన ప్రత్యేక ఆర్టికల్‌లో రాష్ట్రపతి సూచించారు. జూనియర్ డాక్టర్ హత్యపై రాష్ట్రపతి స్పందించడం ఇదే మొదటిసారి. తల్లులు, అక్కచెల్లెమ్మలపై జరుగుతున్న అరాచకాలపై దేశం మేల్కోవాల్సిన సమయం వచ్చిందని ఆమె ఉద్ఘాటించారు. మహిళల పట్ల నీచమైన అభిప్రాయాలు ఉంటే వారిని ఒక వస్తువుగా చూసే అలవాటు పెరుగుతుందని తెలిపారు. స్త్రీలను బలహీనులుగా, తెలివిలేనివారుగా పరిగణించే ఆలోచనా ధోరణిని అందరూ మార్చుకోవాలని హితవు పలికారు. మహిళల పట్ల ప్రజల దృష్టికోణం మారితే సమాజంలో వారిపై నేరాలు జరగబోవని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ముర్ము ఇంకా ఏం చెప్పారంటే...

మనం పాఠాలు నేర్చుకున్నామా?

దేశంలో సోదరీమణులపై ఎన్నో నేరాలు జరుగుతున్నాయి. ఆగస్టు 9న కోల్‌కతాలో వైద్యురాలపై జరిగిన అఘాయిత్యం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. నాగరిక సమాజంలో ఆడబిడ్డలు ఇలాంటి అరాచకాల బారిన పడడానికి వీల్లేదు. జూనియర్ డాక్టర్ హత్య పట్ల దేశమంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అందులో నేను కూడా ఉన్నాను. కోల్‌కతాలో విద్యార్థులు, వైద్యులు, పౌరులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తుండగానే, మరోచోట నేరగాళ్లు చెలరేగిపోయారు. మహారాష్ట్రలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడ్డారు. 12 ఏళ్ల క్రితం జరిగిన నిర్భయ ఘటన తర్వాత మహిళలపై నేరాలు జరగకుండా వ్యూహాలు రూపొందించుకున్నాం. ప్రణాళిక అమల్లోకి తీసుకొచ్చాం. అయినా నేరాలు ఆగడం లేదు. గత 12 ఏళ్లలో లెక్కలేనన్ని దారుణాలు జరిగాయి. కొన్ని మాత్రమే అందరి దృష్టికి వచ్చాయి. మనం నిజంగా పాఠాలు నేర్చుకున్నామా? ఆందోళనలు ముగిసిపోగానే ఘోరాలు మరుగునపడిపోతున్నాయి. వాటిని మనం మర్చిపోతున్నాం. మరో ఘోరం జరిగాక పాత ఘోరాలను గుర్తుచేసుకుంటున్నాం. ఇది సరైన విధానం కాదు.

మహిళలపై వక్రబుద్ధిని మొదట్లోనే అడ్డుకోవాలి

మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలి. వాటిని పోరాడి సాధించుకోవాలి. మహిళలకు మరిన్ని హక్కులు దక్కకుండా, హక్కుల విస్తరణ జరగకుండా కొన్ని సామాజిక ఆచారాలు, సంప్రదాయాలు అడ్డుపడుతున్నాయి. మహిళలను ప్రాణంలేని వస్తువుగా చూసే ధోరణి వారిపై నేరాలకు పురిగొల్పుతోంది. ఈ పరిస్థితిలో కచ్చితంగా మార్పురావాలి. వారి హక్కులను అందరూ గౌరవించాలి. స్త్రీల పట్ల జనంలో ఉన్న దురభిప్రాయాన్ని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు, సమాజంపై ఉంది. చరిత్రను ఎదిరించే సమయం వచ్చింది. స్త్రీలపై నేరాల పట్ల నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారిపై అత్యాచారాలు, హత్యలు జరగకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. జరిగిన తప్పులను సరిదిద్దుకోకపోతే సమాజంలోని సగం జనాభా మిగతా సగం జనాభాలాగా నిర్భయంగా జీవించలేదు.

మీడియా ధైర్యంగా పనిచేయాలి

ప్రసార మాధ్యమాలు ధైర్యంగా పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సూచించారు. ఒత్తిళ్లకు లొంగకుండా, ఎవరికీ భయపడకుండా ప్రజలకు నిజాలు తెలియజేయాలని అన్నారు. దేశాన్ని, సమాజాన్ని సక్రమంగా తీర్చిదిద్దడంలో ఫోర్త్ ఎస్టేట్ పాత్ర అత్యంత కీలకమని వివరించారు. మీడియా ఎప్పటికీ సత్యానికే అండగా ఉండాలని చెప్పారు. సత్య మార్గం నుంచి పక్కకు మళ్లొద్దని కోరారు. 'మనసు ఎక్కడ నిర్భయంగా ఉంటుందో' అని రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన పద్యాన్ని రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. పీటీఐ 77వ వార్షికోత్సవం సందర్భంగా వార్తాసంస్థల ఎడిటర్లు బుధవారం రాష్ట్రపతిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన దేశంలో మహిళలను దేవతలుగా పూజిస్తుంటామని, మరోవైపు మన రోజువారీ ప్రవర్తనలో ఆ భావన కనిపించకపోవడం తనను అప్పుడప్పుడు ఆవేదనకు గురి చేస్తోందని ముర్ము వ్యాఖ్యానించారు.

రేపిస్టులకు మరణశిక్షే

- ఆ మేరకు చట్టాలను సవరిస్తాం
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కోల్‌కతా: అత్యాచారం కేసుల్లో మరణశిక్ష విధించేలా చట్టాలను సవరిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. వచ్చేవారం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను పెట్టి ఈ బిల్లును ఆమోదిస్తామన్నారు. రాష్ట్ర మంత్రివర్గం కూడా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

రేప్ లాంటి నేరాలను తాము ఏమాత్రం ఉపేక్షించబోమని మమత అన్నారు. అత్యాచారానికి మరణశిక్ష విధించే సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయడంలో ఆలస్యం చేసినా, రాష్ట్రపతికి పంపినా.. తాను రాజ్‌భవన్ ఎదుట ధర్నా చేస్తానని ప్రకటించారు. రేప్ కేసుల్లో దోషులుగా తేలినవారికి కఠిన శిక్షలు విధించేలా చట్టం తేవాలని, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి టీఎంసీ శనివారం నుంచి క్షేత్రస్థాయిలో ఉద్యమం చేస్తుందని తెలిపారు. గవర్నర్ తమ బిల్లును తొక్కిపెడితే రాజ్‌భవన్ ఎదుట మహిళలతో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని మమత అన్నారు. టీఎంసీ ఛాత్ర పరిషద్ వ్యవస్థాపక దినోత్సవం ర్యాలీని ఉద్దేశించి మమత బుధవారం ప్రసంగించారు. రాజ్‌భవన్‌లో తనను లైంగిక వేధింపులకు గురిచేశారని గతంలో ఒక ఉద్యోగిని ఆరోపించడాన్ని ప్రస్తావించారు. గవర్నర్ సి.వి.ఆనంద బోస్ తమ ప్రభుత్వంపై, టీఎంసీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 20 రోజులుగా సమ్మెలో ఉన్న జూనియర్ డాక్టర్లను తక్షణం విధుల్లో చేరాల్సిందిగా కోరారు. 'తమ సహచరిణికి న్యాయం కోరుతున్న డాక్టర్ల ఆవేదన పట్ల నేను మొదటినుంచీ సానుభూతితోనే ఉన్నాను. ఘటన జరిగి చాలా రోజులు గడిచిపోయినా జూనియర్ డాక్టర్లపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు దిగలేదు. వారి ఆవేదనను అర్థం చేసుకోగలం. కానీ రోగులు ఇబ్బందిపడుతున్నారు. దయచేసి విధుల్లోకి తిరిగిరండి' అని మమత విజ్ఞప్తి చేశారు. మెడికోల కెరీర్‌కు ఇబ్బంది రాకూడదనే ఒక్క డాక్టర్‌పై కూడా ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయలేదన్నారు. 'ఆర్.జి.కర్ వైద్యురాలి హత్యాచార కేసును సీబీఐ స్వాధీనం చేసుకొని 16 రోజులు అయింది. దర్యాప్తు పురోగతిని సీబీఐ బయటపెట్టాలి' అని మమత డిమాండ్ చేశారు. శవాలపై రాజకీయ లబ్ధి పొందాలనే బీజేపీ 12 గంటల బంద్‌కు పిలుపిచ్చిందని ధ్వజమెత్తారు. వైద్యురాలి హత్యను చూపి బీజేపీ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలనుకుంటోందని మండిపడ్డారు.

ప్రధాని ఎందుకు రాజీనామా చేయలేదు?

ఆర్.జి.కర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్లపై మమతా తీవ్రంగా స్పందించారు. 'ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, మణిపూర్‌లతో మహిళలపై లైంగిక దాడులు, హింసను నిరోధించలేకపోయినందుకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు రాజీనామా చేయలేదని నేను బీజేపీ అడుగుతున్నా. అస్సాంలో ఒక నిందితుడినే ఎందుకు ఎన్‌కౌంటర్ చేశారు? ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగలడం, భవిష్యత్తులో గెలవలేమని తెలుసు కాబట్టే తన రాజీనామాకు బీజేపీ డిమాండ్ చేస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వాడి బీజేపీ పెద్ద ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడుతోందని, సమాజంలో అశాంతిని రేకెత్తిస్తోందని ఆరోపించారు. దుర్గా పూజ సంబరాలను అడ్డుకోవడానికి బీజేపీ కుట్ర పన్నిందన్నారు.

బెంగాల్ తగలబెడితే.. ఢిల్లీ కూడా

బెంగాల్‌ను అపఖ్యాతి పాల్జేయడానికి కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించడానికి కుట్ర పన్నారని బీజేపీపై మమత ధ్వజమెత్తారు. బెంగాల్‌ను తగలబెడితే అసోం, బిహార్, జార్ఖండ్, ఒడిశా, ఢిల్లీ, యూపీల్లోనూ అగ్గి రాజుకుంటుందని హెచ్చరించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి ఇలా దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడం సిగ్గుచేటని బెంగాల్ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి సుకాంత మజుందార్ అన్నారు. బెంగాల్‌లో శాంతిభద్రతలు కాపాడాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు చేసిన ఫిర్యాదులో కోరారు.

సందీప్ ఘోష్‌పై ఐఎంఏ సస్పెన్షన్ వేటు



న్యూఢిల్లీ: ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సస్పెన్షన్ వేటు వేసింది. ట్రైనీ పీజీ డాక్టర్ హత్యాచార ఘటనపై సీబీఐ దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో సందీప్ ఘోష్ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని ఐఎంఏ క్రమశిక్షణ కమిటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.వి.అశోకన్, జనరల్ సెక్రటరీతో కలిసి వైద్యురాలి కుటుంబ సభ్యులను కోల్‌కతాలో కలిశారు. రేప్, హత్య ఘటనలో సందీప్ ఘోష్ ఏమాత్రం సానుభూతి, సున్నితత్వంతో వ్యవహరించకపోవడం, ఆయన బాధ్యతారాహిత్యాన్ని తల్లిదండ్రులు అశోకన్ దృష్టికి తెచ్చారు. దాంతో ఘోష్‌ను సస్పెండ్ చేయాలని ఐఎంఏ నిర్ణయించింది.

దీదీ.. మీకెంత ధైర్యం?

అసోంనే బెదిరిస్తారా: హిమంత



గువాహటి: బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఘాటుగా స్పందించారు. 'దీదీ అసోంను బెదిరించడానికి మీకెంత ధైర్యం? మీ కన్నెర్రకు ఇక్కడెవరూ బెదరరు. మీ విఫల రాజకీయాలతో భారత్‌ను అగ్నిగుండం చేయాలని చూడకండి. విభజన భాష మాట్లాడటం మీకు సరికాదు' అని హిమంత అన్నారు. బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ భాష, సంస్కృతులు ఒక్కటే అయినా.. రెండూ వేర్వేరని, బెంగాల్ భారత్‌లో భాగమని మమత అన్నారు. ఇక్కడా విద్యార్థులను ఎగదోసి బంగ్లాదేశ్ లాంటి పరిస్థితులను కల్పించాలని చూస్తున్నారని బీజేపీపై ధ్వజమెత్తారు.

నైట్ పెట్రోలింగ్ ఉండాలి

- ఆస్పత్రులు సీసీటీవీల తాలూకు నిఘా నీడలో ఉండాలి
- వైద్య సిబ్బందిపై దాడుల నేపథ్యంలో ఆస్పత్రుల్లో మెరుగైన భద్రతా చర్యలు
- రాష్ట్రాలకు తాజాగా మార్గదర్శకాలు జారీచేసిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై రేప్, హత్య ఘటనసహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బందిపై లైంగికదాడుల ఘటనలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. వైద్య సిబ్బంది భద్రతకు ఆస్పత్రుల్లో అమలుచేయాల్సిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం బుధవారం జారీచేసింది. బుధవారం వర్చువల్ విధానంలో జరిగిన నేషనల్ టాస్క్ ఫోర్స్ భేటీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర, ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భేటీలో సూచించిన మార్గదర్శకాల్లో ముఖ్యమైనవి..

- పెద్ద ఆస్పత్రుల్లో జనం పెద్దగా తిరగని చోట్ల, చీకటి ప్రాంతాలు, మూలగా ఉండే చోట్ల సీసీటీవీలు బిగించాలి
- ఆస్పత్రుల్లో భద్రతపై జిల్లా కలెక్టర్లు, డీఎస్పీలు, జిల్లా ఆస్పత్రి యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి తగు సెక్యూరిటీ ఏర్పాట్లు చూసుకోవాలి
- సెక్యూరిటీ, ఇతర సిబ్బందిని భద్రతా తనిఖీలు చేయాలి
- రాత్రుళ్లు అన్ని ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో సెక్యూరిటీ పెట్రోలింగ్ తరచూ జరుపుతుండాలి
- పెద్ద జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేయాలి. సీసీటీవీలను ఎప్పటికప్పుడు చెక్‌చేస్తూనే డాటాను కూడా తరచూ బ్యాకప్ తీసుకోవాలి
- అత్యవసర కాల్స్‌కు స్పందించి కంట్రోల్ రూమ్, సెక్యూరిటీ, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి. కాంట్రాక్ట్ సెక్యూరిటీ సిబ్బంది శారీరకదారుఢ్యం మెరుగు కోసం వారికి శిక్షణ ఇప్పించాలి
- రోగులను స్ట్రెచర్, ట్రాలీ, చక్రాల కుర్చీల్లోకి మారుస్తూ ఎక్కువ మంది బంధువులు ఆస్పత్రుల్లో పోగుబడుతున్నారు. వీరి సంఖ్యను తగ్గించేందుకు ఆస్పత్రులే ఈ పనులకు తగు సిబ్బందిని నియమించాలి



- వైద్యారోగ్య సిబ్బంది రక్షణ కోసం ఉన్న భారతీయ న్యాయ సంహిత చట్టాలు, వారిపై దాడులకు పాల్పడితే బాధ్యులకు విధించే శిక్షలకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి ప్రాంగణంలో స్పష్టంగా ప్రదర్శించాలి
- తమ రాష్ట్రాల్లో హెల్ప్‌లైన్ నంబర్లు 100, 112 ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చాలా రాష్ట్రాలు స్పష్టంచేశాయి.
- అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి కొన్ని రాష్ట్రాల్లో వైద్య సిబ్బంది రక్షణ కోసం మెరుగైన విధానాలు అమల్లో ఉన్నాయని ఆయా రాష్ట్రాలను కేంద్రం మెచ్చుకోవడం విశేషం.


హాయ్, నేను సీజేఐని... క్యాబ్‌కు రూ.500 పంపండి!

స్కామర్ బరితెగింపు • ఫిర్యాదు చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా వదలడం లేదు. సీజేఐ పేరిట ఒక వ్యక్తిని రూ.500 అడిగారు! సదరు స్కామర్ తనను తాను సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌గా చెప్పుకున్నాడు. ''హలో! నేను సీజేఐని. కొలీజియం అత్యవసర భేటీకి వెళ్లాల్సి ఉంది. కన్నాట్ ప్లేస్‌లో చిక్కుకున్నాను. క్యాబ్ కోసం రూ.500 పంపగలరా! కోర్టుకు చేరగానే తిరిగి పంపిస్తా'' అంటూ మెసేజ్ చేశాడు. అది నిజమైందేనని నమ్మించడానికి ఐ పాడ్ నుంచి పంపుతున్నట్టు కూడా చెప్పుకొచ్చాడు. అయితే దాన్నిండా స్పెల్లింగ్, వ్యాకరణ దోషాలే ఉండటం విశేషం! ఈ నకిలీ మెసేజ్ వైరల్‌గా మారింది. దాన్ని కైలాశ్ మేఘ్వాల్ అనే వ్యక్తి ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఫ్రెండ్స్, ఏం చేద్దాం మరి!' అంటూ కామెంట్ చేశారు. ఈ వైరల్ పోస్టును సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సీజేఐ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్స్‌కు ఫిర్యాదు చేసింది.

డీఎంకే ఎంపీ జగత్రక్షకన్‌కు రూ. 908 కోట్ల జరిమానా



న్యూఢిల్లీ: తమిళనాడులో అధికార డీఎంకే లోక్‌సభ సభ్యుడు జగత్రక్షకన్‌తోపాటు ఆయన కుటుంబానికి పెద్ద షాక్ తగిలింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా) నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.908 కోట్ల జరిమానా చెల్లించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వారిని ఆదేశించింది. ఫెమా చట్టంలోని సెక్షన్ 37ఏ కింద 2020 సెప్టెంబర్ 11న స్వాధీనం చేసుకున్న రూ.89.19 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను జప్తు చేసినట్లు వెల్లడించింది. 76 ఏళ్ల జగత్రక్షకన్ తమిళనాడులోని అరక్కోణం ఎంపీగా ఉన్నారు.

టీవీ పాత్రికేయురాలి అనుమానాస్పద మృతి



ఢాకా: బంగ్లాదేశ్‌లో ఒక టీవీ జర్నలిస్టు రాజధాని ఢాకాలో ఓ సరస్సులో శవమై తేలారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నారా, చంపి ఎవరైనా నీళ్లలో పడేశారా అనేది తెలియరాలేదు. మృతురాలిని గాజీ మీడియా గ్రూప్‌లోని బెంగాలీ బాషలో ప్రసారమయ్యే గాజీ టీవీ న్యూస్‌రూమ్ ఎడిటర్ సారా రహనుమాగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఢాకాలోని హతిర్‌జహీల్ సరస్సు నుంచి మంగళవారం అర్ధరాత్రి దాటాక 2గంటలపుడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చనిపోవడానికి ముందు సారా ఫహీమ్ ఫైజల్ అనే వ్యక్తిని ట్యాగ్ చేస్తూ ఫేస్‌బుక్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టింది. '' నీలాంటి స్నేహితుడిని పొందడం సంతోషంగా ఉంది. నీ కలలను నెరవేర్చలేకపోతున్నందుకు క్షమించు. నీ జీవిత గమనంలో దేవుడు నీకు తోడుగా నిలుస్తాడు' అని రాసుకొచ్చింది. ''చస్తూ బతకడం కంటే చావడమే ఉత్తమం' అంటూ అంతకుముందు మరో పోస్ట్ పెట్టింది.

మహిళల కనీస వివాహ వయసు 21 ఏళ్లు

బిల్లును ఆమోదించిన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో ఇకపై మహిళల కనీస వివాహ వయసు 21 ఏళ్లు. నిర్దేశిత వయసు కంటే తక్కువ వయసున్న మహిళలకు పెళ్లి చేస్తే నేరం అవుతుంది. మహిళ కనీస వివాహ వయసును 18 నుంచి 21 ఏళ్లకు పెంచుతూ హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఈ మేరకు బాల్య వివాహాల నిషేధ చట్టం–2006 స్థానంలో బాల్య వివాహాల(హిమాచల్ ప్రదేశ్) నిషేధ సవరణ–2024 చట్టం తీసుకొచ్చారు. 2006 నాటి చట్టం ప్రకారం మహిళల కనీస వివాహ వయసు 18 ఏళ్లు కాగా, పురుషుల కనీస వివాహ వయసు 21 ఏళ్లుగా ఉంది.

బెంగాల్ బంద్ హింసాత్మకం

పోలీసులతో బీజేపీ కార్యకర్తల ఘర్షణ • బంద్‌కు మిశ్రమ స్పందన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనతోపాటు మంగళవారం జరిగిన 'నబన్నా అభియాన్'పై పోలీసుల దాడికి నిరసనగా ప్రతిపక్ష బీజేపీ బుధవారం తలపెట్టిన 12 గంటల రాష్ట్ర బంద్ హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పోలీసులతో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పోలీసులపై రాళ్లు రువ్వడంతో జనాన్ని చెదరగొట్టడానికి లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. బీజేపీ కార్యకర్తలు రైలు పట్టాలపై నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్రమంతటా ర్యాలీలు నిర్వహించారు. ఉదయం రోడ్లపై బైఠాయించిన బీజేపీ మాజీ ఎంపీలు రూపా గంగూలీ, లాకెట్ చటర్జీ, రాజ్యసభ సభ్యుడు సమిక్ భట్టాచార్య, ఎమ్మెల్యేల అగ్నిమిత్ర పాల్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. 'బంగ్లా బంద్'కు మిశ్రమ స్పందన లభించింది. వ్యాపార, విద్యా సంస్థలు, కార్యాలయాలు పాక్షికంగా మూతపడ్డాయి. రోడ్లపై ఘర్షణలు జరుగుతాయన్న అనుమానంతో ప్రజలు చాలావరకు ఇళ్లకే పరిమితమయ్యారు. రాజధాని కోల్‌కతాలో ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. బలవంతంగా దుకాణాలు మూసివేయిస్తున్న బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

ఇద్దరు బీజేపీ కార్యకర్తలపై కాల్పులు!

ఉత్తర 24 పరగణాల జిల్లాలోని భాత్‌పారాలో ఇద్దరు బీజేపీ కార్యకర్తలపై కాల్పులు జరిగాయని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. అయితే, ఇందులో నిజం లేదని, ఆ ఇద్దరు కార్యకర్తలపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని పోలీసులు చెప్పారు. ఈ దాడిలో గాయపడిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించామని తెలిపారు. తమ కార్యకర్తలపై తృణమూల్ కాంగ్రెస్ నాయకులు తుపాకీతో కాల్పులు జరిపారని బీజేపీ మాజీ ఎంపీ అర్జున్ సింగ్ పేర్కొన్నారు.

బంద్‌పై పిటిషన్ కొట్టివేత

బీజేపీ తలపెట్టిన 12 గంటల బంగ్లా బంద్ చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరుతూ సంజయ్ దాస్ అనే లాయర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కలకత్తా హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఇదే కోర్టులో ఇష్టారాజ్యంగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయకుండా గతంలోనే ఆయనపై నిషేధం విధించామని న్యాయస్థానం తేల్చిచెప్పింది. నిషేధం అమల్లో ఉండగా దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించలేమని స్పష్టం చేసింది. పిటిషనర్ సంజయ్ దాస్‌కు రూ.50 వేల జరిమానా విధించింది. ఈ సొమ్మును 10 రోజుల్లోగా పశ్చిమ బెంగాల్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది.

డిమాండ్లు నెరవేర్చేదాకా ఉద్యమిస్తాం

పశ్చిమ బెంగాల్‌లో గత 20 రోజులుగా ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. జూనియర్ డాక్టర్ హత్యకు ఖండిస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే ఆందోళనలు విరమించి, విధుల్లో చేరాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరగా జూనియర్ డాక్టర్ల ఫోరమ్ అందుకు నిరాకరించింది.

కోల్‌కతాలో టీఎంసీ కార్యకర్తలను నిలువరిస్తున్న పోలీసులు



నిందితుడితో సంబంధం ఉన్న ఏఎస్ఐకి పాలిగ్రాఫ్ టెస్టు

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్ రాయ్‌తో సంబంధాలున్న ఏఎస్ఐ అనూప్ దత్తాకు సీబీఐ అధికారులు బుధవారం పాలిగ్రాఫ్ టెస్టు నిర్వహించారు. ఈ కేసులో అనూప్ దత్తాను పోలీసులు ఇప్పటికే ప్రశ్నించారు. ఇప్పటిదాకా ఎనిమిది మందికి పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించారు. అనూప్ దత్తా కోల్‌కతా పోలీసు వెల్ఫేర్ కమిటీలో పనిచేస్తున్నాడు. వైద్యురాలిపై అఘాయిత్యం జరిగాక నిందితుడు సంజయ్ రాయ్ ఈ విషయాన్ని అనూప్ దత్తాకు తెలియజేసినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు.

ఆర్థిక సమ్మిళిత దశాబ్దం: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: జన్ ధన్ యోజన అమల్లోకి వచ్చిన ఈ పదేళ్లలో దేశంలో మరింత ఆర్థిక సమ్మిళిత సాధ్యమైందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గడిచిన దశాబ్దాన్ని ఆర్థిక సమ్మిళిత దశాబ్దిగా అభివర్ణించారు. పేదల్లో ఆర్థిక స్వావలంబనకు ఉద్దేశించిన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' పథకానికి బుధవారంతో పదేళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ 'ఎక్స్'లో ట్వీట్లు చేశారు. ''దేశ ఆర్థిక ప్రగతిపథంలో సాధారణ ప్రజానీకం హుందాగా భాగస్వాములయ్యేందుకు ఈ పథకం వీలు కల్పించింది. అట్టడుగు వర్గాలకు చెందిన కోట్లాది మందికి, ముఖ్యంగా మహిళలు, యువత ఆర్థిక స్వావలంబనకు దోహదపడింది. 2014 నాటికి కోట్లాది మంది గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు అందలేదు. పొదుపు మొత్తాలు బ్యాంక్‌లో దాచుకోలేకపోవడంతో దొంగలు దోచుకెళ్లడం జరిగేవి. తాము బ్యాంక్‌లోకి అడుగుపెట్టగలమా అన్న సంశయం బ్యాంక్ ఖాతా లేని 53 కోట్ల మందిలో ఉండేది. ఈ పథకం తెచ్చాక పరిస్థితిలో సమూల మార్పులొచ్చాయి. 53 కోట్లకుపైగా కొత్తగా బ్యాంక్ ఖాతాలు తెరిచారు. వీరిలో 65 శాతానికిపైగా ఖాతాలు గ్రామీణ, సెమీఅర్బన్ ప్రజలవేకావడం విశేషం. 30 కోట్ల మంది మహిళలు కొత్తగా బ్యాంకింగ్ వ్యవస్థను వాడుతున్నారు '' అని మోదీ పేర్కొన్నారు.

వెస్ట్‌బ్యాంక్‌లోని నూర్ షామ్ క్యాంప్ వద్ద ఇజ్రాయెల్ బలగాల మొహరింపు



వెస్ట్‌బ్యాంక్‌పై భీకర దాడి

- 9 మంది పాలస్తీనియన్ల మృతి
- ఇక 'అతిపెద్ద' ఆపరేషన్!
- ఇజ్రాయెల్ సైన్యం ప్రకటన

వెస్ట్‌బ్యాంక్: గాజాలో తమ అధీనంలోనే ఉన్న వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయెల్ బుధవారం విరుచుకుపడింది. ఫైటర్ జెట్లు, డ్రోన్లతో భీకర దాడులకు దిగింది. దాంతో 9 మంది మరణించారు. వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్లు స్థావరాలు ఏర్పాటు చేస్తున్నారని, వారు సాధారణ ప్రజలపై దాడి చేయకుండా నిరోధించడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైన్యం వెల్లడించింది. వెస్ట్‌బ్యాంక్‌లోనూ ఇజ్రాయెల్ అడపాదడపా దాడులు చేస్తున్నా ఇంతగా విరుచుకుపడడం ఇదే తొలిసారి. అక్కడి జెనిన్ సిటీని దిగ్బంధించినట్లు తెలుస్తోంది. ఉత్తర వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్, తుల్కారెమ్, అల్–ఫరా శరణార్థి శిబిరంలోకి సైన్యం చొచ్చుకెళ్లినట్లు ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి నదవ్ సొషానీ ప్రకటించారు. ''ఈ దాడి ఆరంభమే. వెస్ట్‌బ్యాంక్‌లో అతిపెద్ద సైనిక ఆపరేషన్‌కు ప్రణాళిక సిద్ధం చేశాం'' అన్నారు.

ఇజ్రాయెల్ సైన్యానికి, తమకు కాల్పులు జరిగినట్లు పాలస్తీనియన్ మిలిటెంట్ గ్రూపులు కూడా పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో, గాజాలో మిలిటెంట్ల స్థావరాలను ధ్వంసం చేస్తున్నట్లుగానే వెస్ట్‌బ్యాంక్‌లోని వారి స్థావరాలను ధ్వంసం చేయక తప్పదని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ స్పష్టం చేశారు.

రూ.6,456 కోట్ల రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: రూ.6,456 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టబోయే మూడు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థికవ్యవహారాల కేబినెట్ కమిటీ పలు ప్రాజెక్టులకు ఓకే చెప్పింది. ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్‌లోని మరో 300 కి.మీ.ల రైలుమార్గం నిర్మిస్తూ ఆ మార్గంలో కొత్తగా 14 రైల్వేస్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. 'ఈ మార్గాల్లో రాకపోకలు పెరగడం వల్ల ఈ 4 రాష్ట్రాల ప్రజలకు మేలు జరగనుంది. ప్రజా రవాణాతోపాటు ఇక్కడి ఎరువులు, బొగ్గు, ఇనుము, ఉక్కు, సిమెంట్, సున్నపురాయి తరలింపు సులభం కానుంది. దీంతో 10 కోట్ల లీటర్ల చమురు దిగుమతి భారం, 240 కోట్ల కేజీల కర్బన ఉద్గారాల విడుదల తగ్గడంతోపాటు 9.7 కోట్ల చెట్లునాటినంత ప్రయోజనం దక్కనుంది'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ఈశాన్య రాష్ట్రాలకు రూ.4,136 కోట్ల సాయం

పలు హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టుల ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో వచ్చే ఎనిమిదేళ్లలో 15వేల మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి సామర్థ్యం సాధించేందుకు ఆ రాష్ట్రాలకు రూ.4,136 కోట్ల ఈక్విటీ సాయం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గరిష్ఠంగా ఒక్కో ప్రాజెక్టుకు రూ.750 కోట్ల మేర రుణసాయం అందించనున్నారు. మరోవైపు వ్యవసాయ మౌలికవసతుల నిధి పథకం(ఏఐఎఫ్)లో స్వల్ప మార్పులు చేస్తూ రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీఓ)లకూ వర్తింపజేయాలన్న నిర్ణయానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. దీంతో పాల ఉత్పత్తిదారులు, మత్స్యకారులు, నేతపనివాళ్లు, గ్రామీణ కళాకారులు, హస్తకళాకారులు వంటి వారికీ ఈ పథకం ద్వారా రుణసదుపాయం కల్పించేందుకు అవకాశం లభిస్తుంది. రూ. 1 లక్ష కోట్ల మూల నిధితో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడం తెల్సిందే.

ఐదు గంటల సుదీర్ఘ సమీక్ష

మహిళలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, సామాజిక రంగంలో విధానాల రూపకల్పనకు విస్తృత సంప్రదింపులు జరపాల్సిందిగా ప్రధాని మోదీ మంత్రులను, అధికారులను కోరారు. బుధవారం మొత్తం మంత్రిమండలిలో మోదీ ఐదు గంటల సుదీర్ఘ సమీక్ష జరిపారు. ప్రభుత్వ నిర్ణయాలను వేగంగా, సమర్థమంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత పదేళ్లలో ప్రజలకు ఎంతో మేలు చేశామని, అదే వేగంతో వచ్చే ఐదేళ్లు కూడా పనిచేద్దామని మోదీ సూచించారు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 29 । ఆగస్టు । 2024



రెస్ట్రో బార్‌పై కోహ్లీ సిక్స్

నగరంలో ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీ సొంతంగా వన్‌–8 కమ్యూన్ అనే రెస్ట్రో బార్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ వసంధైన వంటకాలు నోరూరిస్తున్నాయి. - సిటీప్లస్‌లో..



.. 'గుడ్ మార్నింగ్ హైదరాబాద్'

'గుడ్ మార్నింగ్ హైదరాబాద్' త్వరలో నగర పోలీసుల నోటి వెంట ఈ మాట వినిపించనుంది. సిటీ పోలీసులు ఓ కమ్యూనిటీ రేడియోను ఏర్పాటు చేయనున్నారు. - సిటీప్లస్‌లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/23.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



సాక్షి, సిటీబ్యూరో: వినాయక ఉత్సవాలకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి స్పష్టం చేశారు. సంబంధిత పోలీసు స్టేషన్లలో నిర్వహణ కమిటీలు విధిగా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఈమేరకు కమిషనరేట్‌లో బుధవారం భాగ్యనగర్, గణేష్ ఉత్సవ కమిటీలు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ వంటి ప్రభుత్వ విభాగాల అధికారులు, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌లతో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీపీ మాట్లాడారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఉత్సవ కమిటీలు, సిబ్బంది సహకరించాలని సూచించారు. మహిళల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వదంతులను ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఊరేగింపులు, నిమజ్జన ప్రాంతాలలో పోలీసు బలగాలతో భద్రత, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డీ జోయల్ డేవిస్ ఆదేశించారు.

బల్దియాలో భారీగా బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో అంతర్గత బదిలీల ప్రక్రియలో భాగంగా జూనియర్ అసిస్టెంట్ల నుంచి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ల వరకు భారీ సంఖ్యలో బదిలీలు చేశారు. బదిలీ అయినవారిలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, అడిషనల్ మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు. వీరిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి, ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి బదిలీ చేశారు.

సప్తముఖ మహాశక్తి గణపతికి పెయింటింగ్ పనులు షురూ



ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో రూపుదిద్దుకుంటున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి తయారీ పనుల్లో భాగంగా బుధవారం రంగులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూర్తిగా మట్టితో రూపుదిద్దుకుంటున్న మహాగణపతి ఫినిషింగ్ పనులు పూర్తి కావడంతో వాటర్ పెయింటింగ్ పనులను ప్రారంభించారు. బుధవారం సెంట్రల్ జోన్, ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ మాజిద్, సైఫాబాద్ ఏసీపీ ఏసీపీ ఎర్న, ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌లతో కలిసి మహాగణపతి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులతో చర్చించారు.

హైదరాబాద్ అబ్బాయి.. అమెరికా అమ్మాయి



నాగోలు: హైదరాబాద్ అబ్బాయి.. అమెరికా అమ్మాయి పెళ్లి వేడుకలు బుధవారం నాగోలు స్వాగత్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో తెలుగు సంప్రదాయం ప్రకారం ఘనంగా జరిగాయి. నాగోలు లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన నారమళ్ల జీవన్ జ్యోతి– సుధాకర్‌రావు దంపతుల కుమారుడు రోహిత్ ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేసే క్రమంలో అదే ప్రాంతంలో ఉపాధ్యాయురాలిగా పని చేసే రెబెకాతో ఏర్పడిన పరిచయం ప్రణయానికి దారి తీసి పరిణయానికి బాటలు వేసింది. రెబెకా తల్లిదండ్రులు లౌవురా–తియోతి అంగీకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం బుధవారం ఘనంగా వివాహం చేశారు.

ఓయూ పీజీ పరీక్షలు 19కి వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో జరగనున్న పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు వచ్చే నెల 19కి వాయిదా వేశారు. తొలుత ప్రకటించిన సెప్టెంబరు 4 నుంచి ప్రారంభం కావాల్సిన పీజీ కోర్సుల 2, 4వ సెమిస్టర్ పరీక్షలను యూజీసీ నెట్, టీఎస్ సెట్ పరీక్షల కారణంగా వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఇదేం పారిశుద్ధ్యం?

అధికారులపై అనుదీప్ ఆగ్రహం

ముషీరాబాద్: పారిశుద్ధ్య సమస్యపై జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. బుధవారం సికింద్రాబాద్ జోన్ పరిధిలోని రాంనగర్‌లో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో అత్యధికంగా డెంగీ కేసులు నమోదు కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫాగింగ్, ఎంటమాలజీ అధికారుల పనులపై ఆరా తీశారు. రాంనగర్‌లో పర్యటించిన కలెక్టర్‌కు డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి ఆర్టీసీ డిపో వెనుక పేరుకుపోయిన చెత్త, గుంతలలో నీరు నిలిచి దోమలు ఉన్న ప్రదేశాన్ని చూయించగా.. అక్కడే ఉన్న జీహెచ్‌ఎంసీ డీఎంసీ, ఏఎంవోహెచ్, ఎంటమాలజీ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.



రాంనగర్‌లోని ఆర్టీసీ బస్ డిపో వెనక పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్



అలంకారప్రాయంగా 'ఆక్సిజన్'

ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆనందం.. పంచేందుకు ఎల్బీనగర్ కామినేని ఫ్లైఓవర్ కింద ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. దీనిని అందుబాటులోకి తీసుకు వస్తే చిన్నారులకు, సందర్శకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.







మూసీ వేతలు!

ఎక్కడికక్కడే మూసివేతలు!! • కబ్జా కోరల్లో నదీ పరీవాహకం

సాక్షి, సిటీబ్యూరో: సుందరీకరణ పనులతో మూసీ నది మురిసేలా.. లండన్‌లోని థేమ్స్ నదిని తలపించేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన ఆశయం మాటేమోగానీ.. నదీ పరీవాహకంలో వెలసిన అక్రమ నిర్మాణాల తొలగింపు పెను సమస్యగా పరిణమించనుందా? అనే ప్రశ్నకు అవును అనే సమాధానమే వస్తోంది. ఇప్పటికే నగర శివార్లలో ఎఫ్‌టీఎల్, చెరువులు, బఫర్ జోన్లలో నిర్మాణాల కూల్చివేతతో హడలెత్తిస్తున్న 'హైడ్రా' పరిధిలోకి మూసీ పరీవాహకం రాకపోవడంతో అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రయత్నం అంత సులువు కాదని తెలుస్తోంది. ప్రత్యేకంగా ఏర్పాటైన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి మాత్రమే మూసీతో పాటు దాని పరీవాహక ప్రాంతం వస్తోంది. ఈ సంస్థ ఏర్పాటై ఏడేళ్లు గడుస్తున్నా.. కేవలం పరీవాహక పరిధిలో రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో కలిసి జాయింట్ సర్వే, ఆక్రమణల గుర్తింపు, నోటీసులకు పరిమితమైందే తప్ప ఎలాంటి చర్యలకు ఉపక్రమించిన దాఖలాలు లేవు. తాజాగా రూ.1.5 లక్షల కోట్ల అంచనా వ్యయంతో సుందరీకరణ పనులు తలపెట్టినా.. ఆక్రమణల తొలగింపు ప్రధాన ఆటంకం కానుంది. నదీ పరీవాహకంలో భారీ భవన నిర్మాణాలతో పాటు సుమారు 15 వేలకు పైగా చిన్నా చితకా కట్టడాలు ఉండటంతో వాటి తరలింపు, పునరావాస కల్పన తలకు మించిన భారమే. యథేచ్ఛగా నిర్మాణాలు వెలుస్తున్నా.. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో సమస్య జటిలంగా తయారైంది.

60 శాతం వెడల్పు కనుమరుగు..

మూసీ నది పరీవాహక అసలు వెడల్పులో ప్రస్తుతం 40 శాతానికి పరిమితమైంది. ఇప్పటికే మూసీ రివర్‌బెడ్ దాదాపు ఆక్రమణల్లో చిక్కుకొని కనుమరుగైంది. భాగ్యనగరానికి మణిహారం లాంటి మూసీనది ఒకప్పుడు నగరవాసుల దాహార్తిని తీర్చి ప్రస్తుతం మురికికూపంగా తయారై కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంది. అడుగడుగునా ఆక్రమణలతో క్రమంగా తన స్వరూపాన్నే కోల్పోతోంది.

అడుగడుగునా ఆక్రమణలు

- 60% మేర తగ్గిన రివర్ బెడ్
- బఫర్ జోన్‌లో ఆగని నిర్మాణాలు, లేఅవుట్లు
- ఇప్పటికే అక్రమ కట్టడాల గుర్తింపు, నోటీసులు
- చర్యలకు ఉపక్రమించని అధికారులు

ఏటేటా పెరుగుతున్న ఆక్రమణలు..

సరిగా నాలుగేళ్ల క్రితం మూసీ పరీవాహక పరిధిలో సమగ్ర సర్వే నిర్వహించగా దాదాపు 400 ఎకరాల్లో సుమారు 8,475 ఆక్రమణలను ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తాజాగా రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సంయుక్తంగా సర్వే నిర్వహించగా ఆక్రమణలు 12,184 బయటపడ్డాయి. వాటిని రెండుగా వర్గీకరించి నదీ గర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీ గర్భంలో 1585 చోట్లు గుర్తించగా అందులో 288 చోట్లు భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు ఉన్న బఫర్‌జోన్ పరిధిలో 6,890 ఆక్రమణలు, ఇందులో 1032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు.

మూసీ పరీవాహకంలో ఇలా..

మండలం	ఆక్రమణల సంఖ్య
బహదూర్‌పురా	2080
నాంపల్లి	2059
ఉప్పల్	1589
రాజేంద్రనగర్	1334
అంబర్‌పేట	1154
గోల్కొండ	1113
ఆసిఫ్‌నగర్	902
గండిపేట	869
సైదాబాద్	556
హిమాయత్‌నగర్	401
చార్మినార్	56
మేడిపల్లి	45
అబ్దుల్లాపూర్‌మెట్	20
ఘట్‌కేసర్	04

తగ్గిన బఫర్ జోన్స్ పరిధి..

మూసీ పరిసరాల్లో గతంలో వంద మీటర్ల వరకు బఫర్ జోన్ పరిధి ఉండేది. అంటే ఈ బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదు. ఈ పరిధిని 2016లో ప్రభుత్వం 50 మీటర్లకు కుదిస్తూ, జీవోను జారీ చేసింది. ఆక్రమణదారులకు కుదింపు బాగా కలిసొచ్చింది. రియల్ వ్యాపారులు.. మూసీని మూసేసి... లే అవుట్లు వేసి..భారీ వెంచర్లతో సొమ్ము చేసుకుంటున్నారు.. వాస్తవంగా మూసీ నదికి ఎఫ్‌టీఎల్ హద్దులు లేవు. బఫర్ జోన్ న్ ఎంతవరకు వస్తుందనే రాళ్లు ఏర్పాటు చేయలేదు. దాంతో ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగ్ నుంచి నగరంలోకి ప్రవేశించిన మూసీ నది నాగోల్ బ్రిడ్జి వరకు దాదాపు 25 కిలోమీటర్ల మేర పూర్తిగా కబ్జాకు గురైంది.

ఉదాహరణలివిగో..



- నగరంలోని చాదర్‌ఘాట్ నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లే మార్గంలోని మూసీ నదీ పరీవాహకంలో వలస చిరు వ్యాపారులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఒక వ్యక్తి ఏకంగా నదిలో ఎకరాల కొద్దీ మట్టితో చదును చేసి బస్సు పార్కింగ్ ప్రదేశంగా వినియోగిస్తూ వస్తున్నారు. నాలుగేళ్ల క్రితం 'ప్రైవేటు ల్యాండ్' అని బోర్డు పెట్టగా అప్పట్లో రెవెన్యూ అధికారులు దానిని తొలగించి ప్రభుత్వ స్థలంగా రెండు మూడు బోర్డులు పెట్టినా.. తిరిగి వాటిని తొలగించి మరింత మట్టితో చదును చేసి ప్రైవేటు బస్సుల అడ్డాగా మార్చేశాడు. తాజాగా అక్కడే ప్రైవేటు నర్సరీ కూడా ఏర్పాటైంది.
- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడలోని మూసీ కాల్వలో కొందరు భూబకాసురులు ఇప్పటికే రెండెకరాలు ఆక్రమించుకోగా.. మరో ఐదెకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి రియల్ వెంచర్ కోసం ప్రణాళిక రూపొందించుకున్నారు.
- అంబర్‌పేట, గోల్నాక పరిధిలోని మూసీ పరీవాహకాన్ని మట్టితో నింపుతూ ప్లాట్లు చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సదరు ప్లాట్లను కొనుగోలు చేసిన వ్యక్తులు ఎలాంటి అనుమతులు పొందకుండానే నిర్మాణాలు చేస్తున్నారు.
- అత్తాపూర్ నుంచి నాగోలు వరకు ఎక్కడికక్కడ కొత్తగా ఆక్రమణలు వెలుస్తున్నాయి. స్థలాన్ని చదును చేసి షెడ్లు నిర్మించడం లేదా పార్కింగ్ ప్రదేశాలుగా వినియోగిస్తుంచడం సర్వసాధారణమైంది.
- టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్ వంతెన వరకు మూసీని రెండు వైపులా మట్టితో నింపేసిన భూబకాసురులు.. యథేచ్ఛగా కబ్జా చేసి లేఅవుట్లు చేశారు.
- లంగర్‌హౌస్ బాపునగర్ బస్తీ వెనక కబ్జా పరిస్థితి తారస్థాయికి చేరుకుంది. బాపూఘాట్, డిఫెన్స్ కాలనీ వెనక వైపున్న మూసీ బఫర్ జోన్‌లో ఏకంగా రాజకీయ నాయకులే లేఅవుట్లు చేశారు.
- రాంసింగ్‌పురా ప్రాంతంలో మూసీ పరీవాహక ప్రాంతంలో మండపాలను నిర్మించారు. ఈ ప్రాంతంలో మూసీ నది వెడల్పు పూర్తిగా తగ్గిపోయి.. చిన్న కాల్వలా కనిపించడం గమనార్హం. జియాగూడలో సుమారు 15 గోదాములు మూసీ బఫర్ జోన్‌లో కొనసాగుతున్నాయి. చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జి కింద 18 ద్వారాలుండగా.. అటూఇటూ కలిపి.. 10 ద్వారాలు మూసుకుపోయేలా మట్టితో పూడ్చేశారు. ఉస్మానియా ఆస్పత్రికి దక్షిణం వైపు గేటు ఎదురుగా ఉన్న మూసీ నదిని అఫ్జల్‌గంజ్ లైన్‌లో పెద్దఎత్తున ఆక్రమించి వాహనాలకు పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.



ప్రైవేట్ సెక్యూరిటీకి పెద్దపీట



లోగోను ఆవిష్కరిస్తున్న నగర సీపీ తదితరులు

30న జాతీయ స్థాయి సదస్సు

- నగరంలో తొలిసారిగా నిర్వహణ
- లోగో ఆవిష్కరించిన కొత్వాల్, హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ).. ఈ రెండూ భద్రతారంగంలో వెన్నెముక లాంటి ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు పెద్దపీట వేస్తున్నాయి. ఆ రంగానికి అత్యాధునిక పరిజ్ఞానం జోడించడంతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న ఉత్తమ విధానాలను పరిచయం చేయడానికి జాతీయ స్థాయి సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. 'నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్–2024' శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీసీసీసీ) వేదిక కానుంది. ఇందుకు సంబంధించిన లోగోను నగర కొత్వాల్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ తరహా సదస్సు నిర్వహించడం నగరంలో ఇదే తొలిసారి.

మూడింట రెండో వంతు..

భద్రతలో ప్రైవేట్ సెక్యూరిటీల పాత్ర కీలకం. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల్లో మూడింట రెండో వంతు నగరంలోనే ఉన్నారు. మూడు కమిషనరేట్లలో కలిపి వీరి సంఖ్య నాలుగు లక్షలకు పైగా ఉంటుంది. ఆయుధం లేకుండా పని చేస్తున్న ఈ గార్డులను నేరాల నిరోధంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2012–13లో ఉమ్మడి రాష్ట్రానికి హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పని చేశా. అప్పట్లో నెల్లూరు జిల్లా తడలో ఉన్న శ్రీసిటీలో కొన్ని అసాంఘిక శక్తులు సెక్యూరిటీ గార్డుల ముసుగులో ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా.. నకిలీ గుర్తింపు కార్డులతో ఉన్న మయన్మార్ వాసులు చిక్కారు. ఇలాంటివి లేకుండా ఉండాలంటే సెక్యూరిటీ ఏజెన్సీల రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలి.
– కొత్తకోట శ్రీనివాసరెడ్డి, సిటీ సీపీ

గార్డులతో పాటు సాంకేతిక పరిజ్ఞానం

ప్రైవేట్ ఏజెన్సీల భద్రతను ఫిజికల్ సెక్యూరిటీగా పేర్కొంటారు. ఈ భద్రతలో గార్డులతో పాటు సాంకేతిక పరిజ్ఞానానికీ ప్రాధాన్యం ఉంటుంది. సాంకేతిక అంశంలో ఇప్పటికీ కొన్ని పరిమితులు ఉన్నాయి. పోలీసులు ప్రతి చోటా ఉండలేరు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల పాత్ర వెలకట్టలేనిది.
– విక్రమ్ సింగ్ మాన్, అదనపు సీపీ (శాంతిభద్రతలు)

పోలీసులతో కలిసి పని చేసేలా..

ప్రస్తుతం రాష్ట్రంలో వేల సంఖ్యలో రిజిస్టర్డ్ సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నాయి. రాజధానిలో ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలోనూ కనీసం 20 నుంచి 25 ఏజెన్సీలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా ఠాణాల స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో (ఇన్‌స్పెక్టర్లు) కలిసి సెక్యూరిటీ ఏజెన్సీలు పని చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
– కల్నల్ కేఎస్ రావ్, జాయింట్ సెక్రటరీ, హెచ్‌సీఎస్‌సీ

విష జ్వరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్

గాంధీ ఆస్పత్రి: సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆయన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని సందర్శించి, అత్యవసర వార్డులు, విభాగాలలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్వరాలన్నీ డెంగీ కాదన్నారు. డెంగీపై జరుగుతున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం గాంధీలో ఏడుగురు డెంగీ, నలుగురు చికెన్ గున్యా రోగులతో పాటు మొత్తం 43 మంది జ్వర పీడితులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గాంధీలో మందుల కొరత లేదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మంకీ పాక్స్ ఐసోలేషన్ వార్డులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనంతరం గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ సునీల్‌కుమార్, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.



గాంధీ ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా తీసున్న టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్

ఆ భవనాల లెక్క తేల్చండి

బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలపై నివేదిక సమర్పించండి

- గొలుసు కట్టు చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఎఫ్‌టీఎల్ హద్దు రాయిని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మీర్‌పేట: బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ భవనాల లెక్క తేల్చాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీర్‌పేట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం.. కార్పొరేషన్ పరిధిలోని మూడు గొలుసుకట్టు చెరువులను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలపై ఆరా తీశారు. గతంలో కబ్జా చేసిన ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారా..? అని అడిగారు. చందన చెరువుకు ఆనుకుని నిర్మించిన ఎస్వైఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న ఎఫ్‌టీఎల్ హద్దు రాయిని పరిశీలించారు. ఫంక్షన్‌హాల్ అనుమతి పత్రాలను సమర్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. పూర్తి వివరాలతో రూపొందించిన నివేదికను సోమవారం లేదా మంగళవారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణదారుల వద్ద ఉన్న పత్రాలు, మన వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుందామని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, మీర్‌పేట కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

ఫీవర్.. ఫికర్!

సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రద్దీ పెరగడంతో రోగుల సంఖ్యకు అనుగుణంగా మంచాలు కరువయ్యాయి. బుధవారం గాంధీఆస్పత్రిలో ఓ రోగికి నేలపై పరుపు (ఫ్లోర్ బెడ్) వేసి వైద్యం అందిస్తున్న దృశ్యం విష జ్వరాల తీవ్రతకు అద్దం పట్టింది. – గాంధీఆస్పత్రి



మర్రి రాజశేఖర్‌రెడ్డి విద్యాసంస్థలకు మళ్లీ నోటీసులు

- ఈ నెల 24న నోటీసు... 30వ తేదీలోగా తొలగించుకోవాలి
- లేనిపక్షంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరిక

దుండిగల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డికి చెందిన విద్యాసంస్థలకు అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలంటూ ఆ నోటీసులో పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌లో మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. కళాశాల వెనుక చెన్నదామర చెరువు ఉంది. చిన్నదామర చెరువు మొత్తం 78.39 ఎకరాల్లో విస్తరించి ఉండగా, అందులో 8.24 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్వయంగా చెరువును పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఈ ఏడాది మార్చి 7వ తేదీన మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. వందల సంఖ్యలో విద్యార్థులు అడ్డుకోవడంతో అధికారులు పాక్షికంగా కూల్చివేశారు. అనంతరం కళాశాల యాజమాన్యం కూల్చివేతను ఆపాలని హైకోర్టును ఆశ్రయించడంతో అధికారులు వెనుదిరిగారు.

మరోసారి నోటీసులు

ఈ ఏడాది ఫిబ్రవరి 26న, మార్చి 1వ తేదీన మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నెల 24న రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తూ తొలగింపులకు వారం రోజులు గడువు ఇచ్చారు. 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. మొత్తం 8.24 ఎకరాల్లో ఉన్న నిర్మాణాలను తొలగించుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సర్వే నంబరు 489లో ఉన్న ఎకరా స్థలంలో రెండు శాశ్వత భవనాలు, 485, 488, 484లో రెండు ఎకరాల్లో ఉన్న శాశ్వత షెడ్లు, 492, 489లలో మూడు ఎకరాల్లో ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్, 2.24 ఎకరాల్లో వేసిన కళాశాల రోడ్లను తొలగించాలని లేని పక్షంలో ఆక్రమణలను కూల్చివేస్తామని అధికారులు పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో : హైదరాబాద్‌లో ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడుతూ అన్ని వర్గాలు తమ పండులు నిర్వహించుకోవాలని ఇందులో సెంట్రల్ పీస్, వెల్ఫేర్ కమిటీలు తమ వంతు పాత్ర పోషిస్తూ పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గణేష్ చవిత, మిలాద్ ఉన్ నబి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయా కమిటీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిటీ సభ్యులు నగరంలో ప్రశాంతమైన వాతావారణం ఉండే విధంగా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. హైదరాబాద్ నగర ఖ్యాతిని కాపాడుతూ పండుగలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, డీసీపీలు చైతన్యకుమార్, స్నేహా మెహర ఆయా కమిటీలకు చెందిన జోనల్ ప్రధాన కార్యదర్శులు కమిటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

రోడ్లపై నీరు నిలవకుండా

చర్యలు తీసుకోండి



అధికారుల సమావేశంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: సాధారణ వర్షపాతానికి రోడ్లపై నీరు నిలువకుండా వర్షపు నీరు వెళ్లే మార్గాలను క్లియర్ చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీసీహాల్‌లో జిల్లా రహదారి భద్రత సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కలిసి మాట్లాడారు. రోడ్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోడ్లు, ట్రాఫిక్, మున్సిపాలిటి, ఆర్‌అండ్ బీ, ఎన్ హెచ్ సంబంధిత అధికారులు ప్రమాద స్థలాలను గుర్తించి జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు సరైన ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 19యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని ట్రాఫిక్ ఏసీపీ తెలుపగా, వాటికి తీసుకోవలసిన చర్యలను కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమైన అధిక స్పీడు, ఇరుకైనరోడ్లు, ట్రాఫిక్ జామ్ వంటి అంశాల పై చర్చించారు. జిల్లా రహదారి భద్రత అనే అంశంపై పాఠశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి క్యాంపెయిన్లు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాపిక్ రాచకొండ ఇన్‌స్పెక్టర ప్రదీప్ బాలు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగులకు అవకాశాలు కల్పించాలి

జాతీయ ఎస్టీ కమిషన్‌న్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్



సాక్షి,సిటీబ్యూరో: ఎక్సైజ్‌శాఖలో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగులకు అన్ని స్థాయిల్లో అవసరమైన పదోన్నతులు, ఇతర సౌకర్యాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఉన్నతాధికారులకు సూచించారు. బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఎస్టీ ఉద్యోగులకు అందుతున్న సౌకర్యాలపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ , ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి, తోపాటు ఇతర అధికారులు పాల్గన్నారు. ఎక్సైజ్‌శాఖలో పని చేస్తున్న ఉద్యోగులతో ముందుగా ఎస్టీ కమిషన్ సభ్యులు సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న 336 మంది ఎస్టీ ఉద్యోగుల సమస్యల పలువురు ఉద్యోగులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శిగా వెంకటేశం



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశం

సాక్షి,సిటీబ్యూరో: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి మల్లం వెంకటేశంకు నియామక పత్రాన్ని అందజేశారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్ ఆదేశాల మేరకు ఈ నియమాకాన్ని చేట్టినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బోర్డు తిప్పేసిన ఎడ్యుకేషన్ అకాడమి

పంజగుట్ట: ఓపెన్ డిగ్రీ పూర్తిచేయిస్తానని నమ్మించి లక్ష రూపాయలు తీసుకుని బోర్డు తిప్పేసిన విజేత ఎడ్యుకేషన్ అకాడమిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన బి.మోహన్ రెడ్డి తన కొడుకు డిగ్రీ పూర్తిచేయించేందుకు అమీర్‌పేటకు చెందిన విజేత ఎడ్యుకేషన్ అకాడమీ సంస్థను సంప్రదించాడు. సంస్థ నిర్వాహకుడు సుధాకర్ రెడ్డి అలియాస్ సునీల్ కుమార్ రెడ్డి అలియాస్ సురేష్ కుమార్ (55)ను కలిసిన మోహన్ రెడ్డి తన కొడుకుకు డిగ్రీ పూర్తిచేయించాలని కోరాడు. తాము ఓపెన్ డిగ్రీ చేయిస్తామని, పరీక్ష సెంటర్ కూడా తమకు అనుకూలంగా ఉన్నచోట వేయించి డిగ్రీ పాస్ చేయిస్తామని అందుకోసం లక్ష రూపాయలు చెల్లించాలని కోరాడు. దీనికి అంగీకరించిన మోహన్ రెడ్డి ఫోన్‌పే ద్వారా లక్ష రూపాయలు చెల్లించాడు. అడ్మిషన్ కోసం అకాడమిని సంప్రదించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అమీర్‌పేట సంస్థ కార్యాలయం వద్దకు వచ్చి ఆరా తీయగా సంస్థ బోర్డు తిప్పేసినట్లు గమనించాడు. దీంతో బుధవారం పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



సాయిసాత్విక్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: ద్విచక్రవాహనంపై తండ్రితో పాటు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో కుమారుడు (14)మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మేడ్చల్ పట్టణంలో నివాసం ఉండే బురుగు రవీందర్ మంగళవారం రాత్రి కండ్లకోయలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరగే ఫంక్షన్‌కు కుమారుడు సాయి సాత్విక్(14) తో కలిసి రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద వారి ద్విచక్ర వాహనాన్ని వెనుకనుండి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాయిసాత్విక్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. రవీందర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతను సహించలేని ఎంఐఎం

బీజేపీ నేత మాధవీలత



సాక్షి, సిటీబ్యూరో: హిందూ, ముస్లింలు స్నేహపూర్వక వాతావరణంలో మెలిగితే ఎంఐఎం రజాకార్లు సహించలేకపోతున్నారని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ఆరోపించారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకృష్ణాష్టమి రోజు రాత్రి 11.30 గంటల సమయంలో చాంద్రాయణగుట్ట వైపు నుంచి 20 బండ్ల మీద ఎంఐఎం దుండగులు వచ్చి రక్షాపురం సమీపంలోని భూలక్ష్మి, నల్లపోచమ్మ వార్ల విగ్రహాలు ధ్వంసం చేశారన్నారు. పెద్ద బండరాయితో తాళం పగలగొట్టి అమ్మవారి విగ్రహాలను ధ్వంసం చేసి వెళ్లిపోయే వాళ్లకు హోంగార్డు(డ్రైవర్) సహకరించాడని తెలిపారు. దుండగులను సురక్షితంగా అక్కడి నుంచి తరలించారన్నారు. ఎంఐఎం వాళ్ల దురాగతాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ముస్లింలు, హిందువులు స్నేహంగా ఉంటే ఎంఐఎం రజాకార్లు భరించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా ప్రాజెక్టు రూపంలో అన్యాయంగా ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుంటుంటే ఎంఐఎం అధినేత తన పవర్ చూపించాలని అనుకుంటున్నాడని అన్నారు. హిందువులు అడుగు పెట్టకున్నా.. పేద ముస్లింలకు చెందాల్సిన వక్ఫ్ భూములు ఎక్కడికి పోతున్నాయో ఆలోచించాలని అన్నారు. ముస్లింలు బాగుపడటం ఎంఐఎంకు ఇష్టం లేదన్నారు. ఎంఐఎం అధినేత తండ్రి హిమాయత్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉండేవారు. ఇప్పుడు ఇంత ఆస్తి ఎలా వచ్చిందని ప్రశ్నించారు.

ఆశ చూపి.. మోసం చేసి..

- అధిక వడ్డీ పేరుతో డిపాజిట్ల సేకరణ
- ఆమకాన్ డెవలపర్స్ యజమాని అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ ఆశ చూపించి, సామాన్యుల నుంచి డిపాజిట్లు సేకరించిన ఆమకాన్ డెవలపర్స్ యజమానులను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. గోపన్ పల్లికి చెందిన జుల్లపల్లి చంద్రశేఖర్ దంపతులు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. భార్యాభర్తలు శేరిలింగంపల్లిలో ఆమకాన్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించారు. చేవెళ్ల గ్రామంలో కంపెనీకి 33 గుంటల భూమి ఉందని, రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం పక్కనే ఉన్న భూములను సేకరించే పనిలో ఉన్నామని వినియోగదారులను ప్రలోభపెట్టారు. త్వరలోనే విల్లా లేఅవుట్ రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీని ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేశారు. ఈ బై బ్యాక్ స్కీమ్ లో పెట్టుబడి పెడితే 13 నెలల స్వల్ప వ్యవధిలో పెట్టుబడిపై 55 శాతం అధిక వడ్డీని అందిస్తామని నమ్మించారు. ప్రతిగా పెట్టుబడి పెట్టిన వారికి చేవెళ్లలోని భూమిని పూచీకత్తుగా రిజిస్టర్ చేస్తామని హామీ ఇచ్చారు. వీరి మాటలను విశ్వసించిన చక్కా సుధీర్, ప్రణయ్, వైదేహిలు రూ.1.28 కోట్లు డిపాజిట్లు చేశారు. దీంతో ఆయా కస్టమర్లతో ఎలాంటి సర్వే నంబర్‌ను పేర్కొనకుండా, పెట్టిన పెట్టుబడులను నమోదు చేయకుండా చట్టరీత్యా చెల్లుబాటుకాని ఒప్పందం చేసుకున్నారు. నెలలు గడిచినా ప్రాజెక్ట్ ను ప్రారంభించకపోగా డిపాజిట్లపై వడ్డీ చెల్లించకుండా మోసం చేశారు. దీంతో ముగ్గురు బాధితులు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో చంద్ర శేఖర్, సునీతలను అరెస్టు చేశారు. కంపెనీ ప్రతినిధి శశి కాంత్ పరారీలో ఉన్నాడు. నిందితులపై ఇప్పటికే చైతన్యపురి ఠాణాలో మూడు కేసులున్నాయి.

గాజులరామారంలో కాల్పుల కలకలం



నరేష్

జీడిమెట్ల: గాజులరామారంలో మంగళవారం అర్ధరాత్రి తుపాకి పేలిన శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కపడ్డారు.. ఈసంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో కలకలంరేపింది. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపిన మేరకు.. గాజులరామారంలో ఎల్ఎస్‌బార్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ముగురు వ్యక్తులు గౌతమ్, పూర్ణిమ, అజయ్, బార్ ముందు ఉన్న ఓ ద్విచక్ర వాహనం నుండి పెట్రోల్ తీస్తున్నారు. గమనించిన బార్ క్యాషియర్ అఖిలేష్ వారిని నిలదీశాడు. దీంతో వారి మధ్య తీవ్రమైన వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో పెట్రోల్ తీసే ఇద్దరు వ్యక్తులు వారి స్నేహితులను అక్కడకు పిలిపించారు. ఓ కారులో కొంతమంది రాగా కారులోంచి దిగిన నరేష్ అనే వ్యక్తి తుపాకితో గాలిలోకి కాల్పులు జరిపి వారిని బెదిరించాడు. దీంతో అఖిలేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులు నరేష్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు కొంతమంది యువకులను అదుపులోకి తీసుకున్నారు.

నిందితులేరీ?

- జైలులో ఉన్నవాళ్లను కూడా విచారణకు తీసుకురారా?
- పోలీసులను ప్రశ్నించిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు : బయట ఉన్న నిందితులను ఇప్పటివరకు పట్టుకోలేదు.. వారిని కోర్టులో ప్రవేశపెట్టలేదు. మరి జైలులో ఉన్న నిందితులను ఎందుకు కోర్టుకు తీసుకురాలేదని పోలీసులను ధర్మాసనం ప్రశ్నించింది. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ బుధవారం నాంపల్లి క్రిమినల్ కోర్టులోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు పోలీసులు నలుగురిని అరెస్ట్ చేయగా ఇటీవల భుజంగరావు గుండె సంబంధిత చికిత్స నేపథ్యంలో 15 రోజుల మధ్యంతర బెయిల్‌పై బయటికి వచ్చారు. అయితే ఇంకా ముగ్గురు నిందితులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు చంచల్‌గుడ సెంట్రల్ జైల్‌లో ఉన్నారు. అయితే కేసు విచారణ ఉన్నపుడు జైలులో ఉన్న నిందితులను తీసుకురావడానికి ఇబ్బందేంటి అని న్యాయమూర్తి పోలీసులను ప్రశ్నించారు. వారిని ప్రవేశపెట్టకపోవడానికి కారణాలు చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరెమైనా ఇతర దేశాలనుంచి తీసుకువస్తున్నారా? పక్కనే పెట్టుకొని తీసుకురాకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. వచ్చే వాయిదాకు తప్పనిసరిగా నిందితులను కచ్చితంగా కోర్టులో హాజరుపర్చాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఇతర దేశంలో తలదాచుకున్న ప్రధాన నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌ను ఎప్పుడు తీసుకొస్తారని ప్రభుత్వం తరపు న్యాయవాదిని న్యాయస్థానం అడిగింది. విచారణ వేగవంతం చేసి త్వరగా వారిని పట్టుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జైల్‌లో ఉన్న నిందితుల జ్యూడీషియల్ కస్టడీని సెప్టెంబర్ 9 వరకు పొడిగిస్తూ అదేరోజుకు తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్



రాంనగర్ మణెమ్మ గల్లీలో వర్షపునీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ముషీరాబాద్: రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో వర్షపు నీటి నాలాపై ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రాంనగర్ మణెమ్మ గల్లీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ గల్లీలో వర్షపు నీటి నాలా అక్రమణలపై రోడ్డు అక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన స్పందించి బుధవారం సాయంత్రం రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మణెమ్మ గల్లీని సందర్శించారు. రోడ్డుకు సంబంధించిన రికార్డులు పరిశీలించి ఎమైనా అక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసీపీ దేవేందర్‌ను ఆదేశించారు.

ట్రా'ఫికర్'కు చెక్ పెట్టేలా..

కమిటీని నియమించిన కమిషనర్ ఆమ్రపాలి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎన్ని ఫ్లై ఓవర్లు నిర్మించినా, రహదారులు విస్తరిస్తున్నా ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. పెరుగుతున్న జనాభాకు, అందుబాటులోకి వస్తున్న సదుపాయాలకు పొంతన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో రియల్ టైమ్ ట్రాఫిక్‌ను శాస్త్రీయంగా అధ్యయనం చేసి మెరుగైన ట్రాఫిక్ నిర్వహణతో మొబిలిటీ పెంచే కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఇందుకుగాను 'ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ అండ్ రోడ్ మేనేజ్‌మెంట్ కమిటీ' పేరిట కొత్తగా ఓ కమిటీని కమిషనర్ ఆమ్రపాలి నియమించారు. ఈ కమిటీ కన్వీనర్‌గా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్, ఐటీ) , సభ్యులుగా జీహెచ్‌ఎంసీ ఈఎన్‌సీ, హుమ్టా ఎండీ, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌లను నియమించారు.

కమిటీ ఏం చేస్తుందంటే..

- నగరంలో రియల్‌టైమ్ ట్రాఫిక్‌ను శాస్త్రీయంగా అధ్యయనం చేయడంతో పాటు చిక్కులు లేని సాఫీ ప్రయాణానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కమిటీ సూచిస్తుంది. అభివృద్ధిలో భాగంగా నగరంలో కొత్తగా జరిగే నిర్మాణాలు, కొత్త విధాన నిర్ణయాలు వల్ల పెరగబోయే ట్రాఫిక్‌ను అంచనా వేసేందుకు ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేస్తుంది. ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌తో ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించేందుకు తగిన పార్కింగ్ పాలసీని కూడా ఈ కమిటీ రూపొందించాల్సి ఉంటుంది.
- పార్కింగ్ ఇబ్బందులెక్కువగా ఉన్న ప్రాంతాల్ని గుర్తించడంతోపాటు ఆన్ స్ట్రీట్, ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్‌ల నియంత్రణ, స్మార్ట్ పార్కింగ్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అధ్యయనానికి ఆధునిక సాంకేతికతతో కూడిన ఉపకరణాలు తదితరమైనవి వినియోగించుకుంటుంది. డేటా అనలిటిక్స్, రియల్‌టైమ్ ట్రాకింగ్ తదితరాల ద్వారా ట్రాఫిక్ సమస్యలపై కూలంకషంగా అధ్యయనం చేసి వాటికి మెరుగైన పరిష్కారాలు సూచించడంతో పాటు వాటిని అమలు చేసేందుకు ఏజెన్సీలను ఎంపిక చేస్తుంది. పర్యవేక్షణ పనులు కూడా నిర్వహిస్తుంది.

మరో మూడు కమిటీలు

ఈ కమిటీతో పాటు మరో మూడు కమిటీలను కూడా ఆమ్రపాలి నియమించారు. అవి..

స్మార్ట్ పోల్స్ కమిటీ

ఈ కమిటీ కన్వీనర్‌గా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ (అడ్వర్టయిజ్‌మెంట్)ను ఇద్దరు సభ్యులుగా ఐటీ, ఎలక్ట్రికల్ అడిషనల్ కమిషనర్లను నియమించారు.

స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్ట్ కోసం

స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్ట్ కోసం ట్రాఫిక్, ఎలక్ట్రికల్ విభాగాల అడిషనల్ కమిషనర్లు, ఘనవ్యర్థాల నిర్వహణ సీఈ సభ్యులుగా ముగ్గురితో కమిటీని నియమించారు. ఈ రెండు కమిటీలు టెండర్లు తదితర పనులు నిర్వహిస్తాయి.

స్ట్రీట్ వెండర్ పాలసీ కోసం

స్ట్రీట్ వెండర్ పాలసీ పకడ్బందీగా అమలు చేసేందుకు మరో కమిటీని నియమించారు. ఈ కమిటీ కన్వీనర్‌గా జీహెచ్‌ఎంసీ యూసీడీ అడిషనల్ కమిషనర్‌ను, సభ్యులుగా ఎస్టేట్స్ అడిషనల్ కమిషనర్, హుమ్టా ఎండీ, జీహెచ్‌ఎంసీ సీసీపీలను నియమించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు అరికట్టొచ్చు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్‌ల ఆదేశాల మేరకు బుధవారం రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శంకర్‌రాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భావిభారత పౌరులు చిన్ననాటి నుంచే రోడ్డు సేఫ్టీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాజాగా బేగంపేట ఫ్లైఓవర్‌పై హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తూ పిలియన్ రైడర్ మరణించిన విషయాన్ని గుర్తు చేస్తూ తప్పనిసరిగా బైక్‌పై వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 129 ప్రకారం నాలుగు సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ మోటార్ సైకిల్‌పై ప్రయాణం చేసేటప్పుడు బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా రక్షిత శిరస్త్రాణం ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, అది చట్టరీత్యా నేరమని తెలిపారు. అలా వాహనాలు నడిపితే తల్లిదండ్రులు, వాహన యజమానికి జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణ శ్రీ, సిబ్బంది లత, సురేందర్, గీత, అబ్దుల్ మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ విషయంలో కొందరు నియమ, నిబంధనలు తప్పడం వారికి పరిపాటిగా మారింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిందే మొదలు తొందరగా వెళ్లాలనే కారణం ఒకటైతే.. ఏమౌతుందిలేననే నిర్లక్ష్యంతో సిగ్నల్ జంపింగ్‌లు, ట్రిపుల్ రైడింగ్‌లతో దూసుకుపోతున్నారు. వీరికి ట్రాఫిక్ పోలీసులు జరిమానాలతోపాటు కేసులు కూడా నమోదు చేసినా ఎటువంటి మార్పు రావడం లేదు. పోలీసులు ఉన్నతాధికారులు సైతం వీరిలో మార్పు తీసుకురావాలని కౌన్సెలింగ్‌లు సైతం ఇస్తున్నా జరిమానాల సంఖ్య పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. దీంతో వీరిలో మార్పు ఎలా తీసుకురావాలో తెలియక ట్రాఫిక్ పోలీసులు తలలు పట్టుకుంటున్నారు..



ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిగ్నల్ జంపింగ్.. ట్రిపుల్ రైడింగ్..!

నిబంధనలు ఉల్లంఘించి దూసుకుపోతున్న వాహనదారులు

- జరిమానాలు విధిస్తున్నా కానరాని మార్పు
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు
- పెరుగుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనులు



బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ దూసుకుపోతున్న ద్విచక్ర వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించడంతోపాటు కొన్ని సందర్భాల్లో కేసులు కూడా నమోదు చేస్తున్నా ఎటువంటి మార్పు మాత్రం రావడం లేదు. ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల వాహనాల తనిఖీలు చేపడుతూ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. కొన్నిసార్లు వాహనాలను కూడా సీజ్ చేస్తున్నారు. మార్పు కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా కొందరు మళ్ళీ మళ్ళీ పట్టుబడుతున్నారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి జులై 31వ తేదీ వరకు సిగ్నల్ జంపింగ్ చేసిన వారు 8165 మంది ఉండగా, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడ్డ వాహనదారులు 12790 మంది ఉన్నారు. వీరందరికీ ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తూ అంతకముందు నిబంధనల ఉల్లంఘనల కింద బకాయిపడ్డ డబ్బులను ముక్కుపిండి వసూలు చేయిస్తున్నారు. అయినా సరే వాహనదారుల్లో మార్పు రావడం లేదు. 3, 4 సార్లు కూడా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పట్టుబడ్డ ద్విచక్ర వాహనదారులు వేలల్లో ఉంటున్నారు. త్వరగా గమ్యస్థానానికి చేరుకోవాలన్న ఆతృత కొందరిదైతే, స్టైల్ కోసం మరికొందరు, అందరినీ ఆకర్షించాలనే ఉద్దేశంతో ఇంకొంత మంది యువకులు సిగ్నల్ జంపింగ్ చేస్తూ ట్రిపుల్ రైడింగ్ చేస్తూ రయ్..రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. దీంతో చాలా చోట్ల రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమవుతున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ట్రాఫిక్ పోలీసులు వీరిని ఏమీ అనలేని పరిస్థితి నెలకొనడంతో ఇదే అదునుగా యువకులు నిబంధనలు ఉల్లంఘిస్తూ రెచ్చిపోతున్నారు. దీంతో తరచూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి సంఖ్య ప్రతియేటా పెరిగిపోతోంది. వీరికి ప్రవర్తన మార్చుకోవాలని కౌన్సెలింగ్ నిర్వహించినా ఉపయోగం ఫలితం లేకుండా పోతోంది.

నిబంధనల ఉల్లంఘన ఇలా..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	సిగ్నల్ జంపింగ్	ట్రిపుల్ రైడింగ్
పంజగుట్ట	1604	3,000
ఎస్ఆర్‌నగర్	3537	4540
జూబ్లీహిల్స్	662	2098
బంజారాహిల్స్	2222	3152

రాజకీయ పార్టీలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ ప్రశాంతి

బంజారాహిల్స్: స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) 2024–25లో భాగంగా ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారిణి, సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు. నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆమె సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కోసం ఇంటింటి సర్వే ప్రారంభమైందన్నారు. బీఎల్ఓలు ఓటరు జాబితాతో ప్రతి ఇంటికీ వెళ్తారన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా పూర్తి సహకారం అందించాలని సూచించారు. సందేశాలు ఉంటే తమ వద్ద నివృత్తి చేసుకోవాలన్నారు. నేతల సందేహాలను కూడా ఈ సందర్భంగా ఆమె నివృత్తి చేశారు.

గార్బేజ్ సేకరణను పరిశీలించిన కేంద్ర బృందం



డోర్ టు డోర్ చెత్త సేకరణను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ సంజయ్‌గుప్తా

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ పరిధిలో ఇంటింటికీ స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరిగే తీరును మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ సంజయ్‌గుప్తా పరిశీలించారు. బుధవారం జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని ప్రశాసన్‌నగర్ కాలనీలో ఆయన ఇంటింటికీ చెత్త సేకరణను పరిశీలించిన అనంతరం తీసుకువెళ్లే విధానం, ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండి చెత్తను ఇస్తారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ చేస్తున్న వివిధ అంశాలను పరిశీలించడానికి ఈ బృందం నగరానికి వచ్చి ప్రశాసన్‌నగర్‌లో డోర్ టు డోర్ స్వచ్ఛ ఆటో గార్బేజ్ కలెక్షన్‌ను అడిగి తెలుసుకుంది. ప్రయోగాత్మకంగా ఈ బృందం సర్కిల్–18 పరిధిలో పర్యటించగా, డీఎంసీ ప్రశాంతి ఇందుకు సంబంధించిన వివరాలను అధికారులకు వివరించారు.

స్వామివారికి పంచామృతాలతో అభిషేకం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్‌కు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు



అవార్డును అందుకుంటున్న టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: ఇంటర్నేషనల్ అడ్వర్టయిజింగ్ అసోసియేషన్ (ఐఏఏ) ఇండియన్ మార్కెటింగ్ అవార్డ్స్ (ఐఎంఏ)–2024లలో టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులను గెలుచుకుంది. ఆటిజంపై చేపట్టిన క్యాంపెయిన్‌కు గాను ఈ ఏజెన్సీకి ఐఏఏ అవార్డు లభించింది. ఆటిజంతో బాధపడిన అల్బర్ట్ ఐన్‌స్టీన్, ఛార్లెస్ డార్విన్, లియోనార్డో డావిన్సీ లాంటి మేధావుల గురించి చాటిచెబుతూ ఈ సంస్థ యాడ్ క్యాంపెయిన్ నిర్వహించింది. పలువురు పరిశ్రమ ప్రముఖులు సభ్యులుగా ఉన్న ఐఏఏ జ్యూరీకి హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సీఈఓ, ఎండీ రోహిత్ జవా చైర్మన్‌గా వ్యవహరించారు. ఐఎంఏ అవార్డుల విషయంలోనూ టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ ఇదే జోరును కొనసాగించింది. హైదరాబాద్‌లో సత్య లేక్ రిడ్జ్ లాంచ్‌కుగాను గోల్డ్ అవార్డును, ఆదర్శ్ గ్రూప్ (బెంగళూరు)కు సంబంధించిన టీవీసీకి గాను సిల్వర్ అవార్డును గెలుచుకుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎండీ తురబ్ లక్డావాలా మాట్లాడుతూ తమ సృజనాత్మక శక్తిసామర్థ్యాలకు ఈ అవార్డులే నిదర్శనమన్నారు. పనిలో ఉన్నత ప్రమాణాలకు మాత్రమే కాకుండా సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఆటిజంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్యాంపెయిన్ తోడ్పడిందన్నారు.

4 నుంచి నోవాటెల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హైలైఫ్ లైఫ్‌స్టైల్ లగ్జరీ ఎగ్జిబిషన్‌ను సెప్టెంబర్ 4 నుంచి హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో హైలైఫ్ ఎగ్జిబిషన్ సన్నాహక కార్యక్రమ బ్రోచర్‌ను పలువురు మోడల్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో డిజైనర్లు రూపొందించిన డిజైనరీ దుస్తులతో పాటు ఆభరణాలను ధరించి మోడల్స్ హొయలు పోయారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఉత్పత్తులతో పాటు వెడ్డింగ్, ఫెస్టివల్ కలెక్షన్స్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు ఈ ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు.

చెక్కుల పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ పథకాల విషయంలో సంబంధంలేని చోట చెక్కులను పంపిణీ చేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. బుధవారం గణపతి కాంప్లెక్స్ నవోదయకాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రోటోకాల్ పాటించకుండా చెక్కుల పంపిణీలు మండల కార్యాలయాల్లో జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గం గురించి పూర్తిగా అవగాహనలేని కొందరు తప్పుదోవ పట్టిస్తూ, నియోజకవర్గానికి సంబంధం లేనిచోట చెక్కులను పంపిణీ చేస్తున్నారని, దీంతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. చెక్కుల పంపిణీ విషయంలో కూడా అవినీతి జరుగుతుందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నేరుగా వినియోగదారులకు లేకుంటే డివిజన్లవారీగా ఆయా ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి వారికి కానుకలతో చెక్కులకు అందించామని గుర్తు చేశారు. రెండు డివిజన్లలో మాత్రమే గంగరగోళం నెలకొందన్నారు. ప్రజల ఇబ్బందులకు గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై కలెక్టర్, స్పీకర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్‌గౌడ్, దేదీప్య, సంజీవ, విజయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



చెక్కులను అందిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఖైరతాబాద్ మండల కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బండపల్లి భవానీశంకర్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మనోజ్‌యాదవ్, అరుణ్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

నియామకాలు



నియామకపత్రాలను అందజేసుస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

శ్రీనగర్‌కాలనీ: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి జూబ్లీహిల్స్ నియోజకవర్గం డివిజన్ల నుంచి కన్వీనర్‌లు, కో కన్వీనర్లను ఉత్సవ కమిటీ నేతలు బంగారు ప్రశాంత్, క్రిష్ణమోహన్, రవియాదవ్‌లు బుధవారం నియమించారు. రహమత్‌నగర్ నుంచి కన్వీనర్‌గా విశాల్‌సింగ్, కో కన్వీనర్‌లుగా లక్కు మహేష్, అత్తిలి గోపాల్, వెంగళరావునగర్ నుంచి కన్వీనర్‌గా శివకుమార్, కో కన్వీనర్‌లుగా మురళీకృష్ణ, నరేష్, ఎర్రగడ్డ నుంచి కన్వీనర్‌గా గణేష్, కో కన్వీనర్‌లుగా రాజు, విజయ్, బోరబండ నుంచి కన్వీనర్‌గా సురేష్‌గౌడ్, కో కన్వీనర్‌లుగా భాస్కర్, సతీష్, షేక్‌పేట నుంచి కన్వీనర్‌గా పవన్, కో కన్వీనర్‌గా సాయి, విశాల్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేయాలని సూచించారు.

వేడుకగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని ఉదయ్‌నగర్ బస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. వేద మంత్రోచ్ఛరణలు, డప్పు చప్పుళ్ల నడుమ బస్తీకి నలువైపులా దారులను మూసివేసి బస్తీవాసులు ఉదయం 8 గంటల 11 నిమిషాలకు బొడ్రాయిని ప్రతిష్ఠించారు. అనంతరం హోమం, అర్చనలు నిర్వహించారు. వేడుకగా నిర్వహించిన కుంకుమార్చన వేడుకల్లో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నేతలు లోకరాజు, శంకర్, రవికుమార్, కొంపల్లి శేఖర్, ప్రేమ్ వైరల్, నజీర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా వేడుకల్లో భాగంగా గురువారం బస్తీవాసులు బొడ్రాయికి సామూహిక బోనాలు సమర్పిస్తారని ఉత్సవ కమిటీ నేతలు తెలిపారు.

క్రైం కార్నర్..

బస్సులో ల్యాప్‌టాప్స్ మాయం

వెంగళరావునగర్: బస్సులో ఉంచిన ల్యాప్‌టాప్స్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నానక్‌రామ్‌గూడలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న లోకేష్ ఈనెల 27వ తేదీ రాత్రి జగ్గయ్యపేటలో తన లగేజీని తీసుకుని ఇంద్రబస్సును ఎక్కాడు. ఎస్ఆర్‌నగర్‌లో ఉదయం బస్సు దిగుతూ తన లగేజీ కోసం చూసుకోగా ల్యాప్‌టాప్స్ ఉన్న బ్యాగు కనిపించలేదు. ఆ బాగులో రెండు ల్యాప్‌టాప్స్, చార్జర్లు, ఫోన్‌తోపాటు దాదాపు రూ.లక్ష విలువైన వస్తువులు మాయమైనట్లు గుర్తించాడు. అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో నలుగురు నిందితుల అరెస్టు

పంజగుట్ట: ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన నలుగురు నిందితులను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చాంద్రాయణగుట్టకు చెందిన షేక్ జావేద్ చాక్లెట్స్, బిస్కెట్ల తయారీ చేస్తుంటాడు. ఇతనికి మహారాష్ట్రకు చెందిన ఆరీఫ్ ఇనామ్దార్‌తో వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. మహారాష్ట్రకు చాక్లెట్లు, బిస్కెట్లు సప్లై చేసేందుకు జావెద్‌కు రూ. 50వేల నగదును ఆరీఫ్ చెల్లించాడు, కానీ డబ్బులు తన ఖాతాలోకి రాలేవంటూ జావెద్ డెలివరీ ఇవ్వలేదు. ఇదే విషయం చర్చిద్దామని ఈ నెల 26వ తేదీన అమీర్‌పేట పిల్లర్ నెంబర్ 1067 వద్దకు రావాలని చెప్పడంతో జావెద్ తన బావమర్దిని తీసుకుని అక్కడకు వెళ్లాడు. అప్పటికే అక్కడ తన స్నేహితులైన మహారాష్ట్రకు చెందిన అబ్దుల్ హఫీజ్ (29), ఫక్రుద్దీన్ (23), అజరుద్దీన్ (29)లతో ఆరీఫ్ కారులో వేచి ఉన్నాడు. జావేద్ అక్కడకు రాగానే అతని బావమర్దిని పక్కకుతోసేసి జావేద్‌ను కారులో ఎక్కించుకుని అక్కడ నుంచి పరారయ్యారు. జావేద్ భార్య నేహా నిశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పంజగుట్ట పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నలుగురు నిందితులను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఇన్‌స్టాగ్రాంలో యువతికి వేధింపులు

వెంగళరావునగర్: ఇన్‌స్టాగ్రాంలో ఫ్రెండ్ రిక్వెస్ట్ అనుమతించినందుకు తనను వేధిస్తున్నాడంటూ ఓ యువతి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... నానాక్‌రామ్‌గూడ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించే యువతి స్థానిక మధురానగర్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. మే నెలలో తన ఇన్‌స్టాగ్రాంకు రచ్చ–రచన పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అందులో పరిశీలించగా తన స్నేహితులు కూడా కొంత మంది ఉండటంతో ఆమె కూడా అంగీకరించింది. దీంతో ఒకరోజు చాట్ చేస్తూ ఎవరు నువ్వని ఆమె ప్రశ్నించగా తాను కూడా అదే సంస్థలో పని చేస్తున్నట్టుగా సమాధానం వచ్చింది. అనంతరం ట్రైనీగా వస్తున్నానని చెప్పడంతో అనుమానం కలిగి దానిని బ్లాక్ చేసింది. అప్పటికే ఆమె ఫొటోలను తీసుకున్న అవతలి వ్యక్తి ఫొటోలను మార్ఫింగ్ చేసి తన ఇన్‌స్టాగ్రాంలో అప్‌లోడ్ చేశాడు. ఈ విషయాన్ని ఆమె స్నేహితులు తెలియజేశారు. దీంతో బుధవారం ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సంబంధం లేని కేసుల్లో ఇరికించాలని పోలీసుల కుట్ర

- ఓ మహిళ ఆవేదన

రహమత్‌నగర్ (బోరబండ): తనకు సంబంధం లేని కేసులను తనపై మోపుతూ రౌడీషీట్ నమోదు చేస్తామని బోరబండ పోలీసులు బెదిరింపులకు గురి చేస్తున్నారని బంజారనగర్ బస్తీకి చెందిన సరళ ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను బెల్ట్ షాపు నిర్వహణను మానేసి దాదాపు 8 నెలలు కావస్తుందని, అయితే బోరబండ పోలీసులు పాత కేసులు తిరగేసి తనపై రౌడీషీట్ తెరుస్తామని వేధిస్తున్నారని ఆమె ఆరోపించింది. కాగా దీనిపై బోరబండ ఎస్‌హెచ్ఓ వీరశేఖర్‌ను వివరణ కోరగా సరళ పై ఇప్పటికే తొమ్మిది కేసులున్నాయన్నారు. కొత్త చట్టం ప్రకారం డ్యూటీలో ఉన్న పోలీసుల ఎప్పుడైనా ఎక్కడైనా తనిఖీలు నిర్వహించవచ్చన్నారు.

సాక్షి
10
హైదరాబాద్, గురువారం, 29, ఆగస్టు, 2024

సిటీ ప్లస్



సెలబ్రిటీలు వ్యాపార రంగంలోకి రావడం కొత్తేమీ కాదు.. కానీ వారి వ్యాపారాలకు హైదరాబాద్ నగరాన్ని వేదిక చేసుకోవడం ఈ మధ్య విరివిగా జరుగుతోంది. నగరంలో బాలీవుడ్ హీరోలు మొదలు మనీష్ మల్హోత్రా వంటి ఫ్యాషన్ ఐకాన్స్ నుంచి ప్రముఖ భారతీయ క్రీడాకారుల వరకూ సొంత వ్యాపారాలను ప్రారంభించిన వారే. విభిన్న సంస్కృతులతో పాటు సామాజికంగా, ఆర్థికంగా అన్ని వర్గాల ప్రజలను సమ్మిళితం చేసేలా నగర జీవనం కొనసాగించడం ఒక కారణం. ఐతే నగరంలో ప్రముఖ ఇండియన్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సైతం సొంతంగా వన్-8 కమ్యూన్ అనే సరికొత్త రెస్ట్రో బార్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ కోహ్లీ ఫేవరెట్ ఫుడ్ మష్రూమ్ గూగ్లీ డిమ్ సమ్ వంటి పసందైన వంటకాలు ఆహార ప్రియులకు నోరూరిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

ఫెమినా మిస్ ఇండియా..! ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో మంది ఫ్యాషన్ ఔత్సాహికుల చిరకాల కోరిక. సౌందర్య రంగంలో అత్యున్నత స్థానమైన ఫెమినా మిస్ ఇండియాగా నిలవాలంటే దేహ సౌందర్యమే కాదు.. ఆత్మ సౌందర్యం, విజ్ఞాన కౌశలం, సేవా తత్పరత అన్నింటికీ మించి ఆత్మస్థైర్యం కూడా ఉండాలంటున్నారు ఫెమినా మిస్ తెలంగాణ ప్రకృతి కంబం. ఈ సారి ఫెమినా మిస్ ఇండియా పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రకృతి కంబం ఎంపికయ్యారు. ఇందులో భాగంగా ముంబై వేదికగా జరిగిన ప్రీ ఫెమినా మిస్ ఇండియా పేజెంట్స్‌లో తన ప్రత్యేకతను చాటుకుని ఫెమినా మిస్ తెలంగాణ-2024గా నిలిచారు. మరి కొద్ది రోజుల్లో జరగనున్న ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో దేశవ్యాప్తంగా పాల్గొనే 30 మంది అందాల ముద్దుగుమ్మల్లో తానూ ఒకరు. ఈ నేపథ్యంలో తన ప్రయాణంలోని అనుభవాలు, అనుభూతులను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

-సాక్షి, సిటీబ్యూరో

డ్రీమ్.. మిస్ ఇండియా!

- రెండు సార్లు మిస్ అయ్యా, ఈ సారి క్రౌన్‌తోనే వస్తా
- ముంబై, బెంగళూరు ప్రీ సెషన్స్‌లో ఫైనల్స్‌కు ఎంపిక
- ఫెమినా మిస్ తెలంగాణగా నిలిచిన ప్రకృతి
- సాక్షి'తో విశేషాలు పంచుకున్న మిస్ తెలంగాణ

ఫైనల్స్‌లో తెలుగమ్మాయి



ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకోవడం నా చిరకాల స్వప్నం. గతంలో జరిగిన సౌందర్య పోటీల్లో పాల్గొని టాప్ 5 స్థానంలో నిలిచి ఆ కిరీటాన్ని అందుకోలేకపోయాను. కానీ ఈ సారి ఫెమినా మిస్ ఇండియా క్రౌన్ గెలిచి హైదరాబాద్ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని దృఢ నిశ్చయంతో ఉన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు దేశం నుంచి ప్రాతినిధ్యం వహించాలన్నా కూడా ఫెమినా మిస్ ఇండియా కిరీటమే ప్రామాణికం. ఫైనలిస్టుగా ఎంపిక చేయడానికి బెంగళూరులో జరిగిన ఆడిషన్స్‌లో ప్రతి రాష్ట్రం నుంచి దాదాపు రెండు వందల మంది ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు. అందులో ఎంపిక చేసిన కొద్ది మందితో ముంబైలో మరో పేజెంట్ నిర్వహించగా.. అందులో ఫెమినా మిస్ తెలంగాణగా నేను నిలవడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

జీవితం నేర్పిన పాఠాలు..

నా జీవితంలో స్వతహాగా ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులు, అడ్డంకులే నన్ను ఈ స్థాయికి చేర్చాయని అనుకుంటాను. ప్రతి సమస్య నుంచీ, ప్రతి సందర్భం నుంచీ జీవిత పాఠాలను నేర్చుకున్నాను. సౌందర్య రంగం అంటే అందంగా ఉంటే సరిపోతుందని అంతా అనుకుంటారు. కానీ.. అందంతో పాటు ఆలోచనలు, అభిరుచులు, సంపూర్ణమైన వ్యక్తిత్వం, సామాజిక బాధ్యత-అవగాహన ఇలా పలు అంశాలను పరిశీలించాకే, పరీక్షించాకే ఆ గౌరవమైన స్థానానికి ఎంపిక చేస్తారు.

మల్టీ క్వీన్..

నాకు 5 భాషల్లో ప్రావీణ్యముంది. ఫ్యాషన్‌తో పాటు త్రోబాల్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, క్యారమ్ వంటి క్రీడల్లో ఛాంపియన్ని. పలు ఈవెంట్లలో ట్రాక్ ఫీల్డ్ అథ్లెట్‌గా విజేతగా నిలిచాను. డ్యాన్స్-కొరియోగ్రఫీలో మంచి ప్రావీణ్యముంది. బాలీవుడ్, జాజ్, బ్యాలే, ఫోక్, సౌత్ స్టైల్స్ ఇలా అన్ని స్టెప్పుల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించగలను. క్విల్లింగ్, పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, మండాల ఆర్ట్స్ వంటి పలు కళల్లో మంచి పట్టు ఉంది. సమర్థవంతమైన అమ్మాయిగా నిలవడంలో ఈ అంశాలన్నీ దోహదపడ్డాయి. ఫ్యాషన్ రంగానికి సంబంధించి గతంలో మిస్ గ్రాండ్ కర్ణాటక, టైమ్స్ ఫ్రెష్ ఫేస్‌తో పాటు పలు పేజెంట్లలో విజేతగా నిలిచాను. యాక్టింగ్ పై మక్కువతో టాలీవుడ్ వేదికగా ఒక సినిమాలో నటించాను. మరికొద్ది రోజుల్లో వెండి తెరపైన విడుదల కానుంది. ఇవన్నీ చేయగలడంలో నా టైమ్ మేనేజ్మెంట్ కీలకపాత్ర పోషిస్తుంది.

25 ఏళ్ల వయసులో..

ఈ పోటీలకు అర్హత వయస్సు 25 ఏళ్లు మాత్రమే.. ఇంత చిన్న వయసులో సామాజికంగా, మానసికంగా, మోడలింగ్‌లో ఉన్నత భావజాలం ఉండాలంటే జీవితాన్ని అంకితం చేయాలి. నడక, నడవడిక, అందం, ఆలోచనలు, డ్రెస్సింగ్, మోడ్రన్ ట్రెండ్స్ ఇలా ప్రతీ విషయంలో ఉన్నతంగా ఉంటేనే ఈ పోటీల్లో రాణించగలం. అక్క దగ్గర మోడలింగ్, అమ్మా-నాన్నల దగ్గర సామాజిక అంశాల పైన అవగాహన పొందాను. బాక్స్ ఆఫ్ స్మైల్ పేరుతో అమ్మా నాన్నలు పేద విద్యార్థులకు చేసే సేవా కార్యక్రమాలు నాలో సామాజిక స్పృహను పెంచాయి.



రెస్ట్రో బార్‌పై కోహ్లీ సిక్స్..

- ఫుడ్ బిజినెస్‌లోకి ఇండియన్ క్రికెటర్
- ఆకట్టుకుంటున్న వింటేజ్ రెస్ట్రో బార్
- అధునాతన జీవనశైలికి అనుగుణంగా
- ఫేజ్ త్రీ పీపుల్ చూపును ఆకర్షిస్తున్న యాంబియన్స్
- సెలబ్ స్పాట్‌గా వన్ 8 కమ్యూన్



విలాసవంతమైన ఆహారం, బ్రేవరేజస్‌తో పాటు, అధునాతన జీవన శైలికి అద్దం పట్టే అద్భుతమైన ఇంటీరియర్ ఫ్యాషన్ లుక్ నేటి రెస్టారెంట్ కల్చర్‌లో భాగమైపోయింది. అయితే నగర వాసుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరినీ ఆకర్షించేందుకు ఎవరికి వారు తమ సొంత స్టైల్లో యునీక్ యాంబియన్స్ కోసం తాపత్రయ పడుతున్నారు. అలాంటి వినూత్న అనుభూతిని అందించటం వన్-8 కమ్యూన్ ప్రత్యేకత.

రిచ్ ఫుడ్.. వింటేజ్ లుక్..

ఇటీవలే హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ నడిబొడ్డున ప్రారంభించిన వన్-8 కమ్యూన్ నగరానికున్న రాజసాన్ని, రిచ్ ఫ్లేవర్‌ను ప్రతిబింబిస్తుంది. ఇందులోని కిచెన్.. పాక ప్రపంచానికి నూతన హంగులు అద్దిందని ఫుడ్ లవర్స్ చెబుతున్నారు. వన్-8 కమ్యూన్ బ్రాండ్ ఎథోస్‌కు కట్టుబడి, రెస్టారెంట్ డిజైన్ అందంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఇక్కడి వింటేజ్ లుక్స్ నగరవాసులను విశేషంగా ఆకర్షిస్తుంది. జుహు, బెంగుళూరు, గుర్గావ్‌లలో ఇప్పటికే ఆదరణ పొందుతున్న ఈ రెస్ట్రో బార్ నగరానికి చేరుకోవడంతో ఫుడ్ లవర్స్‌తో పాటు క్రికెట్ ప్రియులు సైతం ఆసక్తిగా విచ్చేస్తున్నారు. రెస్ట్రో బార్‌లో భాగంగా రిచ్ ఫుడ్ డిషెస్‌తో పాటు బ్రేవరేజస్ అందుబాటులో ఉండటంతో అన్ని వర్గాల వారికీ హాట్ స్పాట్‌గా మారింది.

నగర వేదికగా కోహ్లీ 'వన్ 8 కమ్యూన్' రెస్టారెంట్



కోహ్లీ ఫేవరెట్ ఫుడ్ ఇక్కడే..

ఈ స్పాట్ రాయల్ లుక్ ఇంటీరియర్‌తో పాటు కోహ్లీకి అత్యంత ఇష్టమైన కార్న్ బార్లీ రిసోట్టో, మష్రూమ్ గూగ్లీ డిమ్ సమ్, టార్టేర్ టాప్‌డ్ అవకాడో వంటి పలు వంటకాలను ప్రత్యేకంగా వండి వడ్డిస్తున్నారు. కోహ్లీ అభిమానులు ఈ వంటకాలను రుచి చూడటానికి ప్రత్యేకంగా ఇక్కడికి రావడం విశేషం. స్థానికంగా ఆదరణ పొందుతున్న ఫుడ్ రెసిపీలతో పాటు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన విభిన్న మోడ్రన్ రుచులను తయారు చేస్తున్నారు. అంతే కాకుండా మద్యాన్ని ఇష్టపడే వారికి టలిస్కర్, గ్లెన్‌లివెట్, గ్లెన్ మొరంగే, గ్లెన్ ఫిడిచ్, డ్రాగన్‌మోర్ వంటి విభిన్న టాప్ బ్రాండ్లు కొలువుదీరాయి. ఇవన్నీ దాదాపు పది-పన్నెండేళ్ల సరుకు కావడం విశేషం.



ఎల్లప్పుడూ ఆహారంతో పాటుగా సామాజికంగా ప్రజలందరినీ ఒకచోట చేర్చే స్థలాన్ని సృష్టించడం వన్-8 కమ్యూన్ ప్రధాన లక్ష్యం. స్థానికంగానే కాకుండా దేశ విదేశాలకు చెందిన ప్రముఖ సంస్థలు, వ్యక్తులను ఆహారంతో అనుసంధానం చేసే కేంద్రంగా వన్-8 నిలుస్తుంది. స్థానిక ఫుడ్‌తో పాటు కాంటినెంటల్ ఫుడ్‌ను సైతం హైదరాబాద్ నగరం ఆహ్వానించింది, ఆస్వాదిస్తోంది. ఈ ఆదరణకు మెచ్చే విరాట్ కోహ్లీ ఈ రెస్ట్రో బార్‌ను ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే ఈ నగరం, ప్రజలు సరికొత్త రుచులను ఆస్వాదించాలని ఆశిస్తున్నాను.

-వర్తిక్ తిహారా, వన్-8 కమ్యూన్ కో-ఫౌండర్

సామాజిక, సాంస్కృతిక అనుసంధాన వేదిక..



సెలబ్ స్పాట్...

హైటెక్ సిటీ వేదికగా కొలువుదీరిన ఈ రెస్టారెంట్ నగరంలోని సెలబ్రిటీలకు మంచి స్పాట్‌గా మారింది. దీని ప్రారంభోత్సవాలు ముగియకముందే మంచు మనోజ్ వంటి సినీతారల పుట్టినరోజు వేడుకలు ఇక్కడ నిర్వహించడం మరింత ఆసక్తి పెంచింది. వన్-8 కమ్యూన్‌ను ఇప్పటికే సినీ ప్రముఖులు మంచు లక్ష్మి, నాని, అడివి శేష్, నిఖిల్, తేజ సజ్జ, సుధీర్ బాబు, సందీప్ కిషన్, ఆకాష్ పూరి, అభిరామ్ వంటి టాలీవుడ్ నటులు సందర్శించారు.

సిటీ కాప్స్.. గుడ్ మార్నింగ్ హైదరాబాద్



నగర పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ రేడియో

- హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో కలిసి ఏర్పాటు
- ఇతర ఎఫ్ఎం రేడియోలకు దీటుగా అందుబాటులోకి
- వినోదంతో పాటు వివిధ అంశాలపై అవగాహన
- వెల్లడించిన పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి

'గుడ్ మార్నింగ్ హైదరాబాద్...' త్వరలో నగర పోలీసుల నోటి వెంట ఇలాంటి మాట వినిపించనుంది. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్సీ) కలిసి సిటీ పోలీసు విభాగం ఓ కమ్యూనిటీ రేడియోను ఏర్పాటు చేయనుండటమే దానికి కారణం. ఇతర ఎఫ్ఎం రేడియోలకు దీటుగా, అన్ని హంగులతో త్వరలోనే ఇది అందుబాటులోకి రానుందని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకటించారు.

- సాక్షి, సిటీబ్యూరో

నగర పోలీసు విభాగానికి ఇప్పటి వరకూ సొంతంగా ఎలాంటి రేడియో లేదు. అయితే కొన్నేళ్లుగా వివిధ ఎఫ్ఎం రేడియోలతో పాటు ఇతర మీడియా సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. బోనాలు, గణేష్ ఉత్సవాలు వంటి కీలక ఘట్టాలతో పాటు సున్నితాంశాల పైనా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ వేదికల్ని వాడుకుంటున్నారు. రద్దీ వేళల్లో ట్రాఫిక్ జామ్స్, రద్దీ రోడ్లకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎఫ్ఎం రేడియోలకు అందిస్తున్న ట్రాఫిక్ విభాగం అధికారులు ఆ వివరాలను వారి ద్వారా శ్రోతలకు చేరుస్తున్నారు.

ఇప్పటి వరకూ కేవలం వారికే...

కర్ణాటకలోని బెంగళూరులో ఉన్న పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు అధికారులు 2019 అక్టోబర్‌లో ఓ కమ్యూనిటీ రేడియోను ఏర్పాటు చేశారు. అందులో వినోద భరిత కార్యక్రమాలతో పాటు ఖైదీలకు ఉన్న హక్కులు, పెరోల్ నిబంధనలు తదితరాలను ప్రచారం చేస్తున్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ సెంట్రల్ జైలు అధికారులు సైతం 2021 డిసెంబర్‌లో ఓ రేడియోను ప్రారంభించారు. ఈ రెండూ ఖైదీల ఆధ్వర్యంలో నడిచేవే కావడం గమనార్హం. ఇండియన్ ఆర్మీ సైతం ఉత్తర కాశ్మీర్‌లో తొలి రేడియో స్టేషన్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం బారాముల్లా, ఉరి సెక్టార్లలో రెండింటికి విస్తరించింది.

HYDERABAD CITY POLICE
FOR YOU. WITH YOU. ALWAYS.

వినోదంతో పాటు అవగాహన...

నగర పోలీసు విభాగం ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ రేడియో అందరినీ ఆకట్టుకునేలా ఉండాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు హెచ్‌సీఎస్సీతో కలిసి రూపుదిద్దుతున్నారు. ఈ రేడియోలు పాటలు వంటి వినోదభరిత కార్యక్రమాలకు సమప్రాధాన్యం ఇస్తారు. దీంతో పాటు నగరవాసులకు సమకాలీన అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా ట్రాఫిక్ నిబంధనలు, స్థితిగతులు, రోడ్డు భద్రత అంశాలకు పెద్దపీట వేసేలా తమ కమ్యూనిటీ రేడియో ఉండనుందని కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ రేడియో నిర్వహణ బాధ్యతల్ని హెచ్‌సీఎస్సీ చేపట్టనుంది.



మిక్స్.. ట్రిక్స్..





సాక్షి, సిటీబ్యూరో: పానీయాల 'కలుపు'గోలుతనం కలర్‌ఫుల్.. యువతలోని రుచుల మథనం.. వండర్‌ఫుల్.. అన్నట్టు కాక్‌టైల్స్ మిక్సింగ్‌కు సంబంధించి ప్రముఖ సిరప్ బ్రాండ్ మోనిన్. నగరంలోని గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మోనిన్ కప్ జాతీయ స్థాయి ఫైనల్స్ సాగాయి. మిక్సాలజిస్టులుగా తమ ప్రతిభను ప్రదర్శించటానికి ఫైనలిస్ట్స్‌గా నిలిచిన 15 మంది యువ బార్టెండర్‌లు పోటీపడ్డారు. అహూతుల కేరింతల మధ్య సిరప్‌లు, పండ్ల మిశ్రమాలు, ప్యూరీలు, క్రష్‌లు, సాస్‌లు వినియోగించి మిక్సాలజిస్ట్స్ సృష్టించిన పానీయాలు ఆకట్టుకున్నాయి. గత జులై నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించిన రీజనల్ పోటీల విజేతల నుంచి ఈ ఫైనలిస్ట్స్‌ని ఎంపిక చేశామని, ఈ ఫైనల్స్‌లో గెలిచిన జాతీయ విజేత వచ్చే డిసెంబర్‌లో ఫ్రాన్స్‌లోని బోర్డెస్‌లో జరగనున్న ప్రపంచ పోటీల్లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారని మోనిన్ బ్రాండ్ ఎండీ జర్మన్ అరౌడ్ తెలిపారు.





31న 'తామ్రపాత్ర లైవ్' ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు, శంకరానంద కళాక్షేత్రం సంయుక్తంగా 'తామ్రపాత్ర లైవ్' అన్నమయ్య కవితా సౌందర్యంపై ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శనను ఈ నెల 31న సాయంత్రం ఏడు గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహించనున్నారు. ఈ సాంస్కృతిక వేడుకలో దేశంలోని ఐదుగురు ప్రముఖ నృత్యకారులు ఆనంద శంకర్ జయంత్, అనుపమ కైలాష్, దీపికా రెడ్డి, గోపిక వర్మ, వైభవ్ అరేకర్ తమ నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. భరత నాట్యం, కూచిపూడి, మోహినియాట్టం వంటి శాస్త్రీయ నృత్య శైలిలో ఈ ప్రదర్శన ఉంటుంది. ఈ నృత్యాన్ని తిలకించేందుకు సంగీత, నృత్య ప్రియులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు.

క్లుప్తంగా...

ఎంత జనాభా? ఎన్ని నీళ్లు కావాలి?

- ఇండెంట్ సమర్పించాలన్న కృష్ణా బోర్డు
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు లేఖ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, సాగర్ టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బరాజ్‌ల పరిధిలో నివాసముంటున్న జనాభా ఎంత? ఆ జనాభా తాగునీటి అవసరాలకు ఎన్ని నీళ్లు అవసరమో ఇండెంట్ సమర్పించాలని తెలుగు రాష్ట్రాలను కృష్ణా బోర్డు కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు సభ్యుడు ఆర్‌ఎం శంఖువా తెలంగాణ, ఏపీలకు తాజాగా లేఖ రాశారు. ప్రాజెక్టుల కింద జిల్లాలు, మండలాల వారీగా జనాభా లెక్కలు, తాగునీటి అవసరాలను సెప్టెంబర్ 15లోగా తెలియజేయాలని కోరారు. 2024–25 వానాకాలం పంటల అవసరాలకు శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి 135.5 టీఎంసీలను కేటాయించాలని తెలంగాణ ఇటీవల కోరింది. నల్లగొండ ఎడమ కాల్వ కింద నల్లగొండ సీఈ పరిధిలో తాగునీటికి 1.5 టీఎంసీలు, సాగునీటికి 15.5 టీఎంసీలు, సూర్యాపేట సీఈ కింద సాగునీటికి 18 టీఎంసీలు, ఖమ్మం సీఈ కింద తాగునీటికి 3.78 టీఎంసీలు, సాగునీటికి 31.72 టీఎంసీలు, ఎమ్మార్పీ హైలెవల్ కెనాల్, లో లెవల్ కాలువల కింద తాగునీటికి 7.5 టీఎంసీలు, సాగునీటికి 24 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి లిఫ్టుకు 31.1 టీఎంసీలు సాగునీటికి, 2.4 టీఎంసీలు తాగునీటికి కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఇండెంట్ సమర్పించింది.

నెబ్రాస్కాలో దీపావళి పండుగకు అధికారిక గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: నెబ్రాస్కా గవర్నర్ జిమ్ పిల్లెన్ కార్యాలయం భారతీయ పండుగ దీపావళిని అధికారికంగా గుర్తించింది. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు దీపావళి వారంగా ప్రకటించింది. అంతేకాకుండా నెబ్రాస్కా రాష్ట్రంలో అక్టోబర్ నెలను హిందూ వారసత్వ నెలగా గుర్తించారు. పురాతన హిందూ సాంస్కృతిక వారసత్వం, సనాతన ధర్మం, సంప్రదాయాలను సంరక్షించడానికి అమెరికాలోని భారతీయ హిందూ సమాజం చేసిన గణనీయమైన కృషి కారణంగా ఈ గుర్తింపు సాధ్యమైంది. నెబ్రాస్కాలోని హిందువులు దీపావళిని ఘనంగా జరుపుకోవాలని అక్కడి హిందూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా దీపావళి విశిష్టతను తెలిపిన డాక్టర్ ఫణి తేజ్ అడిదమ్‌కు హిందూ సమాజం తరపున వారు ధన్యవాదాలు తెలిపారు.



ఏపీ రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ప్రమాణం చేశారు. బుధవారం హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

మూత'బడి'నది!

కొటాల(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కొటాల మండలం మొగడ్‌దగడ్‌లోని గిరిజన ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో 25 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయిని సుశీల ఇటీవల బదిలీపై వెళ్లగా.. మరో టీచర్‌ను కేటాయించలేదు. దీంతో వారం రోజులుగా బడి తలుపులు తెరుచుకోవడం లేదు. విద్యార్థులంతా బుధవారం ఉదయం తొమ్మిది గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. తాళం వేసి ఉండటంతో అక్కడే కాసేపు ఆడుకుని ఇళ్లకు తిరిగి వెళ్లారు. దీనిపై స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ మడావి పోచానిని వివరణ కోరగా.. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో టీచర్లను సర్దుబాటు చేస్తారని తెలిపారు.



తాళం వేసిన బడి మెట్లపై కూర్చున్న విద్యార్థులు

రూ.1,226 కోట్లతో.. పోలవరం ఎడమ కాలువకు 'లిఫ్ట్'

- రేషన్ డోర్ డెలివరీ రద్దు.. కొత్తగా 2,774 రేషన్ షాపుల ఏర్పాటు
- రివర్స్ టెండర్ల విధానానికీ మంగళం
- ఏపీ కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

సాక్షి, అమరావతి: పోలవరం ఎడమ కాలువకు లిఫ్ట్ ద్వారా నీటిని తోడిపోయడం ద్వారా ఉత్తరాంధ్ర తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.1,226.68 కోట్లతో ఎడవ కాలువ పనులు పూర్తిచేయాలనే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశ వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నానికి లిఫ్ట్ విధానంలో ముందుగా నీరు అందించి, పోలవరం పూర్తయిన తర్వాత గ్రావిటీ ద్వారా పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండర్ విధానం రద్దుచేసి పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ కోసం విడుదల చేసిన జీఓ–67ను రద్దుచేయడంతోపాటు అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలోని పనులను రివర్స్ టెండరింగ్‌కు బదులుగా సంప్రదాయ టెండర్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గత ప్రభుత్వం అమలుచేసిన రేషన్ డోర్ డెలివరీ విధానం రద్దుచేసి దాని స్థానంలో కొత్తగా 2,774 రేషన్ దుకాణాల ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని పార్థసారథి చెప్పారు. ఇక పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ పేరు, బొమ్మలు, రాజకీయ పార్టీల లోగో తొలగించి దాని స్థానంలో రాజముద్రను ముద్రించి 21.86 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు.

పోలవరం ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్లు ఆమోదం!

- సవరించిన అంచనాలకు గ్రీన్ సిగ్నల్
- కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్న కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు
- అధికారిక మీడియా సమావేశంలో ప్రస్తావించని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈమేరకు జలశక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సవరించిన అంచనాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు మీడియాకు తెలిపారు. కొత్త డయాఫ్రమ్ వాల్ సహా పెరిగిన అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. డబుల్ ఇంజన్ గ్రోత్ ఓరియెంటెడ్ ప్రభుత్వం కారణంగా ఇది సాధ్యమైందని చెప్పారు. అయితే, కేంద్ర కేబినెట్ నిర్ణయాలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పోలవరం ప్రాజెక్టును ప్రస్తావించకపోవడం గమనార్హం.

ఖజానాకు కన్నం!

- అంచనాలు పెంచేసి నాడు అధిక ధరలకు కట్టబెట్టిన చంద్రబాబు
- ఆ తర్వాత మొబిలైజేషన్ అడ్వాన్సులు.. కాంట్రాక్టర్ల నుంచి అవే కమీషన్లుగా వసూలు
- ఆ అక్రమ వ్యవహారాలతో ఖజానాపై రూ.20 వేల కోట్లకుపైగా పెనుభారం
- మళ్లీ 2014–19 పాత టెండర్ విధానం అమలుకు కూటమి సర్కారు గ్రీన్ సిగ్నల్
- పట్టిసీమ టెండర్ల అక్రమాలను 2017–18లోనే కడిగేస్తూ కాగ్ నివేదిక
- మళ్లీ ఇప్పుడూ అదే రీతిలో కాంట్రాక్టర్లతో కలిసి ఖజానా దోచేసేందుకు సిద్ధం
- అధికారంలోకి రాగానే టెండర్ల వ్యవస్థను సంస్కరించిన వైఎస్ జగన్
- రూ.వంద కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన పనుల టెండర్ జ్యుడీషియల్ ప్రివ్యూకు
- రూ.కోటి అంతకంటే ఎక్కువ విలువైన పనులకు రివర్స్ టెండరింగ్‌లో టెండర్లు
- అత్యంత పారదర్శక టెండర్లలో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు పోటాపోటీ.. కాంట్రాక్టు విలువ కంటే తక్కువకే పనులు చేసేందుకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్లు

రివర్స్ టెండరింగ్ రద్దుకు ఏపీ కేబినెట్ ఆమోదం



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జాయింట్ సర్వే!

పోలవరం ముంపుపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సీడబ్ల్యూసీ ఛైర్మన్ ఆదేశం

- 150 అడుగుల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో ఉండే ప్రభావంపై అధ్యయనం చేయాలి
- క్షేత్రస్థాయిలో ముర్రెడువాగు, కిన్నెరసాని వాగుల ముంపుపై డీమార్కింగ్ చేయాలి
- ముంపు గుర్తించిన తర్వాత నివారణ చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించాలని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఛైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రెడువాగులకు ఏర్పడనున్న ముంపుపై ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇప్పటికే జాయింట్ సర్వే నిర్వహించగా, తదుపరిగా క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతాన్ని గుర్తిస్తూ డీమార్కింగ్ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించి డీమార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని వోరా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావానికి సంబంధించి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలపై బుధవారం ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో వోరా అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎప్పటికైనా సర్వే చేయాల్సిందే: వోరా

పోలవరం ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ ఎప్పటికైనా 150 అడుగులే ఉంటుందని, దీనివల్ల తెలంగాణలో ఉండనున్న ముంపు ప్రభావంపై ఎప్పుడైనా సర్వే చేసి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సీడబ్ల్యూసీ ఛైర్మన్ వోరా స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్వే జరగకపోవచ్చని, ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో తెలంగాణ కోరిన మేరకు జాయింట్ సర్వే చేయాల్సిందేనని సూచించారు. జాయింట్ సర్వేను సమన్వయం చేయాలని పీపీఏను ఆదేశించారు. 150 అడుగుల నిల్వతో ఏర్పడే ముంపుతో పాటు ప్రాజెక్టు కారణంగా ముర్రెడు వాగు, కిన్నెరసాని వాగులకు ఉండే ముంపును గుర్తించి నివేదిక సమర్పిస్తే, ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీ, తెలంగాణతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణ కోరిన మేరకు.. పోలవరం ప్రాజెక్టుతో మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపుపై జాయింట్ సర్వే విషయంలో మళ్లీ సమావేశమై నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాగా పోలవరం ప్రాజెక్టుతో సీడబ్ల్యూసీ సర్వేలో తేలిన దానికి మించి తమ రాష్ట్రంలో ముంపు ప్రభావం ఉందని ఒడిశా నీటిపారుదల శాఖ సీఈ అశుతోష్ దాస్ పేర్కొన్నారు. ఐఐటీ రూర్కెలా అధ్యయన నివేదికలో ఇది తేలిందన్నారు. ఈ నివేదికపై అధ్యయనం చేసి తదుపరి సమావేశంలో చర్చిస్తామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ మోహన్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం, పీపీఏ సీఈఓ అతుల్ జైన్, సీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి పురోగతి లేదు: తెలంగాణ

గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు జాయింట్ సర్వేకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావడం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) బి.నాగేందర్‌రావు తెలియజేశారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని, కాగితాలకే పరిమితమయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. 150 అడుగుల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో తెలంగాణలో 950 ఎకరాలు ముంపునకు గురవుతాయని, దీనిపై జాయింట్ సర్వే చేయాల్సిందేనని ఆయన కోరారు. మరోవైపు జాయింట్ సర్వేకు తెలంగాణ సహకరించడం లేదని, సర్వే రెండు వాగులకే పరిమితం చేయాల్సి ఉండగా, ఏడు వాగులు సర్వే చేయాలని కోరుతోందని ఏపీ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ శ్రీనివాసరావు చెప్పారు. అయితే ముర్రెడు వాగు, కిన్నెరసాని వాగుల జాయింట్ సర్వేకు పూర్తిగా సహకరించిన విషయాన్ని తెలంగాణ ఈఎన్సీ గుర్తు చేశారు.

నగరం వార్తలు

నగరంలో నేడు..

- హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్ వేదికగా ఎమ్ఎస్ఎన్ సంస్థ ఆధ్వర్యంలో 'ఎమ్ఎస్ఎన్ రియాలిటీ గ్రాండ్ లాంచింగ్' కార్యక్రమం జరగనుంది. ఉదయం 11:30 గంటలకు జరగబోయే ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.
- నగరంలోని హైటెక్స్ వేదికగా సికింద్రాబాద్ ఎలక్ట్రిక్ ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉదయం 10 గంటలకు ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు.
- రవీంద్రభారతి వేదికగా డాక్టర్ సంధ్య విప్లవ్ రచించిన 'త్రికాల' నవల ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. సాయంత్రం 6 గంటలకు జరగనున్న ఈ ఆవిష్కరణలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహా పలువురు సాహితీవేత్తలు, రచయితలు పాల్గొననున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని..



సాక్షి, సిటీబ్యూరో: 2035 నాటికి కనీసం 10 వేల మంది నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలనే కృత నిశ్చయంతో ఉన్నామని పేర్కొంది. హివిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో థర్డ్ స్టూడెంట్, పేరెంట్స్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను బుధవారం ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని ముఫఖంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. 2021 నుంచి తమ ఫౌండేషన్ నిబద్ధతతో పనిచేస్తోందని, ఇప్పటి వరకు నిరుపేద కుటుంబాలకు చెందిన 577 మందికి ఆర్థిక సాయం అందించామని బుధవారం సంస్థ ఓ పత్రికా ప్రకటన ద్వారా తెలిపింది. ఆర్థిక సాయంతో పాటు కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా వారికి అవగాహన కల్పిస్తున్నామని వివరించింది.

రేవంత్ ప్రభుత్వానికి మూల్యం తప్పదు

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



గాంధీలో ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న బీసీ నేతలకు మద్దతు ప్రకటిస్తున్న రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

గాంధీఆస్పత్రి: బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలకు సరైన రీతిలో బుద్ధి చెప్పాలిన సమయం ఆసన్నమైందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘ నేత ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సమగ్ర బీసీ కుల గణన చేపట్టాలని, 42 శాతం బీసీలకు కేటాయించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం నేతలు బత్తుల సిద్దేశ్వరపటేల్, జక్కని సంజయ్‌నేతలు 4 రోజుల క్రితం ఆమరణ దీక్ష చేపట్టారు. దీక్షను భగ్నం చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి మంగళవారం రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలను నిరాకరించి ఆస్పత్రిలో నిరాహార దీక్ష కొనసాగిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్యతో పాటు బీసీ సంఘ నాయకులు బుధవారం వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన స్వలాభం కోసం పనిచేస్తూ బీసీల అభివృద్ధికి తిలోదకాలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక్క బీసీ నాయకుడిని సీఎంగా ఎన్నుకోని రాజకీయ పార్టీలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. కనీసం గ్రామ సర్పంచులుగా కూడా బీసీలు పనికిరారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామి నెరవేర్చాలని, రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటకైనా సీఎం రేవంత్‌రెడ్డి విలువ ఇవ్వాలని కోరారు. బీసీలంతా ఏకమై ఉద్యమం చేపట్టి, రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చకముందే రేవంత్ రెడ్డి సర్కార్ మేలుకోవాలని సూచించారు. అదానీ, అంబానీలకు రూ.లక్షల కోట్ల రుణమాఫీ చేసిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఆశ చూపించి, జనధన్ ఖాతాలను తెరిపించి ఒక్క రూపాయి కూడా అందులో వేయలేదని విమర్శించారు. బీసీ నాయకులు శాంతియుతంగా తమ ఇళ్లలో ఆమరణ దీక్షలు చేస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా దీక్షలకు భగ్నం చేసి గాంధీ ఆస్పత్రికి తరలించడం ఏమిటని, ఇదేనా ప్రజాస్వామం అని ప్రశ్నించారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే రేవంత్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాజుల శ్రీనివాసగౌడ్, రాజారాంయాదవ్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, బీసీ ఆజాద్ సంఘ్ అధ్యక్ష కార్యదర్శులు మహేష్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం

- హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ కమిషనర్ కర్ణణ్
- ఫీవర్‌ను సందర్శించి రిజిస్టర్ల తనిఖీ
- డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కావడం లేదు
- ఫీవర్‌లో బ్లడ్ స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేస్తాం



పాథాలజీ ల్యాబ్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ కమిషనర్ ఆర్వీ కర్ణణ్

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ) కమిషనర్ ఆర్వీ కర్ణణ్ చెప్పారు. రోగులకు ఉపయోగపడే విధంగా ఫీవర్‌లో బ్లడ్ స్టోరేజీ యూనిట్‌ను ఏర్పాటు చేయిస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా డెంగీ, మలేరియా, డిఫ్తీరియా, చికున్‌గున్యా, విషజ్వరాల నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ బుధవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మితో కలిసి ముందుగా వార్డు 2, 3 పరిశీలించి, అక్కడ చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడారు.

వైరాలజీ ల్యాబ్ పనితీరుపై సంతృప్తి..

అక్కడ నమోదవుతున్న డెంగీ కేసులపై ఆరా తీశారు. అనంతరం పాథాలజీ, మైక్రోబయాలజీ, వైరాలజీ ల్యాబ్‌లను సందర్శించారు. అలాగే ల్యాబ్‌లో రోగులకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షల రిపోర్టుల వివరాల నమోదు రిజిస్టర్‌ను తనఖీ చేశారు. రోగుల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఎలా జరుగుతున్నాయనే విషయాలను కమిషనర్ తనఖీ చేశారు. వైరాలజీ ల్యాబ్‌లో అక్కడి సిబ్బంది పనితీరుపై కమిషనర్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నారు..

అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ.. ఫీవర్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సరిపడా ఉన్నారని తెలిపారు. అన్ని రకాల మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఫీవర్ ఆస్పత్రిలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కావడం లేదని, వైరల్ ఫీవర్ కేసులు మాత్రమే అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మికి కమిషనర్ సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్ ఉన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి అక్రమ నిర్మాణాలను తొలగించాలి

హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వజ్రేష్‌యాదవ్

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులు, కుంటలు ఆక్రమించి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధుల్లో నిర్మించిన భవనాలను హైడ్రా వెంటనే కూల్చివేసి పరిహారం వసూలు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మేడ్చల్ మండల పరిధిలోని సర్వే నంబర్ 33లోని నల్లకుంటలో 13 ఎకరాలు కబ్జా చేసిన సీఎంఆర్ మెడికల్ కళాశాల, సర్వే నంబర్‌లో 29 ఎకరాల సుతారిచెరువును కబ్జా చేసి సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, మైసమ్మగూడ సర్వే నంబర్ 647లోని కోమటికుంటలో 20 ఎకరాలు ఆక్రమించుకుని మల్లారెడ్డి యూనివర్సిటీ నిర్మించారని గుండ్లపోచంపల్లి సర్వే నంబర్ 428లో గల నీళ్ల చెరువులో 5 ఎకరాల 30 గుంటల భూమిని అపర్ణ సంస్థవారు కబ్జాలు చేశారని, సర్వే నంబర్ 29లో 14 ఎకరాలు కబ్జా చేసి కమర్షియల్ నిర్మాణాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనురాగ్ యూనివర్సిటీ, నీలిమ ఆస్పత్రి కోసం చెరువులను, కుంటలను కబ్జా చేశారని, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కళాశాలల కోసం కబ్జాలు చేశారని, మేడ్చల్ మండలం పూడూర్ గ్రామంలో బీజేపీ నేత అల్లుడు చెరువును ఆక్రమించారని, వాటిల్లో చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేసి వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని వజ్రేష్‌యాదవ్ కోరారు.

విమానంలో తీసుకొచ్చి.. బాలుడికి అత్యాధునిక వైద్యం

– బాలుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు



బాలుడితో కిమ్స్ కడల్స్ వైద్య బృందం

రాయదుర్గం: అరుదైన ఇన్ఫెక్షన్ కారణంగా జ్వరం, ఫిట్స్, మెదడులో ప్రెషర్ తగ్గిపోవడంలాంటి సమస్యలు తలెత్తి చివరకు తన సొంత తల్లిదండ్రులను కూడా గుర్తుపట్టలేని పరిస్థితికి చేరాడు ఓ బాలుడు. అతడికి తగిన వైద్యం అందించిన కొండాపూర్ ఆస్పత్రి వైద్యులు అతడి ప్రాణాలను కాపాడారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్ ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలుడిని తొలుత స్థానికంగానే ఓ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి సమాచారం అందించారు. అక్కడి నుంచి కిమ్స్ కడల్స్ కొండాపూర్ ఆస్పత్రికి చెందిన వైద్యులు చార్టర్డ్ విమానంలో రాయ్‌పూర్ వెళ్లి అక్కడి నుంచి బాబును తీసుకొచ్చి చికిత్స అందించారు. వివరాలను కొండాపూర్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి చెందిన పిడియాట్రిక్స్ విభాగం క్లినికల్ డైరెక్టర్, పిడియాట్రిక్ ఐసీయూ విభాగాధిపతి డాక్టర్ పరాగ్ శంకర్‌రావు డెకాటే ఈ చికిత్స గురించి బుధవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన బాలుడికి తీవ్రమైన జ్వరం, ఫిట్స్, మెదడులో ప్రెషర్ తగ్గిపోవడం వంటి సమస్యలు వచ్చాయని, దాంతో అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తమను సంప్రదించారన్నారు. తాము రాయ్‌పూర్ వెళ్లేలోపు అతడికి ఫిట్స్ పెరగడం, బీపీ తగ్గిపోవడం, బాగా మత్తుగా ఉండిపోయి, ఊపిరి కూడా అందని పరిస్థితి వచ్చింది. సమస్యలు తగ్గించేందుకు మందులను వాడేలా చేశామన్నారు. తర్వాత విమానంలో చికిత్స అందిస్తూనే నగరానికి తీసుకొచ్చామన్నారు. పీడియాట్రిక్ ఐసీయూ కన్సల్టెంట్ డాక్టర్ తరుణ్ సాయపడ్డారు. ఇక్కడకు చేరిన నాలుగో రోజే వెంటిలెటర్ తీసేసినట్లు తెలిపారు. తొమ్మిదో రోజు పూర్తిగా నయం కావడంతో డిశ్చార్జి చేశామని ఆయన వివరించారు. వైద్యులు అవినాష్, కల్యాణ్, డాక్టర్ ప్రబ్‌జోత్, డాక్టర్ జయంత్‌కృష్ణ, డాక్టర్ పాండు, డాక్టర్ మౌనిక డాక్టర్ ప్రతీక్ వై పాటిల్ ఇతర వైద్య బృందం సహకరించారు.

సర్జరీ లేకుండా వెన్నునొప్పి మాయం

స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు ప్రొ.డాక్టర్ భక్తియార్ చౌదరి



ఐఎంఏ తెలంగాణ సెక్రటరీ డాక్టర్ విజయ్‌రావు, చిత్రంలో డాక్టర్ ఎస్.భక్తియార్ చౌదరి

సాక్షి, సిటీబ్యూరో: వెన్ను, మెడ నొప్పికి విటమిన్ డీ లోపమే కారణమని ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు ప్రొ.డాక్టర్ భక్తియార్ చౌదరి తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో 20 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళల్లో సుమారు 79 శాతం మంది దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు చికిత్స అందించకుండా వదిలేస్తే రోజువారీ పనులు చేసుకోవడం కూడా కష్టమవుతుందని చెప్పారు. చాలా సమస్యలు శస్త్ర చికిత్సలు లేకుండానే తగ్గించవచ్చని, తన 40 ఏళ్ల అనుభవంలో దాదాపు 10 వేల మందికి సర్జరీలు జరగకుండా నయం చేశానని వివరించారు. జీవన శైలిలో మార్పుల కారణంగా, ముఖ్యంగా ఎండ తగలకుండా ఉండటం, విటమిన్ డీ లోపం వంటి కారణాలతో ఫ్రోజెన్ షోల్డర్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సమస్యలకు మొదట్లోనే చికిత్స అందించకుంటే చిన్న పిల్లలు, యువత భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. విటమిన్ డీ లోపానికి ఫ్రోజెన్ షోల్డర్ వ్యాధికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించేందుకు తాము అసోసియేషన్ ఆఫ్ విటమిన్ డీ డెఫిషియెన్సీ విత్ ఫ్రోజెన్ షోల్డర్ సిండ్రోమ్, రిపీటీటివ్ స్ట్రెయిన్ ఇంజురీ ఆన్ స్పైన్ పేరుతో ఓ అధ్యయనం చేశామని తెలిపారు.

రక్షాపురం ఘటనతో అప్రమత్తమైన పోలీసు బాస్‌లు



కాళభైరవ హనుమాన్ దేవాలయంలో పూజలు

చార్మినార్: రక్షాపురంలో జరిగిన ఘటనతో పాతబస్తీ దక్షిణ మండలం పోలీసులు అప్రమత్తమయ్యారు. రానున్న వినాయక చవితిని పురస్కరించుకుని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా పాత బస్తీలోని దర్గాలు, గుళ్లపై నిఘా పెట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలకు సిద్ధమయ్యారు. బుధవారం ఆమె చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్‌తో పాటు చార్మినార్, హుస్సేనీఆలం, కామాటిపురా పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు కమతం చంద్రశేఖర్, సురేందర్, కమల్‌కుమార్‌తో కలిసి ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కాలభైరవ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.



ఐసీసీ టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్: టాప్-10లో రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌ను విడుదల చేశారు. టాప్-10లో భారత్ నుంచి ముగ్గురు స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఒక స్థానం పడిపోయి 751 రేటింగ్ పాయింట్లతో ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. యశస్వి జైస్వాల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 740 రేటింగ్ పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో నిలిచాడు. విరాట్ కోహ్లి రెండు స్థానాలు పురోగతి సాధించి 737 రేటింగ్ పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 881 పాయింట్లతో తన 'టాప్ ర్యాంక్'ను నిలబెట్టుకోగా... విలియమ్సన్ (న్యూజిలాండ్; 859 పాయింట్లు) రెండో ర్యాంక్‌లో, మిచెల్ (న్యూజిలాండ్; 768 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో ఉన్నారు. ఇంగ్లండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌ను అందుకున్నాడు. పాకిస్తాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఆరు స్థానాలు పడిపోయి తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ అశ్విన్ 870 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 847 పాయింట్లతో హాజల్‌వుడ్ (ఆస్ట్రేలియా), బుమ్రా (భారత్) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

5 గంటల 35 నిమిషాలు

యూఎస్ ఓపెన్ చరిత్రలోనే సుదీర్ఘ మ్యాచ్ ఆడిన ఇవాన్స్, ఖచనోవ్



- ఐదు సెట్‌ల పోరులో ఖచనోవ్‌పై ఇవాన్స్ విజయం
- సినెర్, అల్‌కరాజ్ శుభారంభం

న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో బుధవారం అద్భుతం చోటు చేసుకుంది. ఈ టోర్నీ చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన మ్యాచ్ నమోదైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 184వ ర్యాంకర్ డేనియల్ ఇవాన్స్ (బ్రిటన్) 5 గంటల 35 నిమిషాల్లో 6-7 (6/8), 7-6 (7/2), 7-6 (7/4), 4-6, 6-4తో ప్రపంచ 22వ ర్యాంకర్ కరెన్ ఖచనోవ్ (రష్యా)పై గెలుపొందాడు. తొలి సెట్ 68 నిమిషాలు, రెండో సెట్ 61 నిమిషాలు, మూడో సెట్ 72 నిమిషాలు, నాలుగో సెట్ 67 నిమిషాలు, ఐదో సెటస్ 61 నిమిషాలు జరిగాయి. ఈ క్రమంలో యూఎస్ ఓపెన్‌లో సుదీర్ఘంగా సాగిన మ్యాచ్‌గా ఇవాన్స్, ఖచనోవ్ మ్యాచ్ గుర్తింపు పొందింది. 1992లో స్టెఫెన్ ఎడ్బర్గ్ (స్వీడన్), మైకేల్ చాంగ్ (అమెరికా) మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ 5 గంటల 26 నిమిషాలు సాగింది. ఆనాటి మ్యాచ్‌లో చాంగ్‌పై గెలిచిన ఎడ్బర్గ్ ఫైనల్లో పీట్ సంప్రాస్ (అమెరికా)ను ఓడించి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఖచనోవ్‌తో కూడా జరిగిన మ్యాచ్‌లో నిర్ణాయక ఐదో సెట్‌లో ఇవాన్స్ ఒక దశలో 0-4తో వెనుకబడి ఓటమికి చేరువయ్యాడు. అయితే పట్టువదలకుండా పోరాడిన ఇవాన్స్ అనూహ్యంగా వరుసగా ఆరు గేమ్‌లు గెలిచి సెట్‌తోపాటు విజయాన్ని కూడా అందుకున్నాడు.

సిట్సిపాస్‌కు షాక్

ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ), మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) శ్రమించి గెలుపొందగా... 11వ సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. సినెర్ 2-6, 6-2, 6-1, 6-2తో మెకంజీ మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై, అల్‌కరాజ్ 6-2, 4-6, 6-3, 6-1తో లీ టు (ఆస్ట్రేలియా)పై, మెద్వెదెవ్ 6-3, 3-6, 6-3, 6-1తో దుసాన్ లాజోవిచ్ (సెర్బియా)పై నెగ్గారు. సిట్సిపాస్ 6-7 (5/7), 6-4, 3-6, 5-7తో కొకినాకిస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు.

రాడుకానూ ఓటమి

మహిళల సింగిల్స్‌లో 2021 చాంపియన్ ఎమ్మా రాడుకానూ (బ్రిటన్), రన్నరప్ లేలా ఫెర్నాండెజ్ (కెనడా)... 2019 విజేత బియాంకా ఆండ్రెస్కూ (కెనడా) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. సోఫియా (అమెరికా) 6-1, 3-6, 6-4తో రాడుకానూపై, పొటపోవా (రష్యా) 2-6, 6-4, 7-5తో లేలా ఫెర్నాండెజ్‌పై, ఐదో సీడ్ పావ్లీని (ఇటలీ) 6-7 (5/7), 6-2, 6-4తో బియాంకాపై గెలుపొందారు. రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) 4-6, 5-7తో రూస్ (రొమేనియా) చేతిలో ఓడిపోయింది.

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)... శ్రీరామ్ బాలాజీ (భారత్)-గిడో ఆండ్రెజి (అర్జెంటీనా) జోడీలు రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో యూకీ-ఒలివెట్టి ద్వయం 6-3, 6-4తో రియాన్ సెగర్‌మన్-ప్యాట్రిక్ ట్రహక్ (అమెరికా) జంటపై... బాలాజీ-ఆండ్రెజి జోడీ 5-7, 6-1, 7-6 (12/10)తో డానిల్ (న్యూజిలాండ్)-వరేలా (మెక్సికో) జంటపై గెలుపొందాయి.


ఖచనోవ్

మ్యాచ్ గణాంకాలు

ఇవాన్స్		ఖచనోవ్
14	ఏస్‌లు	13
12	డబుల్ ఫాల్ట్‌లు	7
48/71	నెట్ పాయింట్లు	36/55
8/18	బ్రేక్ పాయింట్లు	8/23
53	విన్నర్స్	79
43	అనవసర తప్పిదాలు	73
201	మొత్తం పాయింట్లు	191

పారిస్ మళ్లీ మురిసె...



- అట్టహాసంగా పారాలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలు
- అప్పుడు నదిపై, ఇప్పుడు రోడ్డుపై మార్చ్‌పాస్ట్

పారిస్: మొన్న రెగ్యులర్ ఒలింపిక్స్‌ను ఎంత వైభవంగా ఆరంభించారో... దివ్యాంగుల కోసం నిర్వహించే పారాలింపిక్స్‌ను కూడా అంతే అట్టహాసంగా అంగరంగ వైభంగా ప్రారంభించారు. దీంతో మరోసారి పారిస్ కలలు, కళాకారులు, నృత్యరీతులు, పాప్ గీతాలతో విశ్వక్రీడల శోభకు వినూత్న 'షో'కులద్దింది. కనుల్ని కట్టిపడేసే వేడుకలు ఆద్యంతం అలరించాయి. పలు ఆటపాటలు, కళాకారుల విన్యాసాల అనంతరం ఫ్రాన్స్ జెండాలోని మూడు రంగుల్ని ఆరు ఫ్లయిట్లు ఆకాశానికి పూసినట్లుగా చేసిన ఎయిర్ షో వీక్షకుల్ని విశేషంగా కట్టిపడేసింది. ఆ వెంటే మార్చ్‌పాస్ట్ మొదలైంది. ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో పడవలపై మార్చ్‌పాస్ట్ సాగితే... పారాలింపిక్స్ మార్చ్‌పాస్ట్ పారిస్ రహదారిపై కేరింతగా రెగ్యులర్ ఒలింపిక్స్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా జరిగింది. రేపటి నుంచి పోటీలు జరుగుతాయి. 11 రోజుల పాటు జరిగే పారా విశ్వక్రీడల్లో 4000 మందికి పైగా దివ్యాంగ అథ్లెట్లు 22 క్రీడాంశాల్లో పోటీపడతారు. రెగ్యులర్ ఒలింపిక్స్‌ను ఆదరించినట్లుగానే ఈ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపారని నిర్వాహకులు తెలిపారు. 2 మిలియన్ల (20 లక్షలు)కు పైగా టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవడమే ఆదరణకు నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) అధ్యక్షుడు ఆండ్రూ పార్సన్స్ మాట్లాడుతూ మరోమారు పారిస్‌ను ప్రేక్షకుల సమూహం ముంచెత్తనుందన్నారు. మూడేళ్ల క్రితం టోక్యోలో కోవిడ్ మహమ్మారి కారణంగా పారా అథ్లెట్లంతా ఖాళీ స్టాండ్ల (ప్రేక్షకులు లేక) ముందు తమ ప్రదర్శన కనబరిచారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండబోదని క్రీడాభిమానుల కరతాళధ్వనుల మధ్య పారాలింపియన్లు పోటీలను పూర్తిచేస్తారని నిర్వాహకులు చెప్పారు. గురువారం ముందుగా తైక్వాండోలో పారాలింపియన్లు పతకాల బోణీ కొట్టనున్నారు. దీంతో పాటు పోటీల తొలిరోజు టేబుల్ టెన్నిస్, ట్రాక్ సైక్లింగ్ పోటీలు జరుగుతాయి.



'లక్నో' మెంటార్‌గా జహీర్



లక్నో: ఐపీఎల్ జట్టు లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం తమ కొత్త మెంటార్‌గా భారత మాజీ పేస్ బౌలర్ జహీర్ ఖాన్‌ను నియమించింది. జహీర్ ఈ జట్టుతో చేరుతున్నట్లుగా గత కొంత కాలంగా వార్తలు వినిపించగా... ఇప్పుడు దీనిని టీమ్ యజమాని సంజీవ్ గోయెంకా అధికారికంగా ప్రకటించారు. మెంటార్‌గా ప్రధాన జట్టుకే పరిమితం కాకుండా ప్రతిభాన్వేషణ, కొత్త ఆటగాళ్లను తీర్చిదిద్దే అదనపు బాధ్యతలను కూడా జహీర్‌కు లక్నో యాజమాన్యం అప్పగించింది. 2022లో లీగ్‌లోకి ప్రవేశించిన లక్నో సూపర్ జెయింట్స్‌కు రెండేళ్లు గౌతమ్ గంభీర్ మెంటార్‌గా వ్యవహరించగా రెండుసార్లు టీమ్ ప్లే ఆఫ్స్‌కు చేరింది. ఆ తర్వాత ఈ బాధ్యతల నుంచి గంభీర్ తప్పుకున్నాడు. 2024 సీజన్‌లో లక్నో పేలవ ప్రదర్శన కనబర్చింది. భారత అత్యుత్తమ పేస్ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న జహీర్ 2017 వరకు ఐపీఎల్ ఆడాడు. ముంబై, బెంగళూరు, ఢిల్లీ జట్ల తరఫున మొత్తం 100 మ్యాచ్‌లు ఆడి 102 వికెట్లు పడగొట్టిన అతను ఆ తర్వాత కూడా ఐపీఎల్‌తో కొనసాగాడు. 2018-2022 మధ్య ఐదేళ్ల పాటు జహీర్ ఖాన్ ముంబై ఇండియన్స్ టీమ్‌కు డైరెక్టర్, ఆ తర్వాత హెడ్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.

సినిమా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)... ఇప్పుడు ఎక్కడ చూసినా దీని పైనే చర్చ. ఇప్పటికే పలు రంగాల్లో దీని ప్రభావం మొదలైంది. ఇప్పుడు సినిమా రంగంపైనా ఏఐ తీవ్ర ప్రభావం చూపనుందని తెలుస్తోంది. ఇప్పటివరకూ అందుబాటులోకి వచ్చిన ఏఐ టెక్నాలజీతో సినిమాకు సంబంధించిన మ్యూజిక్ విభాగం ఎక్కువ ఎఫెక్ట్ అయ్యే అవకాశం కనిపిస్తోందని టాక్. మ్యూజిక్ డైరెక్టర్లపై, ఆ విభాగానికి చెందినవారిపై ఏఐ తీవ్ర ప్రభావం చూపనుందనే ఊహాగానాలు ఉన్నాయి.

సినీ సంగీతంపై ఏఐ పిడుగు?

ఓ సినిమాకు సంగీతం అందించడమంటే సంగీతదర్శకుడు ఆ చిత్రకథ వినాలి... అతనిచ్చే ట్యూన్స్ డైరెక్టర్‌తోపాటు నిర్మాత, హీరోలకూ నచ్చాలి. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ విషయంలో డైరెక్టర్ సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలి. సినిమా స్థాయిని బట్టి నెలలు, కొన్నిసార్లు సంవత్సరాలు కూడా పట్టొచ్చు. పాటలు, ఆర్ఆర్, ట్రైలర్లు, గ్లింప్స్, బీజియమ్స్, ప్రమోషన్ వీడియోలు ఇలా చాలా రకాలు తయారు చేయాల్సి ఉంటుంది. దీని కోసం మ్యూజిక్ డైరెక్టర్ వద్ద పదుల సంఖ్యలో ఆర్టిస్టులు పని చేయాల్సి ఉంటుంది. అలాగే చాలామంది టెక్నీషియన్లు కూడా పని చేస్తారు. స్టూడియో బాయ్ నుంచి సౌండ్ ఇంజినీర్స్ వరకు చాలా మంది అవసరం ఉంటుంది. దీనికోసం రెమ్యునరేషన్ రూపంలో నిర్మాత నుంచి మ్యూజిక్ డైరెక్టర్‌కు భారీగానే డబ్బు అందుతుంది. ఇందులో కొంత మొత్తాన్ని ఆర్టిస్టులకు పారితోషికం రూపంలో, కొందరికి జీతాల రూపంలో ఇస్తుంటారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఈ మొత్తం వ్యవస్థ ప్రమాదంలో పడే చాన్స్ కనిపిస్తోంది.

ఏఐ మ్యూజిక్ యాప్స్..

నెట్టింట్లో కొన్ని రకాల ఏఐ మ్యూజిక్ యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి ఉంటే మ్యూజిక్ డైరెక్టర్ అవసరమే ఉండదంటున్నారు. వీటి ప్రత్యేకత ఏంటంటే... మనం లిరిక్స్ ఇస్తే చాలు క్షణాల్లో పాట తయారైపోతుంది. ట్యూన్ కట్టి సింగర్ వాయిస్, మ్యూజిక్‌తో సహా ఇచ్చేస్తుంది. మనం చేయాల్సిందల్లా... మనకు ఎటువంటి ట్యూన్ కావాలి, ఎవరి వాయిస్ కావాలి వంటి రిఫరెన్స్ ఇస్తే చాలు. ఉదాహరణకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వాయిస్‌తో పాట కావాలని ఇస్తే క్షణాల్లో ఆయన గాత్రంతో పాట ప్రత్యక్షమవుతుంది. రకరకాల ఇన్‌స్ట్రుమెంట్స్‌తో మ్యూజిక్, సింగర్ వెర్షన్‌తో సహా సాంగ్‌ను వినిపిస్తుంది... అది కూడా వందల రకాల ట్యూన్స్‌లో. మనకు ఏ ట్యూన్ నచ్చితే దాన్ని ఎంచుకోవచ్చు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రామ్‌గోపాల్ వర్మ అటువంటి మ్యూజిక్ యాప్‌ను ఉపయోగించి పాటల్ని వినిపించారు.

సాహిత్యం కూడా.. సంగీతమే కాదు సాహిత్యాన్ని కూడా ఇచ్చే యాప్స్ అందుబాటులోకి వచ్చేశాయట. మనకు ఏ అంశంపై పాట కావాలి... ఎటువంటి పదాలు అందులో ఉండాలి వంటి హింట్స్ ఇస్తే చాలు.. పాట సాహిత్యం కూడా క్షణాల్లో చేతికొస్తుంది. ఇదే కాదు... వీఎఫ్ఎక్స్ వంటి పనులు కూడా ఏఐతో చేసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే సినీ రంగంపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది.

– దాచేపల్లి సురేష్ కుమార్


యంత్రం పాడితే యాంత్రికంగానే ఉంటుంది



– రచయిత భాస్కరభట్ల రవికుమార్

సాహిత్యం, మ్యూజిక్‌లపై ఏఐ టెక్నాలజీ ప్రభావం తక్కువగా ఉంటుందని నా ఫీలింగ్. యంత్రాల సహాయం తీసుకుంటారు కానీ పాటలు రాయడమనేది యాంత్రికం కాదు. మనిషి మెదడు గొప్పది. మనిషి యంత్రాన్ని తయారు చేశాడు. కానీ మనిషిలా యంత్రం రాయలేదు... పాటలు పాడలేదు. యంత్రం పాడే పాటలు యాంత్రికంగానే ఉంటాయి. తబలా ప్లేయర్స్, కీ బోర్డ్ ప్లేయర్స్ చేసే పనిని యంత్రం చేయలేదు. రోబోలు పనులు చేస్తున్నాయి కదా అని అందరూ రోబోలను పెట్టుకోలేదు కదా! సరదాకి ఏఐతో కొన్ని పాటలను క్రియేట్ చేసి చూసుకోవడమే తప్పితే ఏమీ ఉండదు. పాట అంటే సౌండింగ్ కోసం రాసేది కాదు. అందులో ఆత్మ ఉంటుంది. దర్శకులు సినిమాలోని సందర్భం, బ్యాక్‌డ్రాప్, హీరో-హీరోయిన్ల పాత్రల తీరు తెన్నెలు చెబుతారు. ఎన్నో అంశాలు సమ్మిళితమై ఓ పాట సిద్ధమవుతుంది. పాట ఎలా ఉంటే ఆడియన్స్‌కు నచ్చుతుంది. ఎలాంటి లిరిక్స్ ఈ పాటను వారికి చేరువ చేస్తాయి? ఇలా తర్జనభర్జనలు పడి, రాత్రీ పగలూ కూర్చొని రాసే పాటలు అవి. లవ్ సాంగ్ కావాలంటే... ఏఐ ఆ పాటను ఇచ్చేస్తుంది. కానీ సినిమాల్లో తీసుకుంటారా? ఏఐ వల్ల చరిత్ర మారిపోతుందని, ఉపాధి పడిపోతుందనే మాటల్లో వాస్తవం లేదు.

ఎవర్ని విమర్శించాలి?



– సంగీతదర్శకుడు భీమ్స్

మనుషులు లేకపోతే భూమి ఏమవుతుంది? తల్లి లేకపోతే జన్మ ఉంటుందా? 'మౌనంగానే ఎదగమనీ...' అని కొన్ని వేల మంది రాస్తే టెక్నాలజీ పుట్టింది. అసలు మనిషి పుట్టాకే దేవుడు పుట్టాడు. దేవుడు పుట్టాకే కులాలు, మతాలు పుట్టాయి. అలాగే టెక్నాలజీని పుట్టించిందీ మనిషే. ఆ టెక్నాలజీయే మనిషి మనుగడను శాసిస్తోంది. మనిషికి మంచి... చెడు... రెండూ ఉంటాయి. దాన్నేం చేయలేం. మరి.. సృష్టించినవారిని విమర్శిద్దామా? పాటిస్తున్నవారిని విమర్శిద్దామా? ఎవర్ని విమర్శించాలి? నాకు ఏఐ మీద అవగాహన లేదు. టెక్నాలజీ తెలియదు. భవిష్యత్తులో నాకు పని లేకపోతే అప్పుడు నాకు వచ్చింది నేను చేసుకుంటాను.

హేమా కమిషన్ అవసరం


ఖుష్బూ

– ఖుష్బూ

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులపై జరుగుతున్న వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమా కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకంపనలు రేపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో లైంగిక వేధింపులకు గురైన పలువురు నటీమణులు ప్రస్తుతం గొంతు విప్పే ప్రయత్నం చేస్తున్నారు. కాగా హేమా కమిషన్‌పై ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ తాజాగా స్పందించారు. ఆమె తన 'ఎక్స్' మీడియా వేదికగా పేర్కొంటూ సినిమా రంగంలో జరుగుతున్న లైంగిక వేధింపుల అంతానికి హేమా కమిషన్ చాలా అవసరం అన్నారు. సినిమా రంగంలోనే కాకుండా ఇతర రంగాల్లోనూ మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. అంతే కాదు కొందరు మగవాళ్లు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అభిప్రాయపడ్డారు. వేధింపుల కారణంగా ఏర్పడే గాయాలు శారీరకంగానే కాకుండా మానసికంగానూ బాధిస్తాయన్నారు. తాను కూడా చిన్న వయసులో ఇలాంటి వేధింపులకు గురైన విషయాన్ని ఖుష్బూ గుర్తు చేసుకున్నారు. – సాక్షి, చెన్నై


'పుష్ప: ది రూల్'లో అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'పుష్ప' ఫ్రాంచైజీలోని తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తుండగా, హీరోయిన్ శ్రీవల్లీ పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 6న రిలీజ్ కానుంది. బుధవారం నుంచి ఈ సినిమా రిలీజ్‌కు సరిగ్గా వంద రోజుల సమయం ఉంది. దీంతో 100 డేస్ కౌంట్‌డౌన్ అంటూ ఈ సినిమా పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇక 'పుష్ప' ఫ్రాంచైజీలోని తొలి భాగంగా 'పుష్ప: ది రైజ్' (2021) వచ్చి, విజయం సాధించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

గులాబీ మాటల రచయిత నరసింగరావు కన్నుమూత



సీనియర్ రచయిత నడిమింటి నరసింగరావు (72) ఇక లేరు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హాస్పిటల్‌లో తుది శ్వాస విడిచారు. కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'గులాబీ', రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలోని 'అనగనగా ఒకరోజు' వంటి సూపర్ హిట్ ఫిల్మ్స్‌తో పాటు 'పాత బస్తీ, ఊరికి మొనగాడు, కుచ్చికుచ్చి కూనమ్మా' ... ఇలా దాదాపు యాభై సినిమాలకు నరసింగరావు మాటల రచయితగా చేశారు. సినిమాల్లోకి రాకముందు తెలుగు నాటకరంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన 'బొమ్మలాట, రైలుబండి' వంటి నాటకాలు రాశారు. అలాగే 'తెనాలి రామకృష్ణ, అంతరంగాలు, లేడీ డిటెక్టివ్, వండర్ బాయ్' ఇలా దాదాపు యాభై సీరియల్స్‌కు ఆయన మాటలు రాశారు. రచయితగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు, సన్మానాలు ఎన్నో అందుకున్నారు. కాగా 'ఆదిత్య 369'కి సీక్వెల్‌గా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించాలనుకున్న చిత్రం స్క్రిప్ట్ వర్క్‌లో పాలుపంచుకున్నారు. నరసింగరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి తెలుగు సినీ రచయితల సంఘం అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణతో పాటు పలువురు చిత్రరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

విలన్ హీరోగా మారితే...


త్రికోటి


రామ్‌చరణ్ 'మగధీర' సినిమాలో విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ గిల్ హీరోగా నటించిన చిత్రం 'అహో! విక్రమార్క'. పేట త్రికోటి దర్శకత్వంలో దేవ్ గిల్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం త్రికోటి మాట్లాడుతూ– ''రాజమౌళి దర్శకత్వం వహించిన 'మగధీర' సినిమాకు నేను కో డైరెక్టర్‌గా చేసినప్పుడు దేవ్ గిల్ పరిచయమయ్యాడు. హీరోగా ఓ సినిమా చేయాలని అంటుండేవాడు. నేను 'ఆర్ఆర్ఆర్'కు పని చేస్తున్న సమయంలో దేవ్ గిల్ ఓ సినిమా ప్రపోజల్ తీసుకు వచ్చాడు. అదే 'అహో! విక్రమార్క'. విలన్ ఇమేజ్ ఉన్న దేవ్ గిల్‌కు ఎలాంటి కథ అయితే సరిపోతుందో అలాంటి కథను వర్మ సిద్ధం చేశారు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుంది? అన్నదే ఈ చిత్రకథ. ఇందులో కథ రీత్యా ఆంధ్రా పోలీస్ పుణేకి వెళతాడు. ఇలా సౌత్, నార్త్ అందరికీ ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు మదర్ సెంటిమెంట్ కూడా ప్రేక్షకులను అలరిస్తుంది. రాజమౌళిగారు ఈ సినిమా ట్రైలర్ చూశారు. యాక్షన్ ప్యాక్డ్‌గా ఉందన్నారు. మహేశ్‌బాబు-రాజమౌళిగార్ల కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాకు పని చేస్తాననే అనుకుంటున్నాను'' అని అన్నారు.

మరో లోకమే చూస్తున్నా...


కశ్వి, రామ్ కార్తీక్

''ఇదేం చిత్రమో నిన్న మొన్న లేని మరో లోకమే చూస్తున్నా నే కొత్తగా...' అంటూ మొదలవుతుంది 'ఎన్నెన్నో సంతోషాల...' పాట. రామ్ కార్తీక్, కశ్వి హీరో హీరోయిన్లుగా మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభరెడ్డి నిర్మించిన 'వీక్షణం' సినిమాలోనిదీ పాట. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా 'ఎన్నెన్నో..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ''ప్రేయసి ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసు ఎలా ఉంటుందనే విషయాన్ని చెప్పేలా ఈ పాట ఉంటుంది. రెహ్మాన్ రాసిన ఈ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించారు'' అన్నారు దర్శక-నిర్మాతలు.

దీక్ష ఉంటే...


కిరణ్, రామకృష్ణ గౌడ్, అక్సా ఖాన్

కిరణ్‌కుమార్, అలేఖ్య రెడ్డి జంటగా స్వీయ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ రూపొందించిన చిత్రం 'దీక్ష'. పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మించారు. బుధవారం విలేకరుల సమావేశంలో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – ''దీక్ష' ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో ఈ సినిమాని తెరకెక్కించాం. హీరో కిరణ్ నటన ఆకట్టుకుంటుంది. భీముడి గెటప్‌లో ఆయన చెప్పిన నాన్‌స్టాప్ డైలాగ్ హైలైట్ అవుతుంది. మా సినిమా షూటింగ్ పూర్తయింది. గ్రాఫిక్ వర్క్, ఇతర పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. 'దీక్ష' రిలీజ్ డేట్ ప్రకటించాక మహిళా కబడ్డీ సినిమాను ఆరంభిస్తాం'' అన్నారు. ''దీక్ష'లాంటి మంచి సినిమాలో నటించే అవకాశం ఇవ్వడంతో పాటు నెక్ట్స్ మూవీ 'మహిళా కబడ్డీ'లోనూ అవకాశం ఇచ్చిన రామకృష్ణగారికి ధన్యవాదాలు'' అన్నారు కిరణ్. అనూష, తులసి, అక్సా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
29-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	74	81,786
నిఫ్టీ ▲	35	25,052

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,539	▽ 216
డోజోన్స్	41,026	▽ 224
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,344	▽ 2
డాక్స్	18,782	▲ 100
షాంఘై	2,837	▽ 11
నికాయ్	38,372	▲ 83

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	71,691	▽ 71
బంగారం (99.5 స్వచ్ఛత)	71,404	▽ 69
వెండి (కిలో)	84,929	▽ 1,033

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.53	84.55
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.54	112.13
€	యూరో	ఎస్‌బీఐ	92.64	95.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.35	58.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.00	57.98
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.11	66.59
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.48	23.02
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.90	12.73

అత్యంత విలువైన సంస్థగా ఎస్‌బీఐ

- అత్యుత్తమ బ్యాంక్‌గా అవతరిస్తాం
- కొత్త చైర్మన్ సీఎస్ శెట్టి సందేశం



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ దేశంలోనే అత్యంత విలువైన ఆర్థిక సేవల సంస్థగా ఎదిగేందుకు కృషి చేస్తుందని, నికర లాభాలు పెంచుకుంటుందని కొత్త చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి) ప్రకటించారు. ఎస్‌బీఐని అత్యుత్తమ బ్యాంక్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని.. చైర్మన్ బాధ్యతల స్వీకరణ అనంతరం ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. 50 కోట్లకు పైగా కస్టమర్లకు ఎస్‌బీఐ సగర్వంగా సేవలు అందిస్తోందని చెబుతూ.. వివిధ విభాగాల్లో మార్కెట్ అగ్రగామిగా ఉందని, అతిపెద్ద బ్యాలెన్స్ షీట్ పరంగా ఆస్తులపై ఒక శాతం రాబడి నిష్పత్తిని సాధించినట్టు వివరించారు. ''అత్యంత విలువైన ఆర్థిక సంస్థగా ఎదిగేందుకు కృషి చేయాలి. నికర లాభం నూతన మైలురాళ్లకు చేరుకోవాలి. ప్రతి భారతీయుడి బ్యాంకర్‌గా ఎస్‌బీఐ స్థానం బలోపేతం కావాలి. అత్యుత్తమ సేవలు అందించాలి. ఉద్యోగులకు ఇష్టమైన సంస్థగా తీర్చిదిద్దాలి''అంటూ ఎస్‌బీఐ సిబ్బందికి శెట్టి సందేశం ఇచ్చారు. 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ లాభం రూ.61,077 కోట్లుగా ఉండడం గమనార్హం. బ్యాంక్ చరిత్రలో ఇదే గరిష్ట రికార్డు. ''మాతృభూమి అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి దేశంగా మారుతున్న తరుణంలో మనం ఉండడం అదృష్టం. ఆర్థిక వ్యవస్థలో లోతైన నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫైనాన్షియల్ మార్కెట్లు వేగంగా పరిణతి చెందుతున్నాయి. ఇది భారత్‌కు చెందిన దశాబ్దం. ఇది ఎస్‌బీఐ దశాబ్దం కావాలని కూడా నేను కోరుకుంటున్నాను''అని శెట్టి పేర్కొన్నారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా వ్యవహరించిన దినేష్ ఖరా పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. ఈ నెల మొదట్లో శెట్టి నియామకం జరిగిన సంగతి తెలిసిందే.

తెలుగుతేజం.. అపార అనుభవం..

కొత్త చైర్మన్ శ్రీనివాసులు శెట్టి ఉమ్మడి పాలమూరు జిల్లా, మానవపాడు మండలంలోని ఓ మారుమూల గ్రామం పెద్దపోతుల పాడులో జన్మించారు. ఆయన బాల్యం పూర్తిగా ఇదే గ్రామంలో గడిచింది. 7వ తరగతి వరకూ గ్రామంలోనే విద్యనభ్యసించిన ఆయన, అనంతరం గద్వాల్‌లో పదవ తరగతి, ఇంటర్ పూర్తిచేశారు. అటు తర్వాత హైదరాబాద్ వచ్చి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తిచేశారు.

ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభం..

1988లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఎస్‌బీఐలో తన కెరీర్‌ను ప్రారంభించారు. గుజరాత్‌లో తొలుత పోస్టింగ్‌లో చేరిన ఆయనకు బ్యాంకింగ్‌లో మూడు దశాబ్దాల అపార అనుభవం ఉంది. ఎస్‌బీఐలో పలు బాధ్యతలను ఆయన నిర్వహించారు. ముఖ్యంగా నాలుగేళ్లపాటు ఇంటర్నేషనల్ బ్యాంకింగ్స్‌లో భాగంగా ఎస్‌బీఐ ఓవర్సీస్ బాధ్యతలు స్వీకరించి అమెరికాలో పనిచేశారు. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఎస్‌బీఐ ఎండీగా పదోన్నతి పొందారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్‌లో సర్టిఫైడ్ అసోసియేట్‌గా పనిచేశారు. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ టాస్క్‌ఫోర్స్‌లు, కమిటీలకు నేతృత్వం వహించిన శెట్టి, ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్‌గా, బ్యాంక్ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ పోర్ట్‌ఫోలియోను పర్యవేక్షించారు.

ఎస్ఎంఈ షేర్లతో జాగ్రత్త



- సెబీ తాజా హెచ్చరికలు
- రీసోర్స్‌ఫుల్ ఐపీవో ఎఫెక్ట్

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా చిన్న, మధ్యతరహా సంస్థల(ఎస్ఎంఈలు) షేర్లపట్ల జాగ్రత్త వహించవలసిందిగా సూచించింది. కొన్ని ఎస్ఎంఈలు తమ కార్యకలాపాలపై అవాస్తవిక అంశాలను ప్రచారం చేస్తూ షేర్ల ధరల కృత్రిమ పెంపునకు తెరతీస్తున్నట్లు సెబీ పేర్కొంది. ఇలాంటి కంపెనీలలో ఇన్వెస్ట్ చేసేటప్పుడు బహుపరాక్ అంటూ హెచ్చరించింది. లిస్టింగ్ తదుపరి కొన్ని ఎస్ఎంఈలు లేదా ప్రమోటర్లు తమ కార్యకలాపాలపై సానుకూల ప్రకటనలు చేస్తున్నట్లు తెలియజేసింది. రీసోర్స్‌ఫుల్ ఐపీవోకు భారీ బిడ్డింగ్ నేపథ్యంలో సెబీ ఈ హెచ్చరికలు చేసింది.

2012లో షురూ

నిజానికి వర్ధమాన బిజినెస్‌ల నిధుల సమీకరణలో ప్రత్యామ్నాయ మార్గాలుగా 2012లో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌కు తెరతీశాయి. వీటిపట్ల ఇన్వెస్టర్లలో సైతం భారీస్థాయిలో ఆసక్తి పెరుగుతూ వచ్చింది. దశాబ్ద కాలంలో ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ. 14,000 కోట్ల సమీకరణ జరిగింది. అయితే వీటిలో గతేడాది(2023-24)లోనే రూ. 6,000 కోట్లు లభించడం గమనార్హం! తాజాగా రూ. 12 కోట్ల సమీకరణకు చేపట్టిన రీసోర్స్‌ఫుల్ ఆటోమొబైల్ ఐపీవో ఏకంగా రూ. 4,800 కోట్ల బిడ్స్‌ను సాధించింది.

జీవితకాల గరిష్టానికి నిఫ్టీ

ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డు • సెన్సెక్స్ ఏడోరోజూ ముందడుగు



ముంబై: ఐటీ, ఫార్మా షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారమూ లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం కలిసొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లోని మిశ్రమ సంకేతాలతో ఉదయం సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. తర్వాత క్రమంగా పుంజుకొని స్థిరమైన లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 81,712 వద్ద మొదలైంది. ఒక దశలో 328 పాయింట్లు లాభపడి ఆల్‌టైం హై స్థాయి (82,129)కి 90 పాయింట్ల దూరంలో 82,039 గరిష్టాన్ని అందుకుంది. చివరికి 74 పాయింట్లు పెరిగి 81,786 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది వరుసగా ఏడోరోజూ లాభాల ముగింపు. వరుసగా పదో రోజూ లాభాలు కొనసాగించిన ఎన్ఎస్ఈ నిఫ్టీ 35 పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి 25,052 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 112 పాయింట్లు బలపడి 25130 వద్ద కొత్త ఆల్‌టైం హైని నమోదు చేసింది. మెటల్, కమోడిటీ, పీఎస్‌యూ బ్యాంకులు, కమోడిటీ, ఇండస్ట్రియల్, యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

డాలర్ మారకంలో రూపాయి విలువ 4 పైసలు తగ్గి 83.97 స్థాయి వద్ద స్థిరపడింది.

లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్




ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సంస్థ ఓరియెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేరు లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఇష్యూ ధర(రూ.206)తో పోలిస్తే బీఎస్ఈలో 41% ప్రీమియంతో 290 వద్ద లిస్టయ్యింది. ప్రారంభంలోనే భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో 48% ఎగసి రూ.304.45 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి.., అక్కడే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,268 కోట్లుగా నమోదైంది.



మీడియా దిగ్గజం ఆవిర్భావానికి సీసీఐ గ్రీన్ సిగ్నల్

ఆర్ఐఎల్ - డిస్నీ విలీనానికి ఓకే

డీల్ విలువ రూ. 70,000 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) మీడియా విభాగం, వాల్ట్ డిస్నీ మధ్య విలీనానికి కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దేశీయంగా రూ. 70,000 కోట్ల మీడియా దిగ్గజం ఆవిర్భవించనుంది. ఆరు నెలల క్రితమే ప్రకటించిన డీల్‌ను గుత్తాధిపత్య విధానాలను అడ్డుకునే సీసీఐ పరిశీలించింది. ఈ నేపథ్యంలో తొలుత కుదుర్చుకున్న డీల్ నిర్మాణంలో 2 సంస్థలు కొన్ని సవరణలూ ప్రతిపాదించాయి. తాజా డీల్‌కు సీసీఐ అనుమతి మంజూరు చేసింది.

స్వచ్ఛంద సవరణలు: ఆర్ఐఎల్, వయాకామ్18 మీడియా ప్రైవేట్, డిజిటల్18 మీడియా, స్టార్ ఇండియా ప్రైవేట్, స్టార్ టెలివిజన్ ప్రొడక్షన్స్ మధ్య కుదిరిన ఒప్పందంలో స్వచ్ఛంద సవరణల తదుపరి డీల్‌కు ఆమోదముద్ర వేసినట్లు 'ఎక్స్' ద్వారా సీసీఐ వివరించింది. అయితే రెండు పార్టీల ప్రతిపాదిత సవరణలను వెల్లడించలేదు. తాజా డీల్ ప్రకారం ఆర్ఐఎల్, అనుబంధ సంస్థలు విలీన కంపెనీలో 63.16% వాటాను పొందనున్నాయి. మిగిలిన 36.84% వాటా వాల్ట్ డిస్నీకి దక్కనుంది. విలీన సంస్థ రెండు స్ట్రీమింగ్ సర్వీసులు, 120 టీవీ చానళ్లను కలిగి ఉండనుంది. వెరసి దేశీయంగా అతిపెద్ద మీడియా హౌస్‌గా అవతరించనుంది.

విలీన సంస్థ ఇలా..

ఆర్ఐఎల్‌కు గల మీడియా సంస్థలలో నెట్‌వర్క్ 18 ప్రధానమైనదికాగా.. 18 వార్తా చానళ్లను కలిగి ఉంది. కలర్స్ బ్రాండ్‌తో ఎంటర్‌టైన్‌మెంట్ చానల్‌తోపాటు క్రీడా చానళ్లను నిర్వహిస్తోంది. మనీకంట్రోల్.కామ్, బుక్‌మైషో సైట్లతోపాటు కొన్ని మ్యాగజీన్లను ప్రచురిస్తోంది. మరోవైపు ఆర్ఐఎల్ జియోస్టూడియోస్‌సహా కేబుల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు డెన్, హాథవేలో మెజారిటీ వాటాలను కలిగి ఉంది. 21 సెంచరీ ఫాక్స్ నుంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్తుల కొనుగోలు ద్వారా డిస్నీ+ హాట్‌స్టార్ దేశీయంగా 2020లో ప్రారంభమైంది. ఇందుకు 71.3 బిలియన్ డాలర్లు వెచ్చించింది. తద్వారా స్టార్ ఇండియా, హాట్‌స్టార్‌లను సొంతం చేసుకుంది. ఎంటర్‌టైన్‌మెంట్, సినిమా, స్పోర్ట్స్ తదితర చానళ్లను కలిగి ఉంది.

టెక్నో పెయింట్స్ 'రిచ్‌వేవ్స్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ కంపెనీ టెక్నో పెయింట్స్ రిచ్‌వేవ్స్ పేరుతో అనుబంధ కంపెనీ ఏర్పాటు చేసింది. రిచ్‌వేవ్స్ బ్రాండ్‌లో 200లకుపైగా రకాల్లో ఇటాలియన్, లగ్జరీ ఫినిషెస్‌ను తయారు చేస్తోంది. హైదరాబాద్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను రాజ్యసభ సభ్యులు, రామ్‌కీ గ్రూప్ చైర్మన్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, క్రెడాయ్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. సంస్థ ఆర్అండ్‌డీ, తయారీ సామర్థ్యానికి రిచ్‌వేవ్స్ నిదర్శనమని టెక్నో పెయింట్స్ సీఎండీ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'విస్తృత స్థాయిలో ఇటాలియన్, లగ్జరీ ఫినిషెస్ తయారు చేస్తున్న ఏకైక భారతీయ కంపెనీ మాదే. వీటి తయారీకై హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ప్రత్యేకంగా ప్లాంటు ఏర్పాటు చేశాం. సహజ సిద్ధంగా లభించే ఇసుక, సున్నపు రాయితో తయారు చేస్తున్నాం. దశాబ్దాలపాటు మన్నికగా ఉంటాయి' అని తెలిపారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఈక్విటీ కరెక్షన్‌తో తిరిగి డిపాజిట్ల వృద్ధి: ఎస్‌బీఐ	యూపీఐ 'విశ్వవ్యాప్త'మే ధ్యేయం: ఆర్‌బీఐ

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-8-2024	
విశాఖ	520-00
చిత్తూరు	508-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఐఐటీల్లో అరుదైన కోర్సులు

» బీటెక్, ఎంటెక్ స్థాయిలో వినూత్న కోర్సులు
» ప్రొడక్షన్, ఇండస్ట్రియల్, మైనింగ్, మినరల్ ప్రోగ్రామ్స్
» జేఈఈ అడ్వాన్స్‌డ్, గేట్ ర్యాంక్‌ల ఆధారంగా సీట్ల భర్తీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో కోర్సులు అనగానే టక్కున గుర్తొచ్చేవి.. సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి బ్రాంచ్‌లే! ఎక్కువ శాతం మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకే మొగ్గు చూపుతారు. పీజీ స్థాయిలోనూ వీటికి సంబంధించిన స్పెషలైజేషన్లపైనే ఆసక్తి! అయితే ఐఐటీల్లో.. మరెన్నో అరుదైన బ్రాంచ్‌లు, స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోనూ ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు!! ఈ నేపథ్యంలో.. పలు ఐఐటీలు అందిస్తున్న వినూత్న కోర్సుల వివరాలు, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం..



ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్

- ఐఐటీ లు అందించే భిన్నమైన బ్రాంచ్..ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ-రూర్కీలలో బీటెక్ ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ కోర్సు అందుబాటులో ఉంది.
- ఎంటెక్ స్థాయిలో ఐఐటీ ఢిల్లీలో ప్రొడక్షన్ అండ్ ఇంజనీరింగ్, ఐఐటీ-రూర్కీలో ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ సిస్టమ్ ఇంజనీరింగ్, ఐఐటీ-బీహెచ్‌యూలో ప్రొడక్షన్ ఇంజనీరింగ్, ఐఐటీ-కాన్పూర్‌లో ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో ఇండస్ట్రియల్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి.
- ఈ కోర్సులో భాగంగా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ అంశాలతోపాటు ఉత్పత్తి ప్రక్రియలోని దశలపైనా అవగాహన కల్పిస్తారు. ఆయా ఉత్పత్తుల క్వాలిటీ కంట్రోల్, వాటికి మార్కెట్‌లో ప్రాధాన్యం కల్పించడం వంటి నిర్వహణపరమైన అంశాలనూ బోధిస్తారు.
- ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ఎల్ అండ్ టీ, టాటా పవర్, రిలయన్స్ వంటి ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లోనూ ఉద్యోగాలు లభిస్తున్నాయి. కమ్యూనికేషన్స్, మాన్యుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, ఫార్మా విభాగాల్లో ఎక్కువ అవకాశాలు ఉంటున్నాయి. ఏడాదికి కనిష్టంగా రూ.7 లక్షలు, గరిష్టంగా రూ.14 లక్షల వేతనం లభిస్తోంది.
- బీటెక్‌లో ప్రవేశాలకు జేఈఈ-అడ్వాన్స్‌డ్, ఎంటెక్‌లో ప్రవేశాలకు గేట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

మినరల్ అండ్ మైనింగ్ ఇంజనీరింగ్

- ఐఐటీ-ఖరగ్‌పూర్, ఐఎస్ఎం-ధన్‌బాద్, ఐఐటీ-బీహెచ్‌యూలలో బీటెక్ మైనింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్ అందుబాటులో ఉంది. అదే విధంగా ఐఐటీ-బీహెచ్‌యూ అయిదేళ్ల బీటెక్+ఎంటెక్ మైనింగ్ ఇంజనీరింగ్ (డ్యూయల్ డిగ్రీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తోంది. ఎంటెక్ స్థాయిలో ఐఐటీ-ఢిల్లీ, ఐఎస్ఎం-ధన్‌బాద్, ఐఐటీ -బీహెచ్‌యూలో మైనింగ్, మినరల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్లు ఉన్నాయి.
- మినరల్ అండ్ మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సులో భాగంగా మైనింగ్ ఎక్స్‌ప్లొరేషన్, ఎక్స్‌ట్రాక్షన్, ప్రాసెసింగ్, మినరల్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ పరిధిలోని మైనింగ్ శాఖలో, అదే విధంగా పరిశోధన సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. దీంతోపాటు ప్రైవేట్ రంగంలోనూ మైనింగ్ సంస్థల్లో ఉద్యోగాలు ఉంటాయి. వీరికి సగటున రూ.12 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.

ఇంజనీరింగ్ సైన్స్

- ఐఐటీల్లో మరో వైవిధ్యమైన బ్రాంచ్.. ఇంజనీరింగ్ సైన్స్. ప్రస్తుతం ఈ ప్రోగ్రామ్ ఐఐటీ-హైదరాబాద్, జోధ్‌పూర్‌లలో మాత్రమే అందుబాటులో ఉంది.
- ఇంజనీరింగ్, సైన్స్ సబ్జెక్ట్‌ల సమ్మిళితంగా ఉండే ఈ బ్రాంచ్‌లో మూడో ఏడాది నుంచి స్పెషలైజేషన్ విధానం అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు బయో టెక్, బయో మెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈ, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటీరియల్ సైన్స్, కెమిస్ట్రీ, డిజైన్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్, సైకాలజీ వంటి సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. మొదటి రెండేళ్లు మాత్రం మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లతోపాటు ఇంజనీరింగ్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లను బోధిస్తారు.
- ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి డిజైన్, డెవలప్‌మెంట్, రీసెర్చ్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఇంజనీర్స్ హోదాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీరికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో రూ.14 లక్షల వార్షిక వేతనంతో ఆఫర్స్ లభిస్తున్నాయి.

ఐఐటీ-ముంబైలో ఐఈఓఆర్

- ఐఐటీ-ముంబై ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించిన వినూత్నమైన బీటెక్ ప్రోగ్రామ్.. ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్(ఐఈఓఆర్)! మ్యాథమెటికల్, డెసిషన్ మోడల్స్, సిమ్యులేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ నైపుణ్యాలను ఈ కోర్సులో బోధిస్తారు.
- ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి డేటా అనలిస్ట్, సప్లై చైన్ అనలిస్ట్, ఏఐ ఇంజనీర్, ఫైనాన్షియల్/రిస్క్ అనలిస్ట్, కన్సల్టెంట్, ఆపరేషన్స్ మేనేజర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. దీంతోపాటు కోర్ విభాగాలకు సంబంధించి ఇండస్ట్రియల్ ఇంజనీర్, ఆపరేషన్స్ రీసెర్చర్స్ వంటి కొలువులు కూడా అందుబాటులో ఉంటాయి. ఎంటెక్‌లో కూడా ఐఈఓఆర్ స్పెషలైజేషన్‌ను ఐఐటీ-ముంబై అందిస్తోంది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి అనలిస్ట్, రీసెర్చర్, ప్రొఫెసర్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. సగటున రూ.15 లక్షల వార్షిక వేతనం లభిస్తుంది.

సిరామిక్ ఇంజనీరింగ్

- ఐఐటీ-బీహెచ్‌యూ బీటెక్ స్థాయిలో తాజాగా ప్రారంభించిన బ్రాంచ్.. సిరామిక్ ఇంజనీరింగ్. ఇదే విభాగంలో అయిదేళ్ల బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సును కూడా ఈ ఇన్‌స్టిట్యూట్ అందిస్తోంది.
- ఈ కోర్సుల ద్వారా సిరామిక్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన అంశాలతోపాటు సివిల్, మెటలర్జికల్, కెమికల్, మెకానికల్, బయో మెడికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఇంజనీరింగ్ నైపుణ్యాలు కూడా లభిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఆటోమోటివ్, హెల్త్‌కేర్, ఎనర్జీ రంగాల్లో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయి.
- సెయింట్ గోబైన్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అంబుజా సిమెంట్స్, సెరా, ఐమెరీస్, టాటా స్టీల్, ఉడాన్, వాల్‌మార్ట్ తదితర సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. గత ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఈ బ్రాంచ్ విద్యార్థులకు సగటు వార్షిక వేతనం రూ.24 లక్షల వరకు అందింది.

ఇంజనీరింగ్ ఫిజిక్స్

- బీటెక్ స్థాయిలో ఐఐటీల్లో అందుబాటులో ఉన్న మరో విభిన్నమైన ప్రోగ్రామ్.. ఇంజనీరింగ్ ఫిజిక్స్. ప్రస్తుతం దేశంలో ఐఐటీ-ముంబై, మండి, ఢిల్లీ, ఇండోర్, హైదరాబాద్, చెన్నై, పాట్నా, రూర్కీ, రోపార్, గువహటి, తిరుపతి, ధర్వాడ్ క్యాంపస్‌లలో, అదే విధంగా ఐఎస్ఎం-ధన్‌బాద్ క్యాంపస్‌లో ఈ బ్రాంచ్ అందుబాటులో ఉంది. ఎంటెక్ స్థాయిలోనూ అప్లైడ్ ఆప్టిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, నానో టెక్నాలజీ వంటి స్పెషలైజేషన్లు ఉన్నాయి.
- ఈ బ్రాంచ్‌లో ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన అంశాలు సమ్మిళితంగా ఉంటాయి. ఇంటర్ డిసిప్లినరీ అప్రోచ్‌తో బోధన సాగుతోంది. ఫలితంగా విద్యార్థులు డేటా సైన్స్, ఏఐ-ఎంఎల్ వంటి కోర్సులను ఎంచుకోవచ్చు.
- ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఫిజిసిస్ట్‌గా, పలు ఉత్పత్తి సంస్థల్లో అనలిస్ట్‌లుగా అవకాశాలు లభిస్తాయి. ఐటీ టెక్నికల్ అనలిస్ట్, ప్రొడక్ట్ టెస్ట్ ఇంజనీర్, క్వాంటమ్ మెటీరియల్ సైన్స్ స్పెషలిస్ట్, మెషీన్ విజన్ అప్లికేషన్స్ ఇంజనీర్, రీసెర్చ్ అసోసియేట్ వంటి జాబ్ ప్రొఫైల్స్ అందుకోవచ్చు.

జేఈఈ అడ్వాన్స్‌డ్, గేట్‌తో ప్రవేశం

ఐఐటీల్లోని ఈ విభిన్న కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి బీటెక్ కోర్సులకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకును, ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గేట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. బీటెక్ స్థాయిలో ఈ కోర్సుల పట్ల అంతగా అవగాహన లేకపోవడంతో.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 20 వేల పైన ర్యాంకు వచ్చిన వారికి కూడా సీటు లభించే అవకాశముంది. గేట్‌లో సైతం 400 నుంచి 450 స్కోర్‌తో ఈ బ్రాంచ్‌లకు సంబంధించిన స్పెషలైజేషన్లలో అడుగు పెట్టే అవకాశం ఉంది.

లేటెస్ట్ టెక్నాలజీ సమ్మిళితంగా

మైనింగ్, ప్రొడక్షన్,మినరల్, ఇంజనీరింగ్ సైన్స్ వంటి వినూత్న కోర్సులను అందిస్తున్న ఐఐటీలు.. ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా లేటెస్ట్ టెక్నాలజీ అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నాయి. సదరు బ్రాంచ్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ వంటి కోర్సులను కరిక్యులంలో భాగంగా చేశాయి. ఫలితంగా విద్యార్థులకు ఈ రంగాల్లోనూ వినియోగంలోకి వస్తున్న ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌పై అవగాహన ఏర్పడుతోంది.

గెయిల్‌లో 391 ఉద్యోగాలు

» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక



కేంద్ర ప్రభుత్వానికి చెందిన న్యూఢిల్లీలోని మహారత్న సంస్థ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్).. మొత్తం 391 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్టుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం ఉద్యోగాలు:** 391 (రిజర్వేషన్ల వారీగా అన్ రిజర్వ్‌డ్-174 పోస్టులు,ఈడబ్ల్యూఎస్‌లకు-29,ఓబీసీ-89,ఎస్సీ-60,ఎస్టీలకు 39 పోస్టులు)

విభాగాలు

జూనియర్ ఇంజనీర్(కెమికల్)-2, జూనియర్ ఇంజనీర్(మెకానికల్)-1, ఫోర్‌మెన్(ఎలక్ట్రికల్)-1, ఫోర్‌మెన్ ఇన్‌స్ట్రుమెంటేషన్-14, ఫోర్‌మెన్(సివిల్)-6, జూనియర్ సూపరిండెంట్(అఫిషియల్ లాంగ్వేజ్)-5, జూనియర్ కెమిస్ట్-8, జూనియర్ సూపరిండెంట్(అఫిషియల్ లాంగ్వేజ్)-5, జూనియర్ కెమిస్ట్-8, జూనియర్ అకౌంటెంట్-14, టెక్నికల్ అసిస్టెంట్(ల్యాబరేటరీ)-3, ఆపరేటర్(కెమికల్)-73, టెక్నీషియన్(ఎలక్ట్రికల్)-44, టెక్నీషియన్ (ఇన్‌స్ట్రుమెంటేషన్)-45, టెక్నీషియన్(మెకానికల్)-39, టెక్నీషియన్ (టెలికం అండ్ టెలిమెట్రీ)-11, ఆపరేటర్-39, ఆపరేటర్(బాయిలర్)-8, అకౌంట్స్ అసిస్టెంట్స్-13, బిజినెస్ అసిస్టెంట్స్-65.

అర్హతలు

- **ఆపరేటర్(కెమికల్):** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో బీఎస్సీ డిగ్రీ లేదా కెమిస్ట్రీతో బీఎస్సీ(ఆనర్స్) 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.ప్రభుత్వ/ప్రైవేట్ రంగంలో కెమికల్ విభాగంలో ఏడాది పని అనుభవం తప్పనిసరి.
- **టెక్నీషియన్(ఎలక్ట్రికల్):** మెట్రిక్, ఐటీఐ ట్రేడ్స్ మ్యాన్‌షిప్ లేదా ఎలక్ట్రికల్ /వైర్‌మ్యాన్ ట్రేడ్‌లో నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్ ఉండాలి.
- **టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్):** మెట్రిక్, ఐటీఐ ట్రేడ్స్‌మ్యాన్‌షిప్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ట్రేడ్‌లో నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్ ఉండాలి. రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.
- **టెక్నీషియన్(మెకానికల్):** మెట్రిక్, ఐటీఐ ట్రేడ్స్ మ్యాన్‌షిప్/ఫిట్టర్/డీజిల్ మెకానిక్/మెషినిస్ట్/టర్నర్ ట్రేడ్‌లో నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్, మెకానికల్ రంగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 26 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ,ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు కేటగిరిలను బట్టి 10-15 ఏళ్ల వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

- ఈ పోస్టులకు ఎంపిక ప్రక్రియలో భాగంగా రాత పరీక్ష లేదా ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు. రాత పరీక్షను హిందీ/ఇంగ్లిష్ మీడియంలో హాజరుకావచ్చు. మొత్తం 100 ప్రశ్నలకు-100 మార్కులు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. నెగిటివ్ మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. రాత పరీక్షలో యూఆర్/ఈడబ్ల్యూఎస్‌లు కనీసం 40 శాతం, ఓబీసీలు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ/పీడబ్ల్యూబీడీలు 30 శాతం కనీస అర్హత మార్కులు సాధించాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలోనే పరీక్ష కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు హైదరాబాద్‌లో పరీక్షను నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 07.09.2024
- వెబ్‌సైట్ : www.gailonline.com/CRApplyingGail.html

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఆర్‌డీఏఐ, హైదరాబాద్‌లో 49 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 49.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఐటీ/సీఎస్ఈ), పీజీ డిప్లొమా (ఎకనామిక్స్/క్వాంటిటేటివ్ ఎకనామిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » వయసు: 20.09.2024 నాటికి 30ఏళ్లు మించకూడదు.» ఎంపిక విధానం: రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 21.08.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.09.2024.
» వెబ్‌సైట్: http://irdai.gov.in

యూఎస్.. మనదే జోష్

ఉద్యోగాలు చేసేవారి నుంచి ఉద్యోగాలు ఇచ్చేవారి దాకా భారతీయ అమెరికన్ల హవా

శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కంచర్ల యాదగిరిరెడ్డి



భారతీయ అమెరికన్లు...

టెక్నాలజీ ప్రపంచం రూపురేఖలు మారుస్తున్నారు..
వైద్యుల రూపంలో ప్రాణాలు కాపాడుతున్నారు..
విద్యావేత్తలుగా భావితరాలను తీర్చిదిద్దుతున్నారు..
కళాకారులుగా సాంస్కృతిక రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్నారు..
మేధావులుగా జ్ఞానాన్ని పంచుతున్నారు..
శాస్త్రవేత్తలుగా విశ్వం రహస్యాలను ఛేదిస్తున్నారు
.. పట్టుదల.. నైపుణ్యం.. వైవిధ్యతల కలబోతగా అమెరికన్ సమాజాన్ని సమృద్ధం చేస్తున్నారు. ఈ విజయాలు, గాథలు.. అమెరికా పురోగతి, సమైక్యతల్లో భారతీయ అమెరికన్ల పాత్రకు తార్కాణాలు!!"

.. ఇది భారతీయుల గురించి మనకు మనం చెప్పుకుంటున్న గొప్పలు కాదు.. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కన్సల్టింగ్ సంస్థ బీసీజీ గ్లోబల్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో వెల్లడించిన అచ్చమైన వాస్తవం.

దశాబ్దాల క్రితం ఉపాధి కోసం, సంపాదన కోసం ఖండాలు దాటి అగ్రరాజ్యం అమెరికాలో అడుగిడిన భారతీయులు అక్కడి సమాజంతో మమేకమైపోయారు. భారత్‌లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంటే.. అమెరికాలో మాత్రం మనవాళ్లు ఐదో వంతు మంది ఇప్పటికీ తాతముత్తాతల ఇళ్లలోనే ఉంటున్నారు. సంపాదించే ప్రతి డాలర్‌లో కొంత దాచుకునే ప్రయత్నం, పిల్లలకు మంచి చదువులు చెప్పించడం వంటివి కూడా మన భారతీయ అలవాట్లే. అంతేకాదు.. ప్రతి భారతీయ అమెరికన్ తన కోసం, తన కుటుంబం బాగు కోసం చేస్తున్న ప్రయత్నాలన్నీ.. అక్కడి సమాజానికి, ఆ దేశ పురోగతి మొత్తానికి కూడా ఉపయోగపడుతుండటం విశేషం. దీనిపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

భారతీయ అమెరికన్లు అమెరికా సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన స్థాయిలో సేవలు అందిస్తున్నారు. వలస వచ్చి ఒక దేశంలో బతకడమే కష్టమనుకునే పరిస్థితుల్లో.. భారతీయులు అక్కడి సమాజంతో మమేకం అవడమే కాకుండా టెక్నాలజీ, వైద్యం, విద్య, వ్యాపారాల్లో రాణించి అమెరికన్లకూ మేలు చేయగలుగుతున్నారు. సుమారు 30 కోట్ల జనాభా ఉన్న 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ)'లో భారతీయుల సంఖ్య యాభై లక్షల వరకు ఉంటుందని అంచనా. అంటే అక్కడి జనాభాలో సుమారు రెండు శాతం. కానీ ఆ దేశంలోని 60% హోటళ్లు, సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాలు ఇతర వ్యాపారాలలో వీరికి భాగస్వామ్యం ఉంది. కోటి మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో ఉన్నారు. వందల కోట్ల డాలర్ల విలువైన స్టార్టప్ కంపెనీలు స్థాపించగలిగారు. టాప్ టెక్నాలజీ కంపెనీల సీఈవోల నుంచి ట్రక్ డ్రైవర్ల దాకా ఎన్నో ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. అమెరికా స్థానికుల కంటే సగటు భారతీయ అమెరికన్ కుటుంబం రెట్టింపు వార్షికాదాయాన్ని కలిగి ఉందంటేనే పరిస్థితి ఏమిటన్నది అర్థమవుతుంది.

చదువే పెట్టుబడిగా..

భారతీయ అమెరికన్లు తమ పిల్లలకు మంచి విద్య అందించేందుకు కృషి చేస్తున్నారు. కనీసం 70శాతం మంది బ్యాచిలర్స్ డిగ్రీ వరకు చదువుకుంటున్నారు. 2007 నుంచి 2023 ఏప్రిల్ మధ్య 16 లక్షల మంది గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. భారతీయ అమెరికన్లలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినవారు 40 శాతం ఉంటే.. అమెరికా స్థానికులలో ఇది కేవలం 13 శాతమే కావడం గమనార్హం. భారతీయ అమెరికన్లు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ రంగాల కోర్సులు చేస్తున్నారు. బాగా చదువుకున్న తల్లిదండ్రులు ఉండటం భారతీయ అమెరికన్ కుటుంబాల్లోని భావితరాలకు మరో వరం అని చెప్పవచ్చు. ప్రతిష్ఠాత్మక స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలు 34 సార్లు జరిగితే అందులో 28సార్లు ఇండియన్ అమెరికన్లే విజేతలుగా నిలిచారు. మంచి చదువు, నైపుణ్యాలతో.. మనవాళ్లు ఏ రంగంలో స్థిరపడ్డా బాగా రాణించగలుగుతున్నారు. జీతాలు మెరుగ్గా ఉంటున్నాయి. భారతీయ అమెరికన్ కుటుంబం సగటు వార్షికాదాయం 1,23,700 డాలర్లు (కోటి రూపాయలకుపైనే) ఉంది. అమెరికా స్థానిక కుటుంబాలతో పోలిస్తే ఇది సుమారు రెట్టింపు కావడం గమనార్హం.

330 కోట్ల డాలర్లు

అమెరికాలోని వివిధ యూనివర్సిటీల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు పెడుతున్న ఖర్చులు, చెల్లిస్తున్న ఫీజులు కలిపి సుమారు 330 కోట్ల డాలర్లు ఉంటాయని అంచనా. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ సొమ్ము కూడా కీలకమే.

విద్యా రంగంపైనా మన ముద్ర

భారతీయ అమెరికన్లు అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఉన్నత హోదాల్లో పనిచేస్తున్నారు. అగ్రరాజ్యంలో విద్యారంగంపై తమదైన ముద్ర వేస్తున్నారు. డాక్టర్ నీలి బెండపూడి పెన్‌స్టేట్ యూనివర్సిటీ తొలి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికై చరిత్ర సృష్టించగా.. ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన 'డోయిర్ స్కూల్ ఆఫ్ సస్టెయినబిలిటీ' తొలి డీన్‌గా అరుణ్ మజుందార్ పనిచేస్తున్నారు. శుభ్ర సురేశ్ కార్నెగీ మెలన్ యూనివర్సిటీ అధ్యక్షులుగా ఉండగా.. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా చాన్సలర్‌గా ప్రదీప్ ఖోస్లా వ్యవహరిస్తున్నారు. ఇదే యూనివర్సిటీ బర్కిలీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ డీన్‌గా ఎస్.శంకర శాస్త్రి ఉన్నారు. అంతేకాదు మరెన్నో వర్సిటీల్లో భారతీయ అమెరికన్లు అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఒక అంచనా ప్రకారం అమెరికాలోని యూనివర్సిటీలు, కాలేజీలన్నింటిలో కలిపి సుమారు 22 వేల మంది భారతీయ అమెరికన్ అధ్యాపకులు ఉన్నారు. మొత్తం అధ్యాపకుల్లో మనవాళ్ల వాటా 2.6 శాతం. సిలికాన్ వ్యాలీలోని హార్వర్డ్ లా స్కూల్, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ సభ్యుడిగా వివేక్ వాధ్వా సేవలందిస్తుండగా.. ఆన్‌లైన్ విద్య విప్లవానికి నాంది పలికిన 'ఎడ్ఎక్స్' కంపెనీ సీఈవో, ఎంఐటీ అధ్యాపకుడు అనంత్ అగర్వాల్ కూడా భారతీయ అమెరికనే.

పరిశోధనలు, పేటెంట్లతోనూ..

యూనివర్సిటీలు, కాలేజీల పాలన, బోధన మాత్రమే కాకుండా.. పరిశోధనల ద్వారా కూడా భారతీయ అమెరికన్లు విద్యా వ్యవస్థలో భాగమవుతున్నారు. అమెరికాలో 2023లో ప్రచురితమైన పరిశోధన వ్యాసాలన్నింటిలో భారతీయ సంతతి పరిశోధకుల భాగస్వామ్యం 13 శాతానికిపైగా ఉండటం ఈ విషయాన్ని రుజువు చేస్తోంది. అలాగే పది శాతం పేటెంట్లు కూడా మనవాళ్ల పేరుతోనే జారీ అవుతున్నాయి. పరిశోధనలకు అందించే ఎన్ఐహెచ్ గ్రాంట్లలోనూ భారతీయ అమెరికన్ల వాటా 11 శాతం కంటే ఎక్కువే.

విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యం

గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సిస్టమ్స్ శాంతను నారాయణన్.. మనం తరచూ ఈ పేర్లు వింటుంటాం. ప్రపంచంలోనే టాప్ కంపెనీలను నడుపుతున్న భారతీయ అమెరికన్లు వారు. అంతేకాదు అమెరికాలో భారతీయులు సృష్టించిన వ్యాపార సామ్రాజ్యం చాలా పెద్దది. ప్రపంచం గతిని మార్చేసిన సిలికాన్ వ్యాలీ టెక్ కంపెనీల్లో 15.5 శాతం భారతీయ సంతతి వాళ్లు ఏర్పాటు చేసినవే. టెక్ కంపెనీలే కాదు.. ప్రతి వీధి చివర ఒక సూపర్ మార్కెట్, లేదంటే హోటల్ నడుపుతున్నది మనవాళ్లే. అమెరికా మొత్తమ్మీద ఉన్న హోటళ్లలో 60శాతం భారతీయులవే.

ఉద్యోగ కల్పనకు ఇతోధిక తోడ్పాటు

గూగుల్, మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి 16 పెద్ద కంపెనీలను నడిపిస్తున్న భారతీయ అమెరికన్లు.. ఉద్యోగ కల్పన విషయంలోనూ ముందున్నారు. ఈ కంపెనీల్లో సుమారు 27 లక్షల మంది అమెరికన్లు ఉద్యోగం చేస్తున్నారు. వంద కోట్ల డాలర్లకుపైగా విలువైన యూనికార్న్ కంపెనీలు అమెరికాలో 648 వరకూ ఉంటే.. అందులో భారతీయ అమెరికన్లు ఏర్పాటు చేసినవే 72. వీటి మొత్తం విలువ 195 బిలియన్ డాలర్లు. సుమారు 55,000 మంది ఉపాధి పొందుతున్నారు. మరోవైపు అమెరికాలోని హోటళ్లలో 60శాతం భారతీయ అమెరికన్లవే. ఈ రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తోందని అంచనా. అంటే భారతీయ అమెరికన్లు 24 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్టు లెక్క. చిన్న దుకాణాలు, సూపర్ మార్కెట్ల ద్వారా మరో 3.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. మొత్తంగా భారతీయ అమెరికన్లు కోటి మంది జీవనానికి సాయపడుతున్నట్టు అంచనా.


శంతను నారాయణన్
అడోబ్ సీఈవో

సుందర్ పిచాయ్
గూగుల్ సీఈవో


ఆర్థిక ఇంధనం

అమెరికా స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 2023లో 27.36 లక్షల కోట్ల డాలర్లు. ఇందులో భారతీయ అమెరికన్ల వాటా సుమారు లక్ష కోట్ల డాలర్లు. ఖర్చు పెట్టగల స్థోమత, పన్నుల చెల్లింపు, వ్యాపారాల ద్వారా ఇంత మొత్తాన్ని అమెరికా ఆర్థిక వ్యవస్థకు జోడించగలుగుతున్నారు మనవాళ్లు. ఏటా భారతీయ అమెరికన్లు చెల్లించే పన్నులు 30,000 కోట్ల డాలర్లుగా అంచనా. భారతీయ అమెరికన్లు అక్కడ ఏర్పాటు చేసిన హోటళ్ల ద్వారా వచ్చే ఆదాయం 70,000 కోట్ల డాలర్లు. భారతీయ అమెరికన్లు రోజువారీ సరుకులు మొదలు.. వినోద, విహారాల దాకా ఏటా పెడుతున్న ఖర్చు 37,000 కోట్ల డాలర్ల నుంచి 46,000 కోట్ల డాలర్ల వరకూ ఉంటుంది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వానికి అందే సేల్స్ ట్యాక్స్, ఇతర పన్నుల రూపంలో భారీగానే ఆదాయం సమకూరుతోంది.

టాప్ భారతీయ అమెరికన్‌లు వీరే..


జయ్ చౌధురి
సీఈవో, జెడ్ స్కేలర్ (సైబర్ సెక్యూరిటీ రంగంలో అగ్రగామి సంస్థ)

వినోద్ ఖోస్లా
సన్ మైక్రో సిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు, ఖోస్లా వెంచర్స్ అధినేత



రొమేశ్ టి.వాధ్వానీ
సింఫనీ టెక్నాలజీ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో

రాకేశ్ గంగ్వాల్
ఇండిగో విమానాల సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సహ వ్యవస్థాపకుడు



అనిల్ భుస్రీ
క్లౌడ్ ఆధారిత ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ 'వర్క్‌డే' సహ వ్యవస్థాపకుడు

నీరజ్ షా
ఇంటి సామన్లు అమ్మే ఈ-కామర్స్ కంపెనీ వేఫెయిర్ సీఈవో, సహ వ్యవస్థాపకుడు



బైజూ భట్
కమీషన్ లేకుండా ట్రేడింగ్ సౌకర్యం అందించే కంపెనీ రాబిన్ హుడ్ వ్యవస్థాపకుడు

రోహన్ సేథ్
ఆడియో ఆధారిత సోషల్ నెట్‌వర్కింగ్ అప్లికేషన్ 'క్లబ్‌హౌస్' కంపెనీ సహ వ్యవస్థాపకుడు.


స్టార్టప్‌ల స్థాపనలోనూ..

సోషల్ నెట్‌వర్కింగ్ అనగానే ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటివి గుర్తుకొస్తాయి. అలా కాకుండా ఆడియో ద్వారా కూడా సోషల్ ప్లాట్‌ఫామ్ నడపవచ్చని నిరూపించారు భారతీయ అమెరికన్ రోహన్ సేథ్. 'క్లబ్‌హౌస్' పేరుతో ఆయన అభివృద్ధి చేసిన అప్లికేషన్ ఇప్పుడు పాపులర్. షేర్ల వ్యాపారం చేసే రాబిన్‌హుడ్, ఇంటికే సరుకులు తీసుకొచ్చిన 'ఇన్‌స్టాకార్ట్' వంటి స్టార్టప్‌లు భారతీయ అమెరికన్ల బుర్రల్లోంచి పుట్టుకొచ్చినవే.

అమెరికాలో 'మన' లెక్కలు

51 లక్షలు — అమెరికాలోని భారతీయుల సంఖ్య

50 శాతం పైగా — భారతీయ అమెరికన్లు కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూయార్క్, న్యూజెర్సీ, ఇల్లినాయిస్ రాష్ట్రాల్లోనే ఉంటారు.

20 శాతం — భారతీయ అమెరికన్లలో ఉమ్మడి కుటుంబాలుగానే ఉన్నవారు.

అమెరికాపై ఇండియన్ల ఎఫెక్ట్ ఇదీ..

10% — అమెరికన్లలో తరచూ యోగా చేసేవారు..

36,000 — ఆ దేశవ్యాప్తంగా ఉన్న యోగా స్టుడియోల సంఖ్య

1.5% — అమెరికాలోని లాయర్లలో భారత సంతతి వారు

96 — 2015-2023 మధ్య అమెరికాలో మిలియన్ డాలర్లకుపైగా వసూళ్లు చేసిన భారతీయ సినిమాలు - వీటి మొత్తం వసూళ్లు 340 మిలియన్ డాలర్లు

3% — అమెరికాలోని జర్నలిస్టులలో భారత సంతతివారు

10% — అమెరికాలోని వైద్యుల్లో భారతీయులు

30% — మొత్తం పేషెంట్లలో వీళ్లు వైద్యం అందిస్తున్నవారు..

3% — అమెరికాలోని ప్రభుత్వ ఉద్యోగాలు, సర్వీసులలో భారతీయ సంతతివారు

బుద్ధిగా బడికొస్తోంది.. కొద్దిగా భోంచేస్తోంది



పాఠశాల మధ్యాహ్న భోజనానికి ఓ జాతీయ పక్షి కూడా హాజరవుతోంది. కర్ణాటకలో విజయపుర (బిజాపుర) జిల్లా జంబగి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలలకు రోజూ మధ్యాహ్న భోజనం వడ్డిస్తారు. ఈ సమయంలో అప్పుడప్పుడు ఒక నెమలి వచ్చి కింద పడిన అన్నం తినేది. దీంతో భోజన సిబ్బంది ఆ నెమలి కోసం ఒక ప్లేట్‌లో ఆహారం పెట్టడం ప్రారంభించారు. ఇంకేముంది.. విద్యార్థులతో కలిసి ఆ నెమలి కూడా రోజూ ఇలా భోజనం ఆరగించేస్తోంది.

..: సాక్షి, బళ్లారి :..

సీటూ.. ఫీటూ



శ్రావణమాసం ముగుస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. దీంతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సుల్లో సీటు కోసం విన్యాసాలు చేయాల్సి వస్తోంది. ఒక మహిళా భక్తురాలు సీటు కోసం బస్సు కిటికీలో నుంచి లోపలికి ఎక్కడం కనిపించింది. ఎలాగైతేనేం.. మొత్తానికి లోపలికి దూకి సీటు సంపాదించుకుంది.

..: వేములవాడ అర్బన్ :..

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



ఒక నిమిషం... ఒక విషయం

మత సామరస్యం

మహ్మదీయుల నాదనీరాజనం

కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో బీబీ నాంచారి అనే మహ్మదీయ భక్తురాలు ఉంటూ స్వామికి సేవ చేసినట్టు చరిత్ర. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు కూడా తిరుమలేశునికి విలువైన కానుకలు సమర్పించి స్వామిపై తన భక్తిని చాటుకున్నట్టు చరిత్రకారులంటున్నారు.

* షేక్ హుస్సేన్ అనే భక్తుడు భక్తిశ్రద్ధలతో సమర్పించిన 108 బంగారు పుష్పాలతోనే ప్రతి మంగళవారం గర్భాలయంలోని మూలమూర్తికి అష్టదళ పాద పద్మారాధన ప్రత్యేక వారపు సేవ చేస్తుండటం విశేషం.



ఇలా తిరుమల దివ్యక్షేత్రంలో హిందూ– మహ్మదీయులతో అనాటి నుంచి నేటి వరకు అనేక విధాలుగా అనుబంధం నెలకొంది.

ఇదే తరహాలో ప్రపంచ నాదస్వర చక్రవర్తిగా ప్రఖ్యాతి గాంచిన పద్మశ్రీ షేక్ చినమౌలానాకు శ్రీవారి ఆలయంతో అనుబంధం ఏర్పడింది. ఆలయంలో అనేక కైంకర్య కార్యక్రమాలు, ప్రత్యేక సందర్భాల్లో నాదస్వర కచ్చేరి చేసేవారు మౌలానా బ్రహ్మోత్సవాలు, ఇతర ప్రత్యేక పండగ రోజుల్లో నాద నీరాజనంతో స్వామిని కీర్తించారు. అలాంటి మహనీయుడి ఏకైక కుమార్తె వీవీ జాన్ బిడ్డలైన మనుమలు షేక్ ఖాసీం, షేక్ బాబు తిరుమలేశుని ఆలయ నాదస్వర విద్వాంసులుగా సేవలు అందిస్తూ మత సామరస్యాన్ని చాటుతుండటం విశేషం.

మీకు తెలుసా?

కర్పూరం ఎక్కడి నుంచి వస్తుంది?



ఇది రసాయనాలతో కృత్రిమంగా తయారయింది అనుకుంటారు చాలామంది. కానీ, కర్పూరం చెట్టు నుండి ఉత్పత్తి అవుతుంది అన్నది అక్షర సత్యం. నిజమే! కర్పూరం కాంఫర్ లారెల్ అనే చెట్టునుంచి లభ్యమవుతుంది. కర్పూరాన్ని ఆ చెట్ల ఆకులు, కొమ్మలనుంచి తయారు చేస్తారు. అలాగే కొన్నిరకాలైన తులసి (కర్పూర తులసి) జాతులనుండి కూడా కర్పూరాన్ని తయారుచేస్తారు. కర్పూర చెట్ల కాండంమీద గాట్లు పెడతారు. ఆ గాట్లలోంచి పాలు వస్తాయి. ఆ పాలతో కర్పూరం తయారౌతుంది. కర్పూరం చెట్టు వంద అడుగుల వరకూ పెరిగే సుందరమైన నిత్య హరిత వృక్షం. చక్కని సువాసన కలిగిన పట్ట కలిగి ఉంటుంది. ఆకులు పొడవుగా ఉండి ఫిబ్రవరి, మార్చి నెలల్లో రాలతాయి. పువ్వులు చిన్నవిగా ఉంటాయి. పండ్లు ముదురు ఆకుపచ్చని రంగులో ఉండి అక్టోబర్‌లో పక్వానికి వస్తాయి. ఈ చెట్లు చైనా, జపాన్ దేశాల్లో విస్తారంగా పెరుగుతాయి. మన దేశంలో దీనిని నీలగిరి కొండల్లో పెంచుతారు. అలాగే మైసూర్‌లోనూ, మలబార్ ప్రాంతంలోనూ కర్పూరం చెట్లు కనిపిస్తాయి.

ఆచారం.. సంప్రదాయం



హిందూ వివాహ తంతులో మాంగల్యధారణే అతి ప్రధానమైంది. మాంగల్యానికే మంగళసూత్రం, తాళి, తాళిబొట్టు, పుస్తె, శతమానం అనే పేర్లతో బాటు వివిధ రూపాలు కూడా ఉన్నాయి. స్త్రీలు మంగళ సూత్రం ధరించడం భారతీయ సంప్రదాయం. ఈ ఆచారం ఈనాటిది కాదు. పెళ్ళినాడు వరుడు వధువుకు తాళికట్టే సాంప్రదాయం ఆరో శతాబ్దంలోనే ఆరంభమయింది. మంగళ సూత్రం అనే శబ్దం సంస్కృతం నుండి పుట్టింది. సంస్కృతంలో 'మంగళ' అంటే శోభాయమానం, శుభప్రదం అనే అర్థాలున్నాయి. సూత్రం అంటే తాడు, ఆధారమైనది అని అర్థాలు ఉన్నాయి. సాధారణంగా మంగళసూత్రాన్ని 108 సన్నని పోగులు, దారాలు కలిపి దానికి పసుపు రాసి తయారు చేస్తారు. ఇలా కలపబడిన తొమ్మిది లేదా పదకొండు కలిపి కూడా కొందరు తాళిని తయారు చేస్తారు. మంగళ సూత్రధారణ జరిటేటప్పుడు ఈ మంత్రాన్ని పఠిస్తారు.

' మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా! కంఠే భద్నామి సుభగే త్వం జీవ శరదాం శతం!! ''

మంగళ సూత్రం భార్యా భర్తల శాశ్వత అనుబంధానికి గుర్తు. అది వైవాహిక జీవితాన్ని సమస్త కీడు నుండి తొలగిస్తుందని విశ్వాసం..

స్వీయ క్రమశిక్షణ



సిక్కుమతంలో ఐదవ గురువైన గురు అర్జున్ దేవ్ క్రమశిక్షణకు పెట్టింది పేరు. ఆయన తన గురువైన 'గురు రామ్ దాస్' దగ్గర శిష్యరికం చేస్తూ ఉన్నప్పుడు ప్రతిరోజూ తెల్లవారుజామునే లేచి నీరు తీసుకు రావడంతోపాటు వంటపాత్రలు, ఇతరులు భోజనం చేసిన పళ్ళాలనూ శ్రద్ధగా తోమేవాడు. గురువు దగ్గర జ్ఞానాన్ని ఎంత శ్రద్ధగా నేర్చుకునేవాడో .. తనకు అప్పగించిన పనిని కూడా అంతే అంకితభావంతో చేసేవాడు ... గురు రామ్ దాస్ చనిపోయే సమయంలో అతని దగ్గర ఉన్న మిగతా శిష్యులు హర్ మిందర్ సాహిబ్' అంటే స్వర్ణ దేవాలయ నిర్వహణ బాధ్యతను తమకు అప్పగించమంటే .. తమకు అప్పగించండి' అంటూ తమ గురువును ప్రాధేయపడ్డారు. అయితే గురు రామ్ దాస్ మాత్రం .. ఇవేవీ పట్టనట్లు తన పనిని తాను చేసుకుపోతున్న అర్జున్ దేవ్‌నే చాలాకాలం పాటు గమనించి.. చివరికి అతనినే తనకు వారసుడిగా ప్రకటించారు!

స్వీయ క్రమశిక్షణ అనేది ఓ గొప్ప వ్యక్తిత్వపు లక్షణం. ఇది నిరంతరం చేయాల్సిన తపస్సు లాంటిది. ఒకానొక విద్యార్థి తన జీవితంలో పాటించే స్వీయ క్రమశిక్షణ ఆ విద్యార్థి పూర్తి జీవితానికి బంగారు బాట అవుతుంది.

ధర్మసందేహాలు

పూజలో కొట్టిన కొబ్బరికాయ కుళ్లితే దోషమా?

– డి. వరలక్ష్మి, హైదరాబాద్

కావాలని కుళ్లిన కొబ్బరికాయని మనం తేలేదు కాబట్టి భయపడనక్కర్లేదు. మరో కొబ్బరికాయని తేగల అవకాశం అప్పుడుంటే సరే సరి. మరోసారి పూజకి కూర్చున్నప్పుడు ఈ కొబ్బరికాయకి బదులుగా మరో కొబ్బరికాయని కొడితే సరి. పూజ లోపానికీ కొబ్బరికాయ కుళ్లడానికీ సంబంధం లేదు.

రాహుకాల దీపం గురించి చెప్పగలరు..

– అప్పారావు, సాలూరు

జాతకంలో రాహుదోషం ఉన్న పక్షంలో ప్రతిదినం వచ్చే రాహుకాలంలో రాహుగ్రహ స్తోత్రాన్ని చదువుతూ దీపాన్ని వెలిగించి 18 గుణకాలలో (36, 54, 72, 90...) ఇలా ఆ స్తోత్రాన్ని రాహుకాలం ఉండే 90 నిమిషాలసేపూ పారాయణం చెయ్యాలి.

గృహంలో వాస్తుదోష పరిహారానికి ఏం చెయ్యాలి?

– ఆర్. కౌసల్య, చిల్కమర్రి



వాస్తు దోష పరిహారం కోసం గృహప్రవేశం రోజున 'వాస్తుహోమ'మంటూ ఒక దాన్ని చేస్తారు. దోషం తప్పనిసరిగా ఉన్న పక్షంలో మత్స్య యంత్రం, కూర్మ యంత్రం వేస్తారు. ఏది వేసినా ఇంట్లో నిత్య పూజ జరిగితే దోషం ఏమీ చెయ్యదు. ఇది అనుభవపూర్వకంగా పెద్దలు నిరూపించిన సత్యం.



ప్రయాణంలో చెప్పులు వేసుకుని స్తోత్రాలు చదివాను. దోషమా?

– పార్వతి, హైదరాబాద్

ఇంట్లో దైవమందిరం ముందు ఆచారం తప్పనిసరి. పత్తనే పాదమాచారమ్ (బయటకు వెళ్లాక ఆచారం నాలుగవ వంతే ఆచరించ సాధ్యమౌతుంది) అన్నారు. ఇల్లు దాటాక కూడా చదువుకునేందుకే పుట్టినవి స్తోత్రాలు. ఇంట్లో, గుడిలో తప్ప మరోచోట నియమాలు లేవు.

మరణానంతరం నా శరీరాన్ని ఉచితంగా వైద్య కళాశాలకి ఈయదలిచాను. పిల్లలు అంగీకరించడం లేదు..?

– ఒక పాఠకురాలు హైదరాబాద్


మీరు జీవించినంతసేపే మీ శరీరం మీద మీకు హక్కు. మీ పిమ్మట ఆస్తిపాస్తులతోపాటు పార్థివ శరీరమ్మీద అధికారం కూడా పిల్లలకే ఉంటుంది. వాళ్లు అంగీకరించనప్పుడు ఇవ్వడం భావ్యం కాదు. చివరి కాలంలో పిల్లలతో విరోధించడమూ సరికాదు.


60 సంవత్సరాలు నిండినా నేను, నా భార్య ప్రతి విషయంలోనూ తూర్పుపడమరలుగానే ఉన్నాం. లలితానామాలతో సయోధ్య కుదురుతుందా?

– శ్రీనివాస్, విజయనగరం

ఆలుమగలకు బాధ్యతలు తీరాక పరస్పర నిర్లక్ష్య భావం వస్తుంది. ఎదుటివారు తమను అగౌరవ పరుస్తున్నారనే అభిప్రాయం పెరుగుతుంది. గతాన్ని తవ్వుకుంటూ తప్పుల్ని ఎత్తి చూపించుకోవడాన్ని మానితే, సయోధ్య పెరుగుతుంది. లలితాంబ ఇందులో ఏమీ చేయలేదు.








సకల విఘ్నాలనూ తొలగించే దైవంగా తొలి పూజలు అందుకొనే వేలుపు గణనాథుడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారని సూచించే పురాణగాథలు ఉన్నప్పటికీ, ఏ ఆలయంలోనైనా గణేశుడు ఒక్కడే దర్శనమిస్తాడు. ఇద్దరు భార్యలతోనూ కనిపించే ఆలయాలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అలాంటి అరుదైన కోవెళ్ళలోకెల్లా అరుదైన ఆలయం ఒకటుంది. ఇక్కడ భార్యలతో పాటు పుత్రులతో కూడా కలిసి కొలువు తీరాడు పార్వతీ తనయుడు.

సకుటుంబ సమేత.. త్రినేత్ర గణపతి!

రణథంబోర్ వినాయకుడిని పరమ శక్తిమంతునిగా, రాజ్య రక్షకునిగా స్థానిక చరిత్ర అభివర్ణిస్తోంది. అది క్రీస్తు శకం 1299వ సంవత్సరం. రణథంబోర్ రాజు హమీర్‌కూ, ఢిల్లీ పాలకుడు అల్లావుద్దీన్ ఖిల్జీకీ మధ్య యుద్ధం మొదలైంది. యుద్ధ సమయంలో సైనికుల కోసం ఆహారాన్నీ, అవసరమైన ఇతర సరుకులనూ కోటలోని గోదాముల్లో నిల్వ చేశారు. ఈ యుద్ధం చాలా సంవత్సరాలు సాగడంతో గోదాముల్లో నిల్వలు నిండుకున్నాయి. వినాయకునికి పరమ భక్తుడైన హమీర్‌కు ఏం చెయ్యాలో పాలుపోలేదు. భారమంతా గణపతి మీద వేశాడు. ఒక రోజు రాత్రి అతను నిద్రపోతూండగా ఏకదంతుడు కలలోకి వచ్చాడు. సమస్యలన్నీ మర్నాటి పొద్దుటికల్లా తీరిపోతాయని అభయం ఇచ్చాడు. మరునాడు కోటలోని ఒక గోడ మీద మూడు నేత్రాలున్న వినాయకుని ఆకృతి దర్శనం ఇచ్చింది. దరిమిలా యుద్ధం ముగిసిపోయింది. ఖిల్జీ సేనలు వెనుతిరిగాయి. మరో చిత్రం ఏమిటంటే కోటలోని గోదాములన్నీ సరుకులతో నిండి ఉన్నాయి. గణేశుడే తన రాజ్యాన్ని రక్షించాడనీ, ఎల్లప్పుడూ తమకు అండగా ఉంటాడనీ భావించిన హమీర్ క్రీ.శ. 1300 సంవత్సరంలో కోటలోనే వినాయక ఆలయాన్ని నిర్మించాడు.





ఇదీ విశిష్టత

ఈ ఆలయంలో వినాయకుడు మూడు నేత్రాలతో దర్శనం ఇస్తాడు. భార్యలైన సిద్ధి, బుద్ధి తోపాటు కుమారులైన శుభ్, లాభ్ కూడా గణేశునితో పాటు కొలువు తీరి పూజలందుకోవడం ఈ ఆలయ విశిష్టత. ఇలాంటిది మరే వినాయక ఆలయంలోనూ కనిపించదు. స్వామికి ప్రతిరోజూ అయిదు సార్లు హారతులు ఇస్తారు. అర్చకులతోపాటు భక్తులు కూడా సామూహిక ప్రార్థనలూ, భజన గీతాలాపనలూ చేస్తారు. ఈ స్వామిని పూజిస్తే విద్య, విజ్ఞానాలతోపాటు సంపదనూ, సౌభాగ్యాన్నీ అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం.

ఎక్కడ ఉంది? ఎలా వెళ్లాలి?

రాజస్థాన్ రాష్ట్రంలోని సవాయ్ మధోపూర్ జిల్లా రణథంబోర్‌లో ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల నుంచి సవాయ్ మాధోపూర్ జంక్షన్‌కు నేరుగా రైళ్ళు ఉన్నాయి. అక్కడి నుంచి సుమారు 17 కి.మీ. దూరంలో ఉన్న రణథంబోర్‌కు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు. రణథంబోర్‌కు సమీప విమానాశ్రయం సుమారు 150 కి.మీ. దూరంలోని జైపూర్‌లో ఉంది.

సువార్త

ఆశీర్వాదకరమైన ప్రార్థన




'పరలోకమందున్న మా తండ్రీ!' అంటూ ఆరాధన ఆరంభమయ్యే ప్రార్థనను యేసుక్రీస్తు నేర్పించడం ఒక ఆత్మీయ విప్లవమే. ఎంతో పరిశుద్ధుడు, తేజోమయుడైన కారణంగా కనీసం దరిదాపుల్లోకి కూడా మానవులెవరూ వెళ్లలేని పరిస్థితుల్లో, దేవున్ని మానవాళికి తండ్రిని చేసిన ఘనత యేసుక్రీస్తుదే! ఆ విధంగా మనమంతా ఆయన సంతానంగా దేవున్ని ఏదైనా అడిగి పొందే హక్కుదారుల మయ్యాం. ఈ ప్రార్థన ఒక అపురూపమైన దైవ మానవ బాంధవ్యాన్ని ఆవిష్కరించి దేవున్ని మానవునికి అందుబాటులోకి తెచ్చింది (మత్తయి 6:9). పరిశుద్ధమైన ఆయన నామం, ప్రేమతో పరిఢవిల్లే ఆయన రాజ్యం, నిత్యమైన ఆయన చిత్తం ప్రధానాంశాలుగా ఉన్న విశ్వాసి తనకోసం అనుదినాహారం అనుదిన క్షమాపణతో సహా అన్నింటికీ దేవునిపైనే ఆధారపడే ఒక ఆశీర్వాదకరమైన క్రమాన్ని ఆ ప్రార్థన నేర్పింది. ముఖ్యంగా ఆ ప్రార్థనలో విశ్వాసి 'నేను', 'నా', 'నాకు' అనే పదాలు కాక బహువచనంలో 'మా', 'మాకు' అని సంబోధించాలని ప్రభువు నేర్పడం అత్యంత కీలకాంశం. సంఘజీవిగా దేవుడు ఉద్దేశించిన మానవుడు స్వార్థజీవిగా సంకుచిత దృష్టితో కాక సామాజిక దృష్టినలవర్చుకోవాలన్నది ఆ ప్రార్థన సారాంశం. 'నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు' అన్న ప్రభువు ప్రబోధం ఆయన హృదయాన్ని తెలుపుతుంది. చర్చిలు దేవుని ఆరాధనా స్థలాలుగానే కాక మానవాళి సామూహిక శక్తికి ప్రతీకలు కావాలన్నది దేవుని అభిమతం. ప్రతి విశ్వాసికీ దేవుడప్పగించే పనొకటి ఉంటుంది. అది జరగాలంటే విశ్వాసి ఇతరుల మీద ఆధారపడక తప్పదు. మానవ సంబంధాలు సంక్లిష్టమైనవీ, పరస్పర వైరుధ్యంతో కూడుకున్నవే! అయినా వాటిని ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ, పాఠాలు నేర్చుకొంటూ సర్దుబాట్లతో ముందుకెళ్లాలి. కాని శ్వాస తీసుకున్న తొలి క్షణం నుంచి శ్వాస ఆగిపోయే ఆఖరి క్షణం వరకూ పరిపూర్ణ మానవుడుగా ఎదిగే క్రమంలో అతనికి ఎంతోమంది చేయూతనిస్తారు, ఎంతోమంది అతని ఆసరా తీసుకుంటారు. విశ్వాసి కూడా ఇతరులపై ఆధారపడుతూ, ఎంతోమందికి ఆధారాన్నిస్తూ పరిపూర్ణతలోకి ఎదిగి దేవునికి మహిమ తీసుకురావాలి. దేవుని రాజ్య నిర్మాణం అలాగే జరుగుతుంది. నేను, నా కుటుంబం అనే పరిధిని దాటి ఆలోచించలేని ఆధునిక పోకడల్లో వ్యక్తిగత జీవితంలో వంద మార్కులు సాధించడం గొప్పే! కాని పదిమందికీ ఉపయోగపడుతూ సాగించే సామాజిక జీవితంలో యాభై మార్కులు సాధించినా అది అంతకన్నా గొప్ప విషయమని తెలుసుకోవాలి.

– సందేశ్ అలెగ్జాండర్

ఇస్లాం

సదఖాలో శుభం

ఇది కొన్నేళ్ళ క్రితం సంగతి. అలహాబాదులో అహ్మద్ సయీద్ అని ఒక వ్యక్తి ఉండేవాడు. అతను ఓ చిరుద్యోగి. చాలీచాలని జీతం. దాంతో ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉండేది. సంపాదన తక్కువ... ఖర్చులు ఎక్కువ కావడంతో కుటుంబ అవసరాలకోసం నెలాఖరుకు అప్పుచేయాల్సి వచ్చేది. అలా అలా చాలా అప్పులయ్యాయి. ఏంచెయ్యాలో అర్థమయ్యేది కాదు. ఆరోజు శుక్రవారం. ఎప్పటిలాగే నమాజు కోసం మస్జిదుకు వెళ్ళాడు. ఖుత్బా, నమాజు అనంతరం అందరూ వెళ్ళిపోయారు. అతనొక్కడే మరో రెండు రకతుల నఫిల్ నమాజు చేసి సుదీర్ఘ దుఆ చేశాడు. తన కష్టాలు దూరం చేయమని దీనంగా దైవాన్ని వేడుకున్నాడు. అనంతరం అక్కడే మేనువాల్చాడు. నిద్రలో అతనికి 'సదఖా' చేయమని, దానివల్ల సంపదలో వృద్ధి కలుగుతుందని కల వచ్చింది. కళ్ళు నులుముకొని లేచి కూర్చున్నాడు. తన జీతమే అంతంత మాత్రం. ఇల్లుగడవడమే కష్టంగా ఉంది. ఇక సదఖా ఏంచెయ్యాలి.. అని ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాడు. ఆలస్యంగా ఇంటికొచ్చిన భర్తనుద్దేశించి, ఏమిటీ అలా ఉన్నారు? అని అడిగింది భార్య. ఇదీ సంగతి అని సదఖా స్వప్నం చెప్పాడు. 'అవునండీ..సదఖా వల్ల సంపదలో శుభం చేకూరుతుందని, కష్టాలు దూరమవుతాయని, పరలోక పరాభవం నుండి రక్షణ పొందవచ్చని ప్రవక్త మహనీయులు చెప్పారు' అని గుర్తు చేసింది భార్య. అప్పటి నుండి, ఎన్ని కష్టాలున్నా, ఎన్ని అవసరాలున్నా ఎంతోకొంత దానధర్మాల కోసం ఖర్చు పెట్టాల్సిందే అని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. అదేనెల నుండి సదఖా చేయడం ప్రారంభించారు. దాంతో అనూహ్యంగా వారి జీవితాల్లో సంతృప్తి ప్రవేశించింది. సంపాదనలో శుభం (బర్కత్) చేకూరింది. ఒక పక్క అప్పులు ఉన్నప్పటికీ జీవితంలో మునుపెన్నడూలేని ప్రశాంతత ఏర్పడింది. జీతం పైకం చేతికి రాగానే ముందుగా కొంతభాగం దానధర్మాల కోసం కేటాయించి తరువాత తమ అవసరాలకు వాడుకునేవారు.అలా క్రమం తప్పకుండా సదఖా చేసేవారు. కొన్నాళ్ళకు జీవితంగాడిలో పడి, క్రమక్రమంగా అప్పులు కూడా తీర్చేస్తామన్న భరోసా కలిగింది. కనుక ప్రవక్తమహనీయులు చెప్పినట్లుగా తరచు దానధర్మాలు చేయడం వల్ల సంపాదనలో శుభం చేకూరుతుంది. ఇహలోకంలోనే కాదు, పరలోకంలో కూడా సాఫల్యం ప్రాప్తిస్తుంది.



– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

బిజినెస్ రీల్

స్పామర్లపై చర్యలకు నియంత్రణ సంస్థల కసరత్తు



న్యూఢిల్లీ: ప్రమోషనల్ వాయిస్ కాల్స్, రోబో కాల్స్, ప్రీ–రికార్డెడ్ కాల్స్‌తో విసిగించే స్పామర్లపై సత్వర చర్యలు తీసుకోవడంపై టెలికం రంగ నియంత్రణ సంస్థల సంయుక్త కమిటీ భేటీ అయింది. క్లౌడ్ ఆధారిత టెలిఫోనీ, ఫిక్స్‌డ్ లైన్ కనెక్షన్ ఆధారిత ప్రైవేట్ ఎక్స్ఛేంజీలను ఉపయోగించి వ్యాపార సంస్థలు ట్రాయ్ నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ కాల్స్ చేస్తుండటంపై చర్చించింది. అటువంటి సంస్థలపై తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. నియంత్రణ సంస్థల జాయింట్ కమిటీ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ అధికారులతో పాటు టెలికం, హోంశాఖ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి 7% అప్..



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు 25 మధ్య కాలంలో దేశీయంగా బొగ్గు ఉత్పత్తి 7.12 శాతం పెరిగి 370.67 మిలియన్ టన్నులుగా నమోదైంది. గతేడాది ఇదే వ్యవధిలో బొగ్గు ఉత్పత్తి 346.02 మిలియన్ టన్నులు. విద్యుత్ రంగానికి సరఫరా 313.4 మిలియన్ టన్నుల నుంచి 325.97 మిలియన్ టన్నులకు పెరిగింది. రవాణా, థర్మల్ పవర్ ప్లాంట్లు మొదలైన చోట్ల దాదాపు 121.57 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వ ఉన్నట్లు కేంద్రం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. సరఫరా తగు స్థాయిలో ఉండేలా చూడటంలో బొగ్గు శాఖకు గల నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొంది.

విస్తరిస్తున్న డిజిటల్ పేమెంట్లు



న్యూఢిల్లీ: దేశంలో టైర్ 3 నుండి 6 వరకూ పట్టణాల్లో 40 శాతం కంటే ఎక్కువ మంది వినియోగదారులు రోజువారీగా డిజిటల్ చెల్లింపులను ఉపయోగిస్తున్నారని ఫేజ్ ఇండియా సర్వే ఒకటి పేర్కొంది. అయితే 45 శాతం మంది దీనిని రెండు రోజులకు ఒకసారి ఉపయోగిస్తున్నారని సర్వే నివేదిక తెలిపింది. దాదాపు 41 శాతం మంది వ్యాపారులు తమ విక్రయాల్లో 25 శాతం కంటే తక్కువ డిజిటల్ చెల్లింపుల ద్వారా పొందుతున్నామని పేర్కొంటే.. దాదాపు 15 శాతం మంది వ్యాపారులు తమ విక్రయాల్లో 50 శాతానికి పైగా డిజిటల్ చెల్లింపుల ద్వారానే అందుకుంటున్నారని తెలిపారు. కింది స్థాయిలో డిజిటల్ పేమెంట్ల వ్యవస్థ ఇంకా విస్తృతి కావాల్సి ఉందని నివేదిక వెల్లడించింది. సర్వేలో 2,240 మంది పాల్గొన్నారు. వీరిలో 1,184 మంది వినియోగదారులు. 1,056 మంది వ్యాపారులు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లోని 16 జిల్లాల్లో వివిధ భౌగోళిక మండలాల్లో ఈ సర్వే జరిగింది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LTIM	6,114.60	6.31
WIPRO	536.35	3.71
DIVISLAB	5,035.20	2.71
BHARTIARTL	1,554.00	2.05
INFY	1,938.00	1.99

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	12,330.00	-1.34
ASIANPAINT	3,124.00	-1.33
ADANIENT	3,028.00	-1.27
SHRIRAMFIN	3,191.75	-1.17
BRITANNIA	5,699.00	-1.13

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,473
ఎన్ఎస్ఈ	2,11,437
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,24,116
ఎఫ్ఐఐ	- 1,347
డీఐఐ	+ 439

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.66	$ 75.53
బ్రెంట్	77.64	$ 78.66

ఈక్విటీ కరెక్షన్‌తో
తిరిగి బ్యాంకుల్లోకి డిపాజిట్లు

ఎస్‌బీఐ ఎండీ అశ్విని తివారీ



ముంబై: ఈక్విటీ మార్కెట్లో దిద్దుబాటుతో బ్యాంకులు తిరిగి డిపాజిట్లను ఆకర్షించగలవని ఎస్‌బీఐ ఎండీ అశ్విని తివారీ అభిప్రాయపడ్డారు. ఎస్‌బీఐ డిపాజిట్ల వృద్ధికి ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాలను కీలకంగా చూస్తున్నట్టు చెప్పారు. క్యాపిటల్ మార్కెట్లలో ర్యాలీతో బ్యాంకుల్లోని డిపాజిట్లు అధిక రాబడులను ఇచ్చే ఇతర సాధనాల్లోకి మళ్లేలా చేసినట్టు పేర్కొన్నారు. కాలక్రమేణా మార్కెట్ కరెక్షన్‌కు లోనైతే గతంలో తమ వద్ద డిపాజిట్లుగా ఉండే కొంత మొత్తం తిరిగి వెనక్కి వస్తుందన్నారు. తక్కువ విలువైన, చిన్న ఖాతాల ద్వారా డిపాజిట్లు పెంచుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నట్టు తివారీ తెలిపారు. జన్‌ధన్ యోజన ఖాతాలపై గతంలో ప్రత్యేక దృష్టి ఉండేది కాదంటూ, ఇకమీదట ఆ ఖాతాలను కూడా కీలకంగా చూస్తామన్నారు. గడిచిన 18 నెలలుగా బ్యాంకుల్లో డిపాజిట్ల కంటే రుణాల వృద్ధే అధికంగా నమోదవుతుండడం గమనార్హం. దీంతో డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు రేట్లను పెంచడం లేదంటే రుణ వృద్ధిలో రాజీ పడాల్సిన పరిస్థితి నెలకొంది. దేశ ఈక్విటీ మార్కెట్ గడిచిన ఏడాదిన్నర పాటు గణనీయమైన వృద్ధిని చూడడం గమనార్హం. దీంతో రిటైల్ ఇన్వెస్టర్లు అధిక రాబడుల కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్, నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్న ధోరణి నెలకొంది. ఈ క్రమంలో అశ్విని తివారీ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. అన్‌సెక్యూర్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచడం, ప్రాజెక్టు రుణాలకు అధిక కేటాయింపులు చేయాల్సి రావడం వంటివి డిపాజిట్లలో వృద్ధి నిదానించడానికి సంకేతంగా తివారీ పేర్కొన్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైతే డిపాజిట్ల రేట్లను సైతం పెంచుతామని ప్రకటించారు.

ప్రత్యామ్నాయాలు..

సాధారణంగా బ్యాంకింగ్ రంగంలో 90 శాతం మేర రుణ అవసరాలకు సరిపడా నిధులు డిపాజిట్ల రూపంలోనే వస్తుంటాయని.. ఇన్‌ఫ్రా బాండ్లు వంటి ఇతర సాధనాలవైపు చూడక తప్పని ప్రస్తుత పరిస్థితుల్లో డిపాజిట్ల వాటా తగ్గొచ్చని తివారీ చెప్పారు. సూక్ష్మ రుణాల పోర్ట్‌ఫోలియో చెల్లింపుల్లో ఎలాంటి వైరుధ్యాలు లేవన్నారు.

ప్యాసివ్ ఫండ్స్ బూమ్

ఏడు నెలల్లో 63 కొత్త పథకాలు • రూ.10.95 లక్షల కోట్లకు ఆస్తులు • రూ.15వేల కోట్లకు నెలవారీ పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్స్ (ఇండెక్స్ ఫండ్స్) పథకాల పట్ల ఇన్వెస్టర్లలో అవగాహన విస్తృతం అవుతోంది. పనిలో పనిగా ఈ డిమాండ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రముఖ మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు (ఏఎంసీలు) కొత్త పథకాలతో (ఎన్ఎఫ్‌వో) మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. యాక్టివ్‌గా నిర్వహించే ఈక్విటీ పథకాలు రాబడుల విషయంలో సూచీలతో వెనుకబడుతున్న తరుణంలో ప్యాసివ్ ఫండ్స్‌కు ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతున్నట్టు కనిపిస్తోంది. ఇందుకు నిదర్శనం.. గడిచిన ఏడు నెలల్లో (జనవరి–జూలై) 63 ప్యాసివ్ ఫండ్స్ ఎన్ఎఫ్‌వోలు మార్కెట్లోకి రావడమే. గతేడాది మొత్తం మీద 51 ప్యాసివ్ ఫండ్స్ ఎన్ఎఫ్‌వోల రికార్డును ఈ ఏడాది ఇప్పటికే అధిగమించడం గమనార్హం. ముఖ్యంగా ఈ నెలలో మార్కెట్లోకి 12 ఎన్ఎఫ్‌వోలు రాగా, అందులో సగం మేర ప్యాసివ్ ఫండ్స్ నుంచే ఉన్నాయి. జూలై చివరి నాటికి అత్యధికంగా టాటా మ్యూచువల్ ఫండ్ 10 ప్యాసివ్ ఫండ్ ఎన్ఎఫ్‌వోలను చేపట్టింది. హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 5, మిరే అస్సెట్ మేనేజ్‌మెంట్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ చెరో నాలుగు చొప్పున ప్యాసివ్ ఫండ్స్ ఎన్ఎఫ్‌వోలను తీసుకొచ్చాయి. ప్యాసివ్ ఫండ్స్ పరిధిలోని ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) 22 శాతం పెరిగి జూలై చివరికి 3.22 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో యాక్టివ్ ఫండ్స్ విభాగంలో ఫోలియోలు 19 శాతం పెరిగి 13.84 కోట్లుగా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్యాసివ్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) 24 శాతం వృద్ధితో రూ.10.95 లక్షల కోట్లకు చేరాయి. నెలవారీ ఈ పథకాల్లోకి వచ్చే పెట్టుబడులు ఈ ఏడాది జనవరిలో రూ.3,983 కోట్లుగా ఉండగా.. జూలైలో రూ.14,778 కోట్లకు వృద్ధి చెందడం, వీటి పట్ల ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తోంది.

ప్యాసివ్ ఫండ్స్ ఏయూఎం

నెల	వచ్చిన పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఏయూఎం (రూ.లక్షల కోట్లు)
జూలై	14,778	10.95
జూన్	14,602	10.48
మే	15,665	9.84
ఏప్రిల్	11,504	9.62
మార్చి	12,973	9.34
ఫిబ్రవరి	9,756	9.08
జనవరి	3,983	8.83

ప్రత్యామ్నాయాలపై దృష్టి

కొత్త పెట్టుబడులు ఆకర్షించేందుకు మ్యూచువల్ ఫండ్స్ వినూత్న మార్గాలపై దృష్టి సారించాయి. సంప్రదాయ పథకాల పరంగా ఇప్పటికే తగినంత మార్కెట్ ఏర్పడడంతో.. కొత్త పెట్టుబడుల ఆకర్షణ దిశగా ఇన్వెస్టర్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా ఫండ్స్ సంస్థలు వ్యూహాలు రచిస్తున్నాయి. యాక్టివ్ పథకాలు ఇప్పటికే తగినంతగా మార్కెట్లో ఉండడంతో, ప్రముఖ ఏఎంసీలు ప్యాసివ్, థీమ్యాటిక్ ఎన్ఎఫ్‌వోల బాట పట్టినట్టు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా డైరెక్టర్ కౌస్తభ్ బేల్‌పుర్కార్ తెలిపారు. ప్యాసివ్, యాక్టివ్ ఫండ్స్ మధ్య అంతరాన్ని భర్తీ చేసే విధంగా స్మార్ట్ బీటా తదితర వినూత్నమైన విధానాలను కొత్త ప్యాసివ్ ఫండ్స్ విషయంలో ఏఎంసీలు అమలు చేస్తున్నాయి. స్మార్ట్ బీటా అంటే.. ఆయా ప్యాసివ్ ఫండ్ ఒక సూచీని అనుసరించి పెట్టుబడులు పెట్టినప్పటికీ.. రాబడుల్లో మార్కెట్‌ను అధిగమించేలా ఉంటుంది. ఈ తరహా ప్యాసివ్ ఫండ్ వ్యూహాల్లో 'ఈక్వల్ వెయిట్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ ఇండెక్స్' ఇన్వెస్టర్లను ఎక్కువగా ఆకర్షిస్తోంది. నిఫ్టీ సూచీలో టాప్–10లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా, తక్కువ రిస్క్‌తో కూడిన రాబడులు ఆఫర్ చేసే విధానానికీ ప్రాచుర్యం పెరుగుతోంది. మొత్తానికి ప్యాసివ్ ఫండ్స్ రూపంలో మెరుగైన రాబడులు ఆఫర్ చేయడం ద్వారా ఇన్వెస్టర్ల ఆదరణ సొంతం చేసుకునే దిశగా ఏఎంసీలు ప్రయత్నిస్తుండడం గమనార్హం.

అంతర్జాతీయ ఫౌండ్రీల్లో ఏఐ చిప్‌ల తయారీ

• ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్



న్యూఢిల్లీ: ప్రతిపాదిత కృత్రిమ మేధ (ఏఐ) చిప్‌ల ఉత్పత్తి కోసం ప్రత్యేకంగా ఫ్యాబ్‌ను ఏర్పాటు చేసే యోచనేదీ లేదని ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ తెలిపారు. అంతర్జాతీయంగా తైవాన్, కొరియా తదితర దేశాల ఫౌండ్రీల్లో వాటిని తయారు చేయించే ప్రణాళికలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో ప్రతి చిప్ డిజైన్‌లోనూ భారత్ ముద్ర ఉన్నప్పటికీ మనకంటూ సొంత చిప్ లేకపోవడం 'చిత్రమైన' విషయమని అగర్వాల్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఇటు ఏఐ కోసం అటు సాధారణ కంప్యూటర్ల అవసరాల కోసం సొంత చిప్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా సీపీయూ, ఏఐ చిప్‌లు, ప్లాట్‌ఫామ్‌ల తయారీ కోసం ఆర్మ్, అన్‌టెథర్ ఏఐ వంటి అంతర్జాతీయ దిగ్గజాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు కుదుర్చుకున్నట్లు అగర్వాల్ చెప్పారు. 2026 నాటికి తొలి భారతీయ ఏఐ సిలికాన్ చిప్‌ల డిజైన్, ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాథమికంగా వీటిని తమ సొంత అవసరాల కోసం వినియోగించుకుంటామని, ఇతర సంస్థలు అడిగితే వాటికి కూడా విక్రయిస్తామని అగర్వాల్ చెప్పారు.

యూఏఈ నుంచి 160 టన్నుల బంగారం దిగుమతి

• తయారీదారులు, వ్యాపారులకు కేంద్రం అనుమతి



న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్ తయారీదారులు, వ్యాపారులు రాయితీ రేటుతో 160 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం నోటిఫై చేసింది. భారతదేశం–యూఏఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)లో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నత స్థాయి అధికారి తెలిపారు. రెండు దేశాల మధ్య 2022 మే 1వ తేదీ నుంచి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం, టారిఫ్ రేట్ కోటా (టీఆర్‌క్యూ) కింద ఒక శాతం టారిఫ్ రాయితీతో యూఏఈ నుండి ఏటా 200 మెట్రిక్ టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకోవడానికి భారత్ అంగీకరించింది.గత ఏడాది 140 టన్నులు ఈ తరహాలో నోటిఫైకాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాజాగా 160 టన్నుల దిగుమతులకు ఆమోదముద్ర వేసింది. భారత్ బంగారం దిగుమతులలో 40 శాతంతో స్విట్జర్లాండ్ అతిపెద్ద వాటా కలిగిఉంది. యూఏఈ వాటా 16 శాతంకాగా, దక్షిణాఫ్రికా వాటా 10 శాతంగా ఉంది. దేశంలోకి వచ్చీ–పోయే విదేశీ నిధులకు సంబంధించిన కరెంట్ అకౌంట్‌పై పసిడి కొనుగోళ్ల (దిగుమతుల) ప్రభావం కనబడుతోంది. 2023–24లో భారత్ పసిడి దిగుమతుల విలువ 30 శాతం పెరిగి 45.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

సెల్టోస్ ఎక్స్‌లైన్ వెర్షన్‌లో బ్లాక్ కలర్

న్యూఢిల్లీ: కియా తన సెల్టోస్ 'ఎక్స్‌లైన్ వెర్షన్'లో బ్లాక్ కలర్ వేరియంట్‌ను తెచ్చింది. అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఈ కొత్త కలర్ వేరియంట్‌లో



కేవలం ఎక్స్‌టీరియర్‌లో మాత్రమే కాకుండా ఇంటీరియర్‌లో కూడా కొన్ని మార్పు లు చేశారు. సెల్టోస్ ఎక్స్ లైన్ క్యాబిన్ బ్లాక్, స్ప్లెండిడ్ సేజ్ గ్రీన్ 2టోన్ కాంబినేషన్‌లో వేర్వేరు రంగులను కలిగి ఉంది. రియర్ స్కిడ్ ప్లేట్లు, షార్క్ ఫిన్ యాంటెన్నా, ఫాక్స్ ఎగ్జాస్ట్, వెనుక బంపర్‌పై ఫ్రంట్, ఔటర్ రియర్ మిర్రర్లు, టెయిల్ గేట్ గార్నిష్ తో సహా మరికొన్ని మార్పులు చేశారు. "ఇప్పటి వరకు గ్రే కలర్ వేరియంట్‌లో మా త్రమే అందుబాటులో ఉండే సెల్టోస్ అతి తక్కువ సమయంలో 5 లక్షల యూనిట్లు అమ్ముడైంది. కస్టమర్ల నుంచి డిమాండ్ భారీగా ఉంది. వారి ఫీడ్ బ్యాక్ ఆధారంగానే దీనిని బ్లాక్ కలర్ ఆప్షన్‌లో తీసుకొచ్చాము" అని కియా ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ తెలిపారు.

గాలా ప్రెసిషన్ @ రూ. 503-529

సెప్టెంబర్ 2-4 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: ప్రధానంగా టెక్నికల్ స్ప్రింగులను తయారు చేసే గాలా ప్రెసిషన్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబర్ 2న ప్రారంభంకానుంది. సెప్టెంబర్ 4న ముగియనున్న ఇష్యూకి కంపెనీ రూ. 503–529 ధరల శ్రేణిని ప్రకటించింది. ఐపీవోలో భాగంగా రూ. 135 కోట్లకుపైగా విలువైన 25.58 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 6.16 లక్షల(రూ. 32.6 కోట్ల విలువ) షేర్లను ప్రమోటర్, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 168 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో కొంతమేర శ్రీపెరుంబుదూర్‌లోని సిప్‌కాట్‌వద్ద హై టెన్సైల్ ఫాజనర్స్, హెక్స్ బోల్ట్స్ తయారుచేసే కొత్త యూనిట్ ఏర్పాటుకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను మహారాష్ట్రలోని వడావద్ద ప్లాంట్, మెషినరీ కొనుగోలుకి, రుణ చెల్లింపులు, సాధారణకార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ డిస్క్ అండ్ స్ట్రిప్ స్ప్రింగ్స్, క్వాయిల్ అండ్ స్పైరల్ స్ప్రింగ్స్ తదితరాలను రూపొందిస్తోంది. పునరుత్పాదక ఇంధనంతోపాటు ఎలక్ట్రికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆఫ్‌హైవే ఎక్విప్‌మెంట్, ఆటో మోటివ్ తదితర రంగాలలో కంపెనీ ప్రొడక్టులను వినియో గిస్తారు.

ఐపీవోకు నేషనల్ ఇన్‌ఫ్రా ట్రస్ట్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

మౌలిక రంగ పెట్టుబడుల ట్రస్ట్.. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. గవార్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ స్పాన్సర్ చేసిన కంపెనీ తద్వారా రూ. 1,600 కోట్లు సమీకరించాలని ప్రణాళికలు వేసింది. దీనిలో భాగంగా రూ. 1,200 కోట్ల విలువైన యూనిట్ల(ఇన్విట్)ను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 400 కోట్ల విలువైన యూనిట్లను స్పాన్సర్ విక్రయానికి ఉంచనుంది. యూనిట్ల జారీ నిధులను రుణ చెల్లింపులు, విదేశీ రుణాల చెల్లింపులకు వీలుగా ఎస్‌పీవీలకు ఆర్థిక మద్దతు తదితరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణ ప్రాజెక్టులలో కార్యకలాపాలు విస్తరించింది.

ఐఓసీ, హెచ్‌పీసీఎల్‌కు తాత్కాలిక చైర్మన్లు


న్యూఢిల్లీ: పూర్తిస్థాయి చీఫ్‌ల నియామకం పురోగతిలో ఉన్న నేపథ్యంలో అగ్రశ్రేణి చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లకు ప్రభుత్వం బుధవారం తాత్కాలిక చైర్మన్‌లను నియమించింది.

ఐఓసీ: ఐఓసీ డైరెక్టర్ (మార్కెటింగ్) సతీష్ కుమార్ వడుగూరి సెప్టెంబర్ 1 నుంచి మూడు నెలల పాటు కంపెనీ తాత్కాలిక చైర్మన్‌గా నియమితులైనట్లు చమురు మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజా నియామకం జరిగింది.

హెచ్‌పీసీఎల్: సెప్టెంబరు 1 నుండి మూడు నెలల కాలానికి కంపెనీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా హెచ్‌పిసిఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) రజనీష్ నారంగ్ నియమితులయ్యారు. ఆగస్టు 31 నాటికి 60 ఏళ్లు పూర్తి చేసుకుని, పదవీ విరమణ చేస్తున్న పుష్ప కుమార్ జోషి స్థానంలో నారంగ్ నియమితులయ్యారు.

యూపీఐ, రూపే 'విశ్వవ్యాప్త'మే ధ్యేయం

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: యూపీఐ, రూపేలను "వాస్తవరీతిన విశ్వ వ్యాపితం"గా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం స్పష్ట చేశారు. సెంట్రల్ బ్యాంక్ దృష్టి సారిస్తున్న కీలక అంశాల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024లో గవర్నర్ మాట్లాడుతూ, ఆర్థిక సేవలను అందరికీ అందుబాటులోనికి తీసుకురావడం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) పురోగతికి, వినియోగదారుల రక్షణ, సైబర్ భద్రత, స్థిరమైన ఫైనాన్స్, ఆర్థిక సేవల ప్రపంచ ఏకీకరణ అంశాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అనేక దేశాలతో ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి అంతర్జాతీయ వేదికల ఏర్పాటు, ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోవడంలో భారత్ నిమగ్నమై ఉందని అన్నారు. డేటా గోప్యత ఆందోళన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని 'విశ్వసనీయ ఏఐ' అభివృద్ధికి ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు, అలాగే ఆర్థిక రంగ సంస్థలు పరస్పరం సహకరించుకోవాలని కూడా ఈ సందర్భంగా దాస్ ఉద్ఘాటించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

- సరిహద్దు చెల్లింపు వ్యవస్థలతో సహా ఆర్థిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ఆర్‌బీఐ కీలక లక్ష్యాలుగా ఉన్నాయి.
- భారతదేశానికి సాంకేతిక ప్రతిభ, అభివృద్ధి చెందిన ఆర్థిక ఫిన్‌టెక్ వ్యవస్థల బలం ఉంది. తద్వారా డిజిటల్ ఆవిష్కరణలు, ఫిన్‌టెక్ స్టార్టప్‌లు, అంతర్జాతీయ సహకారానికి నిబద్ధతతో పనిచేయడం, ఎక్సలెన్స్ సంస్థలను అభివృద్ధి చేయడం వంటి వాటికి గ్లోబల్ హబ్‌గా ఉండే సామర్థ్యాన్ని దేశం సముపార్జించింది.
- భూటాన్, నేపాల్, శ్రీలంక, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ (యూఏఈ), మారిషస్, నమీబియా, పెరూ, ఫ్రాన్స్‌సహా కొన్ని ఇతర దేశాలతో రుపే కార్డ్‌ల అంగీకారం, యూపీఐ నెట్‌వర్క్ ద్వారా చెల్లింపుల్లో గణనీయమైన పురోగతి చోటుచేసుకుంది.

డిజిటల్ ట్రాన్స్ బోర్డర్ చెల్లింపులతో అక్రమాలకు చెక్


– ఫెడ్ అధికారి క్రిస్టోఫర్ జే వాలర్

ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడు క్రిస్టోఫర్ జే వాలెర్ ఇదే కార్యక్రమంలో మాట్లాడుతూ, డిజిటల్ క్రాస్ బోర్డర్ చెల్లింపులతో అక్రమ ధనార్జన, టెర్రర్ ఫండింగ్ కట్టడి సాధ్యమవుతాయని అన్నారు. ట్రాన్స్–బోర్డర్ డిజిటల్ లావాదేవీల సామర్థ్యం పెంపు ఆవశ్యకతను ఆర్‌బీఐ గవర్నర్ ఉద్ఘాటిస్తున్న నేపథ్యంలో ఫెడ్ అధికారి కూడా దీనికి వోటువేయడం గమనార్హం.

కేరిటాస్‌తో స్కై ఎయిర్ జత


మెడికల్ సప్లై, డయాగ్నోస్టిక్ శాంపిళ్ల డెలివరీ సేవలపై దృష్టి

ముంబై: డ్రోన్ లాజిస్టిక్స్ కంపెనీ స్కై ఎయిర్ మొబిలిటీ కొట్టాయం సంస్థ కేరిటాస్ హాస్పిటల్ అండ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌తో చేతులు కలిపింది. తద్వారా అత్యవసర మెడికల్ సరఫరాలు, డయాగ్నోస్టిక్ శాంపిళ్ల డెలివరీ సేవలను చేపట్టనుంది. ఆరోగ్య పరిరక్షణ సేవల సామర్థ్య పెంపు, అందుబాటును పెంపొందించే లక్ష్యంతో భాగస్వామ్యానికి తెరతీసినట్లు స్కై ఎయిర్ తాజాగా పేర్కొంది. ఇందుకు మానవరహిత ఏరియల్ వాహనాల(డ్రోన్లు) ద్వారా సరఫరాల(రవాణా)ను చేపట్టనున్నట్లు తెలియజేసింది. దీంతో డెలివరీ సమయం కొన్ని గంటల నుంచి 5–7 నిమిషాలకు భారీగా తగ్గనున్నట్లు వివరించింది. వెరసి కీలక మెడికల్ సరఫరాలు మరింత వేగంగా, సమర్థవంతంగా ఆయా ప్రాంతాలకు చేరనున్నట్లు తెలియజేసింది. 3 కేజీల పేలోడ్‌తో డ్రోన్లను 10–15 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలకు వినియోగించనున్నట్లు వెల్లడించింది. దీనిలో భాగంగా మరో ఐదు ఇతర శాటిలైట్ హెల్త్‌కేర్ సౌకర్యాలను కేరిటాస్ హాస్పిటల్‌కు జత చేయనున్నట్లు పేర్కొంది.



తగ్గేదేలే!

- టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సుదీర్ఘ పోరాటాలు
- అభిమానులకు వినోదం పంచుతున్న మ్యాచ్‌లు
- తరచూ ఐదు సెట్‌లలో తేలుతున్న ఫలితాలు
- తుదికంటా పోరాడుతున్న క్రీడాకారులు



టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టిన ఏ ఆటగాడైనా గెలవాలనే కసితోనే పోరాడతాడు. కొందరు ప్లేయర్లు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం కనబరుస్తూ చూస్తుండగానే మ్యాచ్‌ను లాగేసుకుంటే... మరికొందరు తుదికంటా పోరాడుతూ శక్తి మేరకు ప్రయత్నిస్తారు! టెన్నిస్ కోర్టులో అప్పుడప్పుడు సమఉజ్జీల సమరాలు అభిమానులను అలరిస్తూ ఉంటాయి. శరీరంలో శక్తి క్షీణిస్తున్నా... చెమట ధారగా కారుతున్నా లెక్కచేయకుండా మైదానంలో ఇరువురు ఆటగాళ్లు కొదమ సింహాల్లా పోరాడినపుడు ఆ మ్యాచ్‌లు గంటలకొద్దీ సాగుతూ ఉంటాయి. ఇరువురు ప్లేయర్లు 'తగ్గేదేలే' అన్నట్లు చెలరేగిన మ్యాచ్‌లు సుదీర్ఘ పోరాటాలుగా చరిత్ర పుటల్లో చోటు దక్కించుకుంటున్నాయి. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అలా రికార్డుల్లోకెక్కిన మ్యాచ్‌లను ఓసారి పరిశీలిస్తే...

- సాక్షి క్రీడావిభాగం

శారీరక శ్రమ అధికంగా ఉండే టెన్నిస్ క్రీడలో అప్పుడప్పుడు కొన్ని మ్యాచ్‌లు సుదీర్ఘంగా సాగడం పరిపాటే. తాజాగా సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో డేనియల్ ఇవాన్స్ (బ్రిటన్), కరెన్ ఖచనోవ్ (రష్యా) మధ్య పోరు 5 గంటల 35 నిమిషాల పాటు సాగి అభిమానులకు ప్రత్యేక అనుభూతినిచ్చింది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో ఇదే సుదీర్ఘమైన మ్యాచ్ కాగా.. గతంలో వింబుల్డన్ టోర్నీలో ఇంతకుమించిన మ్యాచ్‌లు చాలా జరిగాయి. 2010 వింబుల్డన్ టోర్నీలో జాన్ ఇస్నెర్ (అమెరికా), నికోలస్ మహుత్ (ఫ్రాన్స్) మధ్య జరిగిన పోరు ఇందులో ముందు వరుసలో నిలుస్తుంది. వర్షం అంతరాయం కలిగించడంతో... వరుసగా మూడు రోజులు సాగిన ఈ మారథాన్ మ్యాచ్ టెన్నిస్ చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన పోరుగా రికార్డుల్లోకెక్కింది. ఇప్పటి వరకు ప్రొఫెషనల్ టెన్నిస్‌లో రెండు మ్యాచ్‌లు మాత్రమే 7 గంటలకు పైగా సాగగా... మరో 14 మ్యాచ్‌లు ఆరు గంటలకు పైగా జరిగాయి. ప్లేయర్ల అలసట, అభిమానుల అసౌకర్యం, నిర్వాహకులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రధాన టోర్నీల్లోని చివరి సెట్‌లోనూ 'టైబ్రేకర్' నిబంధనలు తీసుకొచ్చారు. 1970 నుంచి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో 'టైబ్రేకర్' అమలు చేస్తున్నారు. దీంతో సుదీర్ఘ పోరాటాలకు ఒకింత బ్రేక్ పడింది.

ఫ్రెంచ్ ఓపెన్‌లో... 6 గంటల 33 నిమిషాలు

సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మారథాన్ మ్యాచ్‌లకు కొదువలేదు. 2004 ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుదీర్ఘ మ్యాచ్ జరిగింది. రెండు రోజుల పాటు సాగిన పోరులో ఫ్రాన్స్‌కే చెందిన ఫాబ్రిస్ సాంతోరో, ఆర్నాడ్ క్లెమెంట్ తుదికంటా పోరాడారు. 6 గంటల 33 నిమిషాల తర్వాత ఫాబ్రిస్ సాంతోరో 6-4, 6-3, 6-7 (5/7), 3-6, 16-14తో ఆర్నాడ్ క్లెమెంట్‌పై గెలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఇదే సుదీర్ఘ మ్యాచ్‌గా రికార్డుల్లోకెక్కింది.



వింబుల్డన్‌లో ఇస్నెర్ డబుల్ ధమాకా

టెన్నిస్ చరిత్రలో అత్యంత పురాతన గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన వింబుల్డన్‌లో అమెరికా ఆటగాడు జాన్ ఇస్నెర్ ఒకటికి రెండుసార్లు ఇలాంటి సుదీర్ఘ మ్యాచ్‌ల్లో భాగస్వామి అయ్యాడు. 2010 వింబుల్డన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఇస్నెర్, నికోలస్ మహుత్ మధ్య పోరు వరుసగా మూడు రోజుల పాటు నడిచింది. వర్షం కారణంగా అంతరాయాల నడుమ జరిగిన పోరులో ఇస్నెర్ 6-4, 3-6, 6-7 (7/9), 7-6 (7/3), 70-68తో మహుత్‌పై విజయం సాధించాడు. 11 గంటల 5 నిమిషాల పాటు సాగిన ఈ పోరాటం... ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అత్యంత సుదీర్ఘ పోరుగా చరిత్రకెక్కింది. ఇరువురు ఆటగాళ్లు గంటలకొద్దీ పట్టు వదలకుండా పోరాడటంతో ఈ రికార్డు సాధ్యమైంది. మరో ఎనిమిదేళ్ల తర్వాత 2018 వింబుల్డన్ సెమీఫైనల్లో మరోసారి ఇలాంటి సుదీర్ఘ పోరాటమే జరిగింది. 6 గంటల 36 నిమిషాల పాటు సాగిన పోరులో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) 7-6 (8/6), 6-7 (5/7), 6-7 (9/11), 6-4, 26-24తో ఇస్నెర్‌పై విజయం సాధించాడు.

డేవిస్ కప్‌లో సుదీర్ఘ పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లు

సమయం	విజేత	పరాజిత	ఏడాది	స్కోరు
6గం:43ని	లియొనార్డో మాయెర్ (అర్జెంటీనా)	జోవా సౌజా (బ్రెజిల్)	2015	7-6 (7/4), 7-6 (7/5), 5-7, 5-7, 15-13
6గం:22ని	జాన్ మెకన్రో (అమెరికా)	విలాండర్ (స్వీడన్)	1982	9-7, 6-2, 15-17, 3-6, 8-6
6గం:21ని	బోరిస్ బెకర్ (జర్మనీ)	జాన్ మెకన్రో (అమెరికా)	1987	6-3, 6-2, 4-6, 14-12
6గం:15ని	జోస్ లూయిస్ క్లెర్క్ (అర్జెంటీనా)	జాన్ మెకన్రో (అమెరికా)	1980	6-3, 6-2, 4-6, 14-12
6గం: 04ని	హోర్స్ స్కాఫ్ (ఆస్ట్రియా)	విలాండర్ (స్వీడన్)	1989	6-7 (5/7), 7-6 (9/7), 1-6, 6-4, 9-7

ఆస్ట్రేలియా ఓపెన్‌లో... 5 గంటల 53 నిమిషాలు

టెన్నిస్ చరిత్రలో దిగ్గజ ప్లేయర్లుగా గుర్తింపు సాధించిన నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), రాఫెల్ నాదల్ (స్పెయిన్) కూడా సుదీర్ఘ పోరాటాల్లో భాగస్వాములయ్యారు. గిరిగీసి బరిలోకి దిగితే అంతుచూసేవరకు వదలని స్వభావం గల ఈ ఇద్దరూ ఎన్నో సార్లు హోరాహోరీగా తలబడ్డారు. అందులో 2012 ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్ ఒకటి. 5 గంటల 53 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో జొకోవిచ్ 5-7, 6-4, 6-2, 6-7 (5/7), 7-5తో నాదల్‌ను ఓడించి గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలుచుకున్నాడు. ఓపెన్ శకంలో (1968 నుంచి)అత్యంత సుదీర్ఘంగా సాగిన గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌గానూ ఈ పోరు చరిత్రకెక్కింది. 1975కంటే ముందు టైబ్రేక్ నిబంధన లేదు. ఫలితంగా డేవిస్‌కప్‌లోనూ ఎన్నో సుదీర్ఘ మ్యాచ్‌లు జరిగాయి. 1975 తర్వాత నిర్ణాయక ఐదో సెట్ మినహా ఇతర సెట్‌లలో టైబ్రేక్‌లను అమలు చేయడం మొదలుపెట్టారు. 12 పాయింట్ల టైబ్రేక్‌లో తొలుత ఏడు పాయింట్లు సాధించిన ప్లేయర్‌కు సెట్ లభించేది. ఒకవేళ మ్యాచ్ ఐదో సెట్‌కు వెళితే స్కోరు 5-5 తర్వాత రెండు గేమ్‌ల ఆధిక్యం సంపాదించిన ప్లేయర్‌ను విజేతగా ప్రకటించేవారు. 2016 నుంచి డేవిస్ కప్‌లోనూ నిబంధనలు మార్చారు. మ్యాచ్‌లను 'బెస్ట్ ఆఫ్ 5 సెట్స్' పద్ధతిలో కాకుండా 'బెస్ట్ ఆఫ్ 3 సెట్స్'గా నిర్వహించడం ప్రారంభించారు. సెట్‌లో స్కోరు 6-6తో సమంగా నిలిస్తే టైబ్రేక్‌ను అమలు చేస్తున్నారు.



అంతర్జాతీయ క్రికెట్‌కు మలాన్ గుడ్‌బై

లండన్: మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) సెంచరీలు సాధించిన ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలాన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. 36 ఏళ్ల మలాన్ గత ఏడాది వన్డే వరల్డ్ కప్ ముగిసిన తర్వాత మరో అంతర్జాతీయ మ్యాచ్ ఆడలేదు. ఇంగ్లండ్ తరఫున మలాన్ 22 టెస్టులు ఆడి 1074 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 9 అర్ధ సెంచరీలున్నాయి. 30 వన్డేలు ఆడి 6 సెంచరీలు, 7 అర్ధ సెంచరీల సహాయంతో 1450 పరుగులు సాధించాడు. 62 టి20 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ, 16 అర్ధ సెంచరీలతో 1892 పరుగులు సాధించాడు. 2020లో టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను అందుకున్న మలాన్ 2022లో టి20 వరల్డ్‌కప్ సాధించిన ఇంగ్లండ్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు.



గుకేశ్ ఎనిమిదో 'డ్రా'

సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్ అంతర్జాతీయ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో ఇద్దరు భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద వరుసగా ఎనిమిదో 'డ్రా' నమోదు చేశారు. ఫలితంగా ఈ ఇద్దరికి విజేతగా నిలిచే అవకాశాలకు తెరపడింది. నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీశ్ గిరితో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన ప్రపంచ చాంపియన్‌షిప్ చాలెంజర్ గుకేశ్ 23 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ప్రపంచ మూడో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన గేమ్‌ను తెల్ల పావులతో ఆడిన ప్రజ్ఞానంద 28 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. పది మంది మేటి గ్రాండ్‌మస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో ఎనిమిదో రౌండ్ తర్వాత మాక్సిమి లాచెర్ లాగ్రెవ్ (ఫ్రాన్స్), నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్), గుకేశ్, వెస్లీ సో (అమెరికా), ప్రజ్ఞానంద 4 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... గుకేశ్ ఐదో ర్యాంక్‌లో, ప్రజ్ఞానంద ఏడో ర్యాంక్‌లో నిలిచారు. ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలీరెజా ఫిరూజా 5.5 పాయింట్లతో మరో రౌండ్ మిగిలి ఉండగానే విజేతగా అవతరించాడు. 4.5 పాయింట్లతో కరువానా రెండో స్థానంలో ఉన్నాడు. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో వెస్లీ సోతో గుకేశ్; నొదిర్‌బెక్‌తో నిపోమ్నిషి (రష్యా); కరువానాతో అనీశ్ గిరి; ఫిరూజాతో ప్రజ్ఞానంద; మాక్సిమితో డింగ్ లిరెన్ తలపడతారు.



గోల్‌కీపర్‌గా కృషన్ బహదూర్

- శ్రీజేశ్ రిటైర్మెంట్‌తో వచ్చిన అవకాశం
- ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి భారత హాకీ జట్టు ప్రకటన
- హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో బరిలోకి
- ఒలింపిక్ కాంస్య పతకం నెగ్గిన జట్టులో పలువురికి విశ్రాంతి

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన తర్వాత భారత పురుషుల హాకీ జట్టు మరో టోర్నీకి సిద్ధమైంది. సెప్టెంబర్ 8 నుంచి 17 వరకు చైనాలో జరిగే ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు బరిలోకి దిగనుంది. ఈ టోర్నీలో పాల్గొనే 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వం వహిస్తాడు. వివేక్ సాగర్ ప్రసాద్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ రిటైర్మెంట్ ప్రకటించడంతో... చాలా కాలం నుంచి భారత జట్టుకు స్టాండ్‌బై గోల్‌కీపర్‌గా వ్యవహరిస్తున్న కృషన్ బహదూర్ పాఠక్ ఇప్పుడు ప్రధాన గోల్‌కీపర్‌గా జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. మరో గోల్ కీపర్ సూరజ్ కర్కేరా రిజర్వ్‌గా ఉంటాడు. 2018 నుంచి సీనియర్ జట్టులో గోల్‌కీపర్‌గా ఉన్న కృషన్ ఇప్పటి వరకు 125 మ్యాచ్‌లు ఆడాడు. 2016లో జూనియర్ ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన భారత జట్టుకు గోల్‌కీపర్‌గా ఉన్న కృషన్... రెండుసార్లు ఆసియా క్రీడల్లో, రెండుసార్లు ప్రపంచ కప్‌లో, రెండుసార్లు ఆసియా క్రీడల్లో పాల్గొన్నాడు.

డిఫెండింగ్ చాంపియన్ హోదాలో భారత్ పోటీపడనుండగా... దక్షిణ కొరియా, మలేసియా, పాకిస్తాన్, జపాన్, చైనా జట్లు కూడా టైటిల్ కోసం తలపడతాయి. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత జట్టులో సభ్యులుగా ఉన్న హార్దిక్ సింగ్, మన్‌దీప్ సింగ్, లలిత్ ఉపాధ్యాయ్, షంషేర్ సింగ్, గుర్జంత్ సింగ్‌లకు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ నుంచి విశ్రాంతి ఇచ్చారు. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 8న చైనాతో ఆడుతుంది. ఆ తర్వాత 9న జపాన్‌తో... 11న మలేసియాతో... 12న దక్షిణ కొరియాతో తలపడుతుంది. ఒకరోజు విశ్రాంతి తర్వాత సెప్టెంబర్ 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది. సెమీఫైనల్స్ 16న, ఫైనల్ 17న నిర్వహిస్తారు.

భారత పురుషుల హాకీ జట్టు: కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా (గోల్‌కీపర్లు), హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), వివేక్ సాగర్ ప్రసాద్ (వైస్ కెప్టెన్), జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, రాజ్‌కుమార్ పాల్, నీలకంత శర్మ, మన్‌ప్రీత్ సింగ్, మొహమ్మద్ రాహీల్ మౌసీన్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, అరిజిత్ సింగ్, ఉత్తమ్‌సింగ్, గుర్జోత్ సింగ్.



'గుండె' ధైర్యంతో...

యశ్ ధుల్ మళ్లీ మైదానంలోకి

న్యూఢిల్లీ: యువ టాపార్డర్ బ్యాటర్ యశ్ ధుల్ గుండె శస్త్ర చికిత్స తర్వాత మళ్లీ బరిలోకి దిగి రాణిస్తున్నాడు. 2022లో అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టుకు టైటిల్‌ను అందించిన యశ్ జాతీయ శిక్షణ శిబిరం (ఎన్‌సీఏ)లో ఉండగా గుండెకు చిన్న రంధ్రం ఉన్నట్లు గుర్తించారు. నిజానికి ఇలాంటి కేసులు పుట్టినపుడే బయటపడతాయి. యశ్‌కూ పుట్టినపుడే ఈ రంధ్రం ఉన్నప్పటికీ 20 ఏళ్లకు పైగా ఏనాడూ బయటపడలేదు. అతనికి పెద్దగా ఏ సమస్యా రాలేదు. దీంతో తనకిష్టమైన క్రికెట్‌ను యథేచ్ఛగా ఆడసాగాడు. ఎన్‌సీఏలో ఈ ఏడాది అండర్-23 జట్టుకు ఏర్పాటు చేసి హైపెర్ఫార్మెన్స్ క్యాంప్ సందర్భంగా అతని గుండె సమస్యను ఎన్‌సీఏ వైద్య సిబ్బంది గుర్తించింది. ఇది ఏమాత్రం క్లిష్టమైన సమస్య కానే కాదని మైనర్ సర్జరీతోనే పూర్తిగా కోలుకుంటారని చెప్పడంతో జూలైలో సర్జరీ చేశారు. కేవలం 15 రోజుల విశ్రాంతి తర్వాత మళ్లీ రొటీన్ లైఫ్ గడపొచ్చు. దశాబ్ద కాలంగా ధుల్ కోచ్‌గా ఉన్న రాజేశ్ నాగర్ మాట్లాడుతూ... 'ధుల్‌కు జరిగింది మైనర్ సర్జరీనే. కంగారేమీ లేదు. ఓ పది, పదిహేను రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే పూర్తిగా కోలుకోవచ్చు. యశ్ కూడా అదే చేశాడు. అయితే అతను 100 శాతం ఫిట్‌నెస్‌తో లేకపోయినా 80 శాతం ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ ఆడేందుకు ఇది సరిపోతుంది' అని అన్నాడు. ఈ లీగ్‌లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ధుల్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో 113.41 స్ట్రయిక్‌రేట్‌తో 93 పరుగులు చేశాడు. ఇందులో ఒక అర్ధసెంచరీ (51) ఉంది.

21 ఏళ్ల యశ్ ధుల్ కెరీర్ ఆరంభంలోనే ఎత్తుపల్లాలు చూశాడు. అండర్-19 ప్రపంచ కప్ విజయసారథి 2022లోనే తమిళనాడు తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు శ్రీకారం చుట్టాడు. రెండు శతకాలతో ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది రంజీ ట్రోఫీ కోసం ప్రకటించిన ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా తననే నియమించారు. కానీ పుదుచ్చేరితో తొలి మ్యాచ్‌లో ఓడిపోగానే అతన్ని తప్పించేశారు. భారత్ 'ఎ' తరఫున కీలక ఇన్నింగ్స్ ఆడిన యశ్‌కు ఐపీఎల్‌లో మాత్రం ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చెప్పుకోదగ్గ అవకాశాలు రాలేదు. కేవలం 4 మ్యాచ్‌లే ఆడాడు.




మాళవిక

భారత షట్లర్లకు నిరాశ

సియోల్: కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. బరిలోకి దిగిన యువ షట్లర్లు అష్మిత చాలిహా, మాళవిక, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 53వ ర్యాంకర్ అష్మిత 8-21, 13-21తో 17వ ర్యాంకర్ పోన్‌పావీ చోచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. మరో మ్యాచ్‌లో ప్రపంచ 41వ ర్యాంకర్ మాళవిక 21-18, 15-21, 17-21తో 18వ ర్యాంకర్ లిన్ హోజ్‌మార్క్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోయింది. ఆకర్షి 15-21, 15-21తో లిన్ క్రిస్టోఫర్సెన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో ఆయుశ్ రాజ్ గుప్తా-శ్రుతి జంట 7-21, 12-21తో కో సంగ్ హ్యూన్-ఇయోమ్ హ్యూ వోన్ (కొరియా) జోడీ చేతిలో ఓడింది.

అత్యంత వృద్ధ స్లోత్ మృతి



ప్రపంచంలోనే అత్యంత వృద్ధ స్లాత్ పశ్చిమ జర్మనీలోని క్రైఫెల్డ్ జూపార్కులో కన్నుమూసింది. 54 ఏళ్ల ఈ స్లోత్‌ను జాన్ అని పిలిచేవారు. అది గత వారం కన్నుమూసినట్లు జూ తెలిపింది. 1969లో పుట్టిన జాన్ తొలుత హాంబర్గ్ జూలో నివసించింది. తర్వాత క్రైఫెల్డ్ జూకు మారి 38 ఏళ్లుగా అక్కడే గడిపింది. మానవ సంరక్షణలో ఉన్న అత్యంత వృద్ధ స్లోత్‌గా 2021లో గిన్నిస్ రికార్డులకెక్కింది. ఈ మగ స్లోత్‌కు 22 మంది సంతానం. ఏటా ఏప్రిల్ 30న దాని పుట్టిన రోజు సంబరాలు అట్టహాసంగా జరిగేవి. స్లోత్‌ల జీవితకాలం 30 నుంచి 40 ఏళ్లు.

బద్ధకానికి మారుపేరు!

స్లోత్‌ను అత్యంత బద్ధకస్తురాలైన జీవిగా చెబుతారు. ఇది క్షీరదం. వీటిలో ఆరు రకాలుంటాయి. అన్నీ చెట్ల కొమ్మల మీదే నివసిస్తాయి. మరో చెట్టుపైకి వెళ్లడానికి మాత్రమే కిందకు దిగుతాయి. నేలపై నిమిషానికి కేవలం ఐదడుగుల వేగంతో, చెట్లపైనైతే 15 అడుగుల వేగంతో కదులుతాయి. చూట్టానికి ఎలుగుబంటికి దగ్గరగా, అందంగా ఉంటాయి. ఆకులు, పళ్లు తింటాయి. చెట్ల రసాలు తాగుతాయి. అన్నట్టూ, వీటి జీర్ణ వ్యవస్థ కూడా అత్యంత నెమ్మదిగా పని చేస్తుందట!

– సాక్షి, నేషనల్ డెస్క్

సమాధుల వద్ద థమ్సప్‌లా!



- ట్రంప్ తీరుపై నెటిజన్ల మండిపాటు

సైనిక అమరులకు నివాళుల సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2021లో అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా దళాల ఉపసంహరణ సందర్భంగా అబే గేట్ వద్ద మరణించిన 12 మంది సైనికులకు ఆర్లింగ్టన్ నేషనల్ శ్మశానవాటికలో ట్రంప్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వివాదాస్పద హావభావాలు ప్రదర్శించారు. సమాధుల వద్ద ఫొటోలకు పోజులివ్వడమే గాక చిరునవ్వులు చిందిస్తూ కన్పించారు. అంతటితో ఆగకుండా బొటనవేలు పైకెత్తి థమ్సప్ చిహ్నం చూపారు. వీటిపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. సైనిక అమరుల పట్ల ఆయన అత్యంత అగౌరవంగా, అవమానకరంగా ప్రవర్తించారని నెటిజన్లు దుయ్యబడుతున్నారు. సమాధుల వద్ద చిరునవ్వులు చిందించడమేంటని మండిపడుతున్నారు. సమాధుల వద్ద నవ్వడం అసాధారణమని రిపబ్లికన్ నేత ఆడమ్ కిన్సింగర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సైనిక అమరుల కుటుంబాలకు సంఘీభావం తెలిపినందుకు ట్రంప్‌ను కొందరు అభినందించారు. మరికొందరేమో ఇది కూడా ప్రచార వ్యూహంలో భాగమంటూ పెదవి విరిచారు.

– వర్జీనియా

బెయిల్ నియమం.. జైలు మినహాయింపు

- మనీ లాండరింగ్ కేసులకు సైతం ఇదే వర్తిస్తుంది
- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- అక్రమ మైనింగ్ కేసులో హేమంత్ సోరెన్ అనుచరుడికి బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: బెయిల్ ఒక నియమం.. జైలు ఒక మినహాయింపు అనేది మనీ లాండరింగ్ కేసుల్లో కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో మనీశ్ సిసోడియా కేసు విచారణ సమయంలోనూ ఇదే చెప్పినట్లు గుర్తు చేసింది. అక్రమ మైనింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అనుచరుడు ప్రేమ్ ప్రకాశ్ బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మనీలాండరింగ్ కేసుల్లో బెయిల్‌పై ఉన్నత న్యాయస్థానం ఎంత స్పష్టతతో ఉందో వివరించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కేసులో కేసులో నిందితుడు నేరం చేయలేదని, బెయిల్‌పై ఉన్నప్పుడు ఎలాంటి నేరం చేసే అవకాశం లేదని ప్రాథమికంగా సంతృప్తి చెందాల్సి ఉంటుందని పేర్కొంది. పీఎంఎల్‌ఏ సెక్షన్ 45 నిర్దేశించినవన్నీ బెయిల్‌కు సంబంధించిన షరతులేనని తెలిపింది. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఎల్లప్పుడూ నియమమేనని, దాన్ని కోల్పోవడం అనేది మినహాయింపుగా భావించాలని, ఒకవేళ స్వేచ్ఛను కోల్పోవాల్సి వస్తే అది చట్టబద్ధంగా ఉండాలని ధర్మాసనం పేర్కొంది. పీఎంఎల్‌ఏ కేసులో నిందితుడు కస్టడీలో ఉండగా నేరారోపణ చేసే ప్రకటనను సాక్ష్యంగా పరిగణించి ఆమోదించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. రూ.5 లక్షల పూచీకత్తుతో నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ నిరాకరిస్తూ జార్ఖండ్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తోసిపుచ్చింది.

గుజరాత్‌లో వర్షాలు... 19 మంది దుర్మరణం

అహ్మదాబాద్: గుజరాత్‌లో భారీ వర్షాలకు 19 మంది మృతి చెందారు. నాలుగురోజులుగా రాష్ట్రంలో ఎడతెరపి లేని వర్షాల కారణంగా గుజరాత్‌లో మొత్తం ఇప్పటిదాకా 26 మంది మరణించారు. పలు ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో 17,800 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విశ్వామిత్రి నది పొంగిపొర్లుతుండటంతో వడోదర నగరంలో పలు రోడ్లు, భవనాలు, వాహనాలు నీట మునిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలు వరద నీటిలో మునగడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రకృతి విపత్తును ఎదుర్కొనడంలో గుజరాత్‌కు కేంద్రం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. 140 రిజర్వాయర్లు, డ్యామ్‌లు, 24 నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. 48 రైళ్లు పూర్తిగా రద్దు కాగా, 14 పాక్షికంగా రద్దయ్యాయి. మరో 23 రైళ్లను దారి మళ్లించారు.

చెలియలికట్ట దాటేస్తోంది..!

నానాటికీ ఉప్పొంగుతున్న పసిఫిక్ • ప్రమాదంలో పలు దీవుల అస్తిత్వం

ప్రపంచ సగటును దాటింది: నివేదికలు • ప్రపంచ విపత్తు • ఐరాస హెచ్చరిక

వాతావరణ సంక్షోభం సముద్రాలనూ అల్లకల్లోలం చేస్తోంది. వినాశకరమైన మార్పులకు కారణమవుతోంది. అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల దెబ్బకు సముద్ర మట్టాల పెరుగుదల ఊపందుకుంది. ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్రంలో ఈ ధోరణి నానాటికీ కలవరపెడుతోంది. ఏకంగా 'ప్రపంచ విపత్తు' స్థాయికి చేరి పసిఫిక్ దీవుల అస్తిత్వానికే ముప్పుగా పరిణమించింది! దీనిపై ఐరాస తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "మనిషి చేజేతులా తెచ్చిపెట్టుకున్న సంక్షోభమిది. ఇది గనుక పరాకాష్టకు చేరితే మనం సురక్షితంగా బయటపడేందుకు లైఫ్‌బోట్ కూడా మిగలదు'' అని ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించారు. పరిస్థితి పూర్తిగా చేయి దాటకముందే ప్రపంచం స్పందించాలని పిలుపునిచ్చారు...

– సాక్షి, నేషనల్ డెస్క్



పసిఫిక్ మహాసముద్ర మట్టం పెరుగుతుండటంతో నానాటికీ కుంచించుకుపోతున్న తువలు ద్వీపం

పసిఫిక్ ద్వీప దేశం టోంగా రాజధాని నుకులోఫాలో ఇటీవల పసిఫిక్ ఐలండ్స్ ఫోరం సమావేశం జరిగింది. ఆ వేదిక నుంచే, 'మన సముద్రాలను కాపాడండి (సేవ్ అవర్ సీస్)' పేరిట అంతర్జాతీయ స్థాయి పెనుప్రమాద హెచ్చరిక (గ్లోబల్ ఎస్‌ఓఎస్)ను ఐరాస చీఫ్ విడుదల చేశారు. ''పసిఫిక్ ఉప్పొంగిపోతోంది. అక్కడి బలహీన దేశాలు అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటున్నాయి. వాటికి ఆర్థిక సాయాన్ని, మద్దతును భారీగా పెంచండి'' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.

> "ఇప్పుడు పసిఫిక్ వంతు. ముమ్ముందు అన్ని సముద్రాలకూ ఈ ముప్పు పొంచి ఉంది. ఇప్పుడే కళ్లు తెరిచి పసిఫిక్‌ను కాపాడు కుంటే మొత్తం మానవాళినీ కాపాడుకున్నవాళ్లం అవుతాం. అందుకే ప్రపంచం పసిఫిక్ వైపు చూడాలి. ఈ హెచ్చరికల్ని వినాలి"
>
> – ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్

మూడింతల ముప్పు!

నైరుతీ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1980 నుంచి ప్రపంచ సగటు కంటే ఏకంగా మూడు రెట్లు వేగంగా పెరిగినట్టు ప్రపంచ వాతావరణ సంస్థ స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ పేర్కొంది. దీంతో గత 30 ఏళ్లలో అక్కడ సముద్ర మట్టాలు ప్రపంచ సగటు కంటే రెట్టింపు పెరిగాయట. సముద్ర వడగాలులూ రెట్టింపయ్యాయి. ముమ్ముందు అవి మరింత తీవ్రంగా, మరింత సుదీర్ఘకాలం కొనసాగుతాయి'' అని నివేదిక హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధన ఉద్గారాల తాలూకు వేడిలో ఏకంగా 90 శాతం సముద్రాలే గ్రహించాయని నివేదిక వెల్లడించింది. దాంతో సముద్రపు ఉష్ణోగ్రతలు, ఫలితంగా సముద్ర మట్టం ప్రమాదకరంగా పెరిగిపోతున్నాయి. వేగంగా కరిగిపోతున్న హిమానీ నదాలు, భారీ మంచు పలకలు ఇందుకు తోడవుతున్నాయి!

> "ముమ్ముందు సముద్రాలు కోలుకోలేని మార్పులకు లోనవుతాయి. మనుగడ కోసం మనిషి చేస్తున్న వినాశనమే ఈ ముప్పుకు కారణం''
>
> – డబ్ల్యూఎంఓ ప్రధాన కార్యదర్శి సెలెస్టే సాలో



పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ ఐలాండ్స్

ఆ దీవులకు పెను ముప్పే..

వాతావరణ సంక్షోభం, సముద్ర మట్టాల పెరుగుదల వల్ల పసిఫిక్‌కు త్వరలోనే పెను ముప్పు పొంచి ఉందని ఐరాస వాతావరణ కార్యాచరణ బృందం మంగళవారం ప్రచురించిన రెండో నివేదికలో కూడా పేర్కొంది. అందులో ఏం చెప్పిందంటే...

- దీనివల్ల తువలు, మార్షల్ ఐలాండ్స్ వంటి పసిఫిక్ దీవులు ప్రభావితమవుతున్నాయి.
- సముద్ర తాపం, సముద్ర మట్టం పెరుగుదల, ఆమ్లీకరణ... ఇలా ముప్పేట దాడిని ఎదుర్కొంటున్నాయి.
- ఫలితంగా పర్యావరణ వ్యవస్థలు, పంటలు దెబ్బ తినడమే గాక మంచినీటి వనరుల కలుషితమవుతున్నాయి.
- జీవనోపాధి కూడా భారీగా దెబ్బ తింటోంది.
- తీవ్ర వరదలు, ఉష్ణమండల తుఫాన్లు ఇప్పటికే ఆ ద్వీపాలను నాశనం చేస్తున్నాయి.
- 2023లో 34 భారీ తుఫాన్లు, వరద సంబంధిత ఘటనలు భారీ సంఖ్యలో మరణాలకు దారితీశాయి.
- ఈ ప్రాంతంలో ఏకంగా 2.5 కోట్ల మందిని తీవ్రంగా ప్రభావితం చేశాయి.
- సముద్ర మట్టానికి కేవలం 1 నుంచి 2 మీటర్ల ఎత్తులో ఉన్న పసిఫిక్ ప్రాంతంలో 90 శాతం ప్రజలు తీరానికి 5 కి.మీ. పరిధిలోనే నివసిస్తున్నారు.
- ఇక్కడి మౌలిక సదుపాయాల్లో సగానికి సగం సముద్రానికి 500 మీటర్ల లోపలే ఉన్నాయి.
- ప్రస్తుత 3 డిగ్రీల సెల్సియస్ వేడి పెరుగుదల ఇలాగే కొనసాగితే 2050 నాటికి పసిఫిక్ దీవుల వద్ద సముద్ర మట్టం మరో 15 సెంటీమీటర్లు పెరుగుతుంది.
- ఏటా 30 రోజులకు పైగా తీరప్రాంత వరదలు ముంచెత్తుతాయి.
- సముద్ర మట్టం పెరుగుదల అనుకున్న దానికంటే వేగవంతమవుతుంది.
- ఫలితంగా పసిఫిక్ దీవులకు ముంపు ముప్పు కూడా వేగవంతమవుతుంది.

మహానగరాలకూ డేంజర్ బెల్స్...

సముద్రమట్టం పెంపు తాలూకు ముప్పు ప్రభావం ప్రస్తుతానికి పసిఫిక్ ద్వీపాలపైనే కన్పిస్తున్నా అతి త్వరలో ప్రపంచవ్యాప్తంగా లోతట్టు ద్వీపాలన్నింటికీ పాకుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అత్యధిక జనసాంద్రతతో కిక్కిరిసిపోతున్న తీర ప్రాంత మహా నగరాలు, ఉష్ణమండల వ్యవసాయ డెల్టాలు తదితరాల భద్రతకు పెను ముప్పు పొంచి ఉన్నట్టేనని అంటున్నారు. ''ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరచాలి. అంతకంటే ముందు ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్ లోపుకు పరిమితం చేయడంపై మరింత దృష్టి పెట్టాలి. అందుకోసం కర్బన ఉద్గారాలను భారీగా తగ్గించాలి'' అని రెండు నివేదికలూ ముక్త కంఠంతో పేర్కొన్నాయి.

7 కీలక ప్రాజెక్టులపై మోదీ ప్రగతి సమీక్ష

న్యూఢిల్లీ: దాదాపు 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతున్న రూ.76,500 కోట్ల విలువైన ఏడు కీలక ప్రాజెక్టుల పురోగతిపై బుధవారం ప్రధాని మోదీ 'ప్రగతి'సమీక్ష జరిపారు. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక జరిపిన తొలి సమీక్ష ఇది. రోడ్ల అనుసంధానానికి సంబంధించి రెండు, రైల్వేలకు సంబంధించి రెండు, బొగ్గు, ఇంధన, జల వనరులకు సంబంధించిన తలో ప్రాజెక్టును మోదీ సమీక్షించి ఉన్నతాధికారులకు తగు సూచనలు చేశారు. ప్రాజెక్టు అభివృద్ధిలో పర్యావరణ అనుకూల 'అమ్మ పేరిట ఒక మొక్క'కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ''ప్రాజెక్టులు ఆలస్యమైతే అంచనావ్యయం, ఖర్చు మాత్రం పెరిగిపోవు. ప్రాజెక్టు నుంచి ప్రజలకు ఒనగూరే లబ్ధి తరిగిపోతుంది''అని మోదీ అన్నారు.

సీఐఎస్‌ఎఫ్ డీజీగా ఆర్.ఎస్.భాటి నియామకం

- బీఎస్‌ఎఫ్ చీఫ్‌గా దల్జీత్ సింగ్

న్యూఢిల్లీ: బిహార్ పోలీసు చీఫ్ రజ్వీందర్ సింగ్ భాటి కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సీఐఎస్‌ఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. విమానాశ్రయాలు, అణు సంస్థలు, రోదసి సంస్థలతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలకు సీఐఎస్‌ఎఫ్ భద్రత కల్పిస్తుంది. భాటి 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. వచ్చే ఏడాది సెప్టెంబరు 30న పదవీవిరమణ చేసే దాకా భాటి సీఐఎస్‌ఎఫ్ చీఫ్‌గా ఉంటారని సిబ్బంది వ్యవహారాల శాఖ బుధవారం తమ ఉత్తర్వుల్లో తెలిపింది. సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా దల్జీత్‌సింగ్ చౌదరి నియమితులయ్యారు. నవంబరు 30, 2025న పదవీవిరమణ చేసే దాకా బీఎస్‌ఎఫ్ డీజీగా కొనసాగుతారు.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భగవత్‌కు భద్రత ఇక మరింత పటిష్టం

- జెడ్ ప్లస్ నుంచి అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్‌కి పెంపు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ భద్రత మరింత కట్టుదిట్టమైంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆయనకు జెడ్ ప్లస్ భద్రత కల్పిస్తోంది. అయితే, ఇకపై అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్‌ఎల్) స్థాయికి భద్రతను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత భద్రత పెంపునకు సంబంధించి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇప్పటికే సమాచారం అందించారు. గతంలో ఆయన పర్యటనల సందర్భంగా తలెత్తిన భద్రతా లోపాల దృష్ట్యా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మోహన్ భగవత్‌కు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్థాయి భద్రత కల్పించనున్నారు. అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ స్థాయి భద్రతను దేశంలోని ప్రముఖులకు మాత్రమే కల్పిస్తారు. అత్యాధునిక సీసీటీవీ కెమెరాలు, సెన్సార్లు, భద్రతా సామగ్రితో కూడిన ఒక వాహనం, బుల్లెట్ ప్రూఫ్ వాహనం భద్రతలో భాగంగా ఉంటాయి.

కమల అనర్హురాలు!

- ప్రెసిడెంట్ కావడానికి వీల్లేదు
- కన్జర్వేటివ్ సంస్థ పిడివాదం
- కొట్టిపారేస్తున్న నిపుణులు



అమెరికాలో ఎన్నికల వేడి తారస్థాయికి చేరుతున్న వేళ, అధ్యక్ష పదవికి పోటీ పడేందుకు కమలా హారిస్ అనర్హురాలంటూ సరికొత్త వాదన తెరపైకి వచ్చింది. యూఎస్ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రిపబ్లికన్ అసెంబ్లీస్ (ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ) అనే సంస్థ దీన్ని ప్రచారంలో పెట్టింది. 'సహజ పౌరసత్వం'ఉన్నవాళ్లు మాత్రమే అధ్యక్ష పదవికి అర్హులని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోందన్నది దాని వాదన. ''అమెరికా పౌరసత్వమున్న దంపతులకు ఈ గడ్డపై పుట్టిన వాళ్లను మాత్రమే సహజ పౌరులుగా రాజ్యాంగం నిర్వచిస్తోంది. 1857 నాటి ప్రఖ్యాత డ్రెడ్ స్కాట్ వర్సెస్ స్టాన్‌ఫర్ కేసులో అమెరికా సుప్రీంకోర్టు తీర్పు కూడా దీన్ని ధ్రువపరుస్తోంది. ఈ నిర్వచనం ప్రకారం హారిస్‌తో పాటు నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి వంటివాళ్లు కూడా అధ్యక్షపదవికి అనర్హులే''అని ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ చెప్పుకొచ్చింది. ఈ కీలక మౌలిక ప్రాతిపదికను తుంగలో తొక్కుతూ డెమొక్రటిక్ పార్టీ హారిస్‌కు అధ్యక్ష అభ్యర్థిత్వం కట్టబెట్టిందని ఆరోపించింది. న్యాయ నిపుణులు మాత్రం ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ వాదనను కొట్టిపారేస్తున్నారు. ''ఇది రాజ్యాంగానికి వక్రభాష్యమే. పైగా ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ ఉటంకిస్తున్న డ్రెడ్ స్కాట్ వర్సెస్ స్టాన్‌ఫర్ తీర్పు అమెరికా సుప్రీంకోర్టు చరిత్రలోనే అత్యంత చెత్త తీర్పుగా నిలిచిపోయింది. తల్లిదండ్రులకు అమెరికా పౌరసత్వముందా, లేదా అన్నదానితో నిమిత్తం లేకుండా ఈ గడ్డపై పుట్టే వారంతా దేశ పౌరులేనని ఆ తర్వాత సుప్రీంకోర్టు పలు తీర్పులిచ్చింది. ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ వాదనను వర్తింపజేయాల్సి వస్తే బ్రిటిష్ మూలాలున్న తొలినాళ్ల అధ్యక్షులు జార్జి వాషింగ్టన్, జాన్ ఆడమ్స్, థామస్ జెఫర్సన్, జేమ్స్ మాడిసన్ కూడా ఆ పదవికి అనర్హులే''అని వారంటున్నారు. రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు పలికిన ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ హారిస్‌పై ఉద్దేశపూర్వకంగా బురదజల్లుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హారిస్ తల్లి భారత్‌కు, తండ్రి జమైకాకు చెందిన వారన్నది తెలిసిందే.

ఏమిటా తీర్పు?

డ్రెడ్ స్కాట్ వర్సెస్ స్టాన్‌ఫర్ కేసు 1857 నాటిది. అప్పట్లో అమెరికాలో పలు రాష్ట్రాల్లో బానిసత్వానికి చట్టబద్ధత ఉండేది. తనను స్వేచ్ఛా జీవిగా ప్రకటించాలంటూ డ్రెడ్ స్కాట్ అనే ఆఫ్రికన్ అమెరికన్ బానిస సుప్రీంకోర్టుకెక్కాడు. అందుకు కోర్టు నిరాకరించింది. పైగా ''ఆఫ్రికన్ అమెరికన్లు దేశ పౌరులే కాదు. కనుక వారికి సుప్రీంకోర్టుకెక్కే అర్హతే లేదు''అని కోర్టు పేర్కొంది. పైగా దేశ అత్యున్నత చట్టసభ అయిన కాంగ్రెస్‌కు బానిసత్వాన్ని నిషేధించే అధికారం లేదంటూ తీర్పు వెలువరించింది. దాంతో అమెరికాలో బానిసత్వ రగడ తీవ్రతరమై అంతర్యుద్ధానికి దారితీసింది. ఆ తీర్పును పక్కన పెడుతూ అమెరికా రాజ్యాంగానికి 13, 14వ సవరణలు తీసుకొచ్చారు. బానిసత్వాన్ని రద్దు చేయడమే గాక జాతి భేదాలతో నిమిత్తం లేకుండా అమెరికాలో పుట్టిన వాళ్లంతా దేశ పౌరులేనంటూ చట్టం చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

దేశ వ్యతిరేక పోస్టులకు జీవితఖైదు!

- యూపీ సర్కారు కొత్త డిజిటల్ మీడియా పాలసీ



లక్నో: సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక పోస్టులు పెట్టేవారికి మూడేళ్ల నుంచి జీవితఖైదు వరకు శిక్ష విధించేలా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కొత్త డిజిటల్ మీడియా పాలసీని రూపొందించింది. అభ్యంతరకర, అసభ్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంది. అలాగే ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్‌లలో ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించే వారికి నెలవారీ భారీ నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. యూపీ డిజిటల్ మీడి యా పాలసీ-2024కు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికింద దేశ వ్యతిరేక కంటెంట్‌ను పోస్టు చేస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు. మూడేళ్ల నుంచి జీవితఖైదు విధించే ఆస్కారం కల్పించారు. ఇదివరకు దేశ వ్యతిరేక పోస్టులైతే ఐటీ చట్టం సెక్షన్ 66ఇ, 66ఎఫ్‌ల కింద నేరంగా చూసేవారు. అసభ్య, పరువునష్టం కలిగించే పోస్టులు పెడితే క్రిమినల్ పరువునష్టం అభియోగాలు నమోదు చేస్తారు. ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌కు (వారి ఫాలోవర్స్, సబ్‌స్క్రయిబర్స్‌ను బట్టి) ఎక్స్‌లో అయితే రూ. 5 లక్షలు, ఫేస్‌బుక్‌లో రూ. 4 లక్షలు, ఇన్‌స్టాగామ్‌లో 3 లక్షలు గరిష్టంగా యూపీ ప్రభుత్వం చెల్లిస్తుంది. యూట్యూబ్‌లో అయితే ఫాలోవర్లను బట్టి కేటగిరీలు విభజించి, రూ. 8 లక్షలు, రూ. 7 లక్షలు, రూ. 6 లక్షలు, రూ. 4 లక్షల చొప్పున చెల్లిస్తారు. ఇవి నెలవారీ చెల్లింపులు. ఎవరైనా అభ్యంతరకర కంటెంట్‌ను పెడితే ఆయా సంస్థలపై కూడా చర్యలుంటాయి.

ఆ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

న్యూఢిల్లీ: గతంలో కర్ణాటక రాష్ట్రంలో కోటిగర, కురుబ కులాలకు ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ అమల్లో ఉన్నపుడు కేంద్ర, ప్రభుత్వరంగ సంస్థల్లో కొలువు పొందిన ఉద్యోగులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆ కులాలను తర్వాత కర్ణాటక సర్కార్ రిజర్వేషన్ల జాబితా నుంచి తప్పించింది. దీంతో ''ఇప్పుడులేని ఆ రిజర్వేషన్ల కింద మీరెలా ఉద్యోగాల్లో కొనసాగగలరు?, మిమ్మల్ని ఎందుకు ఉద్యోగాల నుంచి తీసేయకూడదో వివరణ ఇవ్వండి''అంటూ కెనరా బ్యాంక్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కె.నిర్మల తదితర బాధిత ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులను బుధవారం సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ కేసులో కేంద్ర సంస్థలకు అనుకూలంగా గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పునూ జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం పక్కనబెట్టింది. ''నాటి కర్ణాటక ప్రభుత్వ నిర్ణయాలు, జారీ అయిన ఎస్సీ-ఎస్టీ సర్టిఫికేట్ల ప్రకారం చట్టం మేరకే వీరు ఉద్యోగాలు పొందారు. ఇప్పుడు వారి కులాలకు రిజర్వేషన్ లేదని చెప్పి వీరికి ఉద్యోగార్హత లేదనడం అసమంజసం. ఉద్యోగులు నిరభ్యంతరంగా కొలువుల్లో కొనసాగవచ్చు''అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

తగ్గిన కాలుష్యం.. పెరిగిన ఆయుర్దాయం!


భారత్‌లో కాస్తంత మెరుగైన వాయు నాణ్యత

వెల్లడించిన షికాగో వర్సిటీ ఎయిర్‌క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ నివేదిక



న్యూఢిల్లీ: భారత్‌లో 2022 ఏడాదిలో గాలిలో సూక్ష్మ ధూళికణాల గాఢత 19.3 శాతం తగ్గడంతో వాయునాణ్యత స్వల్పంగా మెరుగుపడిందని అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయంలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ (ఈపీఐసీ) ప్రకటించింది. ఈ మేరకు రూపొందించిన 'వాయు నాణ్యతా జీవన సూచీ-2024'నివేదికను ఈపీఐసీ తాజాగా వెల్లడించింది. అయితే ఇప్పటికీ భారత్‌లో వాయుకాలుష్యం అధికంగా ఉందని, తగ్గించుకోకపోతే ప్రజల ఆయుర్దాయం తగ్గక తప్పదని హెచ్చరించింది. గాలిలో ఘనపు మీటర్‌కు 5 మైక్రోగ్రాముల మేరకే 2.5స్థాయి సూక్ష్మధూళి కణాలుండాలి. అంతకుమించి ఉండి, ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రమాణాలను అందుకోలేకపోతే భారత్‌లో ప్రజల ఆయుర్దాయం 3.6 ఏళ్లు తగ్గే ప్రమాదముందని నివేదిక హెచ్చరించింది. 2022లో 2.5స్థాయి సూక్ష్మధూళి కణాలు తగ్గడానికి అక్కడి వాతావరణ పరిస్థితులు, ఉష్ణ పరిస్థితులు కారణమని నివేదిక విశ్లేషించింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్‌లలో ఈ వాయు కాలుష్య తగ్గుదల కనిపించింది. ''భారత్ అంతటా వాయుకాలుష్యం తగ్గితే ఢిల్లీలో ప్రజల ఆయుర్దాయం 7.8 ఏళ్లు పెరగొచ్చు. డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాలను అందుకోలేకపోతే మాత్రం ఢిల్లీ ప్రజల ఆయుర్దాయం 11.9 ఏళ్లు తగ్గవచ్చు. కాలుష్యం ఇలాగే కొనసాగినా, భారత్ నిర్దేశించుకున్న 2.5 స్థాయి వాయు నాణ్యతా ప్రమాణాలను అందుకోలేకపోయినా 8.5 ఏళ్లు క్షీణిస్తుంది'' అని నివేదిక పేర్కొనడం విశేషం. పశ్చిమబెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాలో వాయునాణ్యత పెరిగితే అక్కడి వారి ఆయుర్దాయం 3.6 ఏళ్లు ఎక్కువ అవుతుందని నివేదిక పేర్కొంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌ల్లో వాయుకాలుష్యం అధికంగా ఉంటే 2.9 ఏళ్ల ఆయుర్దాయం తగ్గనుంది. నగరాల సమీప జిల్లాలతో పోలిస్తే దూరంగా ఉన్న జిల్లాల్లో 2017తో పోలిస్తే 2022లో కాలుష్యం 18.8 శాతం తగ్గింది. దీంతో 44.67 కోట్ల మంది ఆయుర్దాయం 10.8 నెలలు పెరిగింది. కాలుష్యాన్ని తగ్గించేందుకు భారత్ వినూత్న విధానాలను అవలంబిస్తోందని నివేదిక పేర్కొంది. 2019లో గుజరాత్ తొలిసారిగా వీటిని అమల్లోకి తెచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా సూరత్‌లో కాలుష్యం 20-30 శాతం తగ్గింది. నివాసప్రాంతాల్లో కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు, వంటచెరకు వాడకం తగ్గించడానికి కేంద్రం ప్రధాన్‌మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అమలుచేస్తుండటాన్ని నివేదిక ప్రస్తావించింది.

సముద్రుడి వైపు కృష్ణమ్మ




కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారడంతో నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వరద నీరు భారీగా వస్తుండటంతో గేట్లెత్తి నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున కృష్ణా జలాలు సముద్రంవైపు పరుగులు తీస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆసాంతం.. ఆకు పచ్చ'ధనం'



ఎటు చూసినా పచ్చదనం.. కనుచూపు మేర ఆకు పచ్చదనం కనువిందు చేస్తోంది. కృష్ణా జిల్లా చోడవరం గ్రామ శివారు ప్రాంతంలో ఈ పచ్చని పొలాలు చూపరులను సమ్మోహన పరుస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రకృతి కాన్వాసుపై..



సాయంసమయాన ప్రకృతి రమణీయంగా మారింది. అస్తమించే సమయంలో భానుడు అరుణ కిరణాలు వెదజల్లుతుంటే ఆకాశం చేయితిరిగిన చిత్రకారుడు కాన్వాసుపై గీచిన చిత్రంలా మారిపోయింది. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి, వడియంపేట గ్రామాల సమీపంలో ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

బీపీటీ విత్తనం.. బ్లాక్ మార్కెట్ పెత్తనం



బ్లాక్ మార్కెట్‌లో సాంబమసూరి విత్తనం

- ప్రభుత్వం నిర్దేశించిన ధర 25 కేజీల బస్తా రూ.920
- బహిరంగ మార్కెట్‌లో రూ.1,400 నుంచి రూ.1,500కు అమ్మకాలు
- ఉత్తరాంధ్ర, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 5.25 లక్షల ఎకరాల్లో సాగు
- 28,973 క్వింటాళ్ల విత్తనం అవసరమని ఇండెంట్
- 19,614 క్వింటాళ్ల విత్తనం మాత్రమే నిల్వ చేసిన ఏపీ సీడ్స్
- బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడంలో విఫలమైన యంత్రాంగం



సాక్షి, అమరావతి:సాంబ మసూరి (బీపీటీ-5204) విత్తనంపై బ్లాక్ మార్కెట్ రాజ్యమేలుతోంది. ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో నాణ్యమైన విత్తనం అంటూ విత్తన విక్రయదారులు ధరలు విపరీతంగా పెంచి విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. అదుపు చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

5.25 లక్షల ఎకరాల్లో సాగు

సాంబ మసూరిగా పిలిచే బీపీటీ-5204 విత్తనానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. 1986లో బాపట్ల వరి పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన ఈ వంగడం ఉత్తరాంధ్రతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా సాగు చేస్తారు. గడచిన మూడున్నర దశాబ్దాలుగా సుమారు 5.25 లక్షల ఎకరాల్లో ఈ వంగడాన్ని రైతులు సాగు చేస్తున్నారు. మద్దతు ధరకు మించి కొనుగోలు చేసే ఈ రకం సాగుకు రైతులు ఎక్కువగా మక్కువ చూపుతారు. విత్తన మార్పిడిలో భాగంగా బీపీటీ-5204కు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1271, ముంపు ప్రాంతాల్లో ఎంటీయూ-1232, ఉప్పు నీటి ప్రాంతాల్లో ఎంసీఎం-103, ఎంటీయూ-1293 రకాలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఎమ్మార్పీకి మించి అమ్మకాలు..

సాధారణంగా నిర్దేశించిన సాగు విస్తీర్ణానికి అవసరమైన విత్తనంలో 30 శాతం విత్తనాన్ని సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంటుంది. మిగిలిన విత్తనంలో కొంత సొంతంగా పండించడంతోపాటు మరికొంత బహిరంగ మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేస్తుంటారు. విత్తన మార్పిడి కోసం ప్రతిపాదించిన రకాలు ఆశించిన స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో మెజార్టీ రైతులు పాత రకాల సాగువైపే మొగ్గు చూపుతున్నారు. జిల్లాల నుంచి 28,973 క్వింటాళ్ల బీపీటీ-5204 రకం విత్తనం అవసరమని ఇండెంట్ రాగా.. ఇప్పటివరకు 19,614 క్వింటాళ్ల విత్తనాన్ని నిల్వ చేశారు. మరో 10 వేల క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉందని ఏపీ సీడ్స్ చెబుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై 25 కిలోల బస్తా విత్తనాల ధరను రూ.920గా నిర్దేశించింది. పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో బీపీటీ రకం విత్తనం ఆశించిన స్థాయిలో నిల్వ చేయకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. 25 కిలోల విత్తనాల బస్తాను బహిరంగ మార్కెట్‌లో రూ.1,400 నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నారు.

బ్లాక్ మార్కెట్‌పై కానరాని నిఘా

ముందుచూపుతో ఖరీఫ్ సీజన్‌లో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో వైఎస్ జగన్ ప్రభుత్వం అవసరమైన సబ్సిడీ విత్తనాన్ని అందుబాటులో ఉంచింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో ×సీడ్ మానిటరింగ్ సెల్‌×ను కూడా ఏర్పాటు చేసింది. వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో ×సీడ్ రెగ్యులేషన్ సెల్‌× (ఫోన్:83310 56032)ఏర్పాటు చేశారు. రైతు సమీకృత సమాచార కేంద్రం (టోల్ ఫ్రీ నంబర్: 155251)కు ఫోన్ చేస్తే తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. సీడ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన క్షేత్రస్థాయి ప్రత్యేక నిఘా బృందాల ద్వారా ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీ పాయింట్లు, డీలర్లు, రిటైల్ షాపులు, డెలివరీ యూనిట్లలో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించారు. ఏప్రిల్, మే నెలల్లో కర్నూలు, నంద్యాల, పల్నాడు, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో మూడు 6ఏ కేసులు నమోదు చేశారు. 7.77 లక్షల విలువైన పత్తి, మిరప విత్తనాలను జప్తు చేశారు. రూ.2.13 కోట్ల విలువైన 435 క్వింటాళ్ల పత్తి, మిరప, కూరగాయల నాసిరకం విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. కానీ.. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ కారణంగానే బ్లాక్ మార్కెట్‌లో విత్తన విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీపీటీ-5204 రకం విత్తనమే కాకుండా ఇతర విత్తనాలు కూడా బ్లాక్ మార్కెట్‌లో గరిష్ట అమ్మకం ధరకు మించి విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సమాజంలోని రుగ్మతలను యువత రూపుమాపాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బీఎస్.కాంగో పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కాంగో

తిరుపతి కల్చరల్: దేశంలోని యువత సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలపై అవగాహన పెంచుకొని సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బీఎస్ కాంగో పిలుపు నిచ్చారు. సీపీఐ సెంట్రల్ పార్టీ శిక్షణ తరగతులు బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా చెబుతున్నప్పటికీ దేశంలో రోజు రోజుకు పేదరికం పెరగడానికి పెట్టుబడిదారీ విధానాలే కారణమన్నారు. మానవాళి మనుగడ సోషలిజంతోనే సాధ్యమన్నారు. సీపీఐ విద్యా విభాగం కన్వీనర్ అనిల్ రాజం వాలే మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత రాజకీయాలు భ్రష్టు పట్టాయని వాటిని మార్చడానికి సైద్ధాంతికంగా విద్యార్థులు, యువత తయారవ్వాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దోచుకోవడానికే రివర్స్ టెండరింగ్ రద్దు

మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరు: ప్రజాధనం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా చూడటమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానాన్ని తీసుకువచ్చిందని, ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకుకేందుకే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం దాన్ని రద్దుచేసిందని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎక్కువ మంది టెండర్లలో పాల్గొనేలా చేసి, దాని వల్ల ఏ పనిలో ఎంత ప్రజా ధనం ఆదా అయిందనే విషయాన్ని ప్రజల ముందుంచుతామని ప్రమాణ స్వీకారం చేసిన రోజే నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలోనే అలాంటి వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని అన్నారు. ఒక పని విలువ రూ 10 లక్షలు దాటితే రివర్స్ టెండరింగ్‌కు. రూ 100 కోట్లు దాటితే రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలోని జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపి పారదర్శకంగా పనులు అప్పగించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసిందన్నారు. ఈ విధానం ద్వారా ఒక్క ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పనుల్లోనే రూ 2,400 కోట్ల ఆదా చేయడం జరిగిందన్నారు. రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేయాలని చంద్రబాబు మంత్రివర్గం నిర్ణయించడం దారుణమని రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం ప్రజా ధనాన్ని దోచుకోవడానికి గేట్లు తెరవడమేనని విమర్శించారు.

ఆధునిక బోధనా దీప్తి 'మిద్దే'

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మిద్దే శ్రీనివాసరావు



ఇప్పటి వరకు అందుకున్న అవార్డులతో శ్రీనివాసరావు(ఫైల్)



సాంకేతిక పరికరాలతో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న శ్రీనివాసరావు

- గుడివాడ ఎస్పీఎస్ మునిసిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా సేవలు
- సెప్టెంబర్ 5న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న వైనం

గుడివాడ రూరల్: ఇంజినీరు కావాలన్నా.. సాంకేతిక రంగాల్లో రాణించాలన్నా.. భౌతిక శాస్త్రంపై పట్టు సాధించడం తప్పని సరి. అంతటి కీలకమైన ఈ శాస్త్రాన్ని సాధారణ పద్ధతుల్లో బోధిస్తే విద్యార్థుల బుర్రకెక్కదు. కష్టమనుకునే ఇంగ్లిష్, గణితం కంటే భౌతిక శాస్త్రం ఎంతో కఠినంగా ఉంటుంది. ఈ విషయం విద్యార్థులకు బాగా తెలుసు. అలాంటి భౌతిక శాస్త్రాన్ని అందరిలాగే బోధిస్తే ఆశించిన ఫలితాలు రావన్న విషయాన్ని గ్రహించిన గుడివాడ ఎస్పీఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు మిద్దే శ్రీనివాసరావు సరికొత్తగా బోధనకు శ్రీకారం చుట్టారు. ఆధునిక, సాంకేతికతను జోడించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. సాంకేతిక పరికరాలతో ప్రయోగాత్మకంగా పాఠాలు బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన ప్పటి సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఆయన బోధన విధానం మంచి ఫలితాలు ఇవ్వడంతో విద్యార్థులకు మేలు చేకూర్చుతోంది. అంతేకాదు జిల్లా, రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిలిపింది. గుడివాడ కీర్తిని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లిన అధ్యాపకుడు మిద్దే శ్రీనివాసరావు సెప్టెంబర్ ఐదో తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకోనున్నారు.

రైతు కుటుంబం నుంచి..

ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడులో రైతు మిద్దే వెంకటేశ్వరరావు, కస్తూరి దంపతులకు శ్రీనివాసరావు జన్మించారు. ఆయనకు ఇద్దరు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు గ్రామంలోని యూపీ పాఠశాలలో, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియెట్ తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ నూజివీడు ప్రభుత్వ డీఆర్ కళాశాల, బీఈడీ ఏజే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మచిలీపట్నం, ఎమ్మెస్సీ ఫిజిక్స్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పూర్తి చేశారు.

డీఎస్సీ తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం

చదువు పూర్తయిన తర్వాత 2000వ సంవత్సరంలో జరిగిన డీఎస్సీలో తొలి ప్రయత్నంలోనే మిద్దే శ్రీనివాసరావు అర్హత సాధించారు. గుడివాడ ఏడో వార్డులోని ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. నాలుగేళ్లు అదే పాఠశాలలో పని చేసి 2004లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొంది గుడివాడలోని ఏజీకే మునిసిపల్ హైస్కూల్‌లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. 2022లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానంలో మార్పులతో ఎస్పీఎస్ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా ఉద్యోగోన్నతి పొంది, అప్పటి నుంచి అక్కడే పని చేస్తున్నారు.

విద్యారంగానికి సేవలు

ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ధర్మం నిర్వహిస్తూ రాష్ట్రస్థాయిలో పాఠ్యపుస్తకాల రూప కల్పన, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలను శ్రీనివాసరావు చేపట్టారు. ఏడో తరగతి రసాయన శాస్త్రం, 9,10 తరగతుల భౌతిక, రసాయన శాస్త్రాల పాఠ్యపుస్తకాలను రూపొందించారు.

సాధించిన అవార్డులు

శ్రీనివాసరావు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుంచి వందకు పైగా అవార్డులు అందుకున్నారు. 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా మచిలీపట్నంలో అవార్డు అందుకున్నారు. 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికై అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ చేతుల మీదుగా విశాఖపట్నంలో అవార్డు స్వీకరించారు. ఇప్పుడు 2024 సంవత్సరానికి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికయ్యారు. సెప్టెంబర్ ఐదో తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

దళారీ వ్యవస్థకు 'మిషన్ కారుణ్య' చెక్!

- విజయవాడ రైల్వే డివిజన్‌లో నూరు శాతం అమలు
- అత్యంత వేగంగా కారుణ్య నియామక ప్రక్రియ పూర్తి
- 7 నుంచి 30 రోజుల్లోనే నియామకాలు
- పర్సనల్ బ్రాంచ్ విశిష్ట సేవలు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఎన్నో ఏళ్లుగా సేవలందించి విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు గానీ లేదా అనారోగ్యంతో గానీ ఒక ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం అనుభవించే ఆవేదన వర్ణనాతీతం. అయితే.. ఆ కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటూ.. వారిలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పిస్తుంది రైల్వేశాఖ. ఈ క్రమంలో వారు దళారీ వ్యవస్థ మోసాలకు గురికాకుండా.. ఆ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు స్వచ్ఛందంగా సేవలందించేందుకు 'మిషన్ కారుణ్య' అనే ఓ వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టిన రైల్వే ఉన్నతాధికారులు పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

పారదర్శక పాలనకు నాంది..


ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోల్చితే రైల్వే శాఖలోని పర్సనల్ బ్రాంచ్ విభాగం ఈ కారుణ్య నియామకాలు వంద శాతం అమలు చేస్తూ రైల్వేకి విలువైన సేవలు అందించిన ఉద్యోగి కుటుంబానికి సీజీ (కాంపాసినెట్ గ్రౌండ్) లెవల్‌లో కారుణ్య నియామకం కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నది. ఈ క్రమంలో దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాలని విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ సీనియర్ డీపీఓ (డివిజనల్ పర్సనల్ ఆఫీసర్) కట్టా ఆనంద్ భావించారు. అందుకోసం 'మిషన్ కారుణ్య' పేరుతో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటీల్ అనుమతితో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టారు. మిషన్ కారుణ్యలో సీనియర్ అధికారుల పర్యవేక్షణలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి పూర్తి వివరాలు అందజేస్తున్నారు. అంతేకాక మృతిచెందిన ఉద్యోగి ఇంటికి రైల్వే సిబ్బంది వెళ్లి దరఖాస్తుదారులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడంతో పాటు వారి అర్హతకు తగిన ఉద్యోగం కల్పించేంత వరకు పారదర్శకంగా సేవలు అందిస్తారు. దీంతో 7 నుంచి 30 రోజుల్లోపే కారుణ్య నియామక ప్రక్రియ పూర్తవుతున్నది. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తుండడంతో దళారీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అరికట్టినట్లయ్యింది.



వసతి, భోజనం సదుపాయం..


కారుణ్య నియామకాల కోసం ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ డివిజన్ హెడ్ క్వార్టర్స్‌కు వచ్చే వారికి పర్సనల్ బ్రాంచ్ సిబ్బంది మానవతా దృక్పథంతో వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. గతంలో మెడికల్ పరీక్షలు, ఇతర పనులపై పర్సనల్ బ్రాంచ్‌కు వచ్చే దరఖాస్తు దారులు ఒకటి, రెండు రోజులు విజయవాడలోనే ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఆ సమయంలో వారు హోటల్స్‌లో తింటూ, రాత్రుళ్లు రైల్వే ప్లాట్‌ఫాంలు, వెయింటింగ్ హాల్స్‌లో నిద్రించాల్సి వచ్చేది. దీంతో ముఖ్యంగా మహిళా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. వారి ఇబ్బందులను గమనించిన సీనియర్ డీపీఓ వారి కోసం రైల్వే క్యాంటీన్‌లో ఆహారం, స్టేషన్ పరిసర ప్రాంతంలో వారు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో దరఖాస్తు దారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బాధ్యతగా భావిస్తున్నాం



రైల్వేకి ఎన్నో సేవలు అందించిన ఉద్యోగి మృతి చెందితే ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు విజయవాడ డివిజన్ ప్రత్యేక చర్యలు తీసుకుంది. గతంలో దళారీ వ్యవస్థ వలన ఎంతోమంది లబ్ధిదారులు నష్టపోయారు. రైల్వే కుటుంబసభ్యుల సంక్షేమం కోసం మిషన్ కారుణ్య ఏర్పాటు చేసి వారికి సహకరిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే దరఖాస్తుదారులకు భోజనం, బస ఏర్పాటు చేయడం బాధ్యతగా భావిస్తున్నాం.
– కట్టా ఆనంద్, సీనియర్ డీపీఓ

పైసా లంచం లేకుండా పని చేసి పెడుతున్నారు..



నా భర్త జనరిలో చనిపోయాడు. పెన్షన్ తదితర విషయాలపై బయట వ్యక్తులకు రూ.లక్షలు చెల్లించి మోసపోయాను. తరువాత మిషన్ కారుణ్య పేరుతో సీనియర్ డీపీఓ నేరుగా వీడియో కాల్‌లో నాతో మాట్లాడి ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని తెలిపారు. వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌లు మా వద్దకు వచ్చి పనులు వేగంగా పూర్తి చేసి పెన్షన్ కూడా మంజూరు చేశారు.
– సుంకర దేవి, కాకినాడ

వేగంగా ప్రాసెస్ జరుగుతోంది..



విజయవాడ డివిజన్‌లో ప్రవేశపెట్టిన మిషన్ కారుణ్య పథకం ఎంతో బాగా ఉంది. కారుణ్య అనే గ్రూప్ క్రియేట్ చేసి మాకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు పంపిస్తున్నారు. ప్రతి ప్రాసెస్ గతంలో కంటే వేగంగా జరుగుతోంది. మా నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని దానికి తగినట్లుగా సహాయం చేస్తున్నారు.
– ఎస్.సత్యేంద్రకుమార్, విజయవాడ

వీలైతే నాలుగు రకాల స్నాక్స్.. కుదిరితే కప్పు కాఫీ.. సాయంత్రమైతే చాలు. విశాఖ వాసి మదిలో మెదిలో మొదటి ఆలోచన ఇదే. చిరుతిండి.. మన జీవితాల్లో భాగమైపోయింది. టీ తాగుతూ స్నాక్స్.. సాయంత్రం సరదాగా స్నాక్స్.. ఇంటికి చుట్టాలొస్తే స్నాక్స్.. చినుకుపడినా.. సమయమేదైనా.. స్నాక్స్ తిందాం మిత్రమా అన్నట్లుగా చిరుతిళ్లపై మనసు మళ్లిస్తున్నారు. అయితే.. ఈ మధ్య కాలంలో చిరుతిళ్లలోనూ ఆరోగ్యాన్ని వెదుకుతున్నారు. విశాఖ సహా 30 నగరాల్లో స్నాక్స్ విక్రయాలు, ప్రజల ఇష్టాయిష్టాలపై ప్రముఖ స్నాక్స్ తయారీ సంస్థ ఫార్మ్‌లే విడుదల చేసిన ది హెల్దీ స్నాకింగ్-2024 నివేదిక పలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది. చిరుతిళ్లలో పోషకాల స్నాక్స్ వేరయా.. అవే మాకు ఇష్టమయా అంటూ 73 శాతం మంది చూసి మరీ తింటున్నారంట. మార్కెట్‌లోకి బెస్ట్ స్నాక్స్ ఏమొచ్చాయో అని ప్రతి 10 మందిలో తొమ్మిది మంది వెతుకుతున్నారని నివేదిక చెబుతోంది.

– సాక్షి, విశాఖపట్నం



హెల్దీ తిండి.. కొత్త ట్రెండీ

- పోషకాలు, పదార్థాల పైనే దృష్టి
- ది హెల్దీ స్నాకింగ్ రిపోర్ట్‌లో ఆసక్తికర అంశాలు
- చిరుతిళ్లలోనూ ఆరోగ్యాన్ని చూస్తున్న 73 శాతం మంది వైజాగ్ వాసులు
- తృణధాన్యాలు, గింజలనే స్నాక్స్‌గా ఆరగిస్తున్న 60 శాతం మంది..



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చిరుతిళ్లకు గిరాకీ పెరుగుతోంది. టీ, కాఫీ తాగుతున్నప్పుడు వేడి వేడి సమోసా లేదంటే.. బిస్కెట్లు ఉండాల్సిందే. లంచ్, డిన్నర్‌కి మధ్య స్నాక్స్ టైమ్ ఫిక్సయిపోయింది. అందుకే భారతీయులకు చిరుతిండి ఇష్టంగా మారిపోయింది. అయితే ఇటీవల ఆహార పదార్థాల కల్తీపై ఆందోళనల నేపథ్యంలో.. స్నాక్స్ ఎంపికలోనూ జాగ్రత్త పడుతున్నారు. భారతీయులు ఎలాంటి స్నాక్స్ ఇష్టపడుతున్నారనే వివరాలను తెలుసుకునేందుకు ఫార్మ్‌లే దేశవ్యాప్తంగా 30 నగరాల్లో సర్వే చేసింది. ఈ వివరాలతో ది హెల్దీ స్నాకింగ్-2024 అనే నివేదికను విడుదల చేసింది. నగరంలోనూ సర్వే నిర్వహించగా.. ఆకలేస్తే పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి రెండు బంగాళాదుంప చిప్స్ ప్యాకెట్లు లేదా బేకరీకి వెళ్లి సమోసా తినే రోజులు పోయాయని విశాఖ వాసులు చెప్పారంట.! కొనేది చిన్న ప్యాకెట్ అయినా.. అందులో ఏం ఇంగ్రిడియంట్స్ ఉన్నాయి? వాటిలో పోషకాల విలువెంత? అవి తింటే వచ్చే అనర్థాలేమైనా ఉన్నాయా? ఇలా ప్రతి విషయంలోనూ మిస్టర్ పర్‌ఫెక్ట్‌లమని తెగేసి చెబుతున్నారు.

మార్కెట్ ట్రెండ్.. మారిపోయిందండోయ్..
ప్రస్తుతం ఫుడ్ ప్యాకేజీ మార్కెట్‌ని స్నాక్స్ సంస్థలే శాసిస్తున్నాయి. దేశవ్యాప్తంగా రూ.3.75 ట్రిలియన్ల ఫుడ్ ప్యాకేజీ ఇండస్ట్రీ ఉండగా.. ఇందులో 33.4 శాతం వరకూ స్నాక్స్, స్వీట్స్ పరిశ్రమలు ఆక్రమించేసుకున్నాయి. ఆరోగ్యకరమైన స్నాక్స్‌ని ఇష్టపడుతున్నారని తెలిసి.. వాటి తయారీ పైనే ఆసక్తి చూపిస్తున్నాయి. శరీరంలో తక్కువ కొవ్వు ఉత్పత్తి చేసే పాపింగ్, బేకింగ్, ఎయిర్‌ఫ్రైయింగ్, వాక్యూమ్ ఫ్రైయింగ్ మొదలైన ప్రాసెస్ విధానంలో తయారు చేసే స్నాక్స్ ఎక్కువగా మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసిన స్నాక్స్‌తో పోలిస్తే 75 శాతం కేలరీలను తగ్గిస్తాయనే ఉద్దేశంతో ఎయిర్ ఫ్రయర్ స్నాక్స్‌కే మొగ్గు చూపుతున్నారు.

విశాఖలో సర్వే సాగిందిలా..

అభిప్రాయం తెలిపిన వారు **6,000**

టీ, కాఫీ తాగే సమయంలో స్నాక్స్ తినడం ఇష్టమన్న వారు **70** శాతం

లేబుల్ చదివి స్నాక్స్ తీసుకునే వారు **73** శాతం

స్నాక్స్‌కి ప్రత్యామ్నాయం వెతుకుతున్న వారు **10** మందిలో **9** మంది

చిరుతిళ్లలో మిల్లెట్లు, పప్పు గింజలకు ప్రాధాన్యమిస్తున్న వారు **60** శాతం

మఖానా, డ్రైఫ్రూట్స్ ఎంపిక చేసుకుంటున్న వారు **67** శాతం

ఆరోగ్యకరమైన స్నాక్స్ ఖరీదని చెబుతున్న వారు **58** శాతం

బ్రాండెడ్ స్నాక్స్ కావాలి



ఒకప్పుడు స్నాక్స్ ప్యాకెట్ తీసుకుంటే కేవలం ఎక్స్‌పైరీ డేట్ మాత్రమే చూసేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. స్నాక్స్ కొనుగోలు చేసినప్పుడు ఫస్ట్ అవి బ్రాండెడ్ సంస్థలు తయారు చేస్తున్నాయా లేదా అని చూస్తున్నారు. అంతేకాదండోయ్.. ప్రతి 100 మందిలో 73 మంది మాత్రం అందులో పోషకాలు ఏం ఉన్నాయి.? సోడియం కంటెంట్ ఎంత ఉంది.? అవి తినడం వల్ల కొవ్వు శరీరంలో పెరుగుతుందా లేదా.? ఆరోగ్యానికి హానికరమైన ముడిపదార్థాలేమైనా ఉన్నాయా అనేది కచ్చితంగా చెక్ చేస్తున్నారు.

మిల్లెట్ల వైపు దృష్టి..

ఇప్పుడిప్పుడే స్నాక్స్ ప్లేస్‌లో మిల్లెట్స్ వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సాయంత్రం సమయంలో బిస్కెట్, సమోసా, బజ్జీ, ఆలూ చిప్స్ మొదలైన వాటి స్థానాలను బాదం, పిస్తా, ఖర్జూరం, జీడిపప్పు, తృణధాన్యాలు, మొలకలు ఆక్రమించేస్తున్నాయి. కొన్ని సంస్థలు ఈ మిల్లెట్స్‌ను ప్యాకేజింగ్ ఫుడ్‌గా మార్చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. 2025 నాటికి మిల్లెట్ స్నాక్స్ 20 శాతానికి చేరుతాయని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అంచనా వేస్తోంది.

స్నాక్స్ ప్లేస్‌ను పప్పుగింజలు ఆక్రమించుకుంటున్నాయి

ఒకప్పుడు ఇంట్లో స్నాక్స్ తయారు చేసి.. వాటినే తినేవారు. ఇప్పుడు కాలం మారిపోయింది. ప్యాకేజ్ స్నాక్స్ రావడంతో వాటిపైనే మొగ్గు చూపుతున్నారు. ఇవి ఆరోగ్యానికి హానికరమని తెలుసుకున్నారు. దీంతో స్నాక్స్ స్థానాన్ని పప్పుగింజలు ఆక్రమించేసుకున్నాయి. ముఖ్యంగా బాదం, పిస్తా వంటివాటికే ఓటేస్తున్నారు. ప్రొటీన్, కాంప్లెక్స్, కార్బొహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు తగినంతగా ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం. యాంటీఆక్సిడెంట్, విటమిన్ ఈ వంటివి ఉండే బాదంను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. తృణధాన్యాలు, పప్పుగింజలు పోషకాలు అవసరమైన విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి. అందుకే చిరుతిళ్లలో పప్పుగింజలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది.

– శీలా కృష్ణస్వామి, పోషకాహార నిపుణురాలు



పర్యావరణ హిత విగ్రహాలను ప్రోత్సహించాలి

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



మట్టి విగ్రహ నమూనా ఫ్లెక్సీని ఆవిష్కరించిన మంత్రి ఆనం, ఎంపీ కేశినేని చిన్ని తదితరులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని, అందుకు ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల విజయ మహా గణపతి విగ్రహ నమూనా ఫ్లెక్సీ, బ్రోచర్‌ను ఆయన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రంలోని 8 ప్రముఖ దేవాలయాల్లో స్వామివార్ల కల్యాణోత్సవానికి ఉపయోగించే దేవతా విగ్రహాలను వాహనాల్లో ఇక్కడకు తీసుకొచ్చి ఉత్సవాల అన్ని రోజులు అక్కడి అర్చకులే కల్యాణాలను నిర్వహిస్తారని వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ గణేష్ ఉత్సవాలేనని, ముఖ్యంగా అందరూ కలిసిమెలిసి ఉండే పశ్చిమ నియోజకవర్గంలో ఈ మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయటం శుభపరిణామమన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ, ఉత్సవాల, కార్యక్రమ నిర్వాహకులు డూండీ రాకేష్, వీవీకె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కుంగదీస్తున్న అనారోగ్యం

- గుండె జబ్బులు, స్ట్రోక్, ఇతర వ్యాధులున్న వారిలో అధిక సమస్య
- అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో వెల్లడి
- 1997-2020 మధ్య 64 వేల మంది బాధితులపై అధ్యయనం

ఇల్‌నెస్.. డేంజర్ బెల్స్

సాక్షి, అమరావతి: అనారోగ్యం మనిషిని మరింత కుంగుబాటుకు గురిచేస్తోంది. గుండె జబ్బులు, స్ట్రోక్, ఇతర గుండె సంబంధిత వ్యాధులు ఈ కుంగుబాటును మరింత పెంచుతున్నాయి. వీటి కారణంగా ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన చాలామంది వ్యక్తులు సాధారణ ప్రజల కంటే ఎక్కువ ఆందోళన, నిరాశకు గురవుతున్నారు. మరికొంతమంది ఏకంగా ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశాలను అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఓ అధ్యయనంలో వెల్లడించింది. యూకే బయోబ్యాంక్‌లోని 5 లక్షల మంది పెద్దల్లో ఎంపిక చేసిన వ్యక్తుల ఆరోగ్య రికార్డులను విశ్లేషించడం ద్వారా ఈ అధ్యయనం చేపట్టారు. దీన్లోభాగంగా 1997 నుంచి 2020 మధ్య గుండె సంబంధిత, స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చేరిన 64 వేల మంది బాధితుల రికార్డులతో గుండె జబ్బులు లేని దాదాపు 1.28 లక్షల మంది ఆరోగ్య రికార్డులను పోల్చి చూశారు.



మానసిక రుగ్మతలకు 83 శాతం అవకాశం

గుండె సంబంధ వ్యాధులతో ఆస్పత్రుల్లో చేరిన వ్యక్తుల్లో మొదటి ఏడాదిలో బహుళ మానసిక రుగ్మతలు నిర్ధారణయ్యేందుకు 83శాతం ఎక్కువ అవకాశం ఉన్నట్లు తేల్చారు. అదేవిధంగా కార్డియోవాస్క్యులర్ సమస్యలున్న వారిలో ఇది 24 శాతం ఉండగా, వీరికి దాదాపు ఎనిమిదేళ్ల వరకూ ఈ ప్రమాదం పొంచి ఉంటుంది. ఇక స్ట్రోక్, సెరెబ్రోవాస్క్యులర్ వ్యాధి ఉన్న వ్యక్తులు ఆస్పత్రిలో చేరిన ఏడాదిలోపు మానసిక రుగ్మతలు, ఆత్మహత్యాయత్నానికి మూడు రెట్లు అధిక ప్రమాదం కలిగి ఉంటారు. ఏడాది తర్వాత అయితే 45 శాతం ఎక్కువ ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ జబ్బులతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చీఫ్ సైన్స్ అండ్ మెడికల్ ఆఫీసర్ మారిల్ జెస్సప్ సూచించారు.

పోస్ట్ ఆపరేటివ్ మానసిక రుగ్మతలకు చికిత్సలున్నాయి

గుండె, ఇతర జబ్బుల బారినపడిన వ్యక్తులు నిరాశ, ఆందోళనకు గురవడం సాధారణం. తాము మునుపటిలాగా పని చేయలేమని, జీవించలేమనే ఆందోళన ఉంటుంది. దీనికి పోస్ట్ ఆపరేటివ్‌లో వాడిన మందులు కూడా కారణం కావచ్చు. అలాగే శస్త్ర చికిత్సల తరువాత కొన్ని నెలలు ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఒంటరిగా ఉండాల్సి వస్తుంది. ఈ కారణంగా మానసిక వేదన మరింత ఎక్కువవుతుంది. ఇలాంటి సందర్భంల్లోనే వైద్యులు, కుటుంబ సభ్యులు రోగులకు ధైర్యం చెప్పాలి. వెంటనే మానసిక వైద్యుడిని సంప్రదించాలి. మునుపటికన్నా ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని చెప్పాలి. ఈ మధ్య కాలంలో జీవనశైలి వస్తున్న మార్పులతో యువత, మధ్య వయస్కులు సైతం గుండె, ఇతర జబ్బులున్నాయేమోనని అపోహలకు గురవుతూ, డిప్రెషన్‌కులోనై మావద్దకు వస్తున్నారు. ఈ మానసిక రుగ్మతలకు చికిత్స ఉంది.

– డాక్టర్ కె.వి.రామిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక వైద్యశాల, విశాఖపట్నం

నేడు స్వర్ణరథంపై ఆది దంపతుల విహారం



ఆలయం ఎదురుగా స్వర్ణ రథంపై విహరిస్తున్న ఆదిదంపతులు

శ్రీశైలం టెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో మొట్టమొదటి సారిగా ఆది దంపతులు స్వర్ణ రథంపై విహరించనున్నారు. ఈ మహాత్కార్యం నేడు జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఆలయ మాఢవీధుల్లో స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు చేస్తారు. అనంతరం 7.30 గంటలకు ఆలయ మాఢ వీధుల్లో స్వర్ణ రథంపై ఊరేగిస్తారు. తొలిసారిగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇకపై ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజున స్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సం నిర్వహించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,153 మంది స్వామివారిని దర్శించుకోగా 25,863 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,97,72,140 వచ్చినట్లు ఈవో ఎస్‌వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను ఆలయంలోని గురుదక్షిణా మూర్తి సన్నిధి వద్ద లెక్కించారు. బంగారు 98 గ్రాములు, వెండి 605 కిలోలు, విదేశీ కరెన్సీ నోట్లు 233 వచ్చాయి.

సింహగిరిపై రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న సింహగిరిపై పెద్ద ఎత్తున సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు పూజాసామగ్రి, ప్రతిమ, రవిక, ప్రసాదం దేవస్థానం ఉచితంగా అందిస్తుందన్నారు.

శ్రీవారి క్షేత్రంలో నేత్రపర్వంగా ఉట్ల పండుగ

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో బుధవారం సాయంత్రం ఉట్ల పండుగ, స్వామివారి తిరువీధి సేవలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పుర వీధులకు పయనమైంది. శ్రీవారి కల్యాణ మండపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన ఉట్టిని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు యువకులకు అందించారు. అనంతరం యువకులు దాన్ని ఉత్సహంగా కొట్టారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈనెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి జరిగే ఈ వేడుకలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనాలని ఆయన కోరారు.



కనుల పండువగా చెన్నకేశవుని కల్యాణం

పెనగలూరు: అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరులో నూతనంగా నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు ప్రత్యేక యాగశాలలో వివిధ రకాల హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపేట: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనను బుధవారం వైభవంగా నిర్వహించారు. తిరుపతిలో ప్రముఖ శిల్పులతో తయారుచేయించిన దేవతామూర్తుల విగ్రహాలను తీసుకువచ్చి సోమవారం నుంచి గత ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారుగా వ్యవహరించిన నేమాని భాస్కరరామం పర్యవేక్షణలో ఆగమ శాస్త్ర పండితులు మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు.

పంచ మఠాల్లో ప్రత్యేక పూజలు


శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలోని వీరశైవ జగద్గురు పరంపరకు సంబంధించిన పంచ మఠాల్లో ప్రతిష్ఠమైన లింగాలకు శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చిన్న సిద్ధరామ శివాచార్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో క్షేత్రంలో ఉన్న ఘంటా మఠం, విభూతి, రుద్రాక్ష, భీమశంకర, సారంగధర మఠాల్లో విశేష అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆయా మఠాల్లో లోక కళ్యాణార్థం అభిషేకాది అర్చనలు చేశామని స్వామి తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు మహిళా వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: థాయిలాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంజ్కలా యూనివర్సిటీ వేదికగా గురువారం నుంచి రెండురోజుల పాటు జరగనున్న రీజనల్ నెట్‌వర్క్స్ ఆన్ పావర్టీ ఎరాడికేషన్ అనే అంతర్జాతీయ సదస్సుకు మహిళా వర్సిటీ అధ్యాపకులు హాజరుకానున్నారు. 14దేశాలకు చెందిన వర్సిటీ అధ్యాపకులు హాజరుకాన్ను ఈ సదస్సుకు మహిళా వర్సిటీ నుంచి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని, డీన్ ఆర్ ఉషా, ప్రొఫెసర్ జ్యోత్స్న పాల్గొంటారని వర్సిటీ అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఒన్ హెల్త్ రాష్ట్రస్థాయి సదస్సు

తిరుపతి కల్చరల్: ఐఏపీఎస్ఎం, ఐపీహెచ్ఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ గురువారం నుంచి మూడు రోజుల పాటు ఎస్వీ మెడికల్ కళాశాలలోని ఆడిటోరియంలో ప్రపంచ వ్యాప్తంగా మనిషితో పాటు మనిషి చుట్టూ ఉన్న వాతావరణం, జంతువుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఒన్ హెల్త్ అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సామాజిక వైద్య విభాగాధిపతి సునీత తెలిపారు.



ఈ నెల 31 ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో ఈ నెల 31 న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఉపాధి అధికారిణి పద్మజ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 31 వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే ఉద్యోగ మేళాలో టయోటా, హోండా కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు సంబంధిత ధృవీకరణపత్రాలతో ఉద్యోగ మేళాలో పాల్గొనాలని తెలిపారు.

జాబ్‌డ్రైవ్‌లో పలువురికి ఉద్యోగాలు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో పలువురు విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల జేకేసీ, హెటిరోల్యాబ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 26 మంది అభ్యర్థులు పాల్గొనగా, 16 మంది అభ్యర్థులు జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

మనుబోలు (వెంకటాచలం): తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వీసీ విజయ్‌భాస్కర్‌రావు అన్నారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలోని తిక్కన సాహితీ పీఠం నెల్లూరు తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పిలువబడే తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



భోళాశంకరుడి భోజనం

పార్వతీపురంలో నిత్యాన్నదానం

రూ.18 కోట్ల విరాళాలతో కొనసాగింపు

ప్రతినెలా 20 వేల మంది.. ఏటా 2 లక్షల మందికి ఉచిత భోజనం

వేములవాడ: భోళాశంకరుడిగా పేరున్న ఎములాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు నిత్యాన్నదాన సత్రంలో ఉచితంగా భోజనం అందిస్తున్నారు. 1990లో అన్నదానం ప్రారంభించగా అప్పట్లో రోజూ 50 మంది భక్తులకు మాత్రమే వడ్డించేవారు. అప్పుడు ఆలయం స్వయంగా ఖర్చులను భరించేది. క్రమేణా అన్నదాన ట్రస్ట్ ఏర్పాటు చేసి భక్తులకు భాగస్వామ్యం కల్పించడంతో విరాళాలు విరివిగా పెరిగాయి. ప్రస్తుతం భక్తులిచ్చిన విరాళాలతోనే ప్రతినెలా 20 వేల మందికి ఉచితంగా అన్నదానం కొనసాగుతోంది. పార్వతీపురంలో నిత్యాన్నదాన సత్రాన్ని ఆలయ అధికారులు నిర్వహిస్తున్నారు. రూ.18 కోట్ల డిపాజిట్లపై వచ్చే వడ్డీతో ప్రతినెలా భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

1990లో ఆరంభం..

వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉచితంగా అన్నదానం చేయాలని 1990లో ఆలయ అధికారులే సంకల్పించారు. వెంటనే రాజన్న అన్నదానం ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో విరాళాలు రావడం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రూ.18 కోట్ల డిపాజిట్లకు ప్రతినెలా వచ్చే రూ.2 లక్షల వడ్డీతో నెలకు 20 వేల మంది, ఏటా 2 లక్షల మంది భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. అలాగే స్వామివారి సన్నిధిలో జరుపుకునే మహాశివరాత్రి జాతర, శ్రీరామనవమి, శివకల్యాణం సందర్భంగా సుమారు 30 వేల నుంచి 40 వేల మందికి ఉచితంగా భోజనాలు వడ్డిస్తుంటారు.

ముందస్తుగా టోకెన్లు..
నివేదన అనంతరం వడ్డింపు

రాజన్నను దర్శించుకునే భక్తులకు ఉదయం పూట ఆలయంలో టోకెన్లు ఇస్తారు. స్వామివారి నివేదన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులకు అన్నదానం ప్రారంభమవుతుంది. రోజూ ఒక కూరగాయతో కూడిన కూర, పప్పు (ఏదైనా ఆకుకూరతో), సాంబార్, చట్నీ, సల్లతో భోజనం పెడతారు.

విరాళాలు ఇలా...

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు అందించే వాళ్లు నేరుగా ఆలయ అధికారులకు చెల్లించి రశీదు తీసుకోవచ్చు. స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లోని ముఖ్యబుకింగ్ వద్ద కౌంటర్ అందుబాటులో ఉంటుంది. ట్రస్ట్ కాబట్టి ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు కూడా వర్తిస్తుంది. ఎవరైనా అన్నదానానికి విరాళాలు అందించి వారికి ఇష్టమైన రోజున వడ్డించేందుకు తేదీలు సూచిస్తే అదే తేదీన వారి పేర్లు సత్రంలో ఉచ్చరించిన తర్వాతే భక్తులకు భోజనాలు వడ్డిస్తారు.

రోజూ అన్నదానం ఇలా..	
సోమవారం	1,000 మంది
శుక్రవారం	1,000 మంది
ఆదివారం	1,000 మంది
మంగళవారం	500 మంది
బుధవారం	500 మంది
గురువారం	500 మంది
శనివారం	500 మంది

అన్నప్రసాదం బాగుంది..



కుటుంబ సభ్యులతో రాజన్నను దర్శించుకునేందుకు వచ్చాను. నిత్యాన్నదానం సత్రంలో అన్నప్రసాదం చాలా బాగుంది. మాకు ఇంట్లో తిన్నట్లే ఉంది. నాలుగు రకాలుగా వడ్డిస్తు న్నారు. అయితే భోజనశాల బయట ఆవరణ చాలా ఇరుకుగా ఉంది. దాన్ని కాస్త పెద్దగా చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

- హరీశ్, భక్తుడు, రేపాక, ఇల్లంతకుంట, రాజన్నసిరిసిల్ల

అందరికీ అందిస్తే బావుంటుంది..



రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న అనంతరం స్వామి వారి ప్రసాదంగా ఉచిత భోజనం తింటాం. అయితే అన్నదానం వద్దకు వచ్చిన వాళ్లందరికీ భోజనాలు వడ్డిస్తే బాగుంటుంది. ఉదయం పూట టోకెన్లు తీసుకున్న వారిలో కొంత మంది స్వస్థలాలకు వెళ్లిపోతారు. ఆ టోకెన్ల స్థానంలో ఇతర భక్తులకు అవకాశం కల్పించేలా ఆలయ అధికారులు చొరవ తీసుకోవాలి.

- కుటుంబ సభ్యులతో భోజనం ఆరగిస్తున్న శ్రీనివాస్, వరంగల్

ప్రసాదం రుచిగా ఉంది

పిల్లలతో కలిసి రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చినం. పొద్దున్నే టోకెన్లు తీసుకున్నం. మధ్యా హ్నం ఒంటిగంటకు సత్రానికి వచ్చి అన్న ప్రసాదం ఆరగించినం. చాలా రుచిగా ఉంది. అయితే గుడికి కాస్త దూరంగా ఉండటం వల్ల భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వడ్డించే వాళ్లు తక్కువగా ఉన్నారు. పదేపదే పిలవాల్సి వస్తోంది.

- తిరుపతి, శ్యామల, భక్తులు, కరీంనగర్

సౌకర్యాలు పెంచుతాం..

అన్నదాన సత్రంలో భోజనం కోసం వచ్చే భక్తులకు మంచి భోజనం వడ్డించడంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా. పలువురు భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తాం.

- కొప్పుల వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో



బుధవారం సాయంత్రం సమయంలో హుస్సేన్ సాగర్‌పై అలుముకున్న రంగురంగుల మేఘాలు...



గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన లైట్లు

ఉద్యోగులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు

సాక్షి, హైదరాబాద్ : ఉద్యోగులు పని ఒత్తిడితో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలుచేయించుకోవాలని, ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు సూచించారు. తెలంగాణ సచివాలయంలో బుధవారం సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని క్రిస్టినా జెడ్ చొంగ్తు ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగస్తుల కోసం సచివాలయం ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ క్యాంపులో మధుమేహం, రక్తపోటు, గుండె వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ క్యాంప్‌నకు సహకరించిన విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు ఉద్యోగ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు నర్సింగ్ రావు, కె.సుజాత, చైర్మన్ జి.శ్రీనివాస్‌రెడ్డి, సహాధ్యక్షుడు ఎంపీ జనార్దన్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు జి.ఎల్.ఎన్.రాజు, జి.లావణ్యలత తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించిన లా కార్యదర్శి

తెలంగాణ రాష్ట్ర సచివాలయ ఉద్యోగస్తుల సంఘం కార్యాలయంలో మంచి నీటి సరఫరా కోసం కనకంటి అభిలాష్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను లా కార్యదర్శి రెడ్ల తిరుపతయ్య ప్రారంభించారు. కనకంటి అభిలాష్ మృతి విషయాన్ని తెలుసుకున్న తిరుపతయ్య వారి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీధర్‌బాబుతో ఐక్యరాజ్యసమితి అండర్ సెక్రటరీ భేటీ

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో అగ్రిఫుడ్ వ్యవస్థలలో మహిళలు, చిన్న తరహా పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఐక్యరాజ్య సమితి(ఐరాస) అధ్యయనానికి ప్రభుత్వ సహకారం కోరుతూ ఐరాస అండర్ సెక్రటరీ ఆర్మిడా సల్సియా అలిస్జాహ్బానా మంత్రి శ్రీధర్‌బాబును బుధవారం సచివాలయంలో కలిశారు. ఐక్యరాజ్యసమితిలో భాగంగా ఉన్న ఎకనమిక్, సోషల్ కమిషన్ ఫర్ ఆసియా పసిఫిక్ (ఈఎస్‌సీఏపీ) సంస్థ తెలంగాణకు చెందిన పది సంస్థలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చింది. సమాజంలోని అట్టడుగు వర్గాలను ప్రధాన స్రవంతిలో భాగస్వాముల్ని చేసేందుకు ఇప్పటికే ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించినట్లు ఆమె వివరించారు. తదుపరి కార్యాచరణ కోసం ప్రభుత్వ సహాయం కోరారు. భేటీలో టీజీఐఐసీ సీవోవో మధుసూదన్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం డైరెక్టర్ అఖిల్, లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

బోధన వైద్యుల సంఘం ప్రతిపాదనల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: కోల్‌కతా ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకోవలసిన రక్షణ చర్యలకు సంబంధించి తెలంగాణ బోధన ప్రభుత్వ వైద్యుల సంఘం చేసిన ప్రతిపాదనలను కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ పరిగణనలోకి తీసుకుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, డీజీపీలకు మార్గదర్శకాలు పంపిందని వెల్లడించారు. అందులో చాలా వరకు తాము పంపిన ప్రతిపాదనలను స్వీకరించినట్టు పేర్కొన్నారు. సలహాలు, సూచనలు స్వీకరించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

30న హైదరాబాద్‌లో 'గ్రిహ' కౌన్సిల్ ప్రాంతీయ సమావేశం

సాక్షి, హైదరాబాద్: గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హాబిటాట్ అసెస్‌మెంట్ (గ్రిహ) కౌన్సిల్ ప్రాంతీయ సమావేశం ఈ నెల 30న హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, వివిధ శాఖలకు చెందిన ఎస్.దేవేందర్‌రెడ్డి, నీలం జన్నయ్య, కె.శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొనున్నారు. 'యాక్సిలరేటింగ్ క్లైమేట్ యాక్షన్ ఇన్ ద బిల్ట్ ఎన్విరాన్‌మెంట్'అనే అంశంపై సమావేశంలో చర్చ జరగనుంది. హరిత భవనాల ఏర్పాటు, సుస్థిరత కూడిన ఆలోచనలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం వెల్లడించా రు. 2050 సంవత్సరానికల్లా నిర్మిత పరిసరాల్లో (బిల్ట్ ఎన్విరాన్‌మెంట్) కర్బన ఉద్గారాలు లేకుండా చూడటం, 2070 కల్లా భారత్‌ను 'నెట్ జీరో'దేశంగా మార్చాలనే లక్ష్యాలకు అనుగుణంగా కూడా చర్చలు ఉంటాయన్నారు. అనంతరం డిసెంబర్ 4,5 తేదీల్లో ఢిల్లీలో జాతీయస్థాయిలో 'గ్రిహ సమ్మిట్'ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బడ్జెట్లో రైతుల కోసం సింహభాగం నిధులు

యూపీ వ్యవసాయమంత్రి, కేంద్ర వ్యవసాయ సహాయమంత్రితో తుమ్మల



సాక్షి, హైదరాబాద్ : రైతుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం నిధులు కేటాయించామని, అలాగే రైతు రుణ మాఫీ కోసం రూ.31 వేల కోట్లు కేటాయించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సూర్యప్రతాప్ షాహి, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి బల్దేవ్ సింగ్‌లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. త్వరలో ఆయిల్‌పామ్‌ను ఉత్పత్తి చేసే రాష్ట్రాలలో తెలంగాణను దేశంలోనే మొదటిస్థానంలో నిలబెడతామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వ్యవసాయరంగంలో, రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను యూపీ వ్యవసాయ మంత్రి సూర్యప్రతాప్ షాహి అభినందించారు. ఉత్తర ప్రదేశ్‌లో తమ రైతులు వాడే వరి విత్తనాలు ఎక్కువ శాతం తెలంగాణ నుంచే వస్తాయని తెలిపారు.

మన రక్షిత అటవీ ప్రాంతాలు భేష్!

- మొత్తం 26,903 చ.కి.మీలలో అటవీ ప్రాంతాల విస్తరణ
- 5,693 చ.కి.మీలలో రక్షిత ప్రాంతాలు
- తాజాగా కవ్వాల్‌లోని కోర్, ఇతర ప్రాంతాల్లో జంతువులపై హెచ్‌వైటీ కాయ్‌స్ పరిశీలన



సాక్షి, హైదరాబాద్ : తెలంగాణలో 12 రక్షిత అటవీ ప్రాంతాలు (7 శాంక్చురీలు, 2 టైగర్ రిజర్వ్‌లు 3 జాతీయ పార్కులు) ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 26,903 చ.కి.మీ పరిధిలో అడవి విస్తరించి ఉండగా 5,693 చ.కి.మీలలో రక్షిత ప్రాంతపరిధి ఉంది. ప్రతీ రెండేళ్లకు ఒకసారి జంతు, వృక్ష జాతులు, మన దగ్గరి జీవవైవిధ్యం, ఆయా రక్షిత ప్రాంతాలు, శాంక్చురీలు, టైగర్ రిజర్వ్‌లు, నేషనల్ పార్కుల్లోని వివిధ రకాల జంతువులు, వృక్షాలు, చెట్ల జాతులు వంటి వాటిపై అధ్యయనం చేస్తున్నారు. మన రాష్ట్ర అటవీ ప్రాంతాల పరిధిలో చిరుతలు, అడవి దున్నలు, అడవి కుక్కలు, నక్కలు, జింకలు, దుప్పులు, తదితర రకాల వన్యప్రాణులు సందడి చేస్తూ కనువిందు చేస్తున్నాయి. వివిధ అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాపుల్లో వీటి కదలికలు తాజాగా రికార్డ్ కావడం, వీటి సంఖ్య పెరిగిన ఆనవాళ్లు కనిపించడం పట్ల అటవీశాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవవైవిధ్యం, విభిన్నరకాల జంతువులు, అన్నివిధాలా అనుకూల పరిస్థితులు, మెరుగైన సౌకర్యాలతో కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్) వన్యప్రాణుల వైవిధ్య కేంద్రంగా నిలుస్తోంది. ఇక్కడ కొంతకాలంగా చేపడుతున్న గడ్డిభూముల పెంపకం, పర్క్యులేషన్ ట్యాంక్‌ల ఏర్పాటు, వాటర్‌షెడ్ పద్ధతుల ప్రకారం శాశ్వత నీటివనరుల కల్పన వంటివి ఎంతో దోహదపడ్డాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేటీఆర్‌లో టైగర్స్ వర్రీ

పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పులుల సంచారం పెరిగినా, కేటీఆర్‌లో అనుకూల పరిస్థితులున్నా, అవి ఇంకా స్థిరనివాసం ఏర్పరచుకోకపోవడం మాత్రం సవాల్‌గానే మారింది. రాష్ట్ర సరిహద్దుల నుంచి కోర్ ఏరియాలోకి పులులు అడుగుపెట్టి సంచరిస్తున్నా, అవి పూర్తిస్థాయిలో స్థిరనివాసం ఏర్పరచుకోవడం లేదు. అడవికి రాజుగా ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యం తదితరాల కేంద్రంగా ఉన్న పెద్దపులులదే కీలకపాత్ర. అయినా ఇక్కడ వాటి స్థిరనివాస సంఖ్య మృగ్యమైంది. మహారాష్ట్ర తడోబా నుంచి నేరుగా పులులు వచ్చేందుకు జాతీయరహదారితో పాటు రైల్వేకారిడార్ ఉండడం, కొన్నిచోట్ల ఆక్రమణలతో కొంత అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం అండర్ పాస్‌ల నిర్మాణం చేపడుతున్నందున త్వరలోనే ఈ పరిస్థితిలో అనుకూల మార్పులు చోటుచేసుకోవచ్చునని అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ పరిశీలనలో..

తాజాగా హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హెచ్‌వైటీకాయ్‌స్) ఆధ్వర్యంలో ఇటీవల కేటీఆర్‌లోని కోర్ ఏరియాను ఆనుకుని ఉన్న, పొరుగు ప్రాంతాల నుంచి జంతువులు రాకపోకలు సాగించే (బఫర్) ఏరియాల్లో వివిధ రకాల జంతువుల సంఖ్య (ఆక్యుపెన్సీ)పై పరిశీలన జరిపారు. గత ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన అధ్యయనంలో కేటీఆర్ పులుల అభయారణ్యం ఏ మేరకు సరిపోయేటట్టు ఉంది, అనుగుణమైన పరిస్థితులు, ఏఏ రకాల మాంసాహార, శాఖాహార జంతువులు ఉన్నాయనే దానిపై దృష్టి కేంద్రీకరించారు. బఫర్ ఏరియాలోని కాగజ్‌నగర్, చెన్నూరు, ఆదిలాబాద్ డివిజన్లలో అనేక పులి కాలిగుర్తు (పగ్‌మార్క్)లు గుర్తించారు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ వైల్డ్‌లైఫ్ శాంక్చురీ నుంచి ప్రాణహిత, పెన్‌గంగ నదులను దాటి తడోబా అంధారి టైగర్ రిజర్వ్ నుంచి వలస వచ్చే పులుల సంచారం ఎక్కువగా ఉంటోందని గుర్తించారు. కేటీఆర్ ప్రధాన అటవీ ప్రాంతంలో చిరుతలు, అడవి కుక్కలు, ఎలుగుబంట్లు ఇతర జంతువులు కనిపించాయి. తాళ్లపేట, ఇంథన్‌పల్లిలో కృష్ణజింకలను అత్యధిక సంఖ్యలో గుర్తించారు. అడవి దున్న (బైసన్‌స్), అడవి పంది, నీల్గాయ్, సాంబారు, మచ్చలజింక, చౌసింగ వంటి శాఖా హార జంతువులను కూడా గుర్తించారు. నీల్గాయ్ లు, అడవి పందుల జనాభా అటవీ ప్రాంతమంత గా విస్తరించి ఉండగా, సాంబార్ జింకలు కొండ ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించారు. వీటన్నింటికి సంబంధించి పులులు మొదలు ఇతర జంతువులు తా రసపడడంతో పాటు, వాటి పాదముద్రలు, పెంటికలు (విసర్జనలు) తదితరాల ఆధారంగా వివిధ ర కాల జంతువులను గుర్తించారు. అయితే ఈ సర్వేకు సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో సమాచారం, వివరాలు, జంతువుల సంఖ్య వంటి వాటిపై తుది నివేదిక తయారు చేయలేదు. ఇది తయారయ్యాకే ఆయా రకాల జంతువుల సంఖ్యపై పూర్తి స్పష్టత వస్తుంది.

తెలంగాణలో రక్షిత అటవీ ప్రాంతాలు	ఉమ్మడి జిల్లా	ఏరియా (చ.కి.మీ)
కవ్వాల్ టైగర్ రిజర్వ్	ఆదిలాబాద్	893
ప్రాణహిత వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	ఆదిలాబాద్	136
సివారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	ఆదిలాబాద్,కరీంనగర్	29.810
ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	వరంగల్	803
పాకాల వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	వరంగల్	860
కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	ఖమ్మం	635.400
పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	మెదక్, నిజామాబాద్	129.840
మంజీరా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ	మెదక్	20
అమ్రాబాద్ టైగర్ రిజర్వ్	మహబూబ్‌నగర్, నల్లగొండ	2.166.280
కాసు బ్రహ్మానందరెడ్డి నేషనల్ పార్కు	హైదరాబాద్	1.425
మృగవాణి నేషనల్ పార్కు	రంగారెడ్డి	3.600
మహావీర్ హరిణవనస్థలి నేషనల్ పార్కు	రంగారెడ్డి	14.590

కేటీఆర్‌లో సర్వే ఎక్కడెక్కడ అంటే...

- బఫర్ రేంజ్‌ల విషయానికొస్తే...లక్సెట్టిపేట, ఉట్నూర్, జోడేఘాట్, తిర్యాణి, దిమ్మదుర్తి, ఖానాపూర్
- కోర్ రేంజ్‌లలో చూస్తే...తాళ్లపేట, జన్నారం, ఇంథపల్లి, ఉథమ్‌పూర్, బిర్సాయ్‌పేట, కడెం, పెంబి, తాండ్ర
- జన్నారం డివిజన్‌లో తాళ్లపేట, మామిడిపల్లి, సింగరాయిపేట, పైడిపల్లి, చింతగూడ, గోండుగూడ, మహ్మదాబాద్, తపాల్‌పూర్, కొత్తూరుపల్లి, కిష్టాపూర్, దొంగపల్లి, అలీనగర్, లింగాపూర్, దమ్మన్నపేట, పాతమామిడిపల్లి, చింతపల్లి, తానిమడుగు, దండేపల్లిలను కవర్ చేశారు

ఈ అధ్యయనంలో భాగంగా ఆదిలాబాద్, కాగజ్‌నగర్, నిర్మల్, జన్నారం, చెన్నూరు, మంచిర్యాల డివిజన్లను హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ కవర్ చేసింది. మొత్తం 2,254.35 చ.కి.మీ పరిధిలో పరిశీలించారు. ఇందులో 558 కి.మీ కాలినడకన సర్వే నిర్వహించారు. ఆదిలాబాద్, కాగజ్‌నగర్-చెన్నూరు బార్డర్‌లో పులుల ఉనికిని గుర్తించారు. ఆదిలాబాద్, కాగజ్‌నగర్, జన్నారంలలో ఎలుగుబంట్లు, చిరుతలు, ధోల్, ఇతర జంతువులు కనిపించాయి. జన్నారంలో అడవి గొర్రెలు, సాంబార్ జింకలు, చెన్నూరు, కాగజ్‌నగర్, ఆదిలాబాద్‌లో నీల్గాయ్‌లు పెద్దసంఖ్యలో కనిపించాయి. వర్షాకాలం తర్వాత రిపీట్ సర్వేలో భాగంగా ఆసిఫాబాద్‌లో మళ్లీ సర్వే చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో వానలు కురిశాక...ఆ ప్రభావంపై వివిధ రకాల జంతువులపై ఎలా ఉంది, వన్యప్రాణుల విస్తరణ వంటివి ఉలా ఉన్నాయనేది పరిశీలిస్తారు.

దేశ విభజనకు దారి తీసిన చట్టం ఏది?

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

'సైమన్ కమిషన్ మొదటిసారిగా సమాఖ్య పద్ధతిని సూచించింది'. సైమన్ కమిషన్ అనేది భారత సమస్యలపై ఒక సమగ్ర అధ్యయనమని కూప్లాండ్ అనే రచయిత పేర్కొన్నారు. బ్రిటన్‌లోని అధికార లేబర్ పార్టీ ఈ కమిషన్ సమర్పించిన నివేదికలోని అంశాలపై సరిగా దృష్టిపెట్టలేదు. కానీ, ఆ తర్వాత రూపొందించిన భారత ప్రభుత్వ చట్టం-1935లో సైమన్ కమిషన్ ప్రతిపాదించిన అంశాలను పొందుపరిచారు.

భారత కౌన్సిల్ చట్టాలు

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత దేశంలో పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, భారతీయుల సహకారాన్ని పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించింది. వీటినే కౌన్సిల్ చట్టాలు లేదా శాసన చట్టాలు అంటారు.

కౌన్సిల్ చట్టం-1861

భారతదేశంలో శాసన నిర్మాణ ప్రక్రియలో మొదటిసారిగా భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించారు.

- ఈ చట్టం ప్రకారం కొంతమంది భారతీయులను అనధికార సభ్యులుగా కౌన్సిల్‌లోకి వైస్రాయ్ నామినేట్ చేస్తారు. ఇలా నామినేట్ అయిన వారిలో బెనారస్ రాజు, పాటియాలా మహారాజు, శ్రీ దినకర్‌రావు ఉన్నారు.
- 1773 చట్టం ద్వారా రద్దయిన బాంబే,మద్రాస్ ప్రెసిడెన్సీల శాసనాధికారాలను పునరుద్ధరించారు. ఆ విధంగా ఈ చట్టాన్ని 'వికేంద్రీకరణ ప్రక్రియ'కు నాందిగా చెప్పొచ్చు. బెంగాల్, పంజాబ్, ఈశాన్య సరిహద్దు ప్రావిన్సులతో నూతన లెజిస్లేటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు.
- కౌన్సిల్‌లో కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన సూత్రాలు, నియమాలను జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కి ఇచ్చారు. 1859లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన పోర్ట్‌ఫోలియో (మంత్రిత్వ శాఖలుగా విధుల కేటాయింపు) పద్ధతిని గుర్తించి కొనసాగించారు. తద్వారా వైస్రాయ్ కౌన్సిల్ మరిన్ని శాఖలను నిర్వహించే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. శాసన కౌన్సిళ్ల సమ్మతి లేకుండానే ఆర్డినెన్సులు జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కు కల్పించారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం-1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. ముఖ్యంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, విద్యావంతులైన భారతీయులు బ్రిటిష్ పాలనలోని లోపాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుండటంతో ఈ చట్టాన్ని రూపొందించారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. కేంద్రశాసన మండలికి ఎంపికైన భారతీయ ప్రముఖులు.. గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, రాస్ బిహారీ ఘోష్.

ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రశ్నలు అడిగేందుకు గవర్నర్, గవర్నర్ జనరల్‌ల ముందస్తు అనుమతి పొందాలి. శాసనసభల్లో తమ స్థానం నామమాత్రమేనని గ్రహించిన భారతీయులు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు.

భారత కౌన్సిల్ చట్టం-1909 లేదా మార్లే-మింటో సంస్కరణలు

1892 చట్టంలోని లోపాలను సవరించాలని, దేశంలో తీవ్రవాద జాతీయవాదంతో ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కొనాలనే ఉద్దేశంతో ఈ చట్టానికి రూపకల్పన చేశారు. భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మార్లే, భారత వైస్రాయ్ మింటో పేర్లతో ఈ చట్టాన్ని సూచించారు. అందువల్ల దీన్ని మార్లే-మింటో సంస్కరణ చట్టం అంటారు. కాంగ్రెస్‌లోని మితవాదులను మచ్చిక చేసుకోవడానికి బ్రిటిష్‌వారు ఈ చట్టం ద్వారా ప్రయత్నించారని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- కేంద్ర, రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను పెంచారు.
- శాసన ప్రక్రియ కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను 16 నుంచి 60కి పెంచారు. అదేవిధంగా మద్రాస్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను 50కి, పంజాబ్, అస్సాం, బర్మాల్లో 30కి పెంచారు.
- గవర్నర్ జనరల్ ఆధీనంలోని శాసన మండలిలో 4 రకాల సభ్యులు ఉంటారు.
  1. నామినేటెడ్ అధికార సభ్యులు
  2. నామినేటెడ్ అనధికార సభ్యులు
  3. హోదా రీత్యా సభ్యులు
  4. ఎన్నికైన సభ్యులు

మెజారిటీ సభ్యులు అధికార సభ్యులు కావడం వల్ల బిల్లుల ఆమోదం ప్రభుత్వానికి సులభమయ్యేది. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఇలా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

ముస్లింలు, వ్యాపార సంఘాల సభ్యులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కల్పించారు. ముస్లిం జనాభాకు మించిన ప్రాధాన్యాన్ని ఈ చట్టం కల్పించింది. ముస్లిం సభ్యులను ముస్లింలే ఎన్నుకునే వీలు కల్పించింది. దీని కోసం ప్రత్యేక మతపరమైన నియోజక గణాలను ఏర్పాటు చేశారు.

ఈ చట్టం మతతత్వానికి చట్టబద్ధత కల్పించింది. అందుకే లార్డ్ మింటోను 'మత నియోజక గణాల పితామహుడి'గా పేర్కొంటారు.

ప్రెసిడెన్సీ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, భూస్వాములు, వ్యాపార సంస్థలకు కూడా ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో సభ్యులు సైనిక, దౌత్య, మతపరమైన విషయాలు మినహా ఇతర ఏ అంశంపైనైనా ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు అడగడానికి అధికారం లభించింది. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో పోటీ చేసే అభ్యర్థులకు ఈ చట్టం కచ్చితమైన అర్హతలను నిర్ణయించింది.

విమర్శ: ఈ చట్టంలోని అంశాలు 'అసలైన స్వరూపానికి బదులు కేవలం నీడ లాంటి ఆకారా'న్ని మాత్రమే అందించడం వల్ల 1909 చట్టాన్ని చంద్రకాంతితో పోల్చారు. ఈ చట్టం హిందూ, ముస్లింల మధ్య వేర్పాటు బీజాలు నాటి అడ్డుగోడలు సృష్టించిందని, దేశవిభజనకు దారి తీసిందని నెహ్రూ అభిప్రాయపడ్డారు.

భారత ప్రభుత్వ చట్టం-1919 లేదా మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు

భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1917 ఆగస్టు 20న ఒక ప్రకటన చేసింది. అందులో భాగంగా భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మాంటెగు 1917 నవంబర్‌లో భారతదేశాన్ని సందర్శించాడు. వైస్రాయ్ ఛెమ్స్‌ఫర్డ్‌తోపాటు భారతీయ నాయకులతో ఆయన చర్చలు జరిపి ఈ సంస్కరణలను ప్రకటించాడు. అందువల్ల వీటిని మాంటెంగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అంటారు.

ముఖ్యాంశాలు

- భారత రాజ్య కార్యదర్శి జీతభత్యాలను భారత ఆదాయం నుంచి కాకుండా బ్రిటిష్ నిధి నుంచి చెల్లిస్తారు.
- రాష్ట్ర స్థాయిలో ద్వంద్వ పాలన ప్రవేశపెట్టారు. రాష్ట్రాల అధికారాలను రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్డ్‌గా విభజించారు. రిజర్వ్‌డ్ విభాగంలో 28 పాలనా అంశాలను చేర్చారు. విత్తం, భూమి శిస్తు, న్యాయం, నీటి పారుదల, పరిశ్రమలు, మొదలైన వాటిని ఇందులో పేర్కొన్నారు.
- ఈ అంశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను బ్రిటిష్ కౌన్సిలర్ల సహాయంతో ఆయా రాష్ట్ర గవర్నర్లు నిర్వహిస్తారు. అయితే బ్రిటిష్ కౌన్సిలర్లు తమ విధి నిర్వహణలో రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించరు.
- ట్రాన్స్‌ఫర్డ్ విభాగంలో 22 అంశాలను పేర్కొన్నారు. స్థానిక పాలన, వ్యవసాయం, ప్రజా ఆరోగ్యం, విద్య, సహకారం, మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి.
- రాష్ట్ర గవర్నర్ ఈ అంశాల పాలనా వ్యవహారాలను భారతీయ మంత్రుల సహాయంతో నిర్వహిస్తారు. భారతీయ మంత్రులు ఆయా రాష్ట్ర శాసనసభల్లో సభ్యులై ఉంటారు. తమ విధుల నిర్వహణలో శాసనసభకు బాధ్యత వహిస్తారు.
- దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి(కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువ సభను కేంద్ర శాసనసభ(సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరిస్తారు.
- ఎగువసభ అయిన కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో 60 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 34 మంది ఎన్నికైనవారు, 26 మందిని గవర్నర్ జనరల్ నియమిస్తారు. వీరి పదవీకాలం అయిదేళ్లు. అధ్యక్షుడిని వైస్రాయ్ నియమిస్తారు. దిగువసభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 145 మంది సభ్యులుంటారు. ఇందులో 104 మంది ఎన్నికైనవారు, 41 మంది నియమితులైనవారు ఉంటారు. ఈ సభ పదవీకాలం మూడేళ్లు.
- మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు.
- ఆస్తి పన్ను చెల్లింపు ప్రాతిపదికపై పరిమిత ఓటు హక్కును కల్పించారు. లండన్‌లో భారత వ్యవహారాలను, ముఖ్యంగా రెవెన్యూ, పరిపాలన మొదలైన అంశాలను పర్యవేక్షించడానికి భారత హై కమిషనర్ పదవిని సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను వేరు చేశారు.
- లీ కమిషన్ (1923-24) సూచన మేరకు భారతదేశానికి విడిగా ఒక ఆడిటర్ జనరల్‌ను, 1926లో ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం వైస్రాయ్‌కి ఇచ్చారు. ఈ చట్టం అమలు తీరును సమీక్షించడానికి పదేళ్ల తర్వాత చట్టబద్ధత ఉన్న కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విమర్శ: ఈ చట్టం ప్రతిపాదించిన అంశాలపై అనేక విమర్శలు వచ్చాయి.

- 1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతో పాటు 'సూర్యుడు లేని ఉదయం'లా ఉన్నాయని బాలగంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు.
- ఈ సంస్కరణలను బ్రిటిష్‌వారు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఈ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని అనిబిసెంట్ వ్యాఖ్యానించారు.
- భారతదేశంలో ద్వంద్వ పాలన దాదాపు దూషణ పదంగా మారింది. ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని నీవు 'డైయార్కి'వి అని అరవడం విన్నానని సర్ బట్లర్ అనే రచయిత తెలిపాడు.
- ద్వంద్వ పాలనను ఎప్పటికీ ఆదర్శంగా భావించలేం. మరో ఉత్తమ ప్రయోజన స్థితికి ఇది ఓ మెట్టు మాత్రమే. ఆ ఉత్తమ ప్రయోజనమే 'పరిపూర్ణ స్వపరిపాలిత భారతదేశం' అని పలాండే అనే రచయిత పేర్కొన్నారు.

ఈ సంస్కరణలు స్వపరిపాలన దిశగా చెప్పుకోదగ్గ ముందంజ కాబట్టి భారత రాజ్యాంగ చరిత్రలో ముఖ్య పరిణామంగా పరిగణిస్తారు. ప్రేరణను, భవితవ్యం కోసం అనుభవం సంపాదించడానికి ఈ చట్టం తగిన అవకాశం ఇచ్చిందని కూడా చెప్పవచ్చు.

సైమన్ కమిషన్ - నవంబర్ 1927

భారత ప్రభుత్వ చట్టం 1919 ద్వారా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి నిర్ణీత సమయం కంటే రెండేళ్ల ముందే బ్రిటన్ ప్రధాని స్టాన్లీ బాల్డ్‌విన్ 1927 నవంబర్‌లో సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులతో ఒక రాయల్ కమిషన్‌ను నియమించారు.

ఇందులోని సభ్యుడైన క్లిమెంట్ అట్లీ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి ఇంగ్లండ్ ప్రధానిగా ఉన్నారు. ఈ కమిషన్‌లో సభ్యులందరూ ఆంగ్లేయులు కావడం వల్ల భారతీయులు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. కమిషన్ భారతదేశంలో 2 సార్లు పర్యటించింది. 1928 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు తొలిసారి, 1928 అక్టోబర్ 11 నుంచి 1929 ఏప్రిల్ 6 వరకు రెండోసారి పర్యటించింది. ఈ కమిషన్ 1930లో నివేదికను సమర్పించింది.

ముఖ్యాంశాలు

- రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ద్వంద్వ పాలనను రద్దు చేయడం, మంత్రులు శాసనసభకు బాధ్యత వహించేలా చేయడం.
- ప్రభుత్వ నిర్వహణలో భారతీయులకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించడం.
- రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యత్వ సంఖ్యను పెంచడం.
- ఏక కేంద్ర వ్యవస్థ భారతదేశానికి సరిపడదు కాబట్టి సమాఖ్య వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం.
- హైకోర్టుపై కేంద్ర ప్రభుత్వానికి పాలనా పరమైన నియంత్రణ ఏర్పాటు.
- సార్వజనీన వయోజన ఓటు హక్కు వెంటనే సాధ్యం కాదు కాబట్టి దీన్ని కాలానుగుణంగా విస్తృతం చేయడం.

ఉద్యోగాలు

ట్రిపుల్ ఐటీ ఢిల్లీలో వివిధ పోస్టులు

ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్-02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-03, జూనియర్ లైబ్రరీ ఆఫీసర్-01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01.
» **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, హెచ్ఆర్, అకౌంట్స్/ఐఆర్‌డీ, ప్లేస్‌మెంట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 55 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుకు 35 ఏళ్లు, ఇతర పోస్టులకు 32 ఏళ్లు మినహాయింపు ఉంటుంది.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.09.2024.
» **వెబ్‌సైట్:** https://iiitd.ac.in/

ఐఐఎస్‌టీ తిరువనంతపురంలో 12 పోస్టులు

తిరువనంతపురం(కేరళ)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో(ఎస్‌పీఎఫ్)-07, జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(జేపీఎఫ్)-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-01, రీసెర్చ్ అసిస్టెంట్-02, ప్రాజెక్ట్ అసిస్టెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ, ఎంఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో పోస్టుకు రూ.31,000 నుంచి రూ.36,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.31,000, రీసెర్చ్ అసిస్టెంట్‌కు రూ.23,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.31,000, జూనియర్ ప్రాజెక్ట్ ఫెలోకు రూ.28,000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.iist.ac.in/

జీఎంసీ బాలయోగి మ్యూజియం ఎక్కడ ఉంది?

డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ మెథడాలజీ



మాదిరి ప్రశ్నలు

1. జీవశాస్త్ర శాఖలకు సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   ఎ. ఏరోబయాలజీ - ప్రాథమిక శాఖ
   బి. జీవ ఖగోళ శాస్త్రం - అనువర్తిత శాఖ
   సి. వ్యవసాయ శాస్త్రం - సంబంధిత శాఖ
   డి. జీవసాంకేతిక శాస్త్రం- సంబంధిత శాఖ
   1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
2. విజ్ఞానశాస్త్రం చదివిన రాగిణి రోజూ గడపకు పసుపు పూస్తోంది. విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు చేయదం వల్ల రాకేష్ నిజాయతీ అనే లక్షణాన్ని అలవరచుకున్నాడు. వీరిలో పెంపొందిన విలువలు?
   1) రాగిణి - నైతిక విలువ, రాకేష్ - సృజనాత్మక విలువ
   2) రాగిణి - సాంస్కృతిక విలువ, రాగిణి - బౌద్ధిక విలువ
   3) రాగిణి-ఉపయోగాత్మక విలువ, రాకేష్ - సాంస్కృతిక విలువ
   4) రాగిణి - సాంస్కృతిక విలువ రాకేష్ - నైతిక విలువ
3. వైద్యపరమైన ఎన్‌సైక్లోపీడియాలను ఎవరి కాలంలో తయారుచేశారు?
   1) అరబ్బులు 2) గ్రీకులు
   3) రోమన్లు 4) హిబ్రూలు
4. రోహన్ పుస్తకాలు చదవడం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం భవిష్యత్తులో జరిగే సంఘటనను ఊహించాడు. అతనిలో నెరవేరిన లక్ష్యం ఏది?
   1) ప్రాగుక్తీకరణ 2) బహిర్గీశనం
   3) వినియోగం 4) విశ్లేషణ
5. జానీ వాతావరణ శాఖ ఆఫీసులో ఉన్న గ్రాపులను చూసి ప్రస్తుత సంవత్సరకాలం వర్షపాతాన్ని వివరించాడు. అతడిలో ఏ లక్ష్యం సాధించినట్లుగా చెప్పవచ్చు?
   1) జ్ఞానం 2) అవగాహన
   3) వినియోగం 4) అభినందన
6. నిశితంగా పరిశీలించడం అనే లక్షణం విజ్ఞానశాస్త్ర అధ్యయనాల వల్ల వస్తుంది. ఇందు లో పరిశీలన దేనికి సంబంధించింది?
   1) అవగాహన 2) జ్ఞానం
   3) నైపుణ్యం 4) అభిరుచి
7. వివేక్ అనే విద్యార్థికి విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలో పాల్గొనడం,శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదవదం, శాస్త్ర ప్రసంగాలు వినడం అలవాట్లు ఉన్నాయి. అతడిలో సాధించిన లక్ష్యం, దానికి చెందిన రంగానికి సంబంధించి సరైన జత ఏది?
   1) జ్ఞానాత్మక రంగం - అభినందన
   2) భావావేశ రంగం - అవగాహన
   3) మానసిక చలనాత్మక రంగం- అభిరుచి
   4) భావావేశ రంగం- అభిరుచి
8. 'విద్యార్థులు ప్రయోగం చేస్తే ప్రమాదాలు జరుగుతాయి' అనే భ్రమ, భయం కల్గిన అనిల్ అనే జీవశాస్త్ర ఉపాధ్యాయుడికి అనుకూలమైన బోధనా పద్ధతి ఏది?
   1) ప్రయోగ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
   3) అన్వేషణ పద్ధతి 4) శాస్త్రీయ పద్ధతి
9. కృత్రిమ బోధనోపకరణాలను ఉపయోగించడం ద్వారా కాకుండా, సహజ పరిస్థితుల పరిశీలన ద్వారా జీవశాస్త్రం నేర్చుకోవాలనుకునే ఉపాధ్యాయునికి అత్యంత అనుసరణీయమైన పద్ధతి ఏది?
   1) ప్రదర్శనా పద్ధతి 2) అన్వేషణ పద్ధతి
   3) ప్రకల్పన పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
10. కిందివాటిలో దేంట్లో నిగమన ఉపగమాన్ని అనుసరించినట్లుగా చెప్పవచ్చు?
    1) ముందుగా ఉదాహరణ ఇచ్చి తర్వాత సూత్రాన్ని రాబట్టడం
    2) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
    3) ముందుగా సూత్రం చెప్పి తర్వాత ఉదాహరణలు చెప్పడం
    4) విద్యార్థులకు ఉదాహరణలను మాత్రమే తెలియజేయడం
11. హెర్బర్ట్ విధానంలోని దశ కానిది?
    1) హాజరు పరచడం 2) సన్నాహం
    3) సాధారణీకరణం 4) పునర్బలనం
12. యూనిట్ పథక దశల్లో ఉపసంహారక సోపానానికి సంబంధించింది ఏది?
    1) బోధనా పద్ధతి ఎంపిక
    2) ప్రేరణ కల్గించడం
    3) బోధనోపకరణాల వినియోగం
    4) మూల్యాంకన పద్ధతులు
13. ప్రతి విషయానికి ఆధారాలను చూపించమని, ఆధారాలుంటేనే నమ్ముతాను అని జీవశాస్త్ర ఉపాధ్యాయుని అడుగుతున్న 'ప్రజ్ఞ' అనే 9వ తరగతి విద్యార్థినిలో ఏ లక్ష్యం సాధించినట్లు?
    1) మొండితనం 2) అభిరుచి
    3) శాస్త్రీయ దృక్పథం 4) నైతిక విలువ
14. పాఠ్యపథక రచనలో హెర్బర్ట్ విధానం పరిమితి కానిది?
    1) ఉపాధ్యాయుని పాత్ర ఎక్కువ
    2) అన్ని సబ్జెక్టుల బోధనకు అనుకూలం
    3) జ్ఞాపకశక్తికే ప్రాధాన్యం
    4) సగటు విద్యార్థులకు మాత్రమే పనిచేస్తుంది
15. ప్రయోగశాలలో 10'×4' కొలతలతో ఉండేది ఏది?
    1) ఉపాధ్యాయుడి ప్రదర్శనాబల్ల
    2) ప్రయోగశాల కిటికీ
    3) అక్వేరియం 4) నల్లబల్ల
16. 'సైన్స్ న్యూస్ అండ్ పేపర్' అనే గోడపత్రికను ముద్రిస్తున్న సంస్థ ఏది?
    1) మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం
    2) NCERT
    3) విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రం
    4) NCSTC
17. కిందివాటిలో ఏది ప్రత్యేక అభిరుచి సంఘం?
    1) భౌతిక శాస్త్ర సంఘం
    2) వృక్ష శాస్త్ర సంఘం
    3) వ్యవసాయ సంఘం
    4) జంతు శాస్త్ర సంఘం
18. కిందివాటిలో సరైన జత ఏది?
    ఎ. విజ్ఞానశాస్త్ర దినోత్సవం - జూన్ 5
    బి. ధరిత్రీ దినోత్సవం - ఏప్రిల్ 22
    సి. పర్యావరణ దినోత్సవం - జూన్ 5
    డి. ధరిత్రీ దినోత్సవం - ఫిబ్రవరి 28
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
19. విద్యార్థులకు ర్యాంకులను ఇవ్వడం దేన్ని సూచిస్తుంది?
    1) ప్రత్యక్ష మాపనం 2) సాపేక్ష మాపనం
    3) మూల్యాంకనం 4) పరోక్ష మాపనం
20. మంచి పరీక్షకు విశ్వసనీయత ఉండాలి. విశ్వసనీయత అంటే?
    1) ఒక సమాధాన పత్రాన్ని ఏ ఇద్దరు ఉపాధ్యాయులు దిద్దినా ఒకే మార్కులు రావాలి
    2) ఉపాధ్యాయుడు వ్యక్తినిష్ఠతకు ప్రాధాన్యం ఇవ్వాలి, వస్తునిష్ఠతకు కాదు
    3) పూర్తి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని పరీక్ష నిర్వహించాలి
    4) విద్యార్థికి వేర్వేరు సమయాల్లో ఒకే పరీక్ష నిర్వహిస్తే ఒకే మార్కులు రావాలి
21. బ్లూ ప్రింట్ తయారు చేసేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల్లో ఉపాధ్యాయుడు కిందివాటిలో దేన్ని సరిగా అంచనా వేయలేడు?
    1) లక్ష్యాలు 2) పాఠ్యాంశ విషయం
    3) కాఠిన్యత స్థాయి 4) ప్రశ్నల రకాలు
22. జీఎంసీ బాలయోగి సైన్స్ మ్యూజియం ఎక్కడ ఉంది?
    1) రాజమండ్రి 2) విజయవాడ
    3) ఏలూరు 4) విశాఖపట్నం
23. ఎడ్గర్‌డేల్ అనుభవ శంకువులో కదలని చిత్రాల స్థానం?
    1) పై నుంచి మూడో స్థానం
    2) కింది నుంచి 5వ స్థానం
    3) టెలివిజన్ కింద 4)చలనచిత్రాల కింద
24. ప్రత్యేక పరిస్థితుల్లో జీవించే జంతువుల గురించి అధ్యయనం చేయడానికి దోహదపడే ఉపకరణం ఏది?
    1) టెర్రేరియం 2) వివేరియం
    3) హెర్బేరియం 4) అక్వేరియం
25. కిందివాటిలో కృత్యరూప బోధనోపకరణాలేవి?
    ఎ. డయారమా బి. ఎపిడయాస్కోపు
    సి. కంప్యూటర్ డి. ఫీల్డ్ ట్రిప్
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
26. కన్నింగ్‌హామ్ పాఠ్య ప్రణాళికకు ఇచ్చిన నిర్వచనంలో పోలికలకు సంబంధించి సరైన జత ఏది?
    ఎ. స్టూడియో - తరగతి గది
    బి. కళాకారుడు - విద్యార్థి
    సి. అభిరుచికి అనుగుణంగా - లక్ష్యాలు నెరవేరేటట్లు
    డి. ఉపయోగించే సాధనం-పాఠ్యప్రణాళిక
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
27. బ్రూబేకర్ అభిప్రాయం ప్రకారం పాఠ్య ప్రణాళిక ఎలా ఉండాలి?
    1) పాఠ్యప్రణాళిక ముందుగా చేసి అందులో విద్యార్థిని జాగ్రత్తగా ఇమడ్చాలి
    2) పాఠ్యప్రణాళిక చేసి అందులో సిలబస్ పొందుపరచాలి
    3) ఉపాధ్యాయుడు చేయడానికి వీలుగా పాఠ్యప్రణాళిక రూపొందించాలి
    4) విద్యార్థికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక తయారుచేయాలి
28. పాఠ్యపుస్తకం తయారుచేసే రచయితకు ఉండాల్సిన కనీస అర్హత?
    1) ఏ తరగతి పాఠ్యపుస్తకం తయారు చేస్తున్నాడో ఆ తరగతికి కనీసం అయిదేళ్లు బోధించిన అనుభవం ఉండాలి
    2) ఉపాధ్యాయ వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి
    3) SCERTలో కనీసం 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం అవసరం
    4) సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసిన అనుభవంతో పాటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో రెండేళ్ల పని అనుభవం
29. కిందివాటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉండే ఉపకరణం?
    1) రేఖీయ చిత్రం 2) రేడియో
    3) డయారమా 4) శబ్దిక చిహ్నం
30. 1959లో మొట్టమొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ స్థాపించారు?
    1) కోల్‌కతా 2) ముంబై
    3) అహ్మదాబాద్ 4) ఢిల్లీ
31. జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఒకరు హెర్బేరియం ఉపయోగించి, మరొకరు మాతృక స్పెసిమన్‌ను ఉపయోగించి బోధించారు. వారు అందించిన అనుభవాలు వరుసగా..
    1) ప్రత్యక్ష, ప్రతినిధిత్వం
    2) ప్రతినిధిత్వం, ప్రతినిధిత్వం
    3) ప్రత్యక్ష, పరోక్ష 4) ప్రత్యక్ష, ప్రత్యక్ష
32. భావన ఏర్పడటానికి కనీసం రెండు కిందివాటిలో ఏవి కావాలి?
    1) నియమాలు 2) సిద్ధాంతాలు
    3) సత్యాలు 4) సాధారణీకరణలు
33. 'విజ్ఞానశాస్త్ర అంధయుగం'గా పేర్కొన్న శతాబ్ద కాలాలు ఏవి?
    1) క్రీ.శ. 18-19 2) క్రీ.శ. 15-17
    3) క్రీ.శ. 16-18 4) క్రీ.శ. 12-14
34. ఇకో క్లబ్‌లు కిందివాటిలో దేనికి సంబంధించినవి?
    1) ఎయిడ్స్ 2) జలచరాల పరిరక్షణ
    3) పర్యావరణం
    4) అంతరించిపోతున్న జీవులు
35. కార్యాకారణ సంబంధం గుర్తించడం అనేది ఏ లక్ష్యానికి సంబంధించింది?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
36. అక్షయ తృతీయ రోజు బంగారం కొంటే శుభం కలుగుతుంది అని నమ్మే వ్యక్తిలో నెరవేరని లక్ష్యం?
    1) అవగాహన 2) అభిరుచి
    3) శాస్త్రీయ దృక్పథం 4) వినియోగం
37. ప్రయోగ పరికరాలు శుభ్రం చేయడం, భద్రపరచడం అనేవి మానసిక చలనాత్మక రంగ సోపానాల్లో దేనికి సంబంధించినవి?
    1) అనుకరణ 2) హస్తలాఘవం
    3) సమన్వయం 4) సహజీకరణ
38. అవగాహనలోని వివేచనం చేయడం అనే స్పష్టీకరణకు సంబంధించింది ఏది?
    1) రెండు అంశాల మధ్య భేదాలను గుర్తించడం
    2) పెద్ద అంశాన్ని చిన్న చిన్న అంశాలుగా విడగొట్టడం
    3) దశలవారీగా ఒక అంశం గురించి తెలుసుకోవడం
    4) లక్షణాల ఆధారంగా సమూహాలుగా చేయడం
39. విద్యార్థులు నమూనాలు తయారు చేయడానికి సంబంధించి ఏ రకమైన పరీక్షలు నిర్వహించాలి?
    1) నిష్పాదన పరీక్ష 2) ప్రజ్ఞా పరీక్షలు
    3) సహజ సామర్థ్య పరీక్షలు
    4) అంచనా మాపని
40. ఉపాధ్యాయుడు ప్రొజెక్టర్‌ను ఉపయోగించి విద్యార్థులకు బోధించాడు. ఆయన ఉపయోగించిన బోధనా పద్ధతి?
    1) అన్వేషణ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రదర్శనా పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి

సమాధానాలు

1) 2	2) 4	3) 1	4) 2	5) 2
6) 3	7) 4	8) 2	9) 3	10) 3
11) 4	12) 4	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 2	19) 2	20) 4
21) 3	22) 3	23) 1	24) 2	25) 3
26) 3	27) 4	28) 1	29) 3	30) 1
31) 2	32) 3	33) 4	34) 3	35) 2
36) 3	37) 2	38) 3	39) 1	40) 3

మోతాదుకు మించితే విషతుల్యం!

ఔషధాల వాడకానికి సంబంధించి 'సొంత వైద్యం' చాలా ప్రమాదకరమైంది. తప్పనిసరిగా వైద్యుడి సిఫారసు మేరకే మందులు వాడాలి. అంతేకాకుండా వైద్యుడు సూచించిన మోతాదు కంటే అధిక పరిమాణంలో ఔషధాలను వాడితే అవి విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. 'సైడ్ ఎఫెక్ట్'లు కనిష్ట స్థాయిలో ఉండేవిధంగా ఔషధాలను రూపొందిస్తారు.

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

ఔషధాలు (డ్రగ్స్)

మానవులు, జంతువుల్లో జీవక్రియలను ప్రభావితం చేసి, వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే రసాయన కారకాలనే ఔషధాలు అంటారు.సాధారణ పరిభాషలో వీటిని మందులుగానూ వ్యవహరిస్తారు. వ్యాధులను గుర్తించడానికి,నయం చేయడానికే కాకుండా నిరోధించడానికి ఉపయోగించేవాటిని కూడా ఔషధాలుగా పేర్కొంటారు. వ్యాధులు లేదా రోగాల చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియను 'కెమోథెరపీ (Chemothe rapy)' అంటారు.

జీవిలోకి ప్రవేశించిన ఔషధాలు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, లిపిడ్‌లు, ప్రోటీన్లు, న్యూక్లియిక్ ఆమ్లాల లాంటి వాటితో చర్య జరుపుతాయి. ఈ జీవాణువులనే లక్ష్య అణువులు (Target Molecules) అంటారు. ఔషధాలు వరణాత్మకంగా (Selective).. అంటే కేవలం ఆశించిన లక్ష్య అణువులతో మాత్రమే చర్యలో పాల్గొంటాయి. ఇతర లక్ష్య అణువులను ప్రభావితం చేయవు. ఇవి ఆశించిన ప్రదేశంలోనే పనిచేస్తాయి.

వివిధ రకాల ఔషధాలు

బాధా నివారిణులు (Analgesics): ఏ విధమైన ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే ఔషధాలను ఎనాల్జెసిక్‌లు అంటారు. ఇవి రెండు రకాలు.

అవి:

1. నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు: దురలవాట్లకు (Addiction) లోను చేయని ఎనాల్జెసిక్‌లు. వీటినే నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు అంటారు.

ఉదా: ఐబూప్రోఫెన్, ఆస్పిరిన్, పారాసెటమాల్.

- ఎనాల్జెసిక్‌లకు జ్వర తీవ్రతను తగ్గించే గుణం ఉండటం వల్ల యాంటీ పైరెటిక్‌లుగా కూడా పనిచేస్తాయి.
- ఆస్పిరిన్ (ఎసిటైల్ సాలిసిలికామ్లం) ప్రోస్టాగ్లాండిన్‌లు (కణజాలాల్లో వచ్చే మంటలు, తద్వారా వచ్చే నొప్పులకు కారణమైనవి) అనే రసాయన పదార్థాల ఉత్పత్తి వేగాన్ని తగ్గించి బాధా నివారిణిగా పనిచేస్తుంది. దీనికి రక్తాన్ని పలచన చేసే గుణం (Blood thinner) కూడా ఉంది. అందువల్ల ఆస్పిరిన్ రక్తం గడ్డకట్టకుండా చూసి, గుండెపోటు నివారణకు దోహదపడుతుంది.



2. నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు: ఓపియమ్ సాపీ (నల్లమందు) నుంచి గ్రహించే మార్ఫీన్ రకానికి చెందిన రసాయనాలు దురలవాట్లకు గురి చేసేవి (Addictive)గా ఉంటాయి. సాధారణంగా వీటిని శస్త్ర చికిత్సల అనంతరం కలిగే బాధలు, గుండెకు సంబంధించిన నొప్పి, కేన్సర్‌తో అవసాన దశలో ఉండే రోగికి కలిగే బాధలు, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. వీటిని ఔషధ మోతాదులో సేవిస్తే బాధను తగ్గించి, నిద్రను ప్రోత్సహిస్తాయి. అధిక మొత్తంలో సేవిస్తే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛకు దారితీసి చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుంది.

యాంటీ బయాటిక్‌లు: సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించేవి లేదా వాటిని నాశనం చేసే వాటిని యాంటీబయాటిక్‌లు అంటారు.

ఎరిత్రోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్ లాంటివి సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. పెన్సిలిన్, ఆఫ్లోక్సాసిన్ మొదలైనవి సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి.

ఆమ్ల విరోధులు (Antacids): హైడ్రోక్లోరికామ్లం ఉదరంలో ఆహారం జీర్ణమవడానికి తోడ్పడుతుంది. ఒక వేళ జీర్ణకోశంలో ఈ ఆమ్లం అధికంగా ఉత్పత్తి చెందితే అది ప్రకోపానికి (Irritation) లేదా నొప్పికి దారితీస్తుంది. ఇంకా తీవ్రస్థాయిలో జరిగితే జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. రానిటిడిన్, ఒమిప్రజోల్, పెంటాప్రజోల్ లాంటివి ఈ ఆమ్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి - సోడియం బై కార్బోనేట్ (బేకింగ్ సోడా), మెగ్నీషియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ మొదలైనవి.

యాంటీ సెప్టిక్‌లు (చీము నిరోధులు): గాయాలు, కోతలు, అల్సర్‌లు అయినప్పుడు జీవ కణాలకు పూతగా పూసే పదార్థాలే యాంటీ సెప్టిక్‌లు. యాంటీ బయాటిక్‌ల మాదిరిగా వీటిని నోటితో మింగకూడదు.

ఉదా: అయోడిన్ టింక్చర్, స్పిరిట్ (ఇథైల్ ఆల్కహాల్), ఫినాల్ ద్రావణం, డెట్టాల్ (క్లోరోక్సైలినాల్, టెర్పినియోల్‌ల మిశ్రమం), బిథియోనాల్, క్లోరిన్ జలద్రావణం, అయొడోఫాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో నాడీ సంబంధమైన వ్యాధి కానిది?
   1) స్మృహ కోల్పోవడం
   2) మానసిక ఆందోళన
   3) పక్షవాతం
   4) జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు)
2. జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్లాల ఉత్పత్తిని ప్రేరేపించే రసాయనం?
   1) హిస్టమీన్ 2) రెనిటిడీన్
   3) ఎడ్రినలిన్ 4) మార్ఫీన్
3. అధిక ఆమ్ల వ్యాధి (Acidity) చికిత్సకు ఉపయోగించే ఔషధం?
   1) సిమెటిడిన్ 2) రెనిటిడిన్
   3) ఓమిప్రజోల్ 4) పైవన్నీ
4. కిందివాటిలో ఆమ్ల విరోధిగా పనిచేసేది ఏది?
   1) సోడియం బైకార్బోనేట్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   4) పైవన్నీ
5. చిన్న పిల్లలకు ఆమ్ల విరోధిగా ఉపయోగించే మిల్క్ ఆఫ్ మెగ్నీషియా అనేది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) రానిటిడీన్ 4) ఓమీప్రజోల్
6. కిందివాటిలో యాంటీ హిస్టమీన్ ఏది?
   1) వేలియం 2) పారాసిటమాల్
   3) బ్రోమ్‌ఫెనిరమీన్ 4) ఆస్పిరిన్
7. నిద్ర తెప్పించే (హిప్నాటిక్) ఔషధం?
   1) సెరటోనిన్ 2) వేలియం
   3) క్లోరోడయజీపాక్సైడ్ 4) పైవన్నీ
8. కిందివాటిలో నార్కోటిక్ నొప్పి నివారిణి ఏది?
   1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
   3) పారాసెటమాల్ 4) పైవన్నీ
9. కిందివాటిలో ఎనాల్జెసిక్ ఏది?
   1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
   3) ఐబూప్రోఫెన్ 4) పైవన్నీ
10. రక్తాన్ని పలచన చేసే గుణం ఉన్న ఔషధం (Blood thinner) ఏది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) మార్ఫీన్ 4) కొడీన్
11. కెమోథెరపీ అంటే?
    1) కీళ్లు వాచేలా కొట్టడం
    2) ఔషధాలను ఉపయోగించి వ్యాధులు నయం చేయడం
    3) ఫిజియోథెరపీ
    4) యోగా ద్వారా వ్యాధులు నయం చేయడం
12. ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?
    1) ఆస్పిరిన్ 2) పారాసెటమాల్
    3) క్లోరోక్విన్ 4) పెన్సిలిన్
13. సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?
    1) క్వినైన్ 2) మార్ఫీన్
    3) నికోటిన్ 4) కెఫీన్
14. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    1) పారాసెటమాల్ అధిక మోతాదులో వాడితే కాలేయం దెబ్బతింటుంది
    2) ఆస్పిరిన్ అధికంగా వాడితే అల్సర్‌లు ఏర్పడతాయి
    3) మిథైల్ సాలిసిలేట్ మూత్రవర్ధకంగా పని చేస్తుంది
    4) పైవన్నీ సరైనవే
15. కిందివాటిలో బాధా నివారిణిగా పనిచేస్తూ జ్వరాన్ని తగ్గించే గుణం ఉన్న ఔషధం కానిది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) కెఫీన్ 4) మార్ఫీన్
16. ఎలర్జీని తగ్గించే గుణం ఉన్న ఔషధాలను ఏమంటారు?
    1) ఎనాల్జెసిక్‌లు 2) ట్రాంక్విలైజర్‌లు
    3) యాంటీ హిస్టమీన్‌లు
    4) యాంటీ బయాటిక్‌లు
17. హెరాయిన్ అనే మత్తుమందును దేన్ని ఎసిటైలేషన్ చేసి రూపొందిస్తారు?
    1) మార్ఫీన్ 2) కెఫీన్
    3) నికోటిన్ 4) సాలిసిలికామ్లం
18. కిందివాటిలో ఆల్కలాయిడ్ కుటుంబానికి చెందని డ్రగ్ ఏది?
    1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
19. కిందివాటిలో సరికాని జత?
    1) టీ - కెఫీన్ 2) పొగాకు - నికోటిన్
    3) సింకోనా - క్వినైన్
    4) పెన్సిలియం బూజు - క్లోరాంఫెనికాల్
20. కిందివాటిలో సరికాని జత?
    1) పెన్సిలిన్: యాంటీ బయాటిక్
    2) డెట్టాల్: యాంటీ సెప్టిక్
    3) వేలియం: ట్రాంక్విలైజర్
    4) క్లోరోక్విన్: ఎనాల్జెసిక్
21. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) క్లోరోక్విన్ 4) స్ట్రెప్టోమైసిన్
22. మలేరియా నివారణకు వాడే ఔషధం?
    1) క్లోరోక్విన్ 2) పెన్సిలిన్
    3) ఆస్పిరిన్ 4) వేలియం
23. మత్తు మందులకు అలవాటు పడిన వారు అవి దొరకకపోతే సేవించేది ఏది?
    1) డెట్టాల్ 2) పురుగులమందు
    3) దగ్గు మందు 4) ఎండ్రిన్
24. కిందివాటిలో గర్భ నిరోధక ఔషధం (యాంటీ ఫెర్టిలిటీ డ్రగ్) ఏది?
    ఎ. నారిథింద్రోన్
    బి. ఇథైనైల్ ఈస్ట్రాడయోల్
    సి. క్లోరామ్‌ఫెనికాల్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
25. కిందివాటిలో దోమల నియంత్రణకారి?
    1) డెట్టాల్ 2) పైరిత్రిన్
    3) ఈథర్ 4) ఆలిటేమ్
26. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) కనుపాప విస్ఫారణం: అట్రోపిన్
    2) స్థానిక మత్తు మందు: ఈథర్
    3) గుండె జబ్బు: నైట్రో గ్లిజరిన్
    4) మలేరియా: నికోటిన్
27. పెన్సిలిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    2) ఖొరానా 3) సాల్వర్‌సన్
    4) సి.వి. రామన్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4; 5) 1; 6) 3; 7) 4; 8) 1; 9) 4; 10) 2; 11) 2; 12) 1; 13) 1; 14) 4; 15) 3; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 4; 21) 1; 22) 1; 23) 3; 24) 1; 25) 2; 26) 4; 27) 1.

Who is second to the left of A?

Banks Special
Reasoning

MODEL QUESTIONS


Following topics are some of the areas which are expected in the forthcoming SBI POs prelims examination.

1. SYLLOGISMS
2. SEATING ARRANGEMENT
3. PUZZLE TEST

Let us see some examples with solutions:

SYLLOGISMS


1. Statements:
All balls are round.
Some round are plates.
All plates are utensils.
Conclusions:
I. Some utensils being balls is a possibility.
II. Some plates being balls is a possibility.
Solution:




Both the possible conclusions follow as an alternate diagram can be drawn.

SHORT CUT: If all the given statements are affirmative (positive), then every positive possible conclusion is VALID on the given terms. Hence, both the conclusions follow.

2. Statements:
All fans are small.
All small are rats.
All rats are cows.
Conclusions:
I. Some cows are not small.
II. Some cows are not fans.
Solution:






As all the given statements are affirmative, there is a possibility of 'All cows are small' as well as "All cows are fans". Hence, both the conclusions do not follow.

SHORT CUT: If the given statements are positive then every negative definite conclusion is NOT VALID.

3. Statements:
No wall is roof.
All pens are walls.
All doors are roofs.
Conclusions:
I. No any door is wall.
II. No any roof is pen.
Solution:



'No any door is wall' means 'No door is wall'. Similarly, 'No any roof is pen' means 'No roof is pen'. Clearly, both the conclusions are valid as alternate diagram cannot be drawn.

SEATING ARRANGEMENT

A. Study the following information carefully and answer the questions:

A, B, C, D, E, F and G are sitting in straight line facing North.
B sits fourth to the left of A who is second to the left of C. D, who is not an immediate neighbor of A, sits to the immediate right of E. F sits second to the left of G.

4. Which of the following pairs sit at the extreme corners of the line?
   1) BC 2) EC 3) BG
   4) ED 5) None of these
5. How many persons sit between D and G?
   1) One 2) Two 3) Three
   4) None 5) None of these
6. Four of the following five are alike in a certain way based on their seating positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
   1) BD 2) EF 3) AC
   4) AD 5) FG

Solution: While solving seating arrangement questions we have to first of all focus on the definite information given. Step wise explanation is given below.

Step1: B sits fourth to the left of A who is second to the left of C.
B _ _ _ A _ C

Step2: D is not an immediate neighbour of A and D sits to the immediate right of E.
B E D _ A _ C

Step3: Now, the process can be completed in the following way
B E D F A G C

Answers: 4) 1 5) 2 6) 4


Explanation: In every option first person is second to the left of second person where as in the fourth option, first person is second to the right of second person (A is second to the right of D)

B. Study the following information carefully and answer the following questions:

There are eight friends A, B, C, D, E, F, G and H are seated in a circle facing the centre but not necessarily in the same order.
D is as far away from A as C is away from E.
AC, DG, HE and FB are seated adjacent to each other. A is also seated adjacent to H. B is second to the right of H and E is third to the right of C.

7. Who is second to the left of A?
   1) B 2) E 3) G
   4) D 5) None of these
8. If B and G interchange their places, who sits to the immediate right of E?
   1) B 2) C 3) G
   4) D 5) None of these
9. If all the persons are made to sit in alphabetical order starting from A in clockwise manner, the positions of how many will remain unchanged, other than A, as compared to the original seating positions
   1) One 2) Two 3) Three
   4) Four 5) None of these

Solution:
Firstly, focus on the definite information.
1. B is second to the right of H.
2. A is adjacent to H as well as C.
3. E is third to the right of C.
As C is third to the left of E, D must be third to the left of A. So, the arrangement can be properly constructed in the following way.



Answers:
7) 3 8) 3 9) 2

Explanation: 'D' and 'H' positions remain unchanged

PUZZLE TEST

Study the following information carefully and answer the following questions:

A, B, C, D, E and F are six persons in an organization who are of different heights. Each one has different colour of pens - black, white, blue, green, red and yellow.

The tallest person does not like blue or white.

The youngest person does not like black or red.

'C' likes yellow and only one person is taller than him.

'A' likes white colour and is taller than E but shorter than F. B likes black and is shorter than A but taller than E. D likes blue and E likes red.

10. How many persons are taller than D?
    1) One 2) Two 3) Three
    4) Four 5) None of these
11. The tallest among them prefers the pen of
    1) Red colour 2) Green colour
    3) White colour
    4) Cannot be determined
    5) None of these
12. Who is taller than only the shortest?
    1) B 2) E 3) D
    4) A 5) None of these

Solution: Let us focus on the definite points first

1. Only one person is taller than C. So, C is 2nd tallest.
2. A is taller than E but shorter than F → **F > A > E.**
3. B is shorter than A but taller than E. → **A > B > E**
4. Considering 2 & 3
   → **F > A > B > E**
5. By considering 1 & 4
   → **F > C > A > B > E**

Order of heights:
F > C > A > B > E > D

PERSON	COLOUR OF PEN	HEIGHT
A	WHITE	3rd tallest
B	BLACK	4th tallest
C	YELLOW	2nd tallest
D	BLUE	Shortest
E	RED	5th tallest
F	GREEN	Tallest

Answers:
10) 5 (Total 5 persons are taller than D)
11) 2
12) 2 (Taller than only the shortest means 'the person who is 2nd shortest. i.e. E')

అడ్మిషన్స్

గేట్-2025

దేశంలోని ఐఐటీలు, ఇతర సంస్థల్లో ఎంటెక్‌లో ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఐటీ రూర్కీ పరీక్షను నిర్వహిస్తుంది.

» **అర్హత:** ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్,హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** గరిష్ఠ వయో పరిమితి లేదు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. పరీక్ష సమయం మూడు గంటలు.
» **ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, చిత్తూరు, గుంటూరు, కడప, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, అనంతపురం, కర్నూల్, ఏలూరు, కాకినాడ, సూరంపాలెం, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం.
» **తెలంగాణలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, మెదక్, నల్గొండ, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.08.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.09.2024
» **ఆలస్య రుసుముతో చివరితేది:** 07.10.2024.
» **ఫలితాల వెల్లడి తేది:** 19.03.2024.
» **పరీక్ష తేదీలు:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో జరగనున్నాయి.
» **వెబ్‌సైట్:** https://gate2025.iitr.ac.in

జేఎన్‌టీయూ అనంతపురంలో పీహెచ్‌డీ ప్రవేశాలు

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) పీహెచ్‌డీ కోర్సు (పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్)లో ప్రవేశాలకు ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజెంటేటివ్‌లు నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, ఇంగ్లిష్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్లు, జేఎన్‌టీయూ అనంతపురం, అనంతపురం చిరునామకు స్పీడ్ పోస్టు/కొరియర్ ద్వారా పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.09.2024.
» **వెబ్‌సైట్:** www.jntua.ac.in